AVAILABILITY OF BID CUM APPLICATION FORMS: Application forms can be obtained from the Registered Office of **Lenskart Solutions Limited**, **Tel:** +91 124 429 3191 and the **BRLMs –** Kotak Mahindra Capital Company Limited, **Tel:** +91 22 4336 0000, Morgan Stanley India Company Private Limited, **Tel:** +91 22 6118 1000, Avendus Capital Private Limited, **Tel:** +91 22 6648 0050, Citigroup Global Markets India Private Limited, **Tel:** +91 22 6175 9999, Axis Capital Limited, **Tel:** + 91 22 4325 2183, and Intensive Fiscal Services Private Limited, **Tel:** +91 22 2287 0443.

Syndicate Members: Kotak Securities Limited, **Tel:** +91 22 6218 5410, Intensive Softshare Pvt. Ltd., **Tel:** +91 22 2287 0443/44/45, Spark Institutional Equities Private Limited, **Tel:** +91 22 6885 4503 and at the select locations of the Sub-syndicate Members (as given below), SCSBs, Registered Brokers, RTAs and CDPs participating in the Offer. Bid cum Application Forms will also be available on the websites of BSE and NSE and the Designated Branches of SCSBs, the list of which is available at websites of the Stock Exchanges and SEBI.

APPLICATIONS SUPPORTED BY BLOCKED AMOUNT (ASBA): Investors have to apply through the ASBA process. ASBA has to be availed by all the investors. For details on ASBA process, please refer to the details given in the ASBA Form and Abridged Prospectus and also please refer to "*Offer Procedure*" on page 994 of RHP. Further ASBA Application forms can be obtained from Designated Branches of SCSBs, the list of banks that are available on website of SEBI at www.sebi.gov.in and website of Stock Exchanges at www.nseindia.com and www.bseindia.com. The investors are required to fill the Bid Cum Application form and submit the same to the relevant SCSBs at the specific locations or registered brokers at the broker centers or RTA or DP's. The SCSB's will block the amount in the account as per the authority contained in application form. On allotment, amount will be unblocked and account will be debited only to the extent required to be paid for allotment of shares. Hence, there will be no need of refund.

UPI: UPI Bidders can also Bid through UPI Mechanism.

Sub-Syndicate Members: Almondz Global Securities Ltd., Amrapali Capital & Finance Services Limited, Anand Rathi Share & Stock Brokers Ltd., Anand Share Consultancy, ANS Pvt Limited, Asit C. Mehta Investment Interrmediates Ltd, Avendus Wealth Management Private Limited, Axis Securities Limited, Centrum Broking Limited, Dalal & Broacha Stock Broking Private Limited, DB (International) Stock Brokers Ltd, Finwizard Technology Private Limited, G Raj & Co. (Consultants) Limited, HDFC Securities Limited, ICICI Securities Limited, IDBI Capital Markets & Securities Limited, IIFL Securities Ltd, Innovate Securities Pvt Limited, Investmentor Securities Limited, Jhaveri Securities, JM Financial Services Limited, Jobanputra Fiscal Services Private Limited, K M Jain Stock Brokers Pvt Ltd, Kalpataru Multiplier Limited, Kantilal Chhaganlal Sec Pvt Ltd, Keynote Capitals Limited, KJMC Capital Market Services Limited, Lakshmishree Investment & Securities Pvt Ltd, LKP Securities Limited, Marwadi Shares & Finance, Mehta Equities Limited, Motilal Oswal Financial Services Limited, Motilal Oswal Securities Limited, Nirmal Bang Securities Pvt Limited, Nuvama Wealth and Investment Limited, Nuvama Wealth and Investment Limited (Edelweiss Broking Limited), Patel Wealth Advisors Pvt Limited, Prabhudas Lilladher Pvt Limited, Pravin Ratilal Share & Stock Brokers Limited, RR Equity Brokers Private Limited, SBIcap Securities Limited, Sharekhan Limited, SMC Global Securities Limited, Spark PWM Private Limited, SS Corporate Securities Limited, Tanna Financial Services, TradeBulls Securites Private Ltd., Upstox Securities Private Limited, Viren M Shah and YES Securities (India) Limited.

Bankers to the Offer

Escrow Collection Bank and Sponsor Bank: Kotak Mahindra Bank Limited

Public Offer Account Bank, Refund Bank and Sponsor Bank: ICICI Bank Limited

All capitalized terms used herein and not specifically defined shall have the same meaning as ascribed to them in RHP.

For **Lenskart Solutions Limited**
On behalf of the Board of Directors
Sd/-
Preeti Gupta
Company Secretary and Chief Compliance Officer

Place: Delhi
Date: November 3, 2025

Lenskart Solutions Limited is proposing, subject to, receipt of requisite approvals, market conditions and other considerations, to make an initial public offering of its Equity Shares and has filed the RHP with the RoC on October 25, 2025. The RHP shall be available on the website of the Company at https://www.lenskart.com, SEBI at www.sebi.gov.in, as well as on the websites of the BRLMs, i.e. Kotak Mahindra Capital Company Limited, Morgan Stanley India Company Private Limited, Avendus Capital Private Limited, Citigroup Global Markets India Private Limited, Axis Capital Limited and Intensive Fiscal Services Private Limited at https://investmentbank.kotak.com, www.morganstanley.com/, www.avendus.com, https://www.citigroup.com/global/about-us/global-presence/india/disclaimer, www.axiscapital.co.in and www.intensivefiscal.com, respectively and the websites of National Stock Exchange of India Limited and BSE Limited at www.nseindia.com and www.bseindia.com, respectively. Any potential investor should note that investment in equity shares involves a high degree of risk and for details relating to such risk, please see "***Risk Factors***" on page 64 of the RHP. Potential investors should not rely on the DRHP for making any investment decision and instead should place reliance on the RHP and Addendum cum Corrigendum. Specific attention of the investors is invited to "***Risk Factors***" beginning on page 64 of the RHP. This announcement has been prepared for publication in India only and is not for publication or distribution, directly or indirectly, in or into the United States. The equity shares described in this announcement have not been and will not be registered under the U.S. Securities Act of 1933, as amended (the "**U.S. Securities Act**") or any other applicable law of the United States and, unless so registered, may not be offered or sold within the United States, except pursuant to an exemption from, or in a transaction not subject to, the registration requirements of the U.S. Securities Act and applicable U.S. state securities laws. Accordingly, the equity shares of the Company are being offered and sold (i) within the United States only to persons reasonably believed to be "qualified institutional buyers" (as defined in Rule 144A of the U.S. Securities Act) pursuant to Section 4(a) of the U.S. Securities Act, and (ii) outside the United States in "offshore transactions", as defined in and in reliance on, Regulation S of the U.S. Securities Act and the applicable laws of the jurisdictions where those offers and sales occur. There will be no public offering of securities in the United States.

Adfactors

ఈనాడు

విజయవాడ 4-11-2025 మంగళవారం సిటీ సంపుటి 52 . సంచిక 84
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 16
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

హైదరాబాద్-బీజాపూర్ రోడ్డుపై

మృత్యుఘోష



బలంగా ఢీ కొట్టి బస్సుపై పడిన టిప్పర్

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన కంకర టిప్పర్

19 మంది దుర్మరణం

- మరో 24 మందికి గాయాలు
- తెలంగాణలోని చేవెళ్ల మండలం మీర్జాగూడ వద్ద ఘోర ప్రమాదం
- ప్రమాద సమయంలో బస్సులో 60 మంది ప్రయాణికులు

ఈనాడు, హైదరాబాద్, న్యూస్‌టుడే చేవెళ్ల రూరల్: మరో గంటన్నరలో గమ్యం చేరుకునే వారే. కానీ, క్షణంలోనే 'కంకర' వారి ప్రాణాలను పూడ్చిపెట్టింది. చివరి శ్వాస పీల్చుకునే అవకాశం కూడా లేకుండా సజీవ సమాధి చేసింది. నిద్ర మత్తులో ఉన్న వారికి మేల్కొనే అవకాశం ఇవ్వలేదు. మేల్కొని ఉన్న వారికి ఏమి జరుగుతుందో తెలుసుకోనివ్వలేదు. ఘటనా స్థలం నుంచి మొదటి మృతదేహం బయటకు తీయడానికే గంటన్నర సమయం పట్టిందంటే ప్రమాదం తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.

హైదరాబాద్-బీజాపూర్ రోడ్డుపై రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం మీర్జాగూడ గేటు వద్ద సోమవారం ఉదయం 6.40 గంటలకు జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఏకంగా 19 మంది దుర్మరణం పాలయ్యారు. మరో 24 మంది గాయపడ్డారు. (మిగతా 2లో)

కంకర మీదపడటంతో పెరిగిన తీవ్రత





కంకరలో కూరుకుపోయి సహాయం కోసం విలపిస్తున్న మహిళ

అప్తులను కోల్పోవడంతో రోదిస్తున్న బంధువులు

రహదారులపై రక్తధారలు

రాష్ట్రంలో 3 ప్రమాదాలు.. ఏడుగురి దుర్మరణం



- బాపట్ల జిల్లాలో నలుగురి మృత్యువాత
- మృతులు ఎమ్మెల్యే నరేంద్రవర్మ బంధువులు
- అనకాపల్లి జిల్లాలో ఇద్దరి మృతి
- ఏలూరు జిల్లాలో మరో యువకుడు..

బాపట్ల జిల్లా సత్యవతిపేట సమీపంలో ప్రమాదానికి గురైన కారు 2లో



ప్రమాదానికి కారణమైన డంపర్ ట్రక్కు

నియంత్రణ కోల్పోయి..


వాహనాలను ఈడ్చుకెళ్లి..

రాజస్థాన్‌లో డంపర్ ట్రక్కు డ్రైవర్ బీభత్సం

14 మంది మృతి

13 మందికి గాయాలు 2లో

రాష్ట్రంలో 'హిందుజా'
రూ.20 వేల కోట్ల పెట్టుబడులు



ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో రాష్ట్ర ప్రభుత్వ అధికారితో ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న హిందుజా గ్రూప్ భారత్ ఛైర్మన్ అశోక్ హిందుజా, యూరప్‌లోని ఆ గ్రూప్ ఛైర్మన్ ప్రకాశ్ హిందుజా, హిందుజా రెన్యూవబుల్స్ ఫౌండర్ షోమ్ ఏ హిందుజాలు

- కృష్ణా జిల్లా మల్లవల్లిలో ఎలక్ట్రిక్ బస్సులు, తేలికపాటి వాహనాల తయారీ ప్లాంట్
- రాయలసీమలో సౌర, పవన విద్యుత్ ఉత్పత్తి యూనిట్ల ఏర్పాటు
- విశాఖలో 800 మెగావాట్ల సామర్థ్యంతో రెండు కొత్త యూనిట్లు
- లండన్‌లో సీఎం చంద్రబాబు సమక్షంలో ఒప్పందం

ఈనాడు, అమరావతి: హిందుజా గ్రూపు రాష్ట్రంలో రూ. 20 వేల కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. సీఎం చంద్రబాబు సమక్షంలో ఈ మేరకు కీలక ఒప్పందం కుదిరింది. విశాఖలోని హిందుజా పవర్‌ప్లాంట్ సామర్థ్యం మరో 1,600 మెగావాట్లకు పెంచడం, రాయలసీమలో సౌర, పవన విద్యుత్తు ఉత్పత్తి యూనిట్లు, కృష్ణా జిల్లా మల్లవల్లిలో ఎలక్ట్రిక్ బస్సులు, తేలికపాటి వాహనాల తయారీ ప్లాంట్లు, రాష్ట్రవ్యాప్తంగా ఈవీ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు సహా వివిధ కీలక రంగాల్లో హిందుజా దశల వారీగా పెట్టుబడులు పెట్టనుంది. లండన్ పర్యటనలో ఉన్న చంద్రబాబు సోమవారం హిందుజా గ్రూపు భారత ఛైర్మన్ అశోక్ హిందుజా, యూరప్‌లోని ఆ గ్రూపు సంస్థల ఛైర్మన్ ప్రకాశ్ హిందుజా, హిందుజా రెన్యూవబుల్స్ ఫౌండర్ షోమ్ ఏ హిందుజాలతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అవకాశాలు, ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలను ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు. ఏపీలో పారిశ్రామిక ప్రగతి కోసం అత్యుత్తమ వాతావరణం కల్పించేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉంటామని ఆయన హామీ ఇచ్చారు. హిందుజా గ్రూపు సంస్థల ప్రతిపాదనలు త్వరితగతిన కార్యరూపం దాల్చేందుకు (మిగతా 3లో)

160 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి మా లక్ష్యం

పునరుత్పాదక ఇంధన రంగంలో పెట్టుబడులు పెట్టండి

ఆక్టోపస్ ఎనర్జీ ఇంటర్నేషనల్ సంస్థకు సీఎం ఆహ్వానం

3లో

అమరావతిలో ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్ సెంటర్

అంతర్గత జల మార్గాల ద్వారా అతితక్కువ ఖర్చుతో సరకు రవాణా

పారిశ్రామికవేత్తలతో చంద్రబాబు



ఫ్లెమింగోలకు శాశ్వత నివాస స్థావరంగా పులికాట్



ఎకో టూరిజానికి గమ్యస్థానంగా తీర్చిదిద్దుతాం

ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

ఈనాడు, అమరావతి: తిరుపతి జిల్లాలోని పులికాట్ సరస్సును ఎకో టూరిజానికి గమ్యస్థానంగా.. ఫ్లెమింగోలకు శాశ్వత నివాస స్థావరంగా తీర్చిదిద్దుతామని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. ఏటా నిర్వహించే ఫ్లెమింగో ఫెస్టివల్‌ను ఈ సారి మూడు రోజులతో సరిపెట్టేయకుండా, ఎకో టూరిజాన్ని ప్రోత్సహించేలా అటవీశాఖ ఆధ్వర్యంలో ఫొటోగ్రఫీ, పక్షుల వీక్షణ, ఎకో క్లబ్‌ల ఏర్పాటు వంటి వివిధ కార్యక్రమాలు చేపట్టామని వెల్లడించారు. 'పులికాట్‌కు సైబీరియన్ పక్షులైన ఫ్లెమింగోల రాక మొదలైంది. ఆహారం, విశ్రాంతి నిమిత్తం ఈ పక్షులు 6 నెలల పాటు పులికాట్ పరిసరాల్లోనే ఉంటాయి. ఈ నీటి పక్షులను ఆహ్వానిస్తూ ఏటా ఫ్లెమింగో ఫెస్టివల్ ఘనంగా నిర్వహించుకుంటున్నాం. రాష్ట్రం నలుమూలల నుంచి ఏటా 7-8 లక్షల మంది పక్షి ప్రేమికులు హాజరవుతున్నారు. (మిగతా 3లో)

దొనకొండలో ప్రపంచస్థాయి క్యాన్సర్ సెంటర్

రూ.4,260 కోట్లతో నిర్మాణం

వరల్డ్ స్మార్ట్ సిటీస్ ఫోరం ఛైర్మన్ వెల్లడి



విజయవాడలోని ఓ హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఒప్పంద పత్రాలను చూపుతున్న ఒమెక్సా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సుధీర్ పూరి, చల్లా గ్రూప్ ఛైర్మన్ చల్లా ప్రసాద్, వరల్డ్ స్మార్ట్ సిటీస్ ఫోరం ఛైర్మన్ పీటర్, ఒమెక్సా డైరెక్టర్ గ్యారీ చోప్రా, ఒమెక్సా కో ఫౌండర్ రాజన్ గార్గ్

ఈనాడు, అమరావతి; న్యూస్‌టుడే, కురిచేడు నగర్: ప్రకాశం జిల్లా దొనకొండలో 25 ఎకరాల విస్తీర్ణంలో సుమారు రూ. 4,260 కోట్ల (480 మిలియన్ డాలర్ల) వ్యయంతో 'చున్ జియోంగ్ ఉన్ చల్లా క్యాన్సర్ సెంటర్'ను నిర్మించనున్నట్లు దక్షిణ కొరియాకు చెందిన వరల్డ్ స్మార్ట్ సిటీస్ ఫోరం ఛైర్మన్ పీటర్ చున్ వెల్లడించారు. వరల్డ్ స్మార్ట్ సిటీస్ ఫోరం, చల్లా గ్రూప్, ఒమెక్సా బయాలజీస్, మేస్, ఐ హోల్డింగ్ సంస్థల భాగస్వామ్యంతో ఈ సెంటర్‌ను నిర్మించనున్నట్లు ఆయన ప్రకటించారు. విజయవాడలోని ఓ హోటల్‌లో సోమవారం సమావేశమైన ఆయా సంస్థల ప్రతినిధులు ప్రపంచస్థాయి క్యాన్సర్ సెంటర్ నిర్మాణానికి అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. అనంతరం విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పీటర్ చున్ మాట్లాడుతూ చున్ జియోంగ్ ఉన్ క్యాన్సర్ సెంటర్‌ను చెన్నైలో ప్రారంభించామని, సేవలను విస్తరించాలనే ఆలోచనలో ఉన్నప్పుడు చల్లా గ్రూప్ అధినేత చల్లా ప్రసాద్ సూచన మేరకు ఆంధ్రప్రదేశ్‌ను ఎంచుకున్నట్లు తెలిపారు. అనుమతులు రాగానే నిర్మాణాన్ని ప్రారంభిస్తామన్నారు. స్మార్ట్ మెడికల్ సిటీ ప్రాజెక్టులో భాగంగా క్యాన్సర్ డయాగ్నసిస్- ఆంకాలజీ, (మిగతా 3లో)

హాయ్‌ల్యాండ్‌కు తరలించాలన్న నిర్ణయం ఎవరిది?

గ్రూప్-1 జవాబుపత్రాలను అక్కడ ఎన్నిరోజులు ఉంచారు?

ఏపీపీఎస్సీకి తిరిగి ఎప్పుడు తెచ్చారు?

జవాబుపత్రాలను సీల్డ్ కవర్లో మా ముందుంచండి 8లో

ఏపీపీఎస్సీకి హైకోర్టు ఆదేశం

రాజధాని నిర్మాణానికి మరో ₹32,500 కోట్ల రుణం

ప్రపంచ బ్యాంకు-ఏడీబీ నుంచి రూ.14 వేల కోట్లు 8లో

నాబార్డు, ఎన్ఏబీఎఫ్ఐడీ, ఏపీపీఎఫ్‌సీ నుంచి మిగతా నిధులు

పింఛనుదారులకు డిజిటల్ సాధికారత

ఇంటి వద్ద నుంచే లైఫ్ సర్టిఫికెట్ల సమర్పణ 9లో

అమెరికా 'హైర్' చట్టం ఆందోళనకరం 12లో

ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రఘురాం రాజన్

భాగస్వామ్య సదస్సులో ₹9.8 లక్షల కోట్ల పెట్టుబడులు

45 దేశాల నుంచి 300 మంది పారిశ్రామికవేత్తలు, ప్రముఖుల హాజరు

410 ఒప్పందాలపై సంతకాలు

2.5 లక్షల ఉద్యోగాలు కల్పించే కంపెనీలకు భూమిపూజ

విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్



విశాఖలో నిర్వహించనున్న భాగస్వామ్య సదస్సు ఏర్పాట్లపై సమీక్షిస్తున్న మంత్రి లోకేశ్. చిత్రంలో మంత్రులు గొట్టిపాటి రవికుమార్, కొల్లు రవీంద్ర, కొండపల్లి శ్రీనివాస్, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్

ఈనాడు, అమరావతి: విశాఖపట్నంలో ఈ నెల 14, 15 తేదీల్లో జరగనున్న భాగస్వామ్య సదస్సుకు 45 దేశాలకు చెందిన 300 మంది పారిశ్రామికవేత్తలు, ప్రముఖులు హాజరుకానున్నారని విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. ఈ సదస్సులో 410 ఒప్పందాలపై సంతకాలు చేయబోతున్నామని.. వీటి ద్వారా రూ. 9.8 లక్షల కోట్ల పెట్టుబడులు, 7.5 లక్షల ఉద్యోగాలు వస్తాయని వివరించారు. సదస్సు సందర్భంగా రూ. 2.7 లక్షల కోట్ల పెట్టుబడులు, 2.5 లక్షల ఉద్యోగాలు కల్పించే కంపెనీలకు భూమిపూజ చేయబోతున్నామని ప్రకటించారు. భాగస్వామ్య సదస్సు ఏర్పాట్లపై లోకేశ్ సోమవారం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. అనంతరం సహచర మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, గొట్టిపాటి రవికుమార్, కొల్లు రవీంద్ర, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్‌లతో కలిసి ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. 'కూటమి పాలనలో రాష్ట్రానికి ఇప్పటి వరకు రూ. 10 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. దేశీయ పెట్టుబడుల్లోనే కాకుండా ఎఫ్‌డీఐల్లోనూ ఏపీ నంబర్ వన్‌గా నిలుస్తోంది. రాబోయే పదేళ్లలో పారిశ్రామిక రంగంలో రానున్న మార్పులు, అందులో (మిగతా 3లో)

పాక్ అణ్వాయుధ పరీక్షలు నిర్వహిస్తోంది: ట్రంప్ 12లో

ఇదీ సంగతి!



నెల్లూరు జైలుకు మాజీ మంత్రి జోగి రమేష్

- ఆయన సోదరుడు రాము కూడా అదే జైల్లో
- తొలుత ఎక్సైజ్ కోర్టులో హాజరుపరిచిన పోలీసులు
- ఇద్దరూ మద్యం సిండికేట్ నడిపారన్న ఏపీపీ
- అర్ధరాత్రి తర్వాత సుదీర్ఘంగా సాగిన వాదనలు
- జోగి సోదరులకు 13 వరకు రిమాండ్
- తెల్లవారుజామున న్యాయాధికారి ఉత్తర్వులు
- నెల్లూరు కేంద్ర కారాగారానికి తరలింపు



నెల్లూరు సెంట్రల్ జైల్లోకి వెళ్తున్న జోగి రమేష్

ఈనాడు, అమరావతి: నకిలీ మద్యం కేసులో వైకాపా నేత, మాజీ మంత్రి జోగి రమేష్, ఆయన సోదరుడు రాములకు కోర్టు రిమాండ్ విధించడంతో పోలీసులు వారిద్దరినీ నెల్లూరు జైలుకు తరలించారు. జైలు అధికారులు రమేష్‌కు ఖైదీ నంబర్ 7177, రాముకు ఖైదీ నంబర్ 7178 కేటాయించారు. గతనెల ఇబ్రహీంపట్నంలో వెలుగుచూసిన నకిలీ మద్యం కేసులో వీరిద్దరినీ ఆదివారం ఉదయం ఇబ్రహీంపట్నంలో అదుపులోకి తీసుకున్న పోలీసులు సుదీర్ఘ విచారణ అనంతరం రాత్రి విజయవాడలోని ఎక్సైజ్ కోర్టులో హాజరుపరిచారు. అర్ధరాత్రి దాటిన తర్వాత కోర్టులో వాదనలు ప్రారంభమై సోమవారం తెల్లవారుజామున 2.30 గంటల వరకు సాగాయి. దీనిపై ఉదయం 5 గంటలకు న్యాయాధికారి లెనిన్‌బాబు ఉత్తర్వులిచ్చారు. (మిగతా 3లో)



చెట్ల కింద చదువులు

కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు పట్టణంలోని మాచాని సోమప్ప బాలికల జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 6 నుంచి పదో తరగతి వరకు 3,356 మంది బాలికలు విద్యనభ్యసిస్తున్నారు. రాష్ట్రంలో అత్యధికంగా విద్యార్థినులు ఉన్నది ఇక్కడే. పాఠశాలలో 44 గదులు ఉంటే.. అవి ఏ మాత్రం పిల్లలకు సరిపోవడం లేదు. ప్రధానోపాధ్యాయులు, పీఈటీ, స్టాఫ్‌రూం కోసం 4 గదులు వినియోగిస్తున్నారు. 40 ఏళ్ల కిందట నిర్మించిన 8 గదుల్లో పెచ్చులూడుతున్నాయి. గదుల కొరతతో వివిధ తరగతులకు చెందిన 15 సెక్షన్ల విద్యార్థినులు చెట్ల కింద, గోడల నీడన, వరండాల్లో కూర్చోవాల్సి వస్తోంది. – న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు


కంకర కుప్పలోంచి బయటికి కనిపిస్తున్న మహిళ చెయ్యి

హైదరాబాద్-బీజాపూర్ రోడ్డుపై మృత్యుఘోష


ప్రమాదానికి గురైన బస్సు తొలగింపు పనులు

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణలోని వికారాబాద్ జిల్లా తాండూరు నుంచి హైదరాబాద్‌కు 60 మంది ప్రయాణికులతో వస్తున్న ఆర్టీసీ బస్సును ఎదురుగా వచ్చిన కంకర టిప్పర్ ఢీకొట్టడంతో ఈ దారుణం చోటుచేసుకుంది. చనిపోయిన వారిలో 13 మంది, క్షతగాత్రుల్లో 12 మంది మహిళలే ఉన్నారు. ప్రమాద స్థలంలో భీతావహ పరిస్థితి నెలకొంది. ఘటనలో తాండూరుకు చెందిన ఒకే కుటుంబానికి ముగ్గురు అక్కాచెల్లెళ్లు చనిపోయారు. మరో కుటుంబానికి చెందిన మూడు తరాలు అంటే తాత, కుమార్తె, మనుమరాలు మృతి చెందారు. ఇంకో కుటుంబానికి చెందిన భార్యాభర్తలు ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదంపై రాష్ట్రపతి ముర్ము, ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, ప్రధాని మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ప్రధాని మృతులకు ఒక్కొక్కరికి రూ.2 లక్షలు, క్షతగాత్రులకు రూ.50 వేల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున మృతుల ఒక్కొక్కరికి రూ.7లక్షలు, గాయపడిన వారికి రూ.2 లక్షల పరిహారం ఇవ్వనున్నట్లు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. తెలంగాణలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో పలువురు ప్రయాణికులు మృత్యువాత పడటం తీవ్రంగా కలచివేసిందని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ఏపీ మంత్రి లోకేశ్ బాధిత కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు.

క్షణంలో ముంచేసిన కంకరకుప్ప

ప్రయాణికులు, కండక్టర్, పోలీసులు తెలిపిన ప్రకారం... సోమవారం వేకువజామున 4.59 గంటలకు 70 మంది ప్రయాణికులను ఎక్కించుకున్న ఆర్టీసీ బస్సు తాండూరు బస్టాండు నుంచి బయటకు వచ్చింది. విద్యార్థులు, ఉద్యోగులు, చిరు వ్యాపారులు, ఇతర పనుల నిమిత్తం హైదరాబాద్ వచ్చేవారు అందులో ఉన్నారు. డ్రైవర్ దస్తగిరి బస్సు నడుపుతుండగా కండక్టర్ రాధ టికెట్లు తీసుకున్నారు. బస్సు నిండుగా ఉండటంతో వికారాబాద్‌లో ఎవ్వరూ ఎక్కలేదు. తర్వాత మన్నెగూడలో ఇద్దరు దిగిపోయారు. మిగతా 60 మందితో 6.40 గంటల సమయంలో మీర్జాగూడ గేటు సమీపంలోకి రాగానే బస్సు భారీ శబ్దంతో కుదుపునకు గురైంది. ఏంజరుగుతుందో తెలుసుకునేలోపే డ్రైవర్‌తోసహా కుడివైపున్న మొదటి ఆరు సీట్లు కంకరలో కూరుకుపోయాయి. ఎడమవైపున కూర్చున్న వారితోపాటు వెనుక వైపున్న వారికీ గాయాలయ్యాయి. కొద్ది నిమిషాల్లోనే తేరుకున్న మిగతా ప్రయాణికులు కంకర కింద కొందరి కాళ్లు, చేతులు కనిపిస్తుండటంతో హతాశులయ్యారు. చేతులతో కంకర తొలగించి ప్రాణాలు కాపాడేందుకు ప్రయత్నించారు. ఈలోపు దారిన వెళుతున్న వారు కూడా సహాయ చర్యలకు దిగారు. కానీ, బస్సులో కొద్దీ కంకర తొలగించడం వారికి సాధ్యంకాలేదు. ప్రయాణికుల్లో కొందరు డయల్ 100కు ఫోన్ చేయడంతో సమీపంలోని చేవెళ్ల పోలీసులు, ఆ తర్వాత అగ్నిమాపక సిబ్బంది వచ్చారు. కంకర తీసేందుకు వారు కూడా ప్రయత్నించినా సాధ్యం కాలేదు. దాంతో జేసీబీని పిలిపించారు. ప్రమాదం జరిగిన తర్వాత జేసీబీ రావడానికి దాదాపు 45 నిమిషాలపైనే పట్టింది. జేసీబీ సాయంతో తొలుత బస్సుపై పడిపోయిన టిప్పర్‌ను, ఆ తర్వాత బస్సుపై పేరుకున్న కంకరను తొలగించారు. బస్సు కుడివైపు భాగాన్ని జేసీబీ సాయంతోనే కత్తిరించారు. ఇదంతా జరగడానికి దాదాపు గంటన్నర పట్టింది. అప్పటికే కంకర కింద పడి ఇద్దరు డ్రైవర్లతో సహా 17 మంది చనిపోయారు. ఒక్కొక్క మృతదేహం బయటకు తీసి అంబులెన్సుల్లో చేవెళ్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన మరో ఇద్దరు ఆసుపత్రికి తరలించగా ప్రాణాలు విడిచారు. గాయపడిన 24 మందిని సమీపంలోని ఆసుపత్రులకు తరలించి చికిత్స చేస్తున్నారు. మిగిలిన 17 మంది క్షేమంగా బయటపడ్డారు.


ప్రమాదానికి కారణమైన టిప్పర్

మృతుల్లో మహిళలే అధికం

ప్రమాదంలో మొత్తం 19 మంది చనిపోతే వారిలో 13 మంది మహిళలే. గాయపడిన 24 మందిలోనూ 12 మంది మహిళలే. బస్సుల్లో కుడివైపు సీట్లు మహిళలకు కేటాయిస్తుంటారు. దాంతో వారంతా అటువైపే కూర్చుంటారు. ప్రమాదం జరిగినప్పుడు ఈ కుడివైపు సీట్లలో కూర్చున్న వారే చనిపోయారు. ముందు వరుసలో ఎడమవైపు కూర్చున్న కండక్టర్ సహా అనేక మంది ప్రమాదం నుంచి తప్పించుకోగలిగారు.

భారీ గుంతను తప్పించబోయి...

సంగారెడ్డి జిల్లా సంగారెడ్డి మండలం ఎర్దనూరు గ్రామ సమీపంలోని దాసుగుతండా వద్ద ఉన్న క్వారీలో ఉదయం 5.30 గంటల ప్రాంతంలో కంకర నింపుకొన్న టీజీ06యూ3879 టిప్పర్ వికారాబాద్ జిల్లా పూడూరు మండలం చిట్టెంపల్లి గేటుకు బయలుదేరింది. మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన డ్రైవర్ ఆకాశ్ కాంబ్లే టిప్పర్‌ను నడుపుతుండగా దాని యజమాని, మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల సమీపంలోని బాలానగర్‌కు చెందిన లచ్చునాయక్ పక్క సీట్లో కూర్చున్నాడు. టిప్పర్ మీర్జాగూడ గేటు వద్దకు వచ్చాక రోడ్డుకు ఎడమవైపు నాలుగడుగుల వెడల్పుతో ఉన్న గుంత కనిపించింది. దాన్ని తప్పించేందుకు డ్రైవర్ టిప్పర్‌ను కుడివైపు తిప్పాడు. సరిగ్గా అదేసమయంలో ఎదురుగా ఆర్టీసీ బస్సు వస్తున్న విషయాన్ని గమనించలేదు. గుంతను తప్పించామనుకునేలోపే బస్సును బలంగా ఢీ కొట్టాడు. టిప్పర్‌లో ఉన్న లచ్చునాయక్ గాయాలతో బయటపడి... గాంధీ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నాడు.

అసలే ఇరుకురోడ్డు.. ఆపై పరిధి దాటిన వేగం

ప్రమాదం జరిగిన సమయంలో రెండు వాహనాలూ పరిధికి మించిన వేగంతోనే ప్రయాణిస్తున్నట్లు భావిస్తున్నారు. ప్రమాదం జరిగిన ప్రదేశానికి తాండూరు బస్టాండ్ సరిగ్గా 60 కిలోమీటర్ల దూరంలో ఉంది. మామూలుగా కారులో వెళ్లినా గంటన్నర సమయం పడుతుంది. రోడ్డు ఇరుకుగా ఉండటమే ఇందుకు కారణం. ప్రమాదం జరిగినప్పుడు బస్సు వేగంగా ఉందని ప్రయాణికులు తెలిపారు. ఇదే సమయంలో కంకరతో వస్తున్న టిప్పర్ కూడా దాదాపు 55 కిలోమీటర్ల దూరాన్ని గంటలో చేరుకుంది. బస్సు కంటే టిప్పర్ మరింత వేగంగా ఉందని, ప్రమాద తీవ్రత పెరగడానికి ఇదే కారణమని ప్రయాణికులు తెలిపారు. ప్రమాదం ధాటికి బస్సు కుడివైపు భాగమంతా ధ్వంసం కావడంతో టిప్పర్‌లో ఉన్న కంకరంతా ప్రయాణికులను కప్పేసింది. గుంత లేకపోతే ప్రమాదం జరిగేది కాదని, రోడ్డు కుంగిపోయి ఉండకపోతే టిప్పర్‌లో ఉన్న కంకర ప్రయాణికులపై పడిపోవడానికి అవకాశం ఉండేకాదని అభిప్రాయం వ్యక్తమవుతోంది. ● ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లాలో జరిగిన బస్సు దుర్ఘటన మరువకముందే జరిగిన ఈ ప్రమాదం చర్చనీయాంశంగా మారింది. రెండు ప్రమాదాల్లోనూ 19 మంది మరణించడం యాదృచ్ఛికం.


మృతుల బంధువుల రోదనలు


మృతిచెందిన ఒకే కుటుంబానికి చెందిన అక్కాచెల్లెళ్లు సాయిప్రియ, నందిని, తనూష

రహదారులపై రక్తధారలు

- మూడు ప్రమాదాల్లో ఏడుగురి దుర్మరణం
- 23 మందికి గాయాలు

బాపట్ల, కర్లపాలెం, ఎలమంచిలి గ్రామీణం, లింగపాలెం, చింతలపూడి, న్యూస్‌టుడే: సాఫీగా సాగాల్సిన ప్రయాణాల్లో అనూహ్య ప్రమాదాలు... నెత్తుటి ధారలతో తడిచిన రహదారులు... ఆత్మీయులను కోల్పోయిన కుటుంబసభ్యుల రోదనలు... వెరసి రాష్ట్రంలో సోమవారం చోటుచేసుకున్న మూడు వేర్వేరు ప్రమాదాలు ఏడుగురిని పొట్టన పెట్టుకోగా 23 మంది గాయపడ్డారు.

సంగీత్ వేడుకలకు వెళ్లొస్తూ...

బాపట్ల జిల్లాలో సోమవారం తెల్లవారుజామున రొయ్యల కంటెయినర్‌ను కారు ఢీకొని నలుగురు దుర్మరణం చెందారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ కుమారుడు రాకేష్‌వర్మ సంగీత్ వేడుకలను ఆదివారం బాపట్లలో నిర్వహించారు. కర్లపాలెం గ్రామం నుంచి కొందరు బంధువులు హాజయ్యారు. వేడుకలు పూర్తయ్యాక తిరుగు ప్రయాణమయ్యారు. వీరు ప్రయాణిస్తున్న కారు. . 216ఏ జాతీయ రహదారిపై సత్యవతిపేట సమీపంలో ఎదురుగా వస్తున్న రొయ్యల కంటెయినర్‌ను వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న బేతాళం బలరామరాజు(65), ఆయన సతీమణి లక్ష్మి(60), వియ్యపురాలు గాదిరాజు పుష్పవతి(60) అక్కడికక్కడే మృతిచెందారు. కారు నడుపుతున్న ముదునూరి శ్రీనివాసరాజు(54)కు తీవ్ర గాయాలయ్యాయి. ఆయనను ఆసుపత్రికి తరలిస్తుండగా చనిపోయారు. శ్రీనివాసరాజు స్వస్థలం విజయవాడలోని ముత్యాలంపాడు. ప్రమాదంలో బలరామరాజు మనవడు జయంత్‌వర్మ, మనవరాలు వైష్ణవికి గాయాలయ్యాయి. వీరిని గుంటూరు, చీరాలలోని ఆసుపత్రులకు తరలించారు.

లారీని తప్పించబోయి.. ఆటోను ఢీకొట్టి..


అనకాపల్లి జిల్లాలో సంభవించిన ప్రమాదంలో దెబ్బతిన్న ఆటో, టాటా మ్యాజిక్ వాహనాలు


గాయపడిన మహిళను వాహనంలోకి ఎక్కించేందుకు తీసుకొస్తున్న హోంమంత్రి అనిత

చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిపై అనకాపల్లి జిల్లా ఎలమంచిలి మండలం కొక్కిరాపల్లి కూడలిలో ఆగి ఉన్న ఆటోను టాటా మ్యాజిక్ వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందగా.. 12 మందికి గాయాలయ్యాయి. తాళ్లపాలెం నుంచి ప్రయాణికులతో బయల్దేరిన ఆటో డ్రైవర్.. ఎలమంచిలిలోని ప్రేమసమాజం వద్ద ఇద్దరిని దించారు. వారి నుంచి ఛార్జీ డబ్బులు తీసుకుంటున్నారు. ఆ సమయంలో ఆటో పక్కగా లారీ వెళ్తుండగా.. దాని వెనక టాటా మ్యాజిక్ వాహనం వస్తోంది. లారీని తప్పించే ప్రయత్నంలో మ్యాజిక్ వాహనం.. నిలిపి ఉన్న ఆటోను ఢీకొట్టింది. ఆటోలోని ఎనిమిది మందికి గాయాలు కాగా.. కశింకోట మండలం తీడ గ్రామానికి చెందిన గొంది పెంటయ్య (55), నర్సీపట్నానికి చెందిన బాదంపూడి లక్ష్మి మృతి చెందారు. మ్యాజిక్ వాహనంలోని పది మందిలో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని ఆసుపత్రులకు తరలించారు.

క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించిన హోంమంత్రి అనిత

విశాఖపట్నం నుంచి పాయకరావుపేట వస్తున్న హోంమంత్రి అనిత.. ప్రమాదాన్ని చూసి తన కాన్వాయ్‌ను ఆపారు. సిబ్బంది సాయంతో క్షతగాత్రులను వాహనాల్లోకి ఎక్కించి హుటాహుటిన ఎలమంచిలి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. గాయపడిన వారికి ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్‌తో కలిసి వైద్యులతో మాట్లాడి.. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. తీవ్రగాయాలైన ఎనిమిది మందికి వైద్యులు ప్రథమ చికిత్స అందించారు. అనంతరం వారిని అనకాపల్లి జిల్లా ఆసుపత్రి, విశాఖ కేజీహెచ్‌కు తరలించారు.

బైక్‌ను ఢీకొని ప్రైవేటు బస్సు బోల్తా

ఏలూరు జిల్లా లింగపాలెం సమీపంలోని జూబ్లీనగర్ వద్ద సోమవారం రాత్రి ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బైక్‌ను ఢీకొట్టి బోల్తాపడింది. ఈ ఘటనలో ఇటీవలే సాఫ్ట్‌వేర్ కొలువు దక్కించుకుని విధుల్లో చేరేందుకు హైదరాబాద్ ప్రయాణమైన వీరంకి ప్రవీణ్ బాబు(25) అనే యువకుడు మరణించాడు. బస్సు ప్రమాదాన్ని పసిగట్టిన ఆయన బయటకు దూకి ప్రాణాలు దక్కించుకునే ప్రయత్నంలో బస్సు కిందపడి చనిపోయినట్లుగా భావిస్తున్నారు. అయ్యపరాజుగూడేనికి చెందిన ప్రవీణ్‌బాబు ఇటీవల రూ.20 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం దక్కించుకున్నట్లు తెలిసింది. ఈ ప్రమాదంలో 9 మందికి గాయాలయ్యాయి. వీరిని చింతలపూడి, ఏలూరు ఆసుపత్రులకు తరలించారు. ధర్మాజీగూడెం నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ఈ బస్సు.. బయలుదేరిన కాసేపటికే ప్రమాదానికి గురైంది. జూబ్లీనగర్ వద్ద వెళ్తున్న బైక్‌ను పక్క నుంచి బస్సు ఢీకొట్టి సుమారు 400 మీటర్ల దూరం ముందుకు దూసుకెళ్లి అక్కడ మలుపు వద్ద బోల్తాపడింది. డ్రైవర్ ఘటనాస్థలి నుంచి పరారయ్యాడు. డ్రైవర్, క్లీనర్ సహా 17 మంది బస్సులో ఉన్నారు.


ప్రవీణ్‌బాబు


బోల్తాపడిన బస్సు

రుణాల పంపిణీ.. డిజిటలైజేషన్‌లో భారీ అక్రమాలున్నాయ్

- వైకాపా హయాంలో సహకార వ్యవస్థ అస్తవ్యస్తం
- అవకతవకలపై అధికారులను నిలదీసిన సభాసంఘం సభ్యులు

ఈనాడు,అమరావతి: వైకాపా హయాం(2019-24)లో సహకార వ్యవస్థను అస్తవ్యస్తం చేశారని ప్రత్యేక సభా సంఘం అభిప్రాయపడింది. 'దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలివ్వడంలో.. సభ్యుల పేర్ల నమోదులో బినామీ పాస్ పుస్తకాలను పుట్టించడం, తర్వాత వాటిని డిలీట్ చేయడం వంటి అక్రమాలకు పాల్పడ్డారు. రికార్డుల డిజిటలీకరణలోనూ అవకతవకలే. సహకార సంఘాల్లో డిపాజిట్ డబ్బులంటే అవి రైతులవి. ఆ డబ్బును అడ్డగోలుగా రుణాల రూపంలో అయిన వారికి అడ్డదారిలో పంచి పెట్టడమేంటి? రైతులకు ఎలాంటి నష్టమూ జరక్కుండా ఈ అక్రమాలన్నింటినీ సరిచేయాలి. సహకార వ్యవస్థను బాగు చేయాలి. అదే మా ఉద్దేశం' అని సభాసంఘం తేల్చి చెప్పింది. 2019-24 మధ్య ఆప్కాబ్, జిల్లా సహకార కేంద్ర బ్యాంకులు, పీఏసీఎస్‌లలో జరిగిన అక్రమాలను నిగ్గు తేల్చేందుకు ఏర్పాటైన సభాసంఘం.. అసెంబ్లీ కమిటీ హాలులో సోమవారం సమావేశమైంది. ఛైర్మన్ ఎన్.అమరనాథరెడ్డి అధ్యక్షతన జరిగిన భేటీలో సభ్యులు బూర్ల రామాంజనేయులు, యార్లగడ్డ వెంకట్రావు, తెనాలి శ్రావణ్‌కుమార్, ధూళిపాళ్ల నరేంద్రకుమార్, బొలిశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు. సంబంధిత అధికారులు హాజరయ్యారు.

మరిన్ని వివరాలు https://epaper.eenadu.net లో

చెవిరెడ్డి భాస్కరరెడ్డికి ఎయిమ్స్‌లో చికిత్స

తాడేపల్లి, న్యూస్‌టుడే: మద్యం కుంభకోణం కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డికి మంగళగిరి ఎయిమ్స్‌లో వైద్య చికిత్స అందించారు. చర్మ, ఒళ్లు నొప్పుల సమస్యలతో బాధపడుతున్న ఆయన్ను సోమవారం ఉదయం విజయవాడలోని జైలు నుంచి పోలీసు బందోబస్తు మధ్య మంగళగిరి ఎయిమ్స్‌కు తీసుకువచ్చారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆయనకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం విజయవాడ జైలుకు తీసుకెళ్లారు.


వైద్యశాల నుంచి చెవిరెడ్డిని జైలుకు తరలిస్తున్న పోలీసులు

పిటిషన్‌పై విచారణ వాయిదా: ఉండవల్లిలోని మంతెన ఆశ్రమంలో వెన్నునొప్పికి చికిత్స చేయించుకునేందుకు అనుమతించాలని కోరుతూ మద్యం కుంభకోణం కేసులోని నిందితుడు చెవిరెడ్డి భాస్కరరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ మంగళవారానికి వాయిదా పడింది.

పెట్టుబడులకు ఏపీ ఎంతో అనుకూలం

దుబాయ్‌లో పలు సంస్థల ప్రతినిధులతో మంత్రి నారాయణ

ఈనాడు, అమరావతి: వివిధ రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు ఆంధ్రప్రదేశ్‌లో అనుకూల వాతావరణం ఉందని, అనుమతులు సైతం సింగిల్ విండో విధానంలో జారీ చేస్తున్నామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ చెప్పారు. ఈ నెల 14, 15 తేదీల్లో విశాఖలో నిర్వహిస్తున్న సీఐఐ భాగస్వామ్య సదస్సుకు రావాలని పలు ప్రఖ్యాత సంస్థల ప్రతినిధులను ఆయన కోరారు. దుబాయ్ పర్యటనలో భాగంగా మంత్రి నారాయణ మొదటి రోజు సోమవారం దుబాయ్‌లో ఇండియా కాన్సుల్ ప్రతినిధులు బీజీ కృష్ణన్, సెలీనా శశికాంత్‌లతో భేటీ అయ్యారు. అనంతరం రియల్ ఎస్టేట్, మౌలిక సదుపాయాల రంగంలో ప్రసిద్ధిగాంచిన శోభా గ్రూప్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ విక్రమ్‌దత్తతో సమావేశమయ్యారు. ఏపీలో మౌలిక సదుపాయాల కల్పనకు ముందుకు రావాలని మంత్రి కోరగా శోభా గ్రూప్ సానుకూలంగా స్పందించింది. ◆ దుబాయ్‌లోని కేఈఎఫ్ హోల్డింగ్స్ ప్రధాన కార్యాలయంలో ఆ సంస్థ ఛైర్మన్ ఫైజల్ ఇ.కొట్టికోలన్‌తో నారాయణ సమావేశమయ్యారు. మౌలిక సదుపాయాలు, హెల్త్ కేర్, టెక్నాలజీ రంగాల్లో అనేక దేశాల్లో వ్యాపారాలు నిర్వహిస్తున్న కేఈఎఫ్ హోల్డింగ్స్‌ను రాష్ట్రంలో వైద్య ఆరోగ్య రంగంలో పెట్టుబడులు పెట్టాలని కోరారు.

గ్రహం అనుగ్రహం

4-11-2025 మంగళవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; శరదృతువు, కార్తిక మాసం, శుక్లపక్షం
చతుర్దశి: రా. 9-38 తదుపరి పూర్ణిమ
రేవతి: మ. 12-03 తదుపరి అశ్విని
వర్జ్యం: లేదు
అమృత ఘడియలు: ఉ.9-44 నుంచి 11-17 వరకు తిరిగి తె. 3-36 నుంచి 5-05 వరకు
దుర్ముహూర్తం: ఉ. 8-20 నుంచి 9-05 వరకు తిరిగి రా. 10-29 నుంచి 11-19 వరకు
రాహుకాలం: సా. 3-00 నుంచి 4-30 వరకు
సూర్యోదయం: ఉ.6.04; సూర్యాస్తమయం: సా.5.26

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
రాజమహేంద్రవరం	39.0	23.0
నెల్లూరు	36.2	28.2
నరసాపురం	35.5	27.5
విజయవాడ	35.0	25.4
తిరుపతి	34.4	26.0
అనంతపురం	34.2	24.1
కడప	34.0	25.0
కర్నూలు	34.0	24.7
ఒంగోలు	33.8	27.2
విశాఖపట్నం	33.2	25.0
తాడేపల్లిగూడెం	33.0	27.0
శ్రీకాకుళం	33.0	24.0
గుంటూరు	32.0	27.0
విజయనగరం	32.0	24.0
హైదరాబాద్	31.3	22.6

నియంత్రణ కోల్పోయి.. వాహనాలను ఈడ్చుకెళ్లి..

- రాజస్థాన్‌లో డంపర్ ట్రక్కు డ్రైవర్ బీభత్సం
- 14 మంది మృతి, 13 మందికి గాయాలు

జైపుర్: నియంత్రణ కోల్పోయిన ఓ డంపర్ ట్రక్కు డ్రైవర్ 14 మంది మృతికి కారణమయ్యాడు. దాదాపు 300 మీటర్ల మేర 17కి పైగా వాహనాలను ఢీకొంటూ వెళ్లి మరో 13 మందిని గాయపరిచాడు. ఈ భయంకరమైన ఘటన రాజస్థాన్‌లోని జైపుర్ జిల్లా లోహమండిలో సోమవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. ప్రమాద సమయంలో ట్రక్కు 100 కి.మీ.వేగంతో దూసుకుపోయినట్లు సీసీటీవీ దృశ్యాల ఆధారంగా అంచనావేశారు. వాహనాల కింద చిక్కుకున్న అనేక మంది ఆర్తనాదాలు, రక్తపు మరకలు, చెల్లాచెదురైన వాహనాలతో ఆ ప్రాంతం భయంకరంగా ఉన్నట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. డ్రైవర్ మద్యం మత్తే ఈ ప్రమాదానికి కారణమని ఆరోపించారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. కాగా, ఈ ఘటనపై ప్రధానమంత్రి మోదీ, రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మతోపాటు మాజీ సీఎం అశోక్ గహ్లోత్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, గాయపడినవారికి రూ.50 వేల చొప్పున పరిహారాన్ని ప్రధాని ప్రకటించారు.



ప్రమాదంలో ధ్వంసమైన వాహనాలు

ఎస్టీ కమిషన్ ఛైర్మన్‌గా ఎస్.బొజ్జిరెడ్డి


ఈనాడు, అమరావతి: రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్‌గా రంపచోడవరం నియోజకవర్గానికి చెందిన ఎస్.బొజ్జిరెడ్డిని ప్రభుత్వం నియమించింది. సభ్యులుగా గొర్ల సునీత, కద్రక మల్లేశ్వరరావు, కె.లక్ష్మి, సాయిరాం కిల్లో, పి.వెంకటప్పలను నియమించింది. వీరు బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి రెండేళ్లపాటు ఈ పదవిలో కొనసాగనున్నారు. ఈ మేరకు సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

నేడు కృష్ణా జిల్లాలో జగన్ పర్యటన

ఈనాడు, అమరావతి: వైకాపా అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్ మంగళవారం కృష్ణా జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం తాడేపల్లి నివాసం నుంచి బయల్దేరి పెనమలూరు సెంటర్, ఉయ్యూరు, పామర్రు బైపాస్ మీదుగా పెడన నియోజకవర్గం గూడూరు జగన్ చేరుకుంటారు. అక్కడ దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలిస్తారు. తర్వాత అవనిగడ్డ హైవే మీదుగా తాడేపల్లి చేరుకుంటారు. ◆ తెలంగాణలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో పలువురు మృత్యువాత పడడం అత్యంత విషాదకరమని జగన్ విచారం వ్యక్తం చేశారు. ఆర్టీసీ బస్సును కంకర లారీ ఢీ కొట్టడంతో పలువురు మృతిచెందడం తనను తీవ్రంగా కలచివేసిందని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

160 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి మా లక్ష్యం

- ఆక్టోపస్ ఎనర్జీ ఇంటర్నేషనల్ సంస్థకు చంద్రబాబు ఆహ్వానం
- లండన్‌లో పారిశ్రామికవేత్తలతో వరుస సమావేశాలు
- విశాఖలో భాగస్వామ్య సదస్సుకు హాజరుకావాలని పిలుపు



లండన్‌లోని పలువురు పారిశ్రామికవేత్తలు, వివిధ రంగాల నిపుణులతో సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో 160 గిగావాట్ల హరిత ఇంధనాన్ని ఉత్పత్తి చేయడమే తమ లక్ష్యమని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. పునరుత్పాదక ఇంధన రంగంలో పెట్టుబడులు పెట్టాల్సిందిగా లండన్‌లో అతిపెద్ద విద్యుత్తు సరఫరాదారుగా ఉన్న ఆక్టోపస్ ఎనర్జీ ఇంటర్నేషనల్‌ను రాష్ట్రానికి ఆహ్వానించారు. ఈ మేరకు ఆ సంస్థ డైరెక్టర్ క్రిస్ ఫిట్జ్‌గెరాల్డ్‌తో చంద్రబాబు సమావేశమయ్యారు. రాష్ట్రంలో క్లీన్ ఎనర్జీ, స్మార్ట్ గ్రిడ్, డేటా ఎనలిటిక్స్ రంగాల్లో విస్తృత అవకాశాలు, అమరావతి, విశాఖల్లో నూతన సాంకేతికత ద్వారా విద్యుత్తు ఉత్పత్తికి ఉన్న సౌకర్యాల గురించి వివరించారు. సోమవారం లండన్‌లోని వివిధ పారిశ్రామికవేత్తలు, దిగ్గజ సంస్థల ప్రతినిధులతో చంద్రబాబు వరుస సమావేశాలు నిర్వహించారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడంతో పాటు గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల (జీసీసీ) ఏర్పాటు చేయాల్సిందిగా వారిని కోరారు. విశాఖలో ఈ నెల 14, 15 తేదీల్లో జరగనున్న భాగస్వామ్య సదస్సుకు ఆహ్వానించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో గ్రీన్ ఎనర్జీ, సెమీ కండక్టర్లు, ఏవియేషన్ తదితర రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అవకాశాలు, వాటికి అనుగుణంగా ప్రభుత్వం రూపొందించిన పారిశ్రామిక పాలసీలను వివరించారు. పెట్టుబడిదారులకు ప్రభుత్వ ప్రోత్సాహకాలు తెలియజేశారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ స్థానంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాన్ని అనుసరిస్తున్నామని చెప్పారు.

విశాఖ, తిరుపతిల్లో జీసీసీలు ఏర్పాటు చేయండి..

విశాఖ, తిరుపతిలలో జీసీసీలు ఏర్పాటు చేయాలని రోల్స్ రాయిస్ గ్రూప్ ప్రతినిధుల్ని చంద్రబాబు కోరారు. ఈ సంస్థ సీఈవో నిక్కి గ్రేడి స్మిత్‌తో ఆయన సమావేశమయ్యారు. ఏరో ఇంజిన్స్, డీజిల్ ప్రొపెల్షన్ సిస్టమ్స్ తయారీలో రోల్స్ రాయిస్‌కు అంతర్జాతీయ బ్రాండ్‌గా పేరుంది. ఓర్వకల్లులో మిలిటరీ ఎయిర్‌స్ట్రిప్, విమానాల మెయింటెనెన్స్, ఓవర్ హాలింగ్ (ఎంఆర్‌ఓ) యూనిట్, భోగాపురం విమానాశ్రయ సమీపంలో ఏవియేషన్ ఎకో సిస్టం, ఎమ్మార్వో ఫెసిలిటీ ఏర్పాటుకు అవకాశం ఉందని వివరించారు.

ప్యాకేజింగ్ యూనిట్ ఏర్పాటుకు శ్రామ్ అండ్ మ్రామ్ గ్రూపు ఆసక్తి

అనంతరం శ్రామ్ అండ్ మ్రామ్ గ్రూపు ఛైర్మన్ శైలేష్ హీరానందాని, శ్యామ్ కో హోల్డింగ్ లిమిటెడ్ ఛైర్మన్ సంపత్‌కుమార్ మల్లాయలతో చంద్రబాబు భేటీ అయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడిదారులకు అందిస్తున్న ప్రోత్సాహకాలు, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ రంగంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాల గురించి వారికి వివరించారు. ఈ క్రమంలో సెమీ కండక్టర్లు, ఆధునిక ప్యాకేజింగ్ యూనిట్ ఏర్పాటుకు శ్రామ్ అండ్ మ్రామ్ గ్రూపు ఆసక్తి చూపించింది.

ప్రపంచకప్ గెలిచిన జట్టులో మా అమ్మాయి ఉండటంపై గర్విస్తున్నాం

- శ్రీచరణి తల్లిదండ్రులు



శ్రీచరణి తండ్రికి మిఠాయి తినిపిస్తున్న చిన్నారి. చిత్రంలో తల్లి రేణుక తదితరులు

ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే: మహిళల క్రికెట్ జట్టు ప్రపంచకప్ గెలవడం, అందులో తమ కుమార్తె భాగస్వామ్యం కావడంపై గర్వపడుతున్నామని భారత మహిళల జట్టు క్రీడాకారిణి శ్రీచరణి తల్లిదండ్రులు నల్లపురెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, రేణుక తెలిపారు. వైఎస్సార్ కడప జిల్లా ఎర్రగుంట్లలోని తమ నివాసం వద్ద కుటుంబ సభ్యులతో కలిసి వారు మిఠాయిలు పంచుకున్నారు. అనంతరం చంద్రశేఖర్‌రెడ్డి, రేణుక మాట్లాడుతూ.. మొదట మా అమ్మాయి అథ్లెటిక్స్‌లో రాణించిందని, తర్వాత ఆమె మామయ్య కిషోర్ కుమార్‌రెడ్డి ప్రోత్సాహంతో క్రికెట్‌లోకి ప్రవేశించి రాణిస్తోందని చెప్పారు.

రాష్ట్రంలో 'హిందుజా' రూ.20 వేల కోట్ల పెట్టుబడులు

(మొదటి పేజీ తరువాయి)

ఫాస్ట్ ట్రాక్ విండో ద్వారా ట్రాక్ చేస్తామని వివరించారు. ఈ కీలక ఒప్పందాలతో రాష్ట్ర యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని సీఎం తెలిపారు. భేటీ అనంతరం ఏపీలో తమ కార్యకలాపాల్ని విస్తరించడానికి హిందుజా గ్రూపు సంసిద్ధత వ్యక్తం చేసింది.

గ్రీన్ ఎనర్జీ, ఎలక్ట్రిక్ మొబిలిటీ హబ్‌గా ఏపీ

రాష్ట్రాన్ని గ్రీన్ ఎనర్జీ, ఎలక్ట్రిక్ మొబిలిటీ హబ్‌గా తీర్చిదిద్దడంలో హిందుజా పెట్టుబడులు కీలకంగా మారనున్నాయని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. ఎలక్ట్రిక్ మొబిలిటీ హబ్ ఏర్పాటు కోసం అమరావతి, అనంతపురం, కర్నూలు జిల్లాల్లో సంస్థ ప్రతినిధులు త్వరలో పర్యటించనున్నారు. విశాఖలో హిందుజాకు ప్రస్తుతం 1,050 మెగావాట్ల సామర్థ్యం ఉన్న థర్మల్ ప్లాంట్ ఉంది. దీనికి అదనంగా 800 మెగావాట్ల సామర్థ్యం గల రెండు కొత్త యూనిట్లను ఏర్పాటు చేస్తారు. రాష్ట్రవ్యాప్తంగా ఎలక్ట్రిక్ ఛార్జింగ్ స్టేషన్ల నెటవర్క్‌నూ నెలకొల్పనున్నారు. గ్రీన్ ట్రాన్స్‌పోర్టు ఎకో సిస్టం అభివృద్ధికి సహకరిస్తారు.



లండన్‌లో ఆక్టోపస్ ఎనర్జీ ఇంటర్నేషనల్ డైరెక్టర్ క్రిస్ ఫిట్జ్‌గెరాల్డ్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు భేటీ



రోల్స్ రాయిస్ సంస్థ సీటీవో నిక్కి గ్రేడి స్మిత్, ఇతర ప్రతినిధులతో సమావేశమైన ముఖ్యమంత్రి చంద్రబాబు

అమరావతిలో ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్ సెంటర్

- అరుదైన ఖనిజాల వెలికితీతకు విశ్వవిద్యాలయాల భాగస్వామ్యం
- పారిశ్రామికవేత్తలతో రౌండ్ టేబుల్ సమావేశంలో చంద్రబాబు

ఈనాడు, అమరావతి: అమరావతిలో వచ్చే జనవరి నాటికి ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. లండన్‌లో పారిశ్రామికవేత్తలు, వివిధ రంగాలకు చెందిన నిపుణులతో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సాంకేతిక రంగంలో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అవకాశాలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలను వివరించారు. విశాఖలో ఈ నెల 14, 15 తేదీల్లో జరగనున్న భాగస్వామ్య సదస్సుకు వారిని ఆహ్వానించారు. 'ఏపీలో ఉన్న అంతర్గత జల రవాణా మార్గాల ద్వారా అతి తక్కువ ఖర్చుతో సరకు రవాణా చేసేందుకు ఆస్కారం ఉందని వివరించారు. 'లాజిస్టిక్ కారిడార్ ద్వారా ఏపీని అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. ఏఐ వినియోగం, నిపుణుల తయారీ వంటి అంశాలతో పాటు ఎకోసిస్టం అభివృద్ధికి ఉన్న అవకాశాలను పరిశీలించండి. అరుదైన భూగర్భ ఖనిజాల వెలికితీతకు వివిధ విశ్వవిద్యాలయాలు కూడా భాగస్వాములు కావాలి. వీటిని వెలికితీయడం ద్వారా ప్రపంచ అవసరాలకు వాటిని వినియోగించవచ్చు' అని చంద్రబాబు పేర్కొన్నారు. సమావేశంలో ప్రముఖ నిర్మాణ సంస్థ ఆరుప్ గ్లోబల్ ఎఫైర్స్ డైరెక్టర్ జేమ్స్ కెన్నీ, డిజిటల్ రిస్క్ మేనేజ్‌మెంట్ కంపెనీ అల్తెరిన్ టెక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఫ్రెడీ పూలాండ్, పీజీ పేపర్ కంపెనీ సీఈవో పూనమ్‌గుప్తా, డబ్ల్యూఎంజీ యూనివర్సిటీ నుంచి గౌరవ్ మార్వాహా, నానోసైన్స్ ప్రొఫెసర్ రాధా బోయా, ఏఐ పాలసీ ల్యాబ్స్ ఫౌండర్ డైరెక్టర్ ఉదయ్ నాగరాజు, ఫ్లుయెంట్ గ్రిడ్ ప్రెసిడెంట్ రత్న గారపాటి, బ్రిటిష్ హెల్త్ ఇండస్ట్రీ అసోసియేషన్ ప్రతినిధి పాల్ బెంటన్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెమింగోలకు శాశ్వత నివాస స్థావరంగా పులికాట్

(మొదటి పేజీ తరువాయి)

రాజహంసలుగా పిలుచుకునే ఈ పక్షులు జీవవైవిధ్యానికి ప్రతీకలు. ఏటా అక్టోబరులో వచ్చి మార్చిలో తిరిగివెళ్లిపోయే ఈ అతిథి పక్షులు.. ఈ మధ్య ఏడాది పొడవునా కనువిందు చేస్తున్నాయి. ఎకో టూరిజాన్ని అభివృద్ధి చేసే చర్యల్లో భాగంగా ఫ్లెమింగోలు పులికాట్‌లో స్థిరనివాసం ఏర్పాటు చేసుకునేలా అటవీశాఖ ఆధ్వర్యంలో అనువైన పరిస్థితులు కల్పిస్తున్నాం. మొంథా తుపానుకు ముందు నుంచే ఫ్లెమింగోల రాక మొదలైంది. పెనుగాలులు, భారీ వర్షాలకు, వాటి స్థావరాలకు ఇబ్బంది కలగకుండా అటవీశాఖ ఆధ్వర్యంలో తగిన చర్యలు చేపట్టాం. రాబోయే మూడు నెలలు వాటి రక్షణపై మరింత శ్రద్ధ పెడతాం' అని పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు.

ఏనుగుల కదలికలపై సంకేతాలు: మానవ, వన్యప్రాణి సంఘర్షణను నిలువరించేందుకు ఏఐ, మెషిన్ లెర్నింగ్ విధానంతో పనిచేసే సరికొత్త వ్యవస్థను చిత్తూరు జిల్లాలో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నట్లు పవన్‌కల్యాణ్ తెలిపారు. ఏనుగులు సంచరించే ప్రాంతాల్లో ఈ సాంకేతిక వ్యవస్థను మోహరించామని అన్నారు. సౌరశక్తితో పనిచేసే ఈ వ్యవస్థ ఏనుగుల సంచారాన్ని గుర్తించడంతో పాటు వాటిని స్వల్పంగా భయపెడుతుందని, ఏనుగుల కదలికలను గమనించిన వెంటనే అటవీ శాఖాధికారులకు హెచ్చరిక సంకేతాలు పంపిస్తుందని చెప్పారు. తద్వారా అటు మనుషులు, ఇటు వన్యప్రాణులకు ఇది రక్షణ వ్యవస్థలా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. '120 డిగ్రీల పరిధిలో 60 మీటర్ల మేర సున్నిత ప్రాంతాలను ఈ వ్యవస్థ నిరంతరం పర్యవేక్షిస్తుంది. వన్యప్రాణుల వల్ల జరిగే పంట నష్టాన్ని నివారించడంతో పాటు మనుషులు- ఏనుగుల మధ్య సంఘర్షణను తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తుంది' అని పవన్‌కల్యాణ్ అన్నారు. జనావాసాల్లోకి వచ్చే అటవీ ఏనుగులను తరిమికొట్టేందుకు ఇప్పటికే కర్ణాటక నుంచి తీసుకొచ్చిన కుంకీ ఏనుగులతో చేసిన ఆపరేషన్లు సత్ఫలితాలు ఇచ్చాయని అన్నారు. ఈ మేరకు ఉపముఖ్యమంత్రి అధికారిక ఎక్స్ ఖాతాలో ప్రకటన విడుదల చేశారు.

దొనకొండలో ప్రపంచస్థాయి క్యాన్సర్ సెంటర్

(మొదటి పేజీ తరువాయి)

క్యాన్సర్ చికిత్స- శస్త్రచికిత్సలు, 1,500 పడకలతో ఇన్ పేషెంట్ వార్డు, నర్సింగ్ హాస్పిటల్, మెడికల్ స్కూల్, హెలిపోర్ట్, హోటల్, నివాస సముదాయం, రెస్టారెంట్లు, బొటానికల్ గార్డెన్, పార్కు, క్యాన్సర్ మ్యూజియం, ఆరోగ్య సాంకేతిక కేంద్రం తదితరాలను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ఈ ప్రాజెక్టుతో 4 వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు.

సీఎం చంద్రబాబు పిలుపుతో...: 'నేను ప్రకాశం జిల్లా వాసిని. నాకు జన్మనిచ్చిన ప్రాంతంలో క్యాన్సర్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం ఆనందంగా ఉంది. రాష్ట్ర అభివృద్ధికి పాటుపడాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపుతో మరికొన్ని ప్రాజెక్టుల ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నాం' అని చల్లా గ్రూప్ ఛైర్మన్ చల్లా ప్రసాద్ చెప్పారు. ఒమెక్సా కో ఫౌండర్ డాక్టర్ రాజన్ గార్గ్ మాట్లాడుతూ పేదలకు మేలు చేసేలా అత్యాధునిక వైద్య సదుపాయాలతో క్యాన్సర్ సెంటర్‌ను నిర్మిస్తామని తెలిపారు. సమావేశంలో ఒమెక్సా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సుధీర్ పూరి, డైరెక్టర్ గ్యారీ చోప్రా, మేస్ ప్రతినిధి జోసెఫ్ మాథ్యూ, చల్లా గ్రూప్ కోఆర్డినేటర్ పి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



విజయవాడ జీజీహెచ్‌లో పోలీసులను నెట్టుకుంటూ లోపలికి వెళ్తున్న జోగి రమేష్ అనుచరులు

ప్రభుత్వాసుపత్రిలో దౌర్జన్యంపై కేసు

- ఏ1గా జోగి భార్య శకుంతల, ఏ2, ఏ3గా కుమారులు

ఈనాడు - అమరావతి, న్యూస్‌టుడే - పటమట: పోలీసులను దౌర్జన్యంగా తోసేసి.. విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో అద్దాలు పగలగొట్టిన ఘటనపై వైకాపా నేత జోగి రమేష్ భార్య, ఇద్దరు కుమారులు, మరికొందరిపై మాచవరం పోలీసులు కేసు నమోదు చేశారు. నకిలీ మద్యం కేసులో అరెస్టయిన జోగి రమేష్, రాములను న్యాయస్థానంలో హాజరుపరిచే ముందు పోలీసులు ఆదివారం రాత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా వైకాపా శ్రేణులు వీరంగం సృష్టించాయి. లోపలకు చొచ్చుకురాకుండా నిలువరిస్తున్నా ఆగకుండా ఆ పార్టీ అనుచరులు పోలీసులపై దౌర్జన్యానికి పాల్పడ్డారు. ఆసుపత్రిలోని ఎమర్జెన్సీ వార్డు ప్రవేశ ద్వారం అద్దాలు పగలగొట్టారు. అక్కడే విధుల్లో ఉన్న మాచవరం ఎస్.ఐ శంకర్‌రావు వారిని అడ్డుకునే ప్రయత్నం చేయగా.. అతనిపై దౌర్జన్యం చేశారు. వీరిలో జోగి రమేష్ భార్య శకుంతల, కుమారులు రాజీవ్, రోహిత్ కూడా ఉన్నారు. ఈ ఘటనకు సంబంధించి బీఎన్ఎస్‌లోని 189 (2), 324 (3) రెడ్‌విత్ 190, 3 పీడీపీపీఏలోని సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఏ1గా జోగి రమేష్ భార్య శకుంతల, ఏ2గా పెద్ద కుమారుడు రాజీవ్, ఏ3గా చిన్న కుమారుడు రోహిత్‌లతో పాటు మరికొందరిని నిందితులుగా చేర్చారు. ఘటన జరిగిన సమయంలో తీసిన వీడియోలను పోలీసులు పరిశీలిస్తున్నారు. మరో 10 నుంచి 15 మందిని నిందితులుగా చేర్చే అవకాశం ఉంది.

నీ పేరు డిజిటల్ బుక్‌లో రాస్తాం: 'ఈ ప్రభుత్వం ఉండేది ఇంకా రెండేళ్లే. నీ పేరు ఏంటి? డిజిటల్ బుక్‌లో రాసుకుంటాం. నీ కాలర్ పట్టుకుని నిలదీస్తాం. నీకు భయం అంటే ఎలా ఉంటుందో చూపిస్తాం' అంటూ ఎస్.ఐ. శంకర్‌రావును వైకాపా అనుచరులు దుర్భాషలాడారు. పోలీసులు ఆపే ప్రయత్నం చేసినా ఆగకుండా రచ్చ చేశారు. అందరూ కలసి పోలీసులను నెట్టుకుంటూ ఆసుపత్రిలోకి వెళ్లేందుకు యత్నించగా ప్రవేశమార్గం వద్ద ఉన్న తలుపు అద్దాలు పగిలిపోయాయి. 'జై జోగి' అని నినాదాలు చేస్తూ చొచ్చుకెళ్లారు. అక్కడే ఉన్న ఎస్.ఐను పక్కకు నెట్టేశారు. ఓ కానిస్టేబుల్ కిందపడిపోవడంతో అతనిని తొక్కుకుంటూ ముందుకు వెళ్లి పైశాచికత్వం ప్రదర్శించారు.


- వైకాపా శ్రేణుల అరాచకంపై పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. దౌర్జన్యం చేస్తున్నా ఎందుకు నిలువరించలేకపోయారని పోలీసు అధికారులను సీపీ ప్రశ్నించినట్లు సమాచారం. ఆసుపత్రి అద్దాలు పగలగొట్టి పోలీసులపై తిరగబడిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

జోగి సోదరులకు కాకాణి భరోసా

నెల్లూరు (నేర విభాగం), న్యూస్‌టుడే: జోగి రమేష్, రాములను సోమవారం రాత్రి 7.40 గంటలకు నెల్లూరు కేంద్ర కారాగారానికి తీసుకొచ్చారు. వారిద్దరికీ న్యాయస్థానం ఈ నెల 13 వరకు రిమాండ్ విధించడంతో విజయవాడ నుంచి రోడ్డు మార్గాన నెల్లూరుకు తీసుకువచ్చారు. జైలు అధికారులు వారికి ఖైదీ నంబర్లు 7177, 7178 కేటాయించారు. జైలు వద్ద మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి వారిని కలిశారు. అధైర్యపడవద్దని, పార్టీ అండగా ఉంటుందని కాకాణి జోగి రమేష్‌కు భరోసా ఇచ్చారు.

మద్యం డబ్బులు తీసుకోలేదని జగన్ ప్రమాణం చేయగలరా?

- మంత్రి లోకేశ్ సవాల్
- నకిలీ మద్యం కేసులో జోగి రమేష్ ప్రమేయం
- అన్ని ఆధారాలు దొరికినందునే అరెస్ట్
- తప్పు చేసినవాళ్లను బీసీ, ఓసీ అని వదిలేస్తామా అని వ్యాఖ్య



ఈనాడు, అమరావతి: 'మద్యం నుంచి డబ్బులు తీసుకోవడం లేదని నేను దేవుడిపై ప్రమాణం చేస్తాను. తాను తీసుకోలేదని వైకాపా నేత జగన్ తన పిల్లలపై గానీ దేవుడిపై గానీ ప్రమాణం చేయగలరా' అని మంత్రి నారా లోకేశ్ సవాల్ విసిరారు. ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన విలేకర్లతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. 'చట్టాన్ని ఉల్లంఘించిన వారిని శిక్షించే విషయంలో కుల, మతం, ప్రాంతాలు, పార్టీలు చూడం. నకిలీ మద్యం కేసులో తెదేపా వారిని సైతం అరెస్టు చేశాం. ఈ కేసులో అన్ని ఆధారాలతో దొరికినందునే జోగి రమేష్ అరెస్టయ్యారు. కాల్ డేటా కూడా లభించింది. తప్పు చేసిన వ్యక్తిని బీసీ, ఓసీ అని వదిలేస్తామా? శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలో శ్రీవేంకటేశ్వర స్వామిని ప్రజలకు దగ్గర చేయాలని 94 ఏళ్ల పండా ఆలయాన్ని నిర్మించారు. అక్కడ తొక్కిసలాట దుర్ఘటనలో పండాను అరెస్టు చేసి, చేతులు దులిపేసుకోవచ్చు. కానీ, అలా చేయలేదు. మానవత్వంతో పని చేస్తున్నాం' అని తెలిపారు.

పార్టీ కార్యాలయంపై దాడిని మర్చిపోలేదు

'వైకాపా హయాంలో కర్రలతో తెదేపా కార్యాలయంపై దాడి చేశారు. దాన్ని మేం మర్చిపోలేదు. వైకాపా పాలనలో మంత్రి నారాయణస్వామి శాసనసభలో ప్రతిపక్షనేత చంద్రబాబును అసభ్య పదజాలంతో దూషించారు. మెంటల్ ఆసుపత్రికి పంపించాలని అప్పటి మంత్రి సీదిరి అప్పలరాజు విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో మేం ఎప్పుడూ ఎవర్నీ ఒక్క మాట కూడా తూలనాడలేదు.

- జగన్ అసెంబ్లీ వేదికగా చర్చిద్దామంటే రావడం లేదు. వైకాపాకు 11 సీట్లు వచ్చాయి.. అయినా తనను సీఎంను చేస్తేనే శాసనసభకు వస్తానని జగన్ అంటే ఎలా?
- చనిపోయిన తెదేపా కార్యకర్త తోట చంద్రయ్య కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామంటే మండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ అడ్డుపడ్డారు. బీసీలకు న్యాయం చేస్తామంటే అడ్డుకున్నారు.

తప్పుడు ప్రచారం చేస్తే కఠిన చర్యలు

- కులం, మతం, ప్రాంతం ముసుగులో కొందరు విద్వేషాలు రెచ్చగొడుతున్నారు. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. నేను అనని మాటలు అన్నట్లు వక్రీకరించేవారు తీవ్ర పరిమాణాలు ఎదుర్కొంటారు.
- కాశీబుగ్గలో తొక్కిసలాట ఘటన జరిగితే పక్క జిల్లాకు చెందిన బొత్స సత్యనారాయణ కనీసం పరామర్శకు రాలేదు. పైగా వైకాపా వారు ఆ ఘటనపై ఫేక్ వీడియో వదిలారు.
- అరాచక పాలన చేసిన వైకాపాను ప్రజలు 11 సీట్లకే పరిమితం చేయడంతో పెట్టుబడిదారుల్లోనూ నమ్మకం ఏర్పడింది.
- పీపీఏల రద్దుతో రూ.10వేల కోట్ల అప్పు మనపై పడింది. రద్దుచేసి జగన్ ఏం సాధించారు? అప్పట్లో ఎలా సీఎం అయ్యారో గానీ జగన్‌కు ఏ సబ్జెక్టూ తెలియదు.
- మా మంత్రుల్లో ఎవరికీ ఇగోస్ లేవు. మంత్రి రామానాయుడు నుంచి నేను ఎన్నో నేర్చుకున్నా.
- తుపాను నష్టాలపై కేంద్రానికి నివేదిక పంపాం.
- తమిళనాడు లాంటి రాష్ట్రాల్లో నేతలు అంతర్గతంగా విమర్శలు చేసుకున్నా బయటకు వచ్చాక రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యంగా పని చేస్తారు. మన రాష్ట్రంలో ఆ సంస్కృతి లేదు' అని అన్నారు.

భాగస్వామ్య సదస్సులో ₹9.8 లక్షల కోట్ల పెట్టుబడులు

(మొదటి పేజీ తరువాయి)

భారత్, ఏపీ పాత్ర ఏమిటి తదితర అనేక అంశాలపై విశాఖ సదస్సులో చర్చలు ఉంటాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని ఎన్నికలప్పుడు చెప్పాం. ఆ హామీ నెరవేర్చేందుకు మంత్రులందరం మిషన్ మోడ్‌లో పని చేస్తున్నాం.

స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తోనే..

ప్రభుత్వం, ప్రజలు, పారిశ్రామికవేత్తలు కలిసికట్టుగా ముందుకు సాగితేనే ఏపీ అగ్రపథాన పయనిస్తుంది. నిన్న ముంబయిలో క్రికెట్ మ్యాచ్‌కు వెళ్లినప్పుడూ పలువురు పారిశ్రామికవేత్తలను కలిశాను. సీఎం చంద్రబాబు సమర్థ నాయకత్వం, డబుల్ ఇంజిన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాల వల్ల కంపెనీలు తమ పెట్టుబడులకు ఏపీని ఎంచుకుంటున్నాయి. పక్క రాష్ట్రాలు పోటీపడి ప్రోత్సాహకాలిస్తున్నా ఏపీ వైపు మొగ్గుచూపడానికి స్పీడ్ ఆఫ్ డూయింగ్ విధానాలే కారణం. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు సమన్వయం వల్లే గూగుల్ లాంటి భారీ పెట్టుబడి రాష్ట్రానికి వచ్చింది. కేంద్రం అనుమతించడంతో ఆర్సెలార్ మిత్తల్ సంస్థ రూ.లక్షన్నర కోట్లు పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చింది. అభివృద్ధి వికేంద్రీకరణ, అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధే మా ప్రభుత్వ ధ్యేయం. ఏపీలో ఆరు గిగావాట్ల డేటా సెంటర్ల ఏర్పాటు, అందుకు అవసరమైన గ్రీన్ ఎనర్జీ, ఎకో సిస్టమ్‌ను తీసుకురావాల్సి ఉంది. ఉభయ గోదావరి జిల్లాల్లో ఆక్వా పరిశోధనలకు ఆస్ట్రేలియాలోని జేమ్స్ కుక్ వర్సిటీ, క్రీడాభివృద్ధికి గ్రిఫిత్ వర్సిటీ, సోలార్ సెల్, క్వాంటం వ్యాలీ అభివృద్ధికి ఇతర ఆస్ట్రేలియా వర్సిటీలతో మాట్లాడుతున్నాం. ఈ నెలలో చాలా కంపెనీల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు ఉంటాయి.

ఏఐతో అభ్యర్థుల సామర్థ్యం మదింపు

త్వరలో నైపుణ్యం పోర్టల్ ప్రారంభించబోతున్నాం. ఈ పోర్టల్‌లో బైక్ మెకానిక్ నుంచి క్వాంటమ్ ఇంజినీర్ వరకు ఏఐ సాంకేతికతతో అభ్యర్థుల నైపుణ్యాలను అంచనా వేస్తాం. పరిశ్రమలతో నిరుద్యోగుల జాబితా అనుసంధానం చేస్తాం.

ఒక్క రాత్రిలోనే అద్భుతాలు జరగవు

రాష్ట్రం కోసం అందరం కలిసికట్టుగా పని చేద్దాం. ప్రతిపక్షంలో ఉన్న వైకాపా వాళ్లకు తెలిసిన కంపెనీలను తీసుకొచ్చినా క్రెడిట్ వారికే ఇస్తాం. ఒకే ప్రభుత్వం ఎక్కువకాలం కొనసాగినచోట రాష్ట్రాలు అభివృద్ధి చెందుతున్నాయి. ఒక్క రాత్రిలోనే అద్భుతాలు జరగవు. ఐదేళ్ల వైకాపాలో అరాచక పాలన చూశాం. ఇప్పుడు పెట్టుబడులులాంటి పాజిటివ్ వార్తలు చూస్తున్నారు. గత ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను సమీక్షిస్తున్నాం. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కాపాడాలని మేం అడగడం వల్లే కేంద్రం రూ.13 వేల కోట్ల రాయితీలు ఇచ్చింది. దీన్ని మరింత సమర్థంగా నిర్వహించాలి. ఏపీ ప్రభుత్వం సైతం కర్మాగారంలో వాటాదారు' అని లోకేశ్ చెప్పారు.

నకిలీ మద్యం కేసులో మరో నలుగురు నిందితులు

ఈనాడు, అమరావతి: నకిలీ మద్యం కేసులో దర్యాప్తులో పలువురి పాత్రపై ఆధారాలు వెలుగులోకి వస్తున్నాయి. దీంతో నిందితుల జాబితా పెరుగుతోంది. ప్రస్తుతం నిందితుల సంఖ్య 23కు చేరింది. వీరిని విచారించి, అరెస్టు చేసేందుకు ఎక్సైజ్, సిట్ అధికారులు చర్యలు చేపట్టారు. అద్దేపల్లి జనార్దన్‌రావు, జగన్మోహన్‌రావులకు వీరు పలురకాలుగా సాయం చేసినట్లు దర్యాప్తులో గుర్తించారు. ● విజయవాడకు చెందిన వ్యాపారి మనోజ్‌కుమార్‌ను ఏ20గా చేర్చారు. ఆయన జనార్దన్‌రావుకు మూతలు, సీసాలు సరఫరా చేశారు. నిందితుడికి ఎక్సైజ్ పోలీసులు 41ఏ నోటీసిచ్చి సోమవారం పిలిపించారు. విచారణ మధ్యలో ఉండగా తనకు అస్వస్థతగా ఉందని చెప్పడంతో ఆయన్ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ● గోవా నుంచి స్పిరిట్ తెచ్చి సరఫరా చేసిన బాలాజీ కుమారుడు సుదర్శన్‌ను ఏ21గా చేర్చారు. ● కోయంబత్తూరుకు చెందిన సెంథిల్‌తో కొన్ని రకాల సీసాలు తయారు చేయించుకున్నారు. దీంతో అతడిని ఏ22గా చేర్చారు. ● హైదరాబాద్‌కు చెందిన దారబోయిన ప్రసాద్‌ను ఏ23గా చేర్చారు. ఆయన సీసాల మూతలపై బ్రాండ్ పేరు వచ్చేలా ముద్రించి, ఇబ్రహీంపట్నానికి చేర్చారు.

నెల్లూరు జైలుకు మాజీ మంత్రి జోగి రమేష్

(మొదటి పేజీ తరువాయి)

ఈనెల 13 వరకు రిమాండ్ విధించారు. నిందితులను నెల్లూరు కేంద్ర కారాగారానికి తరలించాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. దీంతో వారిని మొదట విజయవాడలోని జిల్లా జైలుకు తీసుకువెళ్లిన అనంతరం నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారు.

జనార్దన్‌రావు నుంచి జోగికి ముడుపులు

వైకాపా హయాంలో ఎస్డీపీఎల్ మద్యం అమ్మకాలకు సహాయ, సహకారాలు అందజేసినందుకు జోగి సోదరులకు ప్రధాన నిందితులు జనార్దన్‌రావు, జగన్మోహన్‌రావుల నుంచి ముడుపులు ముట్టాయని ఏపీపీ విజయలక్ష్మి కోర్టుకు తెలిపారు. ఇరువర్గాల మధ్య ఎప్పటి నుంచో సంబంధాలు ఉన్నాయన్నారు. వీరు మొదట ఇబ్రహీంపట్నంలో సమీప బంధువైన బొల్లా శ్రీనివాస్ పేరిట స్వర్ణ బార్‌ను ప్రారంభించారని, తర్వాత దీని పేరును చెర్రీస్ బార్‌గా మార్చారని పేర్కొన్నారు. మద్యం సిండికేట్ ద్వారా దీనిని 2019 వరకు జోగి రమేష్, రాములు భాగస్వాములుగా నడిపారు. 2019లో ప్రభుత్వం మారిన తర్వాత కొన్నాళ్లపాటు బార్ నిర్వహణ నిలిపేశారు.

సాక్షులను ప్రభావితం చేస్తారు..: వైకాపా ప్రభుత్వ హయాంలో ఏపీలో మద్యం ధరలు ఎక్కువగా ఉండడంతో జనార్దన్‌రావు, జగన్మోహన్‌రావులు హైదరాబాద్‌లో మద్యం కొని, క్యాన్లలో నింపి ఇబ్రహీంపట్నం తరలించేవారని, ఇక్కడ సీసాల్లోకి నింపి అమ్మకాలు సాగించారని తెలిపారు. దీనికి సహాయ సహకారాలు అందించినందుకు జోగి సోదరులకు రెండు, మూడు నెలలకోసారి రూ.3-5 లక్షల వరకు ముడుపులు చెల్లించేవారని అన్నారు. ఇదే క్రమంలో జోగి సోదరుల ప్రోద్బలంతో ప్రధాన నిందితులు నకిలీ మద్యం తయారీని ప్రారంభించారని తెలిపారు. మరింత లోతుగా విచారించాల్సి ఉందని ఏపీపీ విజయలక్ష్మి వాదనలు వినిపించారు. వారికి రిమాండ్ విధించాలని లేనిపక్షంలో సాక్షులను ప్రభావితం చేస్తారని అభ్యర్థించారు.

సీబీఐ విచారణ కోరారు

నకిలీ మద్యం వ్యవహారంపై వాస్తవాలు వెలుగులోకి రావాలంటే సీబీఐతో విచారణ చేయించాలని జోగి రమేష్ హైకోర్టులో ఇప్పటికే పిటిషన్ దాఖలు చేశారని ఆయన తరఫు న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదించారు. జోగిపై అక్రమంగా కేసు నమోదు చేశారని అన్నారు. సహ నిందితుల స్టేట్‌మెంట్ల ఆధారంగా జోగి సోదరులను అరెస్టు చేయడం తగదన్నారు. ఇలాగైతే సంబంధం లేని ఎవరినైనా నిందితులుగా చేర్చే అవకాశం ఉంటుందన్నారు.

- ప్రాసిక్యూషన్ వాదనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయాధికారి లెనిన్ బాబు.. నిందితులు జోగి రమేష్, జోగి రాములకు రిమాండ్ విధించారు. ● జోగి సోదరులను 10 రోజుల కస్టడీకి ఇవ్వాలని సిట్ పిటిషన్ దాఖలు చేసింది. అరెస్టు చేసిన తర్వాత.. ఆదివారం సుదీర్ఘంగా విచారించినా జోగి రమేష్, రాము సహకరించలేదని, మరింత లోతుగా విచారించాల్సి ఉందని తెలిపారు. దీనిపై ప్రాసిక్యూషన్ కౌంటర్ దాఖలుకు వీలుగా కోర్టు మంగళవారానికి వాయిదా వేసింది.

ఈనాడు

హర్మన్‌ప్రీత్ సేనకు జేజేలు!

వరసగా మూడు పరాజయాలు... అవి కూడా అంతవరకు బాగా ఆడి గెలుపు వాకిట్లోకి వచ్చి నిలబడి అక్కడ కాడి వదిలేయడంతో తప్పని ఓటములు... జట్టు ఆత్మవిశ్వాసాన్ని నిలువునా నేలకూల్చే పరాభవాలు... వాటి తాలూకూ చేదు అనుభవాల నుంచి వెనువెంటనే తేరుకుని విశ్వసమరంలో విజేతగా నిలవడమంటే, అది అందరివల్లా అయ్యే పని కాదు! అందులోనూ టోర్నీలో అంతకుముందు తమను ఓడించిన ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికాలను సెమీస్, ఫైనల్స్‌లో మట్టికరిపించి ప్రపంచ కప్పును ముద్దాడటమంటే మాటలు కాదు! ఆ అపూర్వ ఘనతను భారత మహిళా క్రికెట్ జట్టు సాధించి చూపించింది. షెఫాలీ వర్మ, దీప్తి శర్మ ఆల్‌రౌండ్ మెరుపులకు స్మృతి, రిచా, శ్రీచరణిల ప్రతిభా విన్యాసాలు తోడైన వేళ- మన అమ్మాయిలు తొలిసారి వన్డే వరల్డ్ కప్ నెగ్గి ఆసేతుహిమాచలం ఆనందోత్సాహాలు నింపారు. ప్రతీక, జెమీమా, హర్మన్‌ప్రీత్, అమన్‌జ్యోత్, క్రాంతి తదితరులు కీలక మ్యాచుల్లో దుమ్మురేపి జట్టుకు కొండంత బలమయ్యారు. వివక్షాపూరితమైన 'బౌండరీ'లను బద్దలుకొడుతూ మరింత మంది బాలికలు బ్యాటూ బంతి పట్టుకుని మైదానాల వైపు దూసుకొచ్చేటట్టు చేసే స్ఫూర్తిదాయక విజయమిది! చరిత్రను తిరగరాసిన హర్మన్‌ప్రీత్ కౌర్ సేన యావద్భారతానికి గర్వకారణమైంది!

మన దేశంలో మహిళా క్రికెట్ ప్రస్థానం ప్రత్యేక సౌకర్యాల నడుమ సాఫీగా ముందుకు సాగినది కాదు. ఆట పట్ల ప్రేమ, దేశానికి ప్రాతినిధ్యం వహించాలన్న పట్టుదల కలిగిన క్రీడాకారిణుల త్యాగాలే ఇంధన వనరులైన ఒంటరి పయనమది! అన్నే కెల్లెవ్ అనే ఆస్ట్రేలియన్ ఉపాధ్యాయురాలు 1913లో కొట్టాయం(కేరళ)లోని బేకర్ మెమోరియల్ స్కూల్ విద్యార్థినులు తప్పనిసరిగా క్రికెట్ ఆడాలనే నిబంధన పెట్టారు. అలా దేశీయ నారీలోకానికి ఆ ఆట పరిచయమైంది. 1973లో భారత మహిళా క్రికెట్ సంఘం ఏర్పడిన తరవాత మన అమ్మాయిలు అంతర్జాతీయ పోటీలకు వెళ్లడం ఆరంభమైంది. కానీ, నిధుల కొరతతో శాంతా రంగస్వామి, సంధ్య అగర్వాల్, సుధా షా, శుభాంగీ కులకర్ణి, డయానా ఎడుల్జీ, నూతన్ గావస్కర్ వంటి తొలితరం క్రికెటర్లు కనీస సదుపాయాలకు నోచుకోలేకపోయేవారు. సొంత డబ్బులు, చందాలు, విరాళాలతో మ్యాచ్‌లు ఆడుతూ మహిళా క్రికెట్‌కు వారు జీవంపోశారు. ఆపై అంజుమ్ చోప్రా, మిథాలీరాజ్, ఝులన్ గోస్వామి తదితరులు క్రీడాధ్వజాన్ని రెపరెపలాడించి నేటితరానికి స్ఫూర్తిప్రదాతలయ్యారు. బీసీసీఐ పరిధిలోకి రావడం, ఐపీఎల్ తరహాలో ప్రత్యేక లీగ్ మొదలు కావడంతో మహిళల క్రికెట్‌లో ఆనాటి దుర్భర పరిస్థితులు అదృశ్యమయ్యాయి. మన అమ్మాయిల ఆటతీరులోనూ మార్పులెన్నో వచ్చాయి. ఎంతటి భీకర ప్రత్యర్థులతోనైనా నిర్భయంగా తలపడే తత్వం అలవడింది. ప్రపంచ కప్‌ను కైవసం చేసుకోవడానికి అదే విశేషంగా తోడ్పడింది!

సాధికారత కలిగిన స్త్రీలు దృఢమైన దేశానికి వెన్నెముక వంటివారు అంటారు కిరణ్ బేదీ. పితృస్వామిక భావజాలంతో మహిళలకు సంకెళ్లు వేయకుంటే వారెన్నో అద్భుతాలను సాధించగలరు. ప్రస్తుతం తెలంగాణలోని ఆరు ప్రధాన విభాగాలకు మహిళా ఐపీఎస్‌లే సారథులు. దక్షిణ మధ్య రైల్వేలోని అయిదు కీలక డిపార్ట్‌మెంట్లకు నేతృత్వం వహిస్తోందీ స్త్రీలే. ఇటీవల శిక్షణ పూర్తిచేసుకున్న ఐపీఎస్ బ్యాచ్‌లో మహిళల సంఖ్య తొలిసారి 35శాతానికి పైబడింది. తల్లిదండ్రులు అండగా నిలబడితే అమ్మాయిలు ఆటల్లోనూ భరతమాతకు కొత్త కీర్తి కిరీటాలను అలంకరిస్తారని కోనేరు హంపి, పీవీ సింధూ తదితరుల నుంచి హర్మన్‌ప్రీత్ కౌర్ బృందం వరకు ఎప్పటికప్పుడు నిరూపిస్తూనే ఉన్నారు. ఆ మేరకు బాలికల కలలకు కుటుంబసభ్యులే రెక్కలనివ్వాలి. అన్ని రంగాల్లో స్త్రీలు ముమ్మందుకు వెళ్లేలా తగిన సురక్షిత వాతావరణాన్ని ప్రభుత్వాలు కల్పించాలి!



ఏ బాధ్యత తీసుకున్నా నిబద్ధతతో, అంకితభావంతో నిర్వర్తించాలి. దేనికీ సాకులు చెప్పకూడదు. మూస అభిప్రాయాలను ఛేదించాలి. మన సామర్థ్యానికి పగ్గాలు వేసుకోకూడదు. కెరీర్ అయినా, ఇంటి బాధ్యతలైనా స్త్రీ పురుషులు ఇద్దరికీ సమానమేనని గుర్తుపెట్టుకోవాలి.

– పద్మావతీ బందోపాధ్యాయ

తొలి మహిళా ఎయిర్ మార్షల్

అంత సులభం కాదు

ముక్తి అందరికీ కావాలి. దాన్ని ప్రసాదించే భగవంతుడికి భక్తి కావాలి. భక్తి అంటే ప్రేమ, త్యాగం. భక్తి అంటే అంకితభావం- శరణాగతి. అలాంటి వ్యక్తికి మోక్షం ప్రసాదిస్తానని కృష్ణ పరమాత్మ చివరి మాటగా అర్జునుడికి చెప్పాడు. నన్ను నిజంగా శరణు కోరితే, ఆ వ్యక్తి పాపాలన్నీ హరిస్తాను. ముక్తినిస్తాను.. నా మాట నమ్ము- అని స్పష్టంగా చెప్పాడు. ఈ సమాజం ఆ మాటకు విలువనిస్తోందా అన్నదే పరిశీలనార్హమైనది. జన సమూహమే సమాజం. జనాల మధ్య నమ్మకాలు బలపడితే సమాజమూ సక్రమంగానే స్పందిస్తుంది. స్వీయ సంరక్షణకైనా, ధర్మరక్షణకైనా బలమైన మానవ సంబంధాలు అవసరం.

భక్తిలో రకాలు ఉన్నట్టుగానే ముక్తిలోనూ తేడాలున్నాయి. అపరభక్తి ఐహిక సుఖాలవైపు మొగ్గు చూపుతుంది. పరభక్తి ఆముష్మిక సుఖాలను కోరుకుంటుంది. ఐహిక సుఖభోగాలు 'ఐసు'ముక్కల్లా కరిగిపోతాయి. ఆముష్మిక సుఖం నిరుపమాన ఆనందాన్ని ఆకాంక్షిస్తుంది. భూలోకంలో అనుభవించలేని సుఖాలను స్వర్గలోకంలో అనుభవించవచ్చని చెప్పడం మనుషులను మభ్యపెట్టడమే. పరుల కోసం త్యాగం చేయమని ప్రబోధించేవారే నిజమైన గురువులు. త్యాగం, పరోపకారం తదితరాలతో కూడిన ధర్మాచరణ ఉన్నచోట జయం కలుగుతుంది. మహాభారతానికి జయగ్రంథం అన్న పేరుంది. వ్యాస రచనలన్నీ పద్దెనిమిది సంఖ్యతోనే ఉన్నాయి. మహాభారత యుద్ధం పద్దెనిమిది రోజులు జరిగింది. పద్దెనిమిది అధ్యాయాల గీత ధర్మంతో మొదలై ధర్మంతోనే ముగుస్తుంది. 'ధర్మక్షేత్రే కురుక్షేత్రే' అంటూ మొదలై ఎక్కడ కృష్ణార్జునులుంటారో అక్కడ సిరి, విజయం, ఐశ్వర్యం, దృఢమైన నీతి ఉంటాయని నా నమ్మకం- అంటాడు సంజయుడు. అతడు ధర్మానికి మారుపేరు. మొదటి శ్లోకంలో 'మమ'కారం ధృతరాష్ట్రుడి స్వార్థసంకుచిత మనస్తత్వానికి ప్రతీక. చివరి శ్లోకంలోని 'మమ' నమ్మకానికి, విశ్వాసానికి ప్రతీక. భగవంతుడికి, భక్తుడికి నడుమ ఉన్న బంధానికి వ్యాఖ్యానం! మొదటి ఆరు అధ్యాయాలకు మిగతా పన్నెండూ భాష్యాలు అంటారు అరవిందులు.



అంతర్యామి

అర్జున విషాదయోగం నరజాతికి పట్టిన భవరోగం గురించి చెబుతుంది. అజ్ఞానమనే చీకటిని తొలగించేది సాంఖ్యయోగం. జ్ఞాన, కర్మ, సన్యాస యోగం కర్తవ్యోపదేశం చేస్తే, కర్మ సన్యాసయోగం నిష్కామకర్మను విశ్లేషిస్తుంది. ఆత్మసంయమనంతో సాధన ద్వారా పరమ పురుషార్థమైన మోక్షం పొందవచ్చు. అలాగని ప్రబోధించే గీత- మత గ్రంథం కాదని, కర్మయోగ ప్రస్థానమని, విశ్వమానవ సమాజానికి దారి దీపం అని, పాశ్చాత్య వేదాంతులు సైతం ప్రశంసించారు.

ముక్తికి యుక్తమైన దారి సాధన. దాని ద్వారా మనిషి జీవన్ముక్తుడు కావాలి. 'సాధనమయో జీవన్ముక్తో భవతి!' తానొక్కడు అయితే చాలదు. తోటి మానవులకూ ఆ వివేకాన్ని పంచాలి. చెడ్డదారి నుంచి మంచిదారికి మళ్లించాలి. మృత్యు సమానమైన భవబంధాన్ని తొలగించాలి. ముక్తి అనుకున్నంత సులభం కాదు కానీ అనుకుని సాధన చేస్తే సాధ్యమే!

– ఉప్పు రాఘవేంద్రరావు

వృద్ధి బాటలో అవాంతరాలెన్నో!

అవకాశాలున్నా అందిపుచ్చుకోలేని అశక్తత అంటే ఏంటో భారతదేశ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల(ఎఫ్‌డీఐల) తీరును చూస్తే అర్థమవుతుంది. 2024-25లో దేశంలోకి స్థూల ఎఫ్‌డీఐల ప్రవాహం అయిదు వేల కోట్ల డాలర్లకు పైనే ఉన్నట్లు కనిపిస్తోంది. కానీ, నికర ఎఫ్‌డీఐలు మాత్రం 90శాతం పడిపోయాయి. గతంలో వచ్చిన విదేశీ పెట్టుబడులు మరలి పోవడమే దీనికి కారణం. మేకిన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్, జాతీయ పారిశ్రామికోత్పత్తి విధానాల కింద దేశవిదేశీ పెట్టుబడులను భారీగా ఆకర్షించాలని ఇండియా తాపత్రయపడుతున్న వేళ ఎఫ్‌డీఐలు తగ్గడం ఆందోళనకరం!

పలు దేశాల్లో వ్యాపారం చేసే బహుళజాతి కంపెనీలు భారతదేశం దీర్ఘకాలంలో కీలక మార్కెట్‌గా అవతరిస్తుందని భావిస్తున్నాయి. కానీ, ఇక్కడ ఆర్జించిన లాభాలను మళ్లీ ఇక్కడే మదుపు చేయడానికి మాత్రం అవి వెనకాడుతున్నాయి. పన్ను విధానాలు, రాజకీయాల్లో అనిశ్చితి, వివాదాల పరిష్కారానికి ఎక్కువకాలం పట్టడం వంటి కారణాలు ఆ సంస్థలను వెనక్కి లాగుతున్నాయి. ఇది చాలదన్నట్లు డొనాల్డ్ ట్రంప్ ప్రారంభించిన సుంకాల యుద్ధం, అమెరికా-చైనా వైరం, అమెరికా ద్రవ్యవిధానం కలగలిసి అంతర్జాతీయ ఆర్థికాన్ని అస్థిమితం చేస్తున్నాయి. దాంతో భారత్ వంటి వర్ధమాన దేశాల నుంచి విదేశీ పెట్టుబడులు తరలిపోతున్నాయి. కరెంటు ఖాతా లోటు, ఎగుమతుల తగ్గుదలతో సతమతమవుతున్న ఇండియాలో ఎఫ్‌డీఐలు నిలిచిపోవడం వల్ల- భారీ పెట్టుబడులు, అధునాతన సాంకేతికతలు అవసరమైన హరిత పరిశ్రమల్లో ప్రగతి కుంటుపడుతుంది. దీన్ని నివారించడానికి ప్రభుత్వం సత్వరమే నడుం బిగించాలి. అంతర్జాతీయ పెట్టుబడిదారుల నమ్మకాన్ని తిరిగి చూరగొనడంతో పాటు కీలక రంగాల్లో దీర్ఘకాలిక పెట్టుబడులు, సాంకేతికతలకు ఎర్రతివాచీ పరవాలి.



పెట్టుబడులకు భరోసా కల్పిస్తే...

ఇటీవలి కాలంలో దేశంలోకి విదేశీ పెట్టుబడులు తగ్గడానికి కారణాలేంటో సమీక్షించుకోవాల్సిన అవసరముంది. 2020 గల్వాన్ ఘర్షణల తరవాత- సరిహద్దు దేశాల నుంచీ, ప్రధానంగా చైనా నుంచి ఎఫ్‌డీఐలు రావాలంటే ముందస్తు అనుమతి తప్పనిసరి అని భారత్ షరతు పెట్టింది. నాటి పరిస్థితుల్లో అది సరైన నిర్ణయమే కానీ- ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్, ఆటో విడిభాగాల పరిశ్రమల్లో పెట్టుబడులకు గండికొట్టింది. దాంతో దేశంలోని ముఖ్య పరిశ్రమల పురోగతికి ఆటంకం ఏర్పడింది. మారిన పరిస్థితుల్లో పాత వ్యూహాన్ని భారత్ సవరించుకుంటోంది. చైనా పెట్టుబడుల్లో 24శాతాన్ని నేరుగా అనుమతించే అంశాన్ని నీతిఆయోగ్ పరిశీలిస్తోంది. ఇది హైటెక్ పరిశ్రమల్లో ఎఫ్‌డీఐల వృద్ధికి తోడ్పడుతుంది. భద్రతాపరంగా తగిన జాగ్రత్తలతో ఎఫ్‌డీఐలను అనుమతించాలనీ, రాజకీయపరమైన భావోద్వేగాలు ఆర్థిక అనివార్యతలకు అడ్డురాకుండా చూసుకోవాలనీ భారత్ ఇప్పటికే గ్రహించింది.

ప్రపంచంలోనే అత్యధిక యువ జనాభా కలిగిన దేశం మనది. 2045 వరకు ఇదే ఒరవడి కొనసాగనుంది. ఈ శ్రామికశక్తిని నియోగించి ఆర్థికంగా, పారిశ్రామికంగా పురోగమించడానికి దండిగా స్వదేశీ, విదేశీ పెట్టుబడులు కావాలి. అందుకు సంస్థాగత సంస్కరణలు అవసరం. ముందుగా మదుపరులకు తమ పెట్టుబడులు భద్రమనే భరోసా కల్పించాలి. విధానాల్లో ఆకస్మికంగా అనూహ్యమైన మార్పులు తీసుకొచ్చి గందరగోళం సృష్టించకూడదు. పెట్టుబడుల రక్షణకు పూచీకత్తునిచ్చే నిబంధనావళిని రూపొందించి తటస్థ సంస్థల ద్వారా అమలుపరచాలి. పన్నుల్లో, నిబంధనల్లో మార్పులను వెనకటి తేదీ నుంచి అమలు చేయబోమని భరోసా ఇవ్వాలి. హైదరాబాద్, ముంబయిలలోని మధ్యవర్తిత్వ కేంద్రాల ద్వారా అంతర్జాతీయ ఆర్థిక వివాదాలను వేగంగా పరిష్కరించే ఏర్పాట్లు చేయాలి. భారతదేశంలో వ్యాపారం ద్వారా ఆర్జించిన లాభాలను స్వదేశానికి తరలించకుండా అడ్డుపడే విధానాలన్నా; ఏ కారణం వల్లనైనా ఇక్కడ తమ వ్యాపారాలను నిలిపేయడానికి అడ్డుపడే నిబంధనలన్నా బహుళ జాతి సంస్థలకు నచ్చవు. సింగపూర్‌లో మాదిరిగా వేగంగా వ్యాపారాలను బంద్ చేయడానికి అనుమతించే నిబంధనలు భారత్‌లోనూ రావాలని అవి కోరుకుంటున్నాయి. దీని గురించి ప్రభుత్వం ఆలోచించాలి.

కేంద్రం చేపట్టిన ఉత్పత్తి అనుసంధాన ప్రోత్సాహక పథకం(పీఎల్ఐ)... ఫాక్స్‌కాన్, విస్ట్రాన్, పెగాట్రాన్ వంటి కంపెనీలు భారత్‌లో ఎలక్ట్రానిక్ పరిశ్రమలను స్థాపించేలా ప్రేరణనిచ్చింది. ఇక విద్యుత్ వాహనాలకు బ్యాటరీలను తయారుచేసే పరిశ్రమలతో పాటు సెమీకండక్టర్లు, ఏరోస్పేస్, వైద్య పరికరాల తయారీ పరిశ్రమలను రప్పించాల్సి ఉంది. ఈ రంగాల్లో నూరు శాతం ఎఫ్‌డీఐలను అనుమతించాలి. గ్రీన్ హైడ్రోజన్ ఇతర పునరుత్పాదక ఇంధన పరిశ్రమలు, కర్బన ఉద్గారాల తటస్థ పరిశ్రమల్లోకి ఎఫ్‌డీఐలను ఆకర్షించడం, విదేశాల సహభాగస్వామ్యంతో ముందుకుసాగడం అత్యావశ్యకం.

తమిళనాడు, గుజరాత్, మహారాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడిదారుల సదస్సులను నిర్వహించి స్వదేశీ, విదేశీ పెట్టుబడులను పెద్దయెత్తున ఆకర్షిస్తున్నాయి. ఇకపై జాతీయ స్థాయిలో అన్ని రాష్ట్రాలకూ ఎఫ్‌డీఐలను ఆకర్షించేలా సదస్సు నిర్వహించాలి. ఆత్మనిర్భర్ భారత్ ఛత్రం కింద విదేశీ పెట్టుబడులు, సాంకేతికతలు, నిర్వహణా నైపుణ్యంతో పాటు అంతర్జాతీయ సరఫరా గొలుసుల్లో భాగస్వామ్యాన్ని కూడా ఆహ్వానించాలి. తద్వారా స్వదేశీ కంపెనీలు ప్రపంచ మార్కెట్‌లో పోటీపడే సత్తాను సమకూర్చుకోవాలి.

విధానపరమైన మార్పులతోనే...

రక్షణ పేరుతోనో, వ్యూహపరమైన అంచనాలతో ఎఫ్‌డీఐను నిరాకరించడం వల్ల తాత్కాలికంగా లబ్ధి చేకూరవచ్చు. కానీ, దీర్ఘకాలంలో అది నష్టదాయకమే అవుతుంది. విదేశీ భాగస్వాములను ఆహ్వానించి, ఆపై అంతర్జాతీయ సరఫరా గొలుసుల్లో ఆధిక్యం సాధించడమనే వ్యూహాన్ని చైనా విజయవంతంగా అమలు చేసింది. భారత్‌కూ ఇది అనుసరణీయం. నేడు ప్రపంచంలోని ప్రధాన దేశాలు స్వీయ వాణిజ్య రక్షణకు అధిక ప్రాధాన్యమిస్తున్నాయి. దాంతో వాణిజ్య వైరాలు ముదురుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో దేశంలోకి ఎఫ్‌డీఐలు తేలిగ్గా ప్రవహించడానికి వీలుగా ప్రభుత్వం విధానపరమైన మార్పులు తీసుకురావాలి. ఏకగవాక్ష డిజిటల్ విధానంలో అధికారులు వేగంగా అనుమతులు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలి. ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకుని, పెట్టుబడి ప్రతిపాదనలను ఆహ్వానించాలి. స్వావలంబననూ, అంతర్జాతీయ సహకారాన్నీ సమర్థంగా మేళవించాలి. నమ్మకం, పారదర్శకత, జవాబుదారీతనాలతో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆహ్వానించి ఆర్థికంగా దూసుకుపోవడమే ఇప్పుడు ఇండియా చేయాల్సిన పని!



సీఆర్ సుకుమార్

సీనియర్ పాత్రికేయులు, న్యాయవాది

క్యాన్సర్‌పై రెండుసార్లు గెలిచాడు!

అణువణువునా సానుకూల దృక్పథం నిండిన వారి ముందు విధి కూడా ఓటమిని అంగీకరించక తప్పదేమో. 'అవును మరి, పోరాటం వచ్చినవాణ్ని. ఎందుకు ఓడిపోతాను' అంటాడు అలెక్స్ పర్రా. 'నాకే ఎందుకిలా అనుకుంటే అక్కడితో నా ప్రయాణం ఆగిపోతుంది. జీవితం పగబట్టిందని ఏడుస్తూ కూర్చుంటే దాని చేతిలో నేను ఓడిపోయినట్లే. అందుకే జీవితం ఏమిచ్చినా ఎదురు నిలవడమే నాకు తెలుసు' అనే అలెక్స్ కథ వింటే ఎంతటి నిరాశలో కూరుకుపోయిన వారికైనా జీవితం మీద ఆశ కలుగుతుంది.



కాలిఫోర్నియాకి చెందిన అలెక్స్‌కి ఇప్పుడు ఇరవై నాలుగేళ్లు. సాధారణంగా అందరూ చదువు పూర్తిచేసి ఉద్యోగం వెతుక్కునే వయసు. అతడు మాత్రం రెండు రకాల క్యాన్సర్ సర్వైవర్‌గా, పారా స్విమ్మర్‌గా, మారథాన్ రన్నర్‌గా, దివ్యాంగుల హక్కుల కార్యకర్తగా, మోటివేషనల్ స్పీకర్‌గా ఎందరిలోనో స్ఫూర్తిని నింపుతున్నాడు. క్యాన్సర్‌తో అతడి పోరాటం పదిహేనేళ్ల వయసులోనే మొదలైంది. అథ్లెట్ అయిన అలెక్స్ ఓసారి మోకాలు దగ్గర నొప్పి తట్టుకోలేక ఆస్పత్రికి వెళ్లాడు. బోన్ క్యాన్సర్ రెండో దశలో ఉందన్నారు వైద్యులు. ఒక్కరోజులో జీవితం తలకిందులైంది. సరదాగా ఆటపాటలతో గడవాల్సిన ప్రాయం ఆస్పత్రి చుట్టూ తిరగడానికే పరిమితమైంది. 9 నెలల్లో 17 కీమోథెరపీ సెషన్లు చేసినా ఫలితం శూన్యం. 'మోకాలు మార్పిడి శస్త్రచికిత్స చేయాలి, లేదా మోకాలి వరకు కాలు తీసేయాలి. రెండింటిలో ఒక దానికి సిద్ధమవ్వండి' అన్నారు వైద్యులు. 'జీవితం నీది, నిర్ణయం తీసుకోవాల్సిందీ నువ్వే' అన్నాడు తండ్రి. బొమ్మాబొరుసు వేసి కాలు తీసేయడానికి అంగీకారం తెలిపాడు అలెక్స్. శస్త్రచికిత్స అనంతరం కోలుకుని స్కూలుకు వెళ్లసాగాడు. క్రమంగా జీవితం గాడిలో పడుతోంది. కృత్రిమ కాలితోనే సాధ్యమైనంతగా సాధారణ జీవితం గడపడానికి ప్రయత్నిస్తున్నాడు. అయిదేళ్ల పాటు చెకప్‌కి వెళ్తూనే ఉండాలి కాబట్టి ఆస్పత్రికి వెళ్లొస్తున్నాడు. అలా వెళ్లినప్పుడు ఏకంగా లంగ్ క్యాన్సర్ నాలుగో దశలో బయటపడింది. సాధారణంగా ఆ దశలో జీవితానికి ఎక్స్‌పైరీ డేట్ ఇచ్చేస్తుంటారు వైద్యులు. పదిహేడేళ్ల కుర్రాడికి నువ్వు మూడు నెలలే బతుకుతావు అని చెబితే ఏమని బదులివ్వగలడు?! 'మళ్లీ క్యాన్సర్ వచ్చిందని బాధపడాలో, మూణ్నెల్లే టైమ్ ఉందని ఏడవాలో అర్థం కాలేదు నాకు' అంటాడు అలెక్స్ ఇప్పుడు నవ్వుతూ. ఆస్పత్రికి వెళ్లేవరకూ అసలు నాకు క్యాన్సర్ ఉందనే తెలియదు. చాలా మామూలుగా ఉన్నాను. కాబట్టి ఇకముందూ అలాగే ఉండాలనుకున్నాను.. అనే అలెక్స్ నిజంగానే విచారాన్ని తన దరిదాపుల్లోకి రానివ్వలేదు. ధైర్యంగా క్యాన్సర్ చికిత్స, అది అయిపోగానే ఇమ్యునోథెరపీ చికిత్స... తీసుకున్నాడు. ఒక పక్క వైకల్యం, మరో పక్క అనారోగ్యంతో పోరాడుతూ ఒకటీ రెండూ కాదు దాదాపు ఎనిమిదేళ్లు ఆస్పత్రుల్లోనే గడిపాడు. కేవలం పట్టుదలతో క్యాన్సర్ మహమ్మారిని జయించి అసాధ్యం అనుకున్న దాన్ని సుసాధ్యం చేసి చూపించాడు.

– రాజవరపు సురేంద్ర

దయనీయ స్థితిలో..

మెరుగైన జీవితాన్ని ఆశించి భారతీయులు పెద్దసంఖ్యలో గల్ఫ్ దేశాలకు వలసవెళ్తున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచీ పెద్ద సంఖ్యలో వెళ్తున్నారు. నిర్మాణాలు, చమురు, సహజవాయు సంస్థలు, ఆహార పానీయ పరిశ్రమలు, ఆతిథ్యం, ఆరోగ్య పరిరక్షణ, ఇంజినీరింగ్, ఐటీ తదితర రంగాల్లో పనిచేస్తున్నారు. ఇళ్లలో పనివారిగా, పశువుల కాపరులు, డ్రైవర్లు, ప్లంబర్లు, ఎలక్ట్రీషియన్లు, పారిశుద్ధ్య కార్మికులుగానూ ఉపాధి పొందుతున్నారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులు, అనారోగ్యం తదితర కారణాలతో గల్ఫ్‌లో చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారు. యజమానుల వేధింపులు, ఏజెంట్ల మోసాలు భరించలేక, ఇతర కష్టాలు తట్టుకోలేక ఆత్మహత్యలకూ పాల్పడుతున్నారు. గతేడాది గల్ఫ్ సహకార మండలి(జీసీసీ) దేశాల్లో ప్రాణాలు కోల్పోయిన మొత్తం భారతీయులు...

సౌదీ అరేబియా	1,025
యూఏఈ	1,681
కువైట్	564
ఖతార్	210
ఒమన్	284
బహ్రెయిన్	205

(ఆధారం: లోక్‌సభలో కేంద్రం వెల్లడించిన వివరాలు)

గ్రామీణ జీవనోపాధులకు శరాఘాతం

మొంథా తుపాను తెలుగు రాష్ట్రాల్లోని పలు జిల్లాలను అతలాకుతలం చేసింది. వరద బీభత్సానికి లక్షల ఎకరాల్లో పంటలు ధ్వంసం కాగా, పెద్దసంఖ్యలో ఇళ్లు నీటమునిగాయి. పశు సంపదకూ తీరని నష్టం వాటిల్లింది. ఎన్నో జీవాలు వరద ఉద్ధృతిలో గల్లంతయ్యాయి. గడ్డివాములు, పచ్చిక బయళ్లు జలమయం కావడంతో మేత అందక మిగిలిన పశువులు ఆకలితో అలమటిస్తున్నాయి. ప్రభుత్వాలు సత్వరం దృష్టిసారించకపోతే పశుపోషణ మీదే ఆధారపడిన కుటుంబాలు తేరుకోలేవు.

మొంథా తుపాను ప్రభావం పాడి పశువులకు ప్రాణ సంకటంగా మారింది. వరద ఉద్ధృతి కారణంగా రోజుల తరబడి చెమ్మ ఉండటంతో గడ్డి దొరకడం లేదు. దీనికి తోడు తవుడు, తెలగపిండి, మొక్కజొన్న వంటి దాణా ముడిసరకులు బూజు పడుతున్నాయి. సమీకృత దాణాలోనూ ఫంగస్ ఏర్పడి విషతుల్యమవుతోంది. కలుషిత నీటిని తాగడం వల్ల పశువులు, జీవాల్లో అతిసారం, అంటురోగాలు ప్రబలే పరిస్థితులు నెలకొన్నాయి. గడచిన రెండు మూడు నెలల్లో పుట్టిన దూడలపై తుపాను ప్రభావం అధికంగా ఉంటుంది. సరైన సంరక్షణ, పోషణ అందకపోవడానికి తోడు బ్యాక్టీరియా, వైరస్‌ల బెడదను తాళలేక అవి మరణించే ప్రమాదముంది. బురద, మురుగుతో కూడిన నేలమీద ఉండే పశువులు, జీవాల కాళ్లగిట్టలు పాచిపట్టి, ఫుట్‌రాట్ వంటి సమస్యల వల్ల మృత్యువాత పడే పరిస్థితి తలెత్తవచ్చు. మేత కొరత, వాతావరణ ప్రతికూలతల వల్ల పాల దిగుబడులు కూడా గణనీయంగా తగ్గిపోతాయి. కాబట్టి, ఎన్నో కుటుంబాల జీవనోపాధులను దెబ్బతీసే ఈ సమస్యలను అధిగమించడంపై ప్రభుత్వాలు తక్షణమే దృష్టి సారించాలి.




వ్యాధులను తప్పించుకోవాలంటే...

తుపాను అనంతరం పశువుల్ని ముఖ్యంగా దూడల్ని చలిగాలుల నుంచి కాపాడుకోవడం చాలా అవసరం. ఇందుకోసం వాటికి సరైన రక్షణ కల్పించి, ఎండుగడ్డి లేదా పాత గోతాములతో పక్కను ఏర్పాటు చేయాలి. పాకల్లో నీరు నిల్వ లేకుండా చూడాలి. పశువుల వ్యర్థాలు దూరంగా తరలిపోయేలా తాత్కాలికంగానైనా మురుగు పారుదల ఏర్పాటు అవసరం. పాకలూ చుట్టుపక్కల పరిసరాలతో పాటు పశువుల మీద ఈగలు, దోమలు, గోమార్లు వంటివి చేరకుండా డెల్టామెథ్రిన్, సైపర్‌మెథ్రిన్ కార్బొరిల్ వంటి కీటక నాశకాలను నిర్ణీత మోతాదు మేరకు శుభ్రమైన నీటితో కలిపి స్ప్రే చేయాలి. తద్వారా పశువులను ప్రాణాంతకమైన కుందేటి వెర్రి, ఎర్రమూత్ర వ్యాధి, థెయిలీరియాసిస్ వంటి జబ్బుల బారిన పడకుండా కాపాడుకోవచ్చు.

తుపానులు, వరదలు, చలిగాలుల వల్ల పశువులకు కలిగే ఒత్తిళ్లు తీవ్రంగా ఉంటాయి. వాటికి తోడు రోగ కారక క్రిములు సైతం ప్రబలడం వల్ల నిండు చూడి దశలో ఉన్న పశువులు గర్భస్రావాలకు లోనయ్యే ముప్పు ఎక్కువవుతుంది. కాబట్టి, వాటి విషయంలో పశువైద్యుల సూచనలను తప్పకుండా పాటించాలి. వరదనీరు, మురుగు కలిసిన కలుషితమైన మేత వల్ల పశువుల్లో అంటురోగాలు విస్తరిస్తాయి. ఇలాంటి పరిస్థితి కనిపిస్తే వెంటనే పేడ, రక్త నమూనాలను పరీక్షించి చికిత్స అందించాల్సి ఉంటుంది. వీలైనంత వరకు వ్యాధుల బారిన పడకుండా పశువులకు టీకాలు వేయించడం మేలు.

బీమాతో నష్టనివారణ

గడ్డివాములు వరదలో కొట్టుకుపోవడం, పశుగ్రాసం నీటమునిగి కుళ్లిపోవడం, దాణాలు బూజుపట్టడం వల్ల మేత కొరత ఎదురవుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో వాలిపోయిన వరి పైర్లు, అరటి చెట్ల ఆకులను సేకరించి కడిగి ఆరబెట్టుకోవాలి. తరవాత వాటిని ముక్కలుగా తరిగి పశువులకు మేపవచ్చు. ఎన్నో పోషక విలువలు కలిగిన మారేడు, నేరేడు, మామిడి, అవిసె, మునగ ఆకులను కూడా అందించవచ్చు. మొత్తం మేతలో 20శాతానికి మించకుండా వాగులు, చెరువులు, కాల్వలలో లభ్యమయ్యే నీటి కలుపు గుర్రపుడెక్కను కూడా పశువులకు మేపవచ్చు. వాటికి నీరు పెట్టే విషయంలోనూ జాగ్రత్త వహించాలి. ఇండుపగింజ(చిల్లగింజ)లు, మునగ గింజలు లేదా పటికతో తేటపరచిన శుభ్రమైన నీటినే పశువులకు పెట్టాలి. బావులు, బోరుబావుల నుంచి తోడిన నీరైనా మంచిదే. కొన్నేళ్లుగా ప్రకృతి విపత్తులు పదే పదే విరుచుకుపడటం చూస్తున్నాం. వీటి మూలంగా వాటిల్లుతున్న నష్టాల నుంచి కొంతవరకైనా బయటపడాలంటే పశువులకు బీమా చేయించుకోవాల్సిందే. ఒకేసారి మూడేళ్లకు బీమా చేయిస్తే, ఖర్చు తగ్గుతుంది. ఇందుకు పాల సేకరణ సంస్థలు, ప్రభుత్వాలు అందిస్తున్న సబ్సిడీని ఉపయోగించుకోవచ్చు. బీమా సంస్థలు నమోదుచేసిన గుర్తులు, వివరాలు, చెవులకు బిగించిన పోగు నంబర్ల ద్వారా వరదల్లో కొట్టుకుపోయిన, తప్పిపోయిన, అపహరణకు గురైన పశువులను సులభంగా గుర్తించవచ్చు. పాడి రైతులు ఎప్పటికప్పుడు వాతావరణశాఖ హెచ్చరికలను తెలుసుకుని అప్రమత్తంగా వ్యవహరిస్తే నష్టాలను చాలావరకు తప్పించుకోవచ్చు.




డాక్టర్ యంవీజీ అహోబలరావు

పాడి, పశుసంవర్ధక రంగ నిపుణులు

చంటీ సందేహం తీరిపోయింది!

హాయ్! బుజ్జీ!!



ఫ్రెండ్స్..! మనకు ఆకులు అనగానే ఆకుపచ్చ రంగే గుర్తుకొస్తుంది కదా! ఎందుకంటే మనం రోజూ చూసే చెట్ల ఆకులన్నీ ఆ రంగులోనే ఉంటాయి కాబట్టి. కానీ కొన్ని చెట్ల ఆకులు ఎరుపు, పసుపు, నారింజ ఇలా రకరకాల రంగుల్లో ఉంటాయి. అలాగే ఆకుపచ్చగా ఉన్న ఆకులు వాడిపోయేటప్పుడు పసుపురంగులోకి మారతాయి కదా! అసలు వీటన్నింటికీ కారణాలేంటో తెలుసుకోవాలని చంటికి అనిపించింది. వెంటనే వెళ్లి వాళ్ల తాతయ్యని అడిగాడు.. మరి ఆ విశేషాలేంటో మనమూ తెలుసుకుందామా!

'అన్ని ఆకుపచ్చ ఆకుల్లో క్లోరోఫిల్, అంథోసైనిన్, కెరోటినాయిడ్స్ అనే మూడు రంగులకు సంబంధించిన లిక్విడ్స్ ఉంటాయి. క్లోరోఫిల్ ఆకుపచ్చ రంగు, అంథోసైనిన్ నారింజ, కెరోటినాయిడ్స్ పసుపు రంగును సూచిస్తాయన్నమాట. అయితే మనం రోజూ చూసే ఆకుల్లో క్లోరోఫిల్ శాతం ఎక్కువగా ఉంటుంది కాబట్టి అవన్నీ ఆకుపచ్చ రంగులో ఉంటాయి. అలాగే మనకు అక్కడక్కడా పార్కులు, తోటల్లో కనిపించే ఎరుపు రంగు చెట్ల ఆకుల్లో అంథోసైనిన్ ఎక్కువగా ఉంటుంది. ఇంకో విషయం ఎప్పుడైనా గమనించావా చంటీ! కొన్ని చెట్ల ఆకులు మొదట్లో ఎరుపు రంగులో ఉంటే.. మరికొన్ని చెట్లవి వాడిపోయేటప్పుడు పసుపు, నారింజ రంగులోకి మారతాయి. దానంతటికీ కారణం.. ఈ లిక్విడ్స్ 'హెచ్చుతగ్గులేనన్నమాట' అని వివరించారు చంటీ వాళ్ల తాతయ్య. 'ఇప్పుడు విషయం అర్థమైంది తాతయ్యా.. థాంక్యూ!' అనుకుంటూ వెళ్లి పడుకున్నాడు చంటీ. నేస్తాలూ.. ఒకవేళ క్లోరోఫిల్ కంటే అంథోసైనిన్ ఉన్న చెట్లే ఎక్కువగా ఉంటే.. పచ్చని అడవికి బదులుగా ఎర్రని అడవి అనేవాళ్లేమో కదూ!





★

రేపు 'ఈటీవీ' కార్తిక దీపోత్సవం



నేడు ఎంట్రీ పాసుల పంపిణీ

శివకేశవులు ఇద్దరికీ ఎంతో ప్రీతికరమైనది కార్తిక మాసం. దీంతో సమానమైన మాసం, గంగతో సమానమైన తీర్థం లేదని పురాణోక్తి. విశేష పుణ్య సంపదను ప్రసాదించే ఈ మాసంలో దీపారాధనకు ఉన్న ప్రాధాన్యం అసమానమైనది. 'ఈటీవీ ఆంధ్రప్రదేశ్, ఈటీవీ తెలంగాణ, ఈటీవీ లైఫ్' ఛానళ్ల ఆధ్వర్యంలో కార్తిక దీపోత్సవం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే మహిళలకు పూజ సామగ్రి నిర్వాహకులే సమకూరుస్తారు. **ఎంట్రీ పాసులు ఒక రోజు ముందుగా అంటే మంగళవారం ఉదయం 11 గంటల నుంచి విజయవాడ పిన్నమనేని పాలీక్లినిక్‌రోడ్డులోని సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల మైదానం** వద్ద పంపిణీ చేస్తారు. పరిమిత సంఖ్యలోనే పాసులు ఉంటాయి. చిన్నపిల్లలకు అనుమతి లేదు. నేలపై కూర్చోగలిగే వారు మాత్రమే హాజరు కావాలని నిర్వాహకులు కోరుతున్నారు.

–విజయవాడ సిటీ,న్యూస్‌టుడే

సమయం: ఈ నెల 5న (బుధవారం) సాయంత్రం 5.30 గంటలకు

స్థలం: విజయవాడ మొగల్రాజపురం పిన్నమనేని పాలీక్లినిక్ రోడ్డులోని సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల మైదానం.

ఈ ఛానళ్లలో ప్రత్యక్ష ప్రసారం 5న సాయంత్రం ఆరు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు.

బాధ్యతల స్వీకరణ



సీపీకి మొక్క అందిస్తున్న డీసీపీలు లక్ష్మీనారాయణ, కృష్ణప్రసన్న

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల నిర్వహించిన సాధారణ బదిలీల్లో భాగంగా ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్‌కు బదిలీ అయిన డీసీపీలు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సీఐడీ ఎస్పీగా పనిచేస్తున్న కృష్ణప్రసన్న ఎన్టీఆర్ జిల్లా సైబర్ క్రైం డీసీపీగా, డీజీపీ కార్యాలయంలో వెయిటింగ్‌లో ఉన్న బి.లక్ష్మీనారాయణను రూరల్ డీసీపీగా నియమించారు. సోమవారం వారు తమ తమ కార్యాలయాల్లో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబును మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందించి కృతజ్ఞతలు తెలిపారు.

తాతలనాటి చెట్టు.. తరతరాలు నిలిచేట్టు..



ఇంటిపై అందంగా..



మధ్య అంతస్తుల్లో..

విజయవాడ నగరం సత్యనారాయణపురం శివాలయం వీధిలోని ఇరుకు సందులో రెండస్తుల మేడపై కొబ్బరి చెట్టు ఆకర్షణీయంగా కనిపిస్తోంది. భవన నిర్మాణ సమయంలో అడ్డొస్తే చెట్టు తొలగించేయడం ఏమాత్రం ఆలోచించరు. అలాంటిది ఇంటి యజమాని మాణిక్యాలరావు ఉన్నది తక్కువ స్థలమే అయినా భవన నిర్మాణానికి ముందు తమ తాత నాటిన కొబ్బరిచెట్టుతో ఉన్న అనుబంధాన్ని మరిచిపోలేదు. దానికి పోటీగాక ఇలా రెండస్తుల భవనాన్ని నిర్మించుకున్నారు. అందుకే వీధిలో ఇప్పటికీ ఈ ఇల్లు ప్రత్యేకంగా కనిపిస్తోంది.

- ఈనాడు, అమరావతి

జలపుష్పం.. సేవల చిహ్నం



మచిలీపట్నం బస్టాండ్ భవనంపై ఇలా...

కొవిడ్ ఎంత విలయం సృష్టించిందో అందరికీ తెలుసు. ఆ సమయంలో కొవిడ్ వారియర్స్‌గా ఆర్టీసీ కార్మికుల సేవలు ప్రశంసనీయం. రోగులను క్వారంటైన్‌కు తరలించడంతో పాటు ఆసుపత్రులకు అవసరమైన సామగ్రిని సరఫరా చేశారు. దూరం పాటించాలన్న ఆదేశాలతో బస్సుల్లో కొన్ని సీట్లు తొలగించారు. అలా వచ్చిన ఇనుప వ్యర్థాలతో మచిలీపట్నం నగరాన్ని స్ఫూరించేలా తీర్చిదిద్దిన చేప ఆకృతి వెనుక ఆర్టీసీ సేవలు దాగి ఉన్నాయి. డిపో మేనేజర్ పెద్దిరాజుకు వచ్చిన ఆలోచనకు రూపమే ఈ జలపుష్పం. ఆర్టీసీ సేవలకు స్మారక చిహ్నంగా లోహ వ్యర్థాలతో జలపుష్పాన్ని తీర్చిదిద్దామని ఆయన తెలిపారు.

- ఈనాడు, అమరావతి -న్యూస్‌టుడే, మచిలీపట్నం కార్పొరేషన్

అనుమతిచ్చాక.. అడ్డుపడ్డారు..!

ఈనాడు, అమరావతి

ఇంద్రకీలాద్రిపై ఉన్న దుర్గగుడికి సమీపంలోని కుమ్మరిపాలెం జంక్షన్‌లో తిరుమల తిరుపతి దేవస్థానానికి (తితిదే) చెందిన 2.8 ఎకరాల స్థలం ఖాళీగా ఉంది. దీన్ని దుర్గగుడికి కేటాయిస్తే.. అక్కడ వాహనాల పార్కింగ్, కాటేజీలు, కల్యాణ మండపాలు కట్టుకోవచ్చు.. గత తెదేపా ప్రభుత్వ హయాంలో ప్రణాళికలు రూపొందించారు. నాటి చంద్రబాబు సర్కారు స్పందించి.. ఆ భూమిని దుర్గగుడికి కేటాయిస్తూ జీవో ఇచ్చింది.

విజయవాడలో మరోచోట దుర్గగుడి భూమిని తితిదేకు ఇచ్చేలా.. ఒప్పందం చేసుకున్నారు. ఆపై రూ.2 కోట్లతో ఆ స్థలం మొత్తాన్ని చదును చేశారు. కొన్నాళ్లు వాహనాల పార్కింగ్‌కు వాడారు. కానీ.. వైకాపా సర్కారు వచ్చాక.. ఈ స్థలాన్ని దుర్గగుడి నుంచి బలవంతంగా లాగేసుకుంది. ఇక్కడ ఎలాంటి నిర్మాణాలు చేపట్టడానికి వీల్లేదని బోర్డు పెట్టి తాళాలు వేసేశారు. నాటి వైకాపా పాలకులు.. రూ.కోట్ల విలువైన ఈ స్థలంపై కన్నేశారనే విమర్శలు వెల్లువెత్తాయి.

- తితిదే స్థలంపై నాడు కన్నేసిన వైకాపా నేతలు
- దుర్గగుడి అభివృద్ధికి కేటాయిస్తే కొట్టేసే కుట్ర

కుమ్మరిపాలెంలో ఉన్న ఈ స్థలం దుర్గగుడికి కేటాయిస్తే.. దేశవిదేశాల నుంచి వచ్చే భక్తులకు అనేక సౌకర్యాలు కల్పించొచ్చు. ఆ ఉద్దేశంతోనే నాటి ప్రభుత్వం కేటాయించింది. రూ.6 కోట్లతో కల్యాణ మండపం కట్టాలని ప్రతిపాదించారు. అతిథి గృహాలు, పార్కింగ్‌కు నమూనాలు సిద్ధం చేశారు. దీనికి బడ్జెట్ అంచనాలు రూపొందించి అనుమతుల కోసం దేవాదాయ శాఖ కమిషనర్‌కు పంపారు. కానీ.. ప్రణాళికలు పట్టాలెక్కే దశలో వైకాపా పాలకులు గండి కొట్టేశారు. దీంతో ఇప్పటికీ.. దుర్గగుడికి కాటేజీలు, పార్కింగ్ సమస్య తీవ్రంగా వేధిస్తోంది.



కుమ్మరిపాలెంలోని తితిదేకు చెందిన ఖాళీ స్థలం

ఏటా రెండు కోట్ల మంది భక్తులు..

దుర్గగుడికి నిత్యం 30 వేల మంది, వారాంతాల్లో 50 వేల మందికి పైగా భక్తులొస్తారు. దసరాల్లో 15-20 లక్షల మంది తరలివస్తారు. భవానీ దీక్షలు, ఇతర వేడుకలకు లక్షలాదిగా దుర్గమ్మను దర్శిస్తారు. కానీ.. ఆలయానికి ఇప్పటికీ ఒక్క కాటేజీ సరైంది లేదు. దీంతో భక్తులు దర్శనం తర్వాత వెళ్లిపోవడమే తప్ప.. ఆలయ పరిసరాల్లో ఉండే వసతి లేదు. ఒకవేళ ఉండాలన్నా.. విజయవాడలో ప్రైవేటు హోటళ్లే దిక్కు. కనీసం వారి వాహనాల పార్కింగ్‌కూ జాగా లేదు.

వేడుకల వేళ అలీ పెట్టి..

ప్రస్తుతం దసరా సహా వేడుకల సమయంలో కుమ్మరిపాలెం స్థలం కోసం తితిదేకు అర్జీ పెట్టుకుని తాత్కాలికంగా ఇక్కడ పార్కింగ్‌కు వినియోగిస్తున్నారు. తిరిగి వేడుకలు ముగిశాక ఈ స్థలానికి తాళం వేసేస్తున్నారు. వాస్తవంగా ప్రభుత్వం ఎప్పుడో ఈ స్థలాన్ని దుర్గగుడికి కేటాయిస్తూ ఆదేశాలు ఇచ్చింది. అయినా వాడుకునేందుకు లేకుండాపోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి.. ఇక్కడ ఏర్పాట్లు చేస్తే.. అనేక సమస్యలు తీరతాయి.



శ్రీకృష్ణపారిజాతంలో శ్రీకృష్ణుడిగా పెద సత్యం

వెండితెరపై కూచిపూడి వెలుగులు

జిల్లాలో కుగ్రామమైన కూచిపూడి పేరు నాట్యంతో ప్రపంచ వ్యాప్తంగా వినిపిస్తోంది. కూచిపూడి (భాగవతులు) నాట్యాచార్యులు దీనిని వెండితెరపై రెపరెపలాడించారు. తదుపరి సినిమా రంగంలో వేదాంతం రాఘవయ్య, వెంపటి సత్యనారాయణ (పెద సత్యం), మహంకాళి వెంకయ్య, పసుమర్తి కృష్ణమూర్తి, వెంపటి చిన సత్యం, వేదాంతం జగన్నాథశర్మ తదితరులు రాణించారు. నేటితరం యువ నాట్యాచార్యుడు బిస్మిల్లాఖాన్ యువ పురస్కార గ్రహీత డాక్టర్ వేదాంతం వెంకటాచలపతి (వెంకు) కొరియోగ్రాఫర్‌గా తనవృత్తిని ప్రారంభించి స్త్రీ



శుభప్రదం సినిమాకు నృత్య దర్శకత్వం వహిస్తున్న వేదాంతం వెంకటా చలపతి

సాహసం, దేవదాసు, అన్నదాత, అనార్కలి, ప్రేమపాశం తదితర సినిమాలకు దర్శకత్వం వహించారు. వేదాంతం జగన్నాథశర్మ చెంచులక్ష్మి వంటి పలు సినిమాలకు నృత్య దర్శకత్వం వహించారు. వెంపటి పెదసత్యం, చినసత్యం దర్శకుడిగా, నర్తకులుగా వెండితెరపై వెలుగులద్దారు. వెంకట నాగచలపతి (వెంకు) శుభప్రదం సినిమాకు నృత్య దర్శకత్వం వహించారు.

- న్యూస్‌టుడే, కూచిపూడి



దుర్గాఘాట్‌లో పుణ్యస్నానాలు..



శివయ్యకు క్షీరాభిషేకం



పాత శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

కార్తిక దీపం.. శోభాయమానం

కార్తిక సోమవారాన్ని పురస్కరించుకుని భక్తులు తెల్లవారుజామునే దుర్గాఘాట్‌లో స్నానాలు చేశారు. నదిలో దీపాలు వదిలారు. నగరంలోని పాత శివాలయంలో భక్తులు పెద్దఎత్తున పూజలు చేసి దీపాలు వెలిగించారు.

- ఈనాడు, అమరావతి

పర్యాటక అభివృద్ధికి సహకరించండి

పాయకాపురం, న్యూస్‌టుడే : జిల్లాలో హస్తకళలు, పర్యాటక అభివృద్ధికి స్కూల్ ఆఫ్ ప్లానింగ్ ఆర్కిటెక్చర్ (ఎస్పీఏ) కళాశాల చేయూత, భాగస్వామ్యం అవసరమని కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. జిల్లాలో పలు పాఠశాలల ప్లానింగ్‌కు ఎస్పీఏ సహకారం అందించింది. ఈ క్రమంలో సోమవారం ఆయన కలెక్టరేట్‌లో ఆ సంస్థ ప్రతినిధులతో సమావేశమయ్యారు. కొండపల్లి బొమ్మల ఎక్స్‌పీరియన్స్ సెంటర్ అభివృద్ధిపై చర్చించారు. దేశంలోనే ప్రత్యేక గుర్తింపు పొందిన కొండపల్లి బొమ్మల ఔన్నత్యాన్ని నేటి తరానికి చాటిచెప్పాల్సిని కోరారు. ఎస్పీఏ ప్రతినిధులు స్పందించి.. ప్రత్యేక నిపుణులతో కమిటీగా ఏర్పడి అవసరమైన నివేదిక తయారు చేస్తామని తెలిపారు. కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్లు మూర్తి, జగత్‌కుమారి పాల్గొన్నారు.

మరింత తగ్గిన కృష్ణా వరద

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : నగరంలోని ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణా నది వరద ప్రవాహం సోమవారం మరింత తగ్గింది. ఉదయం ఆరు గంటలకు 1,26,975 క్యూసెక్కులను సముద్రంలోకి విడుదల చేశారు. సాయంత్రం ఆరు గంటలకు తగ్గుముఖం పట్టింది. 5 గేట్లను రెండు అడుగులు, 64 గేట్లను ఒక అడుగు మేర ఎత్తారు. సముద్రంలోకి 53,410 క్యూసెక్కులు వదిలారు. గుంటూరు ఛానల్‌కు నీటి విడుదలను పునరుద్ధరించి, 181 క్యూసెక్కులు ఇచ్చారు. మిగతా పంట కాలువలు కట్టివేసి ఉన్నాయి.


ఓటరు కార్డులో

చిరునామా మారుస్తున్నారా..!

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే

సాధారణంగా చాలా మంది ఓటరు కార్డును ఎన్నికల సమయాల్లోనే ఉపయోగపడుతుందని అనుకుంటారు. కానీ దానిని వ్యక్తిగత గుర్తింపు కార్డుగా వినియోగించుకోవచ్చు. అలాగే అద్దెకు ఉండే వారు తరచూ ఇళ్లు మారుతుంటారు. ఇలాంటి వారు ఆ కార్డులో చిరునామాను మార్చుకోవాల్సి ఉంటుంది. గుర్తింపు కార్డుగా దాని ప్రాధాన్యం తెలిసిన వారు అప్‌డేట్ చేసుకుంటారు. మరికొందరు ఆసక్తి చూపించరు. అందులోని చిరునామా (ఫారం-8) మార్పులు, చేర్పులు చేసుకునేందుకు ఒకప్పుడు ఎన్నికల సంఘం నియమిత సమయంలో మాత్రమే అనుమతించేది. తాజాగా ఆన్‌లైన్‌లో (voters services portal) ఎప్పుడైనా మార్చుకునే వెసులుబాటు కల్పించారు.

ఈ జాగ్రత్తలు తీసుకోండి



ఆధార్, ఓటరు కార్డులో పేర్లు ఒకేలా ఉండాలని ముందుగానే ఇలా సూచిస్తుంది...

పేరులో స్వల్పంగా తేడా ఉన్నా...

ఆన్‌లైన్‌లో ఓటరు కార్డు చిరునామా మార్చుకునేందుకు ఆధార్, పాస్‌పోర్ట్, పాన్ కార్డు తదితర గుర్తింపు కార్డులను అనుమతిస్తారు. ఆధార్ కార్డులో పేరు ఎలా ఉందో.. అలాగే ఓటరు కార్డులోనూ ఉండాలి. చిన్నపాటి మార్పు ఉన్నా దరఖాస్తు రిజెక్ట్ అవుతుంది. ఒక యువకుడి పేరు ఆధార్‌లో 'సాయిపవిత్రన్' అని ఉంది. కానీ ఓటరు కార్డులో 'సాయి పవిత్రన్' అని పేరులో ఖాళీ ఉంది. ఆన్‌లైన్‌లో ఫారం 8 దరఖాస్తు మొత్తం పూర్తి చేసిన తర్వాత చివరలో ఓటీపీ వెరిఫికేషన్, 'ఈ-సైన్' చేయాల్సి ఉంటుంది. దాన్ని క్లిక్ చేయగానే పేరులో మార్పు ఉందని దరఖాస్తు రిజెక్ట్ అవుతుంది. అదే విధంగా పేరులో స్పెల్లింగ్ తప్పులతో ఒక్క అక్షరం తేడా ఉన్నా.. రిజెక్ట్ అవుతుంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు పూరించే ముందే ఆధార్, ఓటరు కార్డుల్లో పేర్లు ఒకేలా ఉండాలని సూచన వస్తోంది. పేరులో తేడా ఉంటే ముందుగా పేరును సరిచేసుకుని.. ఆ తర్వాత చిరునామా మార్చుకోవాలని చెబుతోంది. తేడా ఉన్న వారు బీఎల్‌వోను సంప్రదించాలి.

ఆఫ్‌లైన్‌లోనే చేసుకోవాలి...

రెండూ కార్డుల్లోనూ పేర్లు ఒకేలా ఉన్న వారి వివరాలను ఆన్‌లైన్‌లో మార్చుకోవచ్చు. దరఖాస్తు రిజెక్ట్ అయిన వారు స్థానిక బీ.ఎల్.ఓ.ను సంప్రదించాలి. వారు తమ ప్రాంత సచివాలయంలో ఉన్న బూత్ లెవల్ అధికారిని సంప్రదించి చిరునామా మార్పునకు తగిన పత్రాలు ఇస్తే ఆఫ్‌లైన్‌లో దరఖాస్తును పూరించి చిరునామా మారుస్తారు. ప్రస్తుతం ఈ ప్రక్రియ జరుగుతోంది. ఆఫ్‌లైన్‌లో చిరునామా మార్చుకోవాలనుకుంటే.. ఇప్పుడే దరఖాస్తు చేసుకుంటే ఓటరు కార్డులో చిరునామా మారుతుంది. కార్డు డౌన్‌లోడ్ చేసుకుంటే గుర్తింపు కార్డుగా ఉపయోగించుకోవచ్చు.

అమ్మ తేజస్సు.. ప్రకృతి ఉషస్సు

ఈనాడు, అమరావతి



ఆకట్టుకుంటున్న గొట్టుముక్కల జలపాతం

జలపాతంలో స్నానం చేస్తున్న పర్యాటకులు

ప్రకృతి పరిమళం.. జలపాత సడుల ప్రవాహం.. ఆధ్యాత్మిక తన్మయం.. వెరసి కొండపల్లి అటవీ ప్రాంతం ప్రకృతి సోయగాలకు చిరునామాగా నిలుస్తోంది. పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. అక్కడే వనదేవత మద్దులమ్మ కొలువై ఉండడంతో ఆధ్యాత్మిక అటవీ పర్యాటక కేంద్రంగా మారుతోంది. ప్రస్తుతం కార్తిక మాసం కావడంతో వన సమారాధనల తాకిడి పెరుగుతోంది.

ప్రత్యేక ఆకర్షణగా.. విజయవాడకు 30 కి.మీ దూరంలోని కొండపల్లి అటవీ ప్రాంతంలో కంచికచర్ల మండలం గొట్టుముక్కలలో జలపాతం కనువిందు చేస్తోంది. నేరుగా కారు, బైక్, ప్రైవేటు వాహనాల్లో చేరుకునేందుకు అడవిలో మార్గం ఉంది. సామాజిక మాధ్యమాల్లో రీల్స్ ప్రాచుర్యం పొందడంతో సందర్శకుల సంఖ్య బాగా పెరిగింది. ఆదివారం, ఇతర సెలవు రోజుల్లో 500 వరకు ద్విచక్ర వాహనాలు, 100 కార్లు, ఆటోల్లో పర్యాటకులు తరలి వస్తున్నారు. జలపాతంలో ఈత కొట్టి సేద తీరుతున్నారు. కొందరు సమూహాలుగా ఏర్పడి ట్రెక్కింగ్ చేస్తూ ఆనందిస్తున్నారు. ఇక్కడ లఘు చిత్రాల చిత్రీకరణ చేసే వారి సంఖ్య బాగా పెరిగింది. ఫొటో షూట్లు నిత్యకృత్యమయ్యాయి. ఇప్పటికే కార్తిక వన సమారాధనలు మొదలయ్యాయి.

వరద పాయసం

జలపాతం సమీపంలోనే ఉన్న మద్దులమ్మ ఆలయానికి సైతం భక్తులు భారీగా తరలి వస్తున్నారు. 200 ఏళ్ల కిందట గ్రామంలో తాటుకూరు కోటయ్య అనే వ్యక్తికి కలలో అమ్మవారు దర్శన మిచ్చారని.. స్వప్నంలో చెప్పిన ప్రాంతంలో వెతకగా మద్దులమ్మ విగ్రహం దొరికినట్లు స్థానికులు చెబుతారు. చుట్టుపక్కల గ్రామాల్లో వర్షాలు లేక పంటలకు ఇబ్బంది కలిగినప్పుడు అమ్మవారికి పూజలు చేసి పాయసం తయారు చేయించి జలపాతం కొండపై నుంచి పాయసం పోయడం ఆనవాయితీ. ఈ విధానాన్ని వరద పాయసం అంటారు. ఈ వరద పాయసం పోస్తే తప్పకుండా వానపడుతుందని ఆయా గ్రామాల వారి నమ్మకం. వరద పాయసం పోసిన రోజు వర్షం పడినట్లు కొందరు గ్రామస్థులు చెబుతున్నారు.



వనదేవత మద్దులమ్మ

ప్రయోగం.. సఫలం

జాతీయ స్థాయి కాంక్రీట్ క్యూబ్ టెస్టు పోటీల్లో పీవీపీ ఎస్ఐటీ సివిల్ విద్యార్థుల ప్రతిభ



దినేష్ బృందం సభ్యులు తయారు చేసిన కాంక్రీట్ క్యూబ్‌ను పరిశీలిస్తున్న సివిల్ విభాగాధిపతి జగదీష్

ఇండియన్ కాంక్రీట్ ఇనిస్టిట్యూట్ (ఐసీఐ), ఆర్‌డీసీ కాంక్రీట్ ఇండియా లిమిటెడ్ సంయుక్తంగా నిర్వహించిన నేషనల్ కాంక్రీట్ క్యూబ్ టెస్టు సీజన్-3 పోటీల్లో కానూరు పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల సివిల్ విభాగం విద్యార్థులు ప్రతిభ చాటి జాతీయ స్థాయిలో మొదటిస్థానంలో నిలిచారు. మొదటి దశలో ఈ పోటీలకు దేశవ్యాప్తంగా 484 జట్లు నమోదు చేసుకున్నాయి. వీటిలో 37 కళాశాలలకు చెందిన 149 జట్లు తుదిదశ పోటీలకు చేరాయి.

ప్రతిభ చాటారిలా.. పీవీపీ సిద్ధార్థ సివిల్ విభాగం చివరి సంవత్సరం చదువుతున్న కె.దినేష్, ఎంగోవర్ధన్, ఎం.వరప్రసాద్ బృందం పోటీల్లో తుదిదశకు చేరుకుంది. వీరికి సివిల్ విభాగాధిపతి వెంగల జగదీష్ సాంకేతిక సహకారం అందించారు. ఇందులో భాగంగా జూన్ 1న వీరంతా కలిసి సిమెంటు, ఇసుక, గ్రావెల్, ఫ్లయాష్, జీబీబీఎస్, మైక్రోసిలికా వంటి పదార్థాలను కలిపి ఐదు ట్రయల్ మిశ్రమాలు తయారు చేశారు. జులై 12న వీటిలో ఉత్తమమైన దాన్ని ఎంపిక చేసుకున్నారు. ఈ మిశ్రమంతో తయారైన 150 మిల్లీమీటర్ల కాంక్రీట్ క్యూబ్‌లను 14 రోజుల పాటు శాస్త్రీయంగా క్యూర్ చేసి, నిర్దిష్ట బలం, మన్నిక సాధించేలా చేశారు. జులై 26న సమర్పించిన క్యూబ్‌లు, మిశ్రమ వివరాల వీడియోను నిర్వాహకులకు సమర్పించారు. ఆగస్టు 9న నిర్వహించిన అధికారిక పరీక్షల్లో వారి కాంక్రీట్ మిశ్రమానికి గుర్తింపు వచ్చింది. నవంబరు 1న చెన్నై ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయంలో కాంక్రీట్ క్యూబ్ టెస్టు పోటీల్లో జాతీయ స్థాయిలో మొదటి బహుమతిగా రూ.లక్ష చెక్కు అందుకున్నారు.

సవాళ్లను అధిగమించి విజయం.. ట్రయల్స్ కాంబినేషన్లు చేసే సమయంలో ఎన్నో సవాళ్లు ఎదురయ్యాయి. ప్రతి ప్రయత్నం నుంచి కొత్త విషయం నేర్చుకుని సమగ్రంగా కృషి చేశాం. సివిల్ విభాగాధిపతి జగదీష్, ప్రిన్సిపల్ కొండపల్లి శివాజీబాబు సహకరించారు. సంస్థ తక్కువ సిమెంటు వినియోగించి సామర్థ్యం ఉన్న కాంక్రీట్ క్యూబ్‌లను రూపొందించాం. వారి అంచనాలకు, నిర్దేశించిన సామర్థ్య విలువలకు దగ్గరగా క్యూబ్‌లు తయారు చేసి జాతీయ స్థాయిలో మొదటి స్థానంలో నిలిచాం **- దినేష్, బృంద నాయకుడు**

-కానూరు, న్యూస్‌టుడే

ఇది కాదా.. నిలుపు దోపిడీ

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే

- బ్లాక్‌లిస్టులో పెట్టినా చక్రం తిప్పిన పాత లీజుదారుడు
- కార్పొరేషన్ ఆదాయానికి తూట్లు

నాయకులు, వారి అనుయాయులు వాహన పార్కింగ్‌లను అడ్డాగా చేసుకుని అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. లీజు వేలంలో పోటీ లేకుండా, కార్పొరేషన్‌కు ఆదాయం రాకుండా అడ్డుపడుతున్నారు.

పాతబస్తీ బీఆర్‌పీ రోడ్డు, ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచి పార్కింగ్ లీజులు ఆగస్టుతో ముగిసిపోయాయి. 2024లో ఏడాదికి ఆ రెండు పార్కింగ్‌లను వైకాపా కార్పొరేటర్‌గా గెలిచిన ఒకరు.. బినామీ పేరిట లీజుకు దక్కించుకున్నాడు. కార్లు, ద్విచక్ర వాహన పార్కింగ్‌దారుల నుంచి అధిక ఫీజులు వసూలు చేయించాడు. కారుకు(3 గంటలకు) రూ.30 వసూలు చేయాల్సి ఉన్నా.. బెదిరించి రూ.100, రూ.200 వసూలు చేయించాడు. దీనిపై ఫిర్యాదులు రావడంతో అధికారులు తనిఖీ చేసి అతడిని బ్లాక్‌లిస్టులో పెట్టారు. దీంతో కక్ష పెంచుకుని ఆ పార్కింగ్‌కు లీజుటెండర్లు దాఖలు కాకుండా అడ్డుకుంటున్నట్లు ప్రచారం ఉంది. ఈ-వేలం పోర్టల్ ద్వారా ఆగస్టులో టెండర్లు పిలవగా ఒక్క టెండరు కూడా దాఖలు కాకుండా చేయగలిగాడు. సెప్టెంబరు 24న మళ్లీ ఈ-వేలం కింద షార్టు టెండరు పిలవగా అతితక్కువ ధరకు సింగిల్ టెండరు దాఖలైంది. అప్‌సెట్ ధర కన్నా కేవలం రూ.20 వేలు ఎక్కువ కోట్ చేయగా దానిని ఆమోదించేందుకు పాలకులు యత్నిస్తున్నారు.



బీఆర్‌పీ రోడ్డులో కార్ల పార్కింగ్

రెండు పార్కింగ్‌లకు కలిపి రూ.49,11,062 అప్‌సెట్ ధర నిర్ణయించగా.. సింగిల్ టెండరులో ఒకరు రూ.49,31,062 మాత్రమే కోట్ చేశారు. నిర్ణయించిన అప్‌సెట్‌పై కనిష్ఠంగా 11 శాతం(రూ.5,40,216) ఆదాయం ఎక్కువ రావాలి. భిన్నంగా తక్కువ కోట్ చేసిన సింగిల్ టెండరుదారుకు పార్కింగ్‌లీజు కట్టబెట్టేందుకు పాలకపక్షం ప్రయత్నిస్తోంది. ★ ఆయా సింగిల్ టెండరు ప్రతిపాదన ఆమోదానికి స్థాయీ సంఘం ముందుకు తేగా.. కమీషన్ల కోసం వాయిదా వేసినా ఆ తదుపరి సమావేశంలో ఆమోదించనున్నట్లు ప్రచారం సాగుతోంది.

నిబంధనలకు పాతర

★ సింగిల్ టెండర్ దాఖలైతే రద్దు చేసి మళ్లీ టెండర్లు పిలవాల్సి ఉన్నా అందుకు భిన్నంగా కార్పొరేషన్ ఆదాయానికి గండి కొట్టేలా పాలకులు వ్యవహరిస్తున్నారు. ★ ఇక సింగిల్ టెండరు లీజుదారుకు పార్కింగ్ ఫీజుపై జీఎస్టీ మినహాయింపు ఇవ్వనున్నారు. ★ లీజుదారు రూ.49,31,062 ఆఫర్ చేసినా ఆ సొమ్ము 12 వాయిదాల్లో(రూ.4,10,922)గా చెల్లించే వెసులుబాటు కల్పిస్తున్నారు.

నకిలీ మద్యం వ్యాపారంలో జనార్దనరావుకు జోగి అండ

తనకు చెప్పేవాడని విచారణలో వెల్లడించిన శ్రీనివాసరావు

ఈనాడు - అమరావతి: తమ అక్రమ మద్యం వ్యాపారానికి వైకాపా నేత జోగి రమేష్ అండదండలు ఉన్నాయని తనకు జనార్దనరావు పలుసార్లు చెప్పారని నిందితుడు తిరుమలశెట్టి శ్రీనివాసరావు (ఏ13) ఇంటరాగేషన్‌లో వెల్లడించాడు. రాజకీయ అండతో తన వ్యాపారానికి ఢోకా లేదని తరచూ చెప్పేవాడని విచారణలో చెప్పినట్లు తెలిసింది. నకిలీ మద్యం కేసులో అరెస్టయి నెల్లూరు కేంద్ర కారాగారంలో ఉన్న నిందితుడిని ఇటీవల ఐదు రోజుల కస్టడీకి కోర్టు ఇచ్చింది. కస్టడీ సోమవారంతో పూర్తయింది. దీంతో నిందితుడిని సోమవారం విజయవాడలోని ఎక్సైజ్ కోర్టులో న్యాయాధికారి ఎదుట హాజరుపర్చారు. అనంతరం ఆయన ఆదేశాలతో రిమాండ్ నిమిత్తం నెల్లూరు తరలించారు.

ఏకంగా కార్గోలో సరఫరా.. కస్టడీలో శ్రీనివాసరావును పలు అంశాలకు సంబంధించి సిట్ అధికారులు ప్రశ్నించారు. హైదరాబాద్ నుంచి మద్యం తరలించి ఇబ్రహీంపట్నంలో అమ్మకాలు సాగించేందుకు సాయపడినట్లు అంగీకరించాడు. హైదరాబాద్‌లో ఎన్డీపీఎల్ మద్యాన్ని క్యాన్లలో నింపి.. అక్కడి నుంచి ఆర్టీసీ కార్గో ద్వారా ఇబ్రహీంపట్నం చేర్చేవాడు. జనార్దనరావుకు బాలాజీ పరిచయమైన తర్వాత నకిలీ మద్యం తయారీని ప్రారంభించినట్లు విచారణలో తెలిపాడు.

★ బాలాజీ ద్వారా గోవాలో లేబుల్స్‌ను డిజైన్ చేయించి, ప్రింటింగ్ కూడా చేసినట్లు వెల్లడించాడు. వచ్చిన లేబుల్స్.. అచ్చం అసలు బ్రాండ్లకు సరిపోలేలా జగన్మోహన్ రావు క్షుణ్ణంగా పరిశీలించేవాడని చెప్పినట్లు తెలిసింది. ఏఎన్ఆర్ బార్‌కు వచ్చిన బేవరేజెస్ కార్పొరేషన్ ద్వారా వచ్చిన సరకు బ్యాచ్‌నంబర్లను ప్రింట్ చేయించేవారు. వైకాపా హయాంలో స్కానర్లు సరిగా పనిచేయకపోవడంకూడా తమకు కలసి వచ్చిందని విచారణలో సిట్ అధికారులకు వివరించాడు. మొత్తం ఎనిమిది బ్రాండ్లకు సంబంధించి నకిలీ లేబుళ్లను ముద్రించినట్లు చెప్పాడు. పోలీసుల ఎదుట లొంగిపోయేందుకు ఆఫ్రికా నుంచి జనార్దనరావు వచ్చే సమయంలో శ్రీనివాసరావుకు ఫోన్ చేశాడు. ముంబయిలో తాను దిగుతాననీ, అక్కడ తనను ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేసే వీలుందన్నాడు. తాను విమానం దిగాక వస్తే.. తన బ్యాగేజీ అప్పగిస్తా అని చెప్పడంతో.. అక్కడకు వెళ్లి తీసుకున్నట్లు ఇంటరాగేషన్‌లో సిట్ అధికారులకు వివరించాడు.

ప్రపంచకప్ విజయంపై సంబరాలు


క్రీడాకారుల చిత్రాలతో..


మహిళా పోలీస్ అధికారులు, సిబ్బంది సమక్షంలో కేకు కోస్తున్న సీపీ రాజశేఖరబాబు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : భారత మహిళా క్రికెట్ జట్టు.. ప్రపంచ కప్‌ను సాధించడంపై ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ పోలీసులు సంబరాలు చేశారు. సోమవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సీపీ ఎస్.వి.రాజశేఖరబాబు మహిళా పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి కేకు కోశారు. ఆయన మాట్లాడుతూ.. మహిళలు తలచుకుంటే ఎన్ని కష్టాలు వచ్చినా ఎన్ని ఇబ్బందులు, సవాళ్లు ఎదురైనా తమ సంకల్పాన్నే ఆయుధంగా చేసి కచ్చితంగా విజయం సాధిస్తారనేందుకు ఈ ప్రపంచ కప్ విజయమే నిదర్శనమని కొనియాడారు. సంక్రాంతి నేపథ్యంలో మహిళల్లో ఉన్న క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు డిసెంబరు నెలలో గ్రామీణ, మండల, జిల్లా స్థాయిలో మహిళలకు క్రీడా పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీసీపీలు కె.జి.వి.సరిత, ఉదయరాణి, ఏసీపీలు కె.లతాకుమారి, స్రవంతిరాయ్, మహిళా ఎస్సైలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీ కార్యాలయంలో...

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: నగరంలోని ఎంపీ కేశినేని శివనాథ్ కార్యాలయంలో సోమవారం వరల్డ్ కప్ సంబరాలు ఘనంగా జరిగాయి. జిల్లా క్రికెట్ సంఘానికి చెందిన పలువురు మహిళా క్రికెటర్లతో కలిసి ఎంపీ కేశినేని శివనాథ్ కేక్ కోసి ప్రజలందరి తరపున భారత మహిళా క్రికెటర్లకు అభినందనలు తెలిపారు. ఎంపీ మాట్లాడుతూ ఆంధ్రా క్రికెట్ సంఘం మహిళా క్రికెటర్లను ప్రోత్సహించడానికి ఎప్పుడూ ముందుంటుందన్నారు. విశాఖలోని అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఒక గ్యాలరీకి మిథాలీ రాజ్ పేరు, ఒక గేటుకు రావి కల్పన పేర్లు పెట్టడం జరిగిందన్నారు. కేడీసీఏ తరపున ఆడుతున్న మహిళా క్రికెటర్లకు అండగా ఉంటానన్నారు. జిల్లా జట్టు కెప్టెన్ సౌమ్య, రాష్ట్ర స్థాయి క్రికెటర్ ధాత్రి, కోచ్ నాగూర్, బాపిరాజు, కేడీసీఏ ఉమెన్ క్రికెటర్ మెంబర్ నాగమణి తదితరులు పాల్గొన్నారు.


క్రికెటర్ ధాత్రికి కేకు తినిపిస్తున్న ఎంపీ శివనాథ్

మొంథా గాయం.. సస్యరక్షణతో మాయం!

- ఘంటసాల కేవీకే సమన్వయకర్త డి.సుధారాణి
- 'ఈనాడు మీతోడు' ఫోన్‌ఇన్‌కు విశేష స్పందన

రైతేరాజు


రైతుల సందేహాలకు సమాధానాలిస్తున్న కేవీకే సీనియర్ శాస్త్రవేత్త సుధారాణి, వివరాలు నమోదు చేసుకుంటున్న శాస్త్రవేత్తలు

ఘంటసాల, న్యూస్‌టుడే

మొంథా తుపాను కారణంగా వీచిన ఈదురు గాలులు, భారీ వర్షాలకు వరి, మినుము, చెరకు, పలు ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో వాటిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త, సీనియర్ శాస్త్రవేత్త డి. సుధారాణి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ విషయమై 'ఈనాడు-మీతోడు' ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఫోన్‌ఇన్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. **ఉమ్మడి కృష్ణా జిల్లాతో పాటు పలు ప్రాంతాల నుంచి 80 మందికి పైగా రైతులు ఫోన్లు చేశారు.** వారి సందేహాలను డాక్టర్ సుధారాణి నివృత్తి చేశారు. కేవీకే శాస్త్రవేత్తలు కె.రేవతి, ఎం.వెంకటలక్ష్మి, వి.మంజువాణి, బి.నవీన్, జె.యశంత్‌కుమార్‌లు రైతుల సమస్యలు నమోదు చేసుకున్నారు.

వరిలో మానిపండు తెగుల నివారణ

ప్రస్తుతం వరిపైరు పాలుపోసుకునే దశలో ఉంది. అధిక వర్షాలకు మానిపండు తెగులు అధికంగా వ్యాప్తి చెందుతుంది. పొలంలో మురుగు నీటిని త్వరగా బయటకు తీయాలి. తెగులనివారణకు 200మి.లీ ప్రోపికొనజోల్ మందును డ్రోన్‌తో పిచికారీ చేయాలి. గింజ గట్టిపడే దశలో పలు రకాల శిలీంధ్రాలు ఆశించి నల్లటి మచ్చలు ఏర్పడతాయి. వాటి నివారణకు ప్రోపికొనజోల్ 1.0మి.లీ.. లీటరు నీటిలో కలిపి చల్లుకోవాలి.

చెరకులో ఇలా చేయండి..

అధిక వర్షాలకు ముంపునకు గురైన చెరకు పంటలో వడలు తెగులు ఆశించే అవకాశం ఉంది. నివారణకు 3గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా 1.0 మి.లీ.ప్రోపికొనజోల్ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. తెల్లదోమ, దూదేకుల తెగులు ఉధృతంగా ఉంటే.. ఎకరానికి ఇమిడాక్లోప్రిడ్ 50 మి.లీ. లేదా అసిటామి 40 గ్రాముల చొప్పున పిచికారీ చేయాలి.

కందలో కాండం మొదలు కుళ్లు తెగులు

భారీ వర్షాలకు నేలలో తేమ శాతం ఎక్కువగా ఉండటంతో కంద పంటలో మొదలు కుళ్లు తెగులు సోకుతుంది. దీని నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు, లీటరు నీటిలో కలిపి మొక్కల మొదళ్ల తడుపుకోవాలి.

బొప్పాయిలో పండుఈగ యాజమాన్యం

బొప్పాయితోటలో కలుపు లేకుండా చేయాలి. పండు ఈగ ఎరలను ఎకరానికి 4 చొప్పున అమర్చుకోవాలి. కుళ్లిన రాలిన కాయలను ఎప్పటికప్పుడు తీసి నాశనం చేయాలి. ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు ఎసిఫేట్ 1.5 గ్రాములు లేదా క్లోరాంట్రనిలిప్రోల్ 0.3 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలుపుకొని పిచికారీ చేయాలి.

పసుపులో దుంపకుళ్లు

అధిక వర్షాలకు పసుపు మొక్కలు కోలుకోవడానికి మలీకే-50గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. నేలలో తేమ శాతం అధికంగా ఉండటంతో దుంపకుళ్లు తెగులు వ్యాప్తి చెందుతుంది. నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3.0 గ్రాములు లీటరు నీటిలో కలిపి చల్లు కోవాలి.

మొక్కజొన్న కోలుకోవాలంటే..

అధిక వర్షాలకు మొక్కజొన్న మొక్కలు కోలుకోవడానికి మల్టీకే 50 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

కరివేపాకు ఆకులపై మచ్చల నివారణ

కరివేపాకు అకులకు అప్పుడప్పుడు తెగుళ్ల మచ్చలు సోకుతాయి. వీటి నివారణకు 2.0 సాఫ్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

మినుములో రకాలు.. విత్తన శుద్ధి.. తెగుళ్లు

మాగాణి పొలాల్లో మినుము సాగు చేసేవారు ఎల్‌బీజీ-752, ఎల్‌బీజీ-787, ఎల్‌బీజీ-884, ఎల్‌బీజీ-904, ఎల్‌బీజీ-932, ఎల్‌బీజీ-942, టీబీజీ-104 తదితర రకాలు సాగుచేసుకోవచ్చు. మినుములో రసం పీల్చే పురుగులతో వ్యాప్తి చెందే వైరస్ తెగుళ్లను నివారించేందుకు ఇమిడాక్లోప్రిడ్ 5మి.లీ. లేదా థయోమిథాక్సామ్ 5గ్రాములు, కిలో విత్తనంలో కలుపుకొని విత్తన శుద్ధి చేసుకోవాలి. కాండం గజ్జి తెగులు ఆశించి మొక్కలు చనిపోతాయి. దీని నివారణకు కిలో విత్తనంలో ట్రైకోడెర్మావిరిడీ 10గ్రాములు కలుపుకొని విత్తన శుద్ధి చేయాలి.

ఎలక్ట్రానిక్స్ రంగంలో ఐఈటీఈ కీలక సేవలు


ఐఈటీఈ సభ్యులను సత్కరిస్తున్న సతీష్ కుమార్, సూర్యప్రసాదరావు తదితరులు

తుళ్లూరు, న్యూస్‌టుడే: ఎలక్ట్రానిక్స్ రంగంలో అపారమైన అనుభవం ఉన్న మేధావుల మార్గదర్శకత్వాన్ని ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలి కమ్యూనికేషన్ ఇంజినీర్స్ (ఐఈటీఈ) అందిస్తోందని ఆ సంస్థ విజయవాడ కేంద్రం ఛైర్మన్ డా.బి.సూర్యప్రసాదరావు పేర్కొన్నారు. రాజధానిలోని ఏపీ-ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో సోమవారం సాయంత్రం ఆ సంస్థ విజయవాడ సెంటర్ 72వ వ్యవస్థాపక వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో కార్యదర్శి డా.షేక్ రియాజుద్దీన్‌లు హాజరై ప్రసాదరావు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఏడు దశాబ్దాల చరిత్ర కలిగిన ఐఈటీఈ జాతి నిర్మాణంలో విశేష సేవలు అందిస్తోందన్నారు. కృష్ణా, గుంటూరు, ప్రకాశం, ఖమ్మం జిల్లాల పరిధిలోని 4 వేల మంది ఇంజినీరింగ్ విద్యార్థులు వీటిని అందుకుంటున్నారని వివరించారు. తమతో పరస్పర భాగస్వామ్య పద్ధతిలో ఏపీ-ఎస్ఆర్ఎం వర్సిటీ పనిచేస్తుందని వీసీ డా.సతీష్‌కుమార్ తెలిపారు. ఈసీఈ విద్యార్థులు స్వయంగా రూపొందించిన నెక్స్ట్‌ట్రానిక్స్ టెక్నాలజీ క్లబ్‌ను ఇన్‌ఛార్జి వీసీ ప్రారంభించారు. లోగోను డీన్ డా.సి.వి టామీ ఆవిష్కరించారు.

రూ.10.5 కోట్ల నష్టపరిహారం అందజేత

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: ఏడు నెలల కిందట జగ్గయ్యపేట శివారులోని సాయి తిరుమల కోల్డ్‌స్టోరేజ్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో సంభవించి మిర్చి, అపరాలు కాలిపోయాయి. సుమారు 207 మంది రైతులు భారీగా నష్టపోయారు. దీంతో ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య కోల్డ్ స్టోరేజ్ యాజమాన్యంతో మాట్లాడి వారికి నష్టపరిహారం వచ్చే విధంగా కృషి చేశారు. సోమవారం రూ.10.5 కోట్ల నష్టపరిహారంగా రైతులకు అందించారు. ఈ సందర్భంగా రైతులు.. ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్యకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై రాజు తదితరులు పాల్గొన్నారు.


రైతులకు నగదు అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య

బొప్పాయి పాలు.. విదేశాలకు

నంద్యాల జిల్లా చాగలమర్రి మండల వ్యాప్తంగా రైతులు అధికంగా బొప్పాయి సాగు చేస్తుంటారు. చిన్నవంగలితో పాటు సమీపంలోని గ్రామాలైన వైఎస్సార్ కడప జిల్లా కానగూడూరు, క్రిష్ణంపల్లె గ్రామాల్లో 1200 ఎకరాల్లో పండిస్తారు. విత్తనం నాటిన కాలం నుంచి తొమ్మిది నెలలకు పంట చేతికొస్తుంది. పండ్ల సేకరణ అనంతరం 13 నెలల తర్వాత మిగిలినవి, ముదురు కాయలకు గాట్లు పెట్టి పాలను సేకరిస్తున్నారు. తెల్లవారుజాము సమయంలోనే కాయలకు గాట్లు పెడితే కేవలం రెండు గంటల్లోనే పాలు ఊరుతుంది. ఇలా సేకరించిన దాన్ని రాయచోటి, రాజంపేటకు చెందిన వ్యాపారులు స్థానిక రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. 20 లీటర్ల పాలు రూ.6 వేలకు విక్రయిస్తున్నారు. ఎకరాకు 3 నుంచి 4 డ్రమ్ముల పాలు సేకరిస్తున్నారు. ఎకరానికి పాల సేకరణ ద్వారా రైతుకు రూ.24 వేల ఆదాయం వస్తుంది. సేకరించిన పాలను పరిశ్రమల్లో మందులు, కాస్మోటిక్స్, సబ్బుల తయారీలో ఉపయోగిస్తున్నారు. బెంగళూరు, చెన్నైతో పాటు నాణ్యతను బట్టి విదేశాలకు సైతం పాలను ఎగుమతి చేస్తున్నారు. బొప్పాయి సాగులో ఎప్పుడైనా ధర పడిపోయినప్పుడు బొప్పాయి పాల సేకరణతో నష్టాల నుంచి రైతులు బయటపడుతున్నారు. **- న్యూస్‌టుడే, చాగలమర్రి**

పాడి ఆవుల ఎంపికలో మెలకువలు

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే

పశు పోషకులు పాడి ఆవుల కొనుగోలులో జాగ్రత్తలు తీసుకుంటే మంచి గోవులను పొందే అవకాశం ఉంటుందని పశు వైద్యాధికారి జంగా ప్రకాష్‌బాబు తెలిపారు. ఆయన సూచనలు ఇలా.. ప్రధానంగా పాల ఉత్పత్తి ఉన్న వాటిని ఎంపిక చేసుకోవాలి. ఈత సామర్థ్యంతో పాటు ఆరోగ్యంగా చురుగ్గా ఆకర్షణీయంగా, నిండు ఆడ లక్షణాలు కలిగిన ఆవులను కొనాలి. శరీరం త్రికోణాకారంగా, కాంతివంతమైన కన్నులు కలిగి, సన్నని మెడ ఉండే వాటిని ఎన్నుకోవాలి. పశువుల నాణ్యత, చరిత్రను దృష్టిలో ఉంచుకోవాలి. పాల దిగుబడిని మూడు వేళ్లలో లెక్కించి సగటున ఎన్ని పాలిస్తున్నాయన్నది లెక్క కట్టి అవగాహనకు రావాలి. పాలు పితకడానికి ఎవరినైనా దగ్గరకు రానిచ్చే ఆవులను ఎంచుకోవాలి. ప్రధానంగా అక్టోబర్- నవంబరు నెలల్లో కొనాలి.

జైలుకు జోగి బ్రదర్స్..

నకిలీ మద్యం కేసులో ఆదివారం అరెస్టయిన వైకాపా నేత, మాజీ మంత్రి జోగి రమేష్, ఆయన సోదరుడు జోగి రామును ఆదివారం రాత్రి ఎక్సైజ్ కోర్టులో హాజరుపర్చగా వాదోపవాదాల అనంతరం జడ్జి రిమాండ్ విధించారు. దీంతో సోమవారం తెల్లవారుజామున విజయవాడ జైలుకు, అనంతరం అక్కడి నుంచి నెల్లూరు జైలుకు తరలించారు. **-ఈనాడు, అమరావతి**


కోర్టు నుంచి విజయవాడ జైలుకు జోగి రమేష్, జోగి రామును తరలిస్తూ..


జైలు లోపలికి వెళ్లిన వేళ..

అలసత్వం సహించను : కలెక్టర్


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, జేసీ ఇలక్కియా తదితరులు

పాయకాపురం, న్యూస్‌టుడే : ప్రజా సమస్యలపై వచ్చిన అర్జీల పరిష్కారంలో అలసత్వాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోనని, అవి పునరావృతం కాకుండా చూడాలని కలెక్టర్ జి.లక్ష్మీశ సంబంధిత అధికారులను హెచ్చరించారు. అనుమతి లేకుండా గ్రీవెన్స్‌కు గైర్హాజరైతే చర్యలు తప్పవని పేర్కొన్నారు. సోమవారం నగరంలోని కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమస్యలు పరిష్కారం అవుతాయని అర్జీదారులు నమ్మకంతో మనవద్దకు వస్తారని, వారి నమ్మకానికి బలం చేకూరేలా సమస్యలు సకాలంలో తీర్చాలని పేర్కొన్నారు. బాధ్యతగా భావించి, అనుశీలన చేయాలని పేర్కొన్నారు. పీజీఆర్ఎస్‌కు ప్రజల నుంచి మొత్తం 194 అర్జీలు వచ్చాయి. జేసీ ఇలక్కియా, డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, డీఆర్డీఏ పీడీ ఎ.ఎన్.వి.నాంచారరావు, గ్రామ వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

7 నుంచి కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి హామీ

ఈనాడు కథనానికి స్పందన

మైలవరం, న్యూస్‌టుడే : ఈనెల 7వ తేదీ నుంచి జిల్లా వ్యాప్తంగా పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేందుకు సీసీఐ అధికారులు హామీ ఇచ్చినట్లు మార్కెటింగ్ శాఖ సంయుక్త సంచాలకులు కే.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'సీసీఐ జాడ లేదు.. గ్రామాల్లో ధర లేదు' శీర్షికన సోమవారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి స్పందించి, కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. సోమవారం గుంటూరులో నిర్వహించిన ఉన్నత స్థాయి సమావేశంలో 7న కేంద్రాలను తెరిచేందుకు సీసీఐ జనరల్ మేనేజర్ హామీ ఇచ్చినట్లు వివరించారు.

టెట్-2025 పరీక్షలకు ఉచిత శిక్షణ

గుంటూరు (నగరంపాలెం): టెట్-2025 పరీక్షలకు హాజరయ్యే మైనార్టీ విద్యార్థులకు ఉచిత శిక్షణ అందజేస్తున్నట్లు రీజనల్ సెంటర్ ఫర్ ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనార్టీస్ డీడీ యాకుబ్ బాషా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెట్-2025 పరీక్షలకు హాజరయ్యే కోస్తా జిల్లాలకు సంబంధించిన ముస్లింలు, దూదేకులు, క్రిస్టియన్(బీసీ-సి), పార్శీకులు, సిక్కులు, నియోబుద్ధులకు గుంటూరులోని రీజనల్ సెంటర్ ఆంధ్రా ముస్లిం కళాశాల క్యాంపస్‌లో నైపుణ్యం, అనుభవం కలిగిన అధ్యాపకులతో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈనెల 5 నుంచి తరగతులు ప్రారంభిస్తామని తెలిపారు. వివరాలకు 95026 66629, 81259 07579 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ముక్క చీరలతో మోసం చేస్తే చర్యలు


విక్రయాలు పరిశీలిస్తున్న దుర్గగుడి ఛైర్మన్ రాధాకృష్ణ, సభ్యులు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ముక్క చీరలతో భక్తులను మోసం చేసే వారిపై చర్యలు తీసుకుంటామని దుర్గగుడి పాలకమండలి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ పేర్కొన్నారు. ఈనెల 7న నిర్వహించనున్న పాలకమండలి సమావేశాన్ని దృష్టిలో పెట్టుకొని సభ్యులతో పాలకమండలి ఛైర్మన్ ట్రయల్ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఎజెండాకు సంబంధించిన అంశాలను సభ్యులకు మూడు రోజులు ముందుగా అందజేయాలని అధికారులకు సూచించారు. అనంతరం దేవస్థానంలో ముక్క చీరలతో భక్తులను మోసం చేస్తున్న దుకాణాలను తనిఖీ చేశారు. భక్తులను ఇబ్బంది పెట్టకుండా కనకదుర్గానగర్‌లో దుకాణాల ముందు ఫుట్‌పాత్ ఆక్రమించకుండా రెయిలింగ్ ఏర్పాటు చేయాలని సభ్యులు ఛైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. ప్రసాదాల పోటు, అన్నప్రసాద పంపిణీ భవనం, ఎలివేటెడ్ క్యూలైన్ల నిర్మాణ పనులు పరిశీలించారు. కార్యక్రమంలో ట్రస్టు బోర్డు సభ్యులు బి.ధర్మారావు, జి.సరోజ నీదేవి, పద్మావతి ఠాకూర్, ప్రధానార్చకులు దుర్గాప్రసాద్, ప్రత్యేక ఆహ్వానితులు శంకరబాబు, రామబ్రహ్మం పాల్గొన్నారు.

సైబర్ నేరాలకు సహకారం.. ముగ్గురి అరెస్టు


రమేశ్‌రెడ్డి శ్రీను శ్రీధర్

హైదరాబాద్: ఆన్‌లైన్ పెట్టుబడి మోసాలకు సహరించిన ముగ్గురు నిందితులను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. వీరు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందినవారు. పోలీసుల కథనం ప్రకారం.. ఓ ముఠా సభ్యులు హైదరాబాద్‌కు చెందిన బాధితులకు వాట్సాప్ ద్వారా పెట్టుబడుల సలహాదారులుగా పరిచయం చేసుకొని, నమ్మించి డబ్బులు దండుకున్నారు. అలా ముగ్గురి నుంచి రూ.59 లక్షలు కొట్టేశారు. బాధితులిచ్చిన ఫిర్యాదుపై సైబర్ సెల్ పోలీసులు దర్యాప్తు మొదలుపెట్టారు. గుంటూరు జిల్లా, తమ్మ రంగారెడ్డినగర్‌కు చెందిన మడతాల రమేశ్‌రెడ్డి (25), విశాఖపట్నం ఇంద్రానగర్‌కు చెందిన గండి శ్రీను, విజయవాడ, గొల్లపూడి, కృష్ణమల్లి రెసిడెన్సీ నివాసి, గుర్రపుకొండ శ్రీధర్‌లను నిందితులుగా గుర్తించారు. వీరు సైబర్ మోసగాళ్లతో చేతులు కలిపి, వివిధ బ్యాంకుల్లో ఖాతాలు తెరిచారు. వాటి వివరాలను మోసగాళ్లకు చేరవేశారు. ఆ ఖాతాలో జమయ్యే మొత్తంలో రమేశ్‌రెడ్డి, శ్రీను, శ్రీధర్‌లకు 15 నుంచి 20 శాతం కమీషన్‌లు అందుతున్నాయని పోలీసులు గుర్తించారు. ఏసీపీ శివమారుతి నేతృత్వంలోని బృందం నిందితులను అరెస్టు చేశారు. వారి ఫోన్లు, డెబిట్ కార్డులు స్వాధీనం చేసుకున్నారు.

విద్యుత్తు సమస్యలా? తెలియజేయండి

డయల్ యువర్ డీఈఈ రేపు



గ్రామాల్లో ప్రజలకు, రైతులకు నిత్యం అనేక విద్యుత్తు సమస్యలు ఎదురవుతున్నాయి. ఇటీవల మొంథా తుపాను నుంచి పలు ప్రాంతాల్లో ఇబ్బందులు తలెత్తాయి. ఆయా ఇబ్బందులను విద్యుత్తు అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించుకోవడంలో భాగంగా ఈనాడు ఆధ్వర్యంలో విద్యుత్తుశాఖ మైలవరం సబ్ డివిజన్ డీఈఈ జి.సుధాకర్‌తో ఫోన్‌ఇన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. సబ్ డివిజన్ పరిధిలో గల మైలవరం, జి.కొండూరు మండలాల్లోని ప్రజలు తమ సమస్యలను నేరుగా ఆయన దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తారు. దిగువ ఇచ్చిన ఫోన్ నంబర్లకు ఫోన్ చేయవచ్చు. - న్యూస్‌టుడే, మైలవరం

94910 66103
80085 74705

తేదీ: బుధవారం 05-11-2025

సమయం: ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు

తిరువూరు

• తిరువూరు • మైలవరం

స్పందించారు..శుభ్రం చేయిస్తున్నారు

కొండపల్లి 29వ డివిజన్ అరుణానగర్ ఖాళీ స్థలాల్లో ముళ్ల చెట్లు పెరిగిపోయాయి. వర్షం పడిన సందర్భంలో ఇళ్లలోకి పాములు, పురుగులు రావడంతో ఇబ్బందిగా ఉందని సమస్యలు తెలిపిన సమస్యలపై ఈనాడులో పలుమార్లు కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ నేపథ్యంలో పురపాలిక కౌన్సిల్ సమావేశంలో ఈ విషయాన్ని వైస్ ఛైర్మన్ శ్రీను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై వారు స్పందించారు. సోమవారం జంగిల్ క్లియరెన్స్ కార్యక్రమాన్ని ఛైర్మన్ చిట్టిబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో కమిషనర్ రమ్యకీర్తన తదితరులు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, కొండపల్లి



పనులు పర్యవేక్షిస్తున్న ఛైర్మన్ చిట్టిబాబు తదితరులు

అన్నదాతల సంక్షేమానికి ప్రాధాన్యం

రైతుల పంట కొనేందుకు వడివడిగా చర్యలు

గంపలగూడెం, తిరువూరు, న్యూస్‌టుడే: తిరువూరు రెవెన్యూ డివిజన్‌లో ఖరీఫ్ వరి నూర్పిడులు ప్రారంభమయ్యాయి. రైతులు పండించిన ధాన్యం ప్రభుత్వ కేంద్రాల్లో మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు అధికార యంత్రాంగం సిద్ధమైంది. ఇప్పటికే తిరువూరు, విస్సన్నపేట మండలాల్లోని పలువురు రైతులు యంత్రాలతో ధాన్యం నూర్పిడి చేయించారు. గ్రామాల్లో పీపీఏల ద్వారా పెట్టుబడి ఖరారు చేసుకుని కేంద్రాల్లో విక్రయించేందుకు సిద్ధంగా ఉన్నారు. మరోవైపు అధికారులు నిర్దేశిత పీఏసీఎస్‌లు, డీసీఎంఎస్‌ల ద్వారా ధాన్యం కొనుగోలుకు అవసరమైన తేమ పరీక్ష యంత్రాలు, ధాన్యం నింపేందుకు గోనె సంచులు, తూకం వేసేందుకు ఎలక్ట్రానిక్ కాటాలు కేంద్రాల్లో ఉంచారు.

48 గంటల్లోపు సొమ్ము జమ

రెవెన్యూ డివిజన్‌లో ఈ ఏడాది ఖరీఫ్‌లో 21,084 హెక్టార్లలో వరి సాగు చేయగా దిగుబడి 1,56,327 మెట్రిక్ టన్నులు ఉంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు దిగుబడిలో 60 శాతం వరకు పంటను కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని లక్ష్యంగా ఉంది. ఈ నేపథ్యంలో డివిజన్‌లోని ఐదు మండలాల నుంచి 1,31,197 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాల్సి ఉంది. ఇప్పటికే 3,67,500 గోనె సంచులు కేంద్రాలకు సరఫరా చేశారు. కొనుగోలు చేసిన ధాన్యం తరలించేందుకు ఎ.కొండూరు మండలంలో 2, విస్సన్నపేట మండలాల్లో మూడేసి రైస్ మిల్లులను ఎంపిక చేశారు. రైతులు జీపీఎస్ అమర్చిన వాహనాలతో పాటు సొంత వాహనాల్లో కూడా ధాన్యం మిల్లులకు తరలించవచ్చు. రైతులకు 24 నుంచి 48 గంటల లోపు సొమ్మును బ్యాంక్ ఖాతాలకు జమ చేస్తారు.

ధాన్యానికి ప్రభుత్వ ప్రకటించిన మద్దతు ధర (రూ.లో) ఇలా

రకం	క్వింటా	75 కిలోలు
సాధారణ	2369	1777
ఎ.గ్రేడ్	2389	1792



తిరువూరు చింతలపాడులో ఆరబోసిన వడ్లు

గతేడాది రికార్డు అధిగమించాలి

తిరువూరు రెవెన్యూ డివిజన్‌లో 2024 ఖరీఫ్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని లక్ష్యాన్ని అధిగమించి ప్రభుత్వ కేంద్రాల్లో కొనుగోలు చేశారు. ఆర్డీవో కె.మాధురి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకున్నారు. డివిజన్ జిల్లాలోనే ముందంజలో నిలిచారు. గతేడాది 40 వేల మెట్రిక్ టన్నుల పంట కొనుగోలు లక్ష్యం ఉండగా డిసెంబరు మొదటి పక్షానికే లక్ష్యాన్ని చేరుకుని రికార్డు నెలకొల్పారు. రెవెన్యూ అధికారులు అదే స్ఫూర్తితో ఈ ఏడాది కూడా లక్ష్యం మేరకు మద్దతు ధర చెల్లించి ధాన్యం కొనుగోలు చేస్తే రైతులకు మేలు చేసినట్లే.

తిరువూరు రెవెన్యూ డివిజన్‌లో వివరాలు

మండలం	సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)	దిగుబడి అంచనా (మెట్రిక్ టన్నుల్లో)	కేంద్రాలు	గోనె సంచులు
తిరువూరు	7379	54583	18	1,70,500
గంపలగూడెం	3907	29000	11	47,500
విస్సన్నపేట	3606	26782	9	45,000
రెడ్డిగూడెం	3399	25191	9	45,000
ఎ.కొండూరు	2796	20276	12	59,500

శుద్ధజల యంత్రం వితరణ



దాతలు శివ నాగేశ్వరరావు, కరుణ ప్రసాదుతో నాయకులు

విస్సన్నపేట, న్యూస్‌టుడే: విస్సన్నపేట తెదేపా మండల కార్యాలయానికి రూ.50,000 విలువ గల శుద్ధజల యంత్రాన్ని స్థానిక నివాసి శివ నాగేశ్వరరావు, కుమారుడు కరుణ ప్రసాద్ అందజేశారు. తెదేపా మండల అధ్యక్షుడు రాయల సుబ్బారావు, నాయకులు వారికి అభినందనలు తెలిపారు.

ప్రజల దాహార్తి తీర్చిన దాత

విస్సన్నపేట, న్యూస్‌టుడే: తాతకుంట్ల గౌరవపాలెం ముస్లిం బజారు నివాసితులకు మంచినీటిని అందించే మోటార్ ఇటీవల తుపానుకు మరమ్మతులకు గురైంది. ఈ సమస్యను దాత ఎస్టీ వెంకటేశ్వరరావు రూ.20,000 వితరణ చేసి బాగు చేయించారు. స్థానిక ప్రజలు దాతను అభినందించారు.

చిత్రాలు గీశారు.. బహుమతులు పొందారు



బహుమతులు సాధించిన విద్యార్థినులతో ఉపాధ్యాయులు



విస్సన్నపేట విజేతలతో ప్రిన్సిపల్ కృష్ణమాచారి, అధ్యాపకులు

మైలవరం, న్యూస్‌టుడే: ప్రతిభతో చక్కటి చిత్రాలను గీసిన విద్యార్థినులు బహుమతులు సాధించారు. 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిభాపాటవ పోటీల్లో భాగంగా సోమవారం స్థానిక బాలికోన్నత పాఠశాల ప్లస్‌లో 'మీకు ఇష్టమైన పండగ' అంశంపై చిత్రలేఖన పోటీలను నిర్వహించగా విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వారిలో అండర్ 7వ తరగతి విద్యార్థినులు సీహెచ్.దివ్యశ్రీ, ఎ.లిఖిత, బి.గగనప్రియలు వరుసగా తొలి మూడు స్థానాలు సాధించారు. వారికి ప్రధానోపాధ్యాయుడు వై.రాజశేఖర్, ఉపాధ్యాయులు జి.వాణిశ్రీ, కె.సుందరి, కె.సారిక, ఎం.శిరీష, ఎం.తులసిలు బహుమతులు అందజేసి అభినందించారు.

ప్రతిభతోనే ప్రశంసలు

విస్సన్నపేట, న్యూస్‌టుడే: విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీయడానికి ఈనాడు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిభా పాటవ పోటీలు తోడ్పడతాయని విశాఖ విద్యాసంస్థల డైరెక్టర్ నరెడ్ల నర్సిరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక విశాఖ జూనియర్ కళాశాలలో మీకు ఇష్టమైన పండగ విభాగంలో చిత్రలేఖన పోటీలు నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వారిలో ఎంపీసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు సంగోజు భావన, బరమయ్య ఉపేంద్ర, బిల్లా వెంకటలక్ష్మిలు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. వారికి ప్రిన్సిపల్ వి.కృష్ణమాచారి బహుమతులు అందజేసి అభినందించారు. అధ్యాపకులు బి.దర్శయ్య, బి.చిన్న రవి, సీహెచ్.సాయి రేఖ, యు.నాగలక్ష్మి పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

కొండపల్లి: 8008574656, జి.కొండూరు: 9063144762

? ఎస్సీఎస్ నగర్‌లో ఉమా కిరాణా సమీపంలో గల వీధి కూడలి మధ్య పిచ్చి చెట్లు పెరగడంతో నీళ్లు పట్టుకోవడానికి ఇబ్బందిగా ఉంది. - సత్యవతి, మైలవరం ✔ పిచ్చి చెట్ల తొలగింపునకు చర్యలు తీసుకుంటాం. - ఉమామహేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ? వెల్లటూరు గ్రామంలోని ఎస్సీ ఏరియాలో ఇటీవల కురిసిన వర్షాలకు పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా తయారై దోమలతో అవస్థలు పడుతున్నాం. - రాంబాబు, గ్రామస్థుడు ✔ తక్షణమే పారిశుద్ధ్య చర్యలు చేపట్టి దోమల నివారణ చర్యలు తీసుకుంటాం. - మురళి పంచాయతీ కార్యదర్శి

◆ స్థానిక పంచాయతీలోని పలు అంతర్గత రహదారుల వెంట మురుగు కాలువల నుంచి తొలగించిన వ్యర్థాలు తొలగించకపోవడంతో ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులను 'మేమున్నాం మీకు తోడుగా' శీర్షిక ద్వారా పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా స్పందించారు. సోమవారం పలు ప్రాంతాల్లో ఉన్న వ్యర్థాలను శుభ్రం చేయించారు. ◆ దుగ్గిరాలపాడు గ్రామంలోని కాలువల్లో పూడిక పేరుకుపోయి మురుగు పారక అవస్థలు పడుతున్నామని స్థానికులు తెలిపిన సమస్య 'మేమున్నాం మీకు తోడుగా' శీర్షికన 3వ తేదీన ప్రచురితమవగా పంచాయతీ కార్యదర్శి మనోజ్ స్పందించారు. సిబ్బందితో కాలువను శుభ్రం చేయించి..దోమల నివారణకు చర్యలు చేపట్టారు. ◆ కొండపల్లి ఆరు పంపులకు వెళ్లే మూల మలుపులో చెత్త తొలగించలేదని, కాలువలో మురుగు తీయలేదని స్థానికులు మేమున్నాం..మీకు తోడుగా తెలిపిన సమస్యపై పారిశుద్ధ్య సిబ్బంది స్పందించారు. ఆ ప్రాంతంలో శుభ్రం చేయించారు. ◆ స్థానిక పంచాయతీలోని 9 వార్డులో రహదారి వెంట డ్రెయినేజీ పూడికతో నిండి మురుగు ప్రవాహానికి ఆటంకంగా ఉందని స్థానికులు తెలిపిన సమస్యను పంచాయతీ కార్యదర్శి ఎస్.రామారావుకు తెలియజేయగా స్పందించారు. సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు. **- న్యూస్‌టుడే, మైలవరం, జి.కొండూరు, రెడ్డిగూడెం, కొండపల్లి** ◆ స్థానిక నరసాపురం గ్రామ పంచాయతీ ప్రధాన వీధుల్లో ఇటీవల తుపాను వర్షాలకు అధ్వానంగా మారడంతో శుభ్రం చేయించాలని నివాసితులు చేస్తున్న ఫిర్యాదుపై కార్యదర్శి జి.స్వాతి స్పందించారు. సిబ్బంది సాయంతో వీధులను శుభ్రం చేయించి, బ్లీచింగ్ చల్లించారు. **- న్యూస్‌టుడే, విస్సన్నపేట** ◆ పట్టణంలోని 14వ వార్డులో చెత్త పేరుకుపోయిందని స్థానికుడు దుర్గారావు ఫిర్యాదు చేయగా శానిటరీ అధికారి సంతోష్ స్పందించారు. సిబ్బందిని పంపి చెత్త ఊడ్పించారు. ◆ పట్టణంలోని 16వ వార్డులో డ్రెయినేజీల్లో మట్టి, బురద పేరుకుపోయి మురుగు పారడంలేదని స్థానికుడు సోమశేఖర్ చేసిన ఫిర్యాదుపై శానిటరీ అధికారులు స్పందించారు. సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు. **- న్యూస్‌టుడే, తిరువూరు టౌన్, విస్సన్నపేట**

'ప్రజల ఆశలను కొలికపూడి నిర్వీర్యం చేశారు'



మాట్లాడుతున్న రాజేశ్వరరావు, పక్కన నాయకులు

గంపలగూడెం, న్యూస్‌టుడే: తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు పనితీరుతో తెదేపా నాయకులు, కార్యకర్తలు అధికారంలో ఉన్నామనే మనోధైర్యాన్ని కోల్పోయారని మండల పార్టీ నాయకులు ధ్వజమెత్తారు. సోమవారం రాత్రి పార్టీ మండల శాఖ అధ్యక్షుడు మానుకొండ రామకృష్ణ అధ్యక్షతన మండల పార్టీ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు సీహెచ్.రాజేశ్వరరావు, మండల శాఖ మాజీ అధ్యక్షుడు ఆర్.వీరారెడ్డి మాట్లాడుతూ తెదేపా ఆవిర్భవించాకే రాజకీయాల్లో, పదవుల్లో కులమతాలకు అతీతంగా ప్రాధాన్యత లభించిందన్నారు. ... పార్టీని, కార్యకర్తలను ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కె.వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీపీ కె.శ్రీనివాసరావు, జడ్పీటీసీ మాజీ సభ్యులు పి.కొండలరావు, డీవీ.కృష్ణారావు, లీగల్ సెల్ కార్యదర్శి కె.ఆనంద్‌స్వరూప్, తెలుగు మహిళా అధ్యక్షురాలు ఎన్.రాఘవమ్మ తదితరులు పాల్గొన్నారు.

గెలిచారు.. అభినందనలు అందుకున్నారు..

జి.కొండూరు, న్యూస్‌టుడే: కవులూరులోని భోగినేని రాజగోపాలరావు పుష్పావతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ముగ్గురు జిల్లా స్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికయ్యారని హెచ్ఎం జీవీ రామకృష్ణ సోమవారం తెలిపారు. స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శనివారం విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన డివిజన్ స్థాయి పోటీల్లో డి.విక్రమ్ అండర్-14, 400 మీటర్ల పరుగు పందెంలో రెండవ స్థానం, కె.సిద్ధార్థ అండర్-17, 5 కిలోమీటర్ల వాకింగ్‌లో రెండవ స్థానం, జె.సుదర్శ అండర్-17 హర్డిల్స్‌లో ప్రథమ స్థానం సాధించి ఎంపికయ్యారన్నారు. క్రీడాకారులను, పీడీ శ్రీలతను పలువురు అభినందించారు. ◆ వెలగలేరు చనమోలు పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు యు.రాజేంద్ర, సీహెచ్.మనికంఠ జి.తరుణ్‌కుమార్, సుచరిత, సుదీప్ హైజంప్, లాంగ్ జంప్, షాట్‌పుట్, డిస్కస్ త్రోలో సత్తాచాటి జిల్లాకు ఎంపికైనట్లు హెచ్ఎం కె.పద్మ తెలిపారు. వారికి, పీడీ పురుషోత్తంను పలువురు అభినందించారు.

వెల్వడం(మైలవరం), న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి అండర్ 16 కబడ్డీ పోటీలకు మండలంలోని వెల్వడం ఎంపీపీ హైస్కూల్ విద్యార్థులు ఎం.వరుణ్, పి.లోకేశ్ ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు టి.బసవరావు, పీడీ బి.నాగమణి తెలిపారు. ఈ సందర్భంగా వారిని ఉపాధ్యాయులు అభినందించారు.



కవులూరు: క్రీడాకారులతో రామకృష్ణ, పీడీ శ్రీలత



మైలవరం విద్యార్థులతో ఉపాధ్యాయులు

సేవా కార్యక్రమాలకు పెద్దపీట



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న జిల్లా గవర్నర్, నాయకులు

మైలవరం, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా లయన్స్‌క్లబ్‌ల ద్వారా విస్తృత సేవలు అందించాలని లయన్స్ జిల్లా గవర్నర్ వీవీపీఎస్ ఆంజనేయులు సూచించారు. ఉమ్మడి కృష్ణాజిల్లా లయన్స్‌క్లబ్ రెండో క్యాబినెట్ సమావేశాన్ని ఆదివారం రాత్రి స్థానిక ఎస్వీఎస్ కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా లయనిజం ఉందని, సేవా కార్యక్రమాలకు పెద్దపీటగా నిలుస్తోందన్నారు. అనంతరం సేవా కార్యక్రమాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐపీఎంసీసీ డి.శ్రీశాంతి, మొదటి, రెండవ గవర్నర్‌లు ఎన్‌వీపీఎస్ ప్రసాద్, సీహెచ్ శ్రీనివాసరెడ్డి, క్యాబినెట్ సభ్యుడు బాలగోపాలరెడ్డి, శ్రీధర్, కోఆర్డినేటర్ వెంకటేశ్వరరావు, మైలవరం క్లబ్ నాయకులు నాగభూషణం, రామిరెడ్డి, హరీష్‌గుప్తా పాల్గొన్నారు.

వైభవంగా సత్యనారాయణస్వామి వ్రతం

నెమలి(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని నెమలి వేణుగోపాలస్వామి ఆలయంలో కార్తిక మాసం సోమవారం సందర్భంగా సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు గోపాలాచార్యులు వ్రత కథా వృత్తాంతాలను వివరించారు. వివిధ గ్రామాలకు చెందిన 34 మంది దంపతులు పీటలపై ఆశీనులై క్రతువులో పాల్గొన్నారు. ఆలయ సహాయ కమిషనర్ ఎన్.సంధ్య, పాలకమండలి అధ్యక్షురాలు కె.శశిరేఖ, సభ్యురాలు జి.వెంకటరమణ, గుడి కమిటీ మాజీ అధ్యక్షులు బి.మధుసూదనరావు, వి.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



క్రతువులో పాలకవర్గం, అధికారులు, తెదేపా నాయకులు

రాష్ట్ర స్థాయికి ఎంపిక

మైలవరం, న్యూస్‌టుడే: రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న వేడుకల్లో భాగంగా సోమవారం నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చాటిన ముగ్గురు విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ఎంఈఓ ఎల్.బాలు తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన ఈ పోటీల్లో స్థానిక బాలికల ఉన్నత పాఠశాల ప్లస్ విద్యార్థిని ఎస్.కె.గుల్షన్ ఆరా, స్థానిక బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి ఎస్.కె నాగుల్ షరీఫ్, కొండపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థిని ఎం.మేఘనలు వరుసగా మొదటి మూడు స్థానాలను సాధించినట్లు వివరించారు.



విద్యార్థులతో ఎంఈఓ, ఉపాధ్యాయులు

విద్యార్థులకు బహుమతులు, ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వరదా శ్రీనివాసరావు, సాక్ డైరెక్టర్ శ్రీసాయి విజయ్, కోఆర్డినేటర్లు సత్యనారాయణ, శివకృష్ణ, క్లబ్ లీడర్ కల్యాణ్, కో లీడ్ శశాంక్ పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

మైలవరం, న్యూస్‌టుడే: కేఎల్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని స్మార్ట్ విలేజ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని చంద్రాల హైస్కూల్‌లో క్విజ్ పోటీలను నిర్వహించారు. ఆయా విభాగాల్లో విజేతలైన



విజేతలతో నిర్వాహకులు

రూ.50 లక్షలతో అభివృద్ధి పనులు

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: మూలపాడు శివారు త్రిలోచనపురం వాసులు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న మురుగు కాలువలు, రహదారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం రూ.50 లక్షలు మంజూరు చేసినట్లు గ్రామ వ్యవసాయ పరపతి సహకార సంఘం అధ్యక్షుడు గరికపాటి శ్రీనివాసరావు తెలిపారు. గ్రామంలో మురుగు కాలువల నిర్మాణానికి రూ.40 లక్షలు, సీసీ రహదారుల ఏర్పాటుకు రూ.10 లక్షలు మంజూరయ్యాయన్నారు. ఈ పనులను చేసేందుకు సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. సర్పంచి చింతల భూలక్ష్మి జడ్పీటీసీ శ్రీదేవి, నాయకులు నాగేశ్వరరావు, గంజి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజలో నాయకులు, అధికారులు

కారు ఢీకొని ఒకరి మృతి

జి.కొండూరు, న్యూస్‌టుడే: కారు ఢీకొన్న ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందాడు చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు పినపాక గ్రామానికి కోసూరు బాబురావు(57) సోమవారం మధ్యాహ్నం పినపాక శివారు విద్యానగరం సమీపంలో తన సైకిల్‌పై పొలానికి వెళుతున్నాడు. ఈ క్రమంలో జాతీయరహదారి-30 వద్ద యూటర్న్ తీసుకుని వెళ్తున్న క్రమంలో ఇబ్రహీంపట్నం వైపు నుంచి వస్తున్న కారు అదుపు తప్పి బాబురావు సైకిల్‌ను ఢీకొంది. దీంతో అతడు రహదారిపై పడిపోగా తలకు తీవ్ర గాయమవడంతో ఢీకొన్న కారులోనే విజయవాడ ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. భార్య దుర్గ ఫిర్యాదు మేరకు ఎస్సై కె.సతీష్‌కుమార్ కేసు నమోదు చేశారు.

విద్యుదాఘాతంతో మరొకరు..

హనుమాన్‌జంక్షన్: విద్యుదాఘాతం కారణంగా మల్లవల్లిలో సోమవారం ఒకరు దుర్మరణం చెందారు. స్థానికంగా ఉన్న పారిశ్రామికవాడను ఆనుకుని ఉన్న పెంథుకోస్తు ప్రార్థనా మందిరంలో విద్యుత్తు పనులు చేస్తుండగా.. మున్నంగి యోహాను(40)కు ఒక్కసారిగా షాక్ కొట్టింది. దీంతో ఇతడిని సమీపంలో ఉన్న మీర్జాపురంలోని ఓ ఆసుపత్రికి.. ఆ తర్వాత నూజివీడు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కొద్దిసేపటికే యోహాను ప్రాణాలు కోల్పోయారు. ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లికి చెందిన ఇతడు ప్రార్థనా మందిరంలో పనులు చేసేందుకు వచ్చి ఇలా మృతి చెందడంతో స్థానికంగా విషాద ఛాయలు అలముకున్నాయి. వీరవల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదవశాత్తూ జారిపడి వృద్ధురాలు..

తిరువూరు టౌన్: స్థానిక జైబావి సెంటర్ వద్ద ఆగి ఉన్న ఆర్టీసీ బస్సు దిగుతూ గంపలగూడెం మండలం కనుమూరుకు చెందిన యార్లగడ్డ రోశమ్మ(84) ప్రమాదవశాత్తు జారిపడి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని తిరువూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అర్హులకి పింఛను అందించాలి

విస్సన్నపేట, న్యూస్‌టుడే: అర్హత కలిగిన పింఛనుదారులు తమకు పింఛను మంజూరు చేయాలని విస్సన్నపేట సీపీఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయానికి చేరుకున్నారు. మండల కార్యదర్శి నాగరాజు ఆధ్వర్యంలో ఎంపీడీవో చిన్నరాట్నాలుకి వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జ్ఞానరత్నం, ఏడుకొండలు, రంగారాణి తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో అక్కాచెల్లెళ్ల ప్రతిభ

ఇబ్రహీంపట్నం(గ్రామీణం), న్యూస్‌టుడే: ఇబ్రహీంపట్నం గ్రామీణ మండలం జూపూడికి చెందిన అక్కాచెల్లెళ్లు తైక్వాండో పోటీల్లో సత్తా చాటి పతకాలు సాధించారు. రాష్ట్ర పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 2, 3 తేదీల్లో అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరులో నిర్వహించిన అండర్ 17 బాలికల విభాగంలో కలతోటి దామిని ప్రతిభ చూపి బంగారు పతకం సాధించగా..నిర్వాహకులు అరుణాచల్‌ప్రదేశ్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ బాలిక ప్రస్తుతం డాన్‌బాస్కో పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. ఇదే పోటీల్లో దామిని సోదరి కలతోటి హాసిని అండర్ 19 విభాగంలో రజత పతకం అందుకుంది. ఈమె గుంటూరులోని భాష్యం కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఈ సందర్భంగా వీరిని, శిక్షకులు అంకమ్మరావు, గౌరీశంకర్‌లను పాఠశాల, కళాశాల యాజమాన్యాలు, గ్రామస్థులు అభినందించారు.

5న గిరిప్రదక్షిణ

పెనుగొలను(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని పెనుగొలను సమీప మెట్టగుట్ట గజలక్ష్మి సమేత శేషాచల శ్రీనివాస ఆలయంలో కార్తిక పూర్ణిమ సందర్భంగా ఈ నెల 5వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు గిరిప్రదక్షిణ, సాయంత్రం 6 గంటలకు కృతిక జ్యోతి దీపోత్సవం నిర్వహిస్తామని గుడి అభివృద్ధి కమిటీ సభ్యులు, అర్చకులు తెలిపారు.

జోగి రమేష్ అరెస్టును ఖండిస్తున్నాం

జి.కొండూరు: మాజీ మంత్రి జోగి రమేష్‌ను కల్తీ మద్యం కేసులో అక్రమంగా అరెస్టు చేశారని ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ ఆరోపించారు. ఆమె నివాసంలో వైకాపా మండల నాయకులతో కలిసి సోమవారం విలేకర్లతో మాట్లాడారు. కల్తీ మద్యం కేసులో ఆధారాలు లేకుండా జోగి రమేష్‌ను అరెస్టు చేయడం దారుణమన్నారు.

ఘనంగా భూమిపూజ

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: ముచ్చనపల్లి, రెడ్డిగూడెం గ్రామాల్లో వడ్డె ఓబన్న విగ్రహం ఏర్పాటుకు ఘనంగా సోమవారం భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏపీ వడ్డెర సంక్షేమ సంఘం, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ మల్లే ఈశ్వరరావు, ఆ సంఘం నాయకులు సత్యనారాయణ, వేములబాబు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ పునఃప్రతిష్ఠ

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: గ్రామ ఆధ్యాత్మిక, సాంస్కృతిక సమైక్యతలుగా దేవాలయాలు నిలవాలని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. ఇబ్రహీంపట్నం గంగానమ్మ తల్లి నూతన ఆలయ పునఃప్రతిష్ఠా కార్యక్రమంలో సోమవారం ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

అధికారుల బృందం సందర్శన

విస్సన్నపేట, న్యూస్‌టుడే: కలెక్టర్ లక్ష్మీశ ఆదేశాల మేరకు విస్సన్నపేట మండలంలో దేవాలయాలను పలు శాఖలతో కూడిన అధికారుల బృందం సోమవారం సందర్శించింది. ఆలయాల్లో మౌలిక వసతులు, పర్వదినాల్లో వచ్చే భక్తుల సంఖ్య, కావలసిన రక్షణ ఏర్పాట్లు గురించి నిర్వహణ కమిటీ ప్రతినిధులు, స్థానిక ప్రజలతో చర్చించారు. ఎంపీడీవో చిన్నరాట్నాలు, ఆర్ఐ సుజాత, రీసర్వే డీటీ విజయ్ భాస్కర్ పాల్గొన్నారు.

నేతలకన్నా అంశాలే మిన్న!

బిహార్ ఎన్నికల్లో కూటములు, కులమతాలు, అభివృద్ధి, సంక్షేమంవంటి అంశాలకు ప్రాధాన్యం



బిహార్ రాజకీయం ఇటీవలి కాలంలో ఎన్నడూ లేనంత సంక్లిష్టంగా, ఆసక్తికరంగా మారింది. అక్కడ నేతలకన్నా ఆయా ప్రాంతాల ప్రాథమ్యాలే కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఒక్కో ప్రాంతంలో ఒక్కో అంశం ప్రభావం చూసే అవకాశం కనిపిస్తోంది. దీంతో ఎన్నికలు అంచనాలకు అందడం లేదు. బహుళ కూటములు, ఓటర్ల జాబితా సవరణ, సంక్షేమ పథకాలు, కుల సమీకరణాలు, సరికొత్త రాజకీయ పార్టీల అవతరణతో బహుముఖ పోటీ పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో సంప్రదాయ ఓటింగ్‌కు భిన్నంగా ఈసారి పరిస్థితి కనిపిస్తోంది. ఎన్నికల్లో ప్రభావం చూసే ఆయా అంశాలేవంటే..

కూటములు: అంతర్గత సమస్యలతో ఎన్డీయే, మహాగఠ్‌బంధన్ కూటములు సతమతమవుతున్నాయి. దీంతో వాటితో పొసగని పార్టీలు కొత్త కూటములను కట్టాయి. ఎన్డీయేలోకి ఎల్జేపీ రావడంతో జేడీయూ ఇబ్బంది పడుతోంది. దీనివల్ల సీట్ల సర్దుబాటులో సమస్యలు వచ్చాయి. గత ఎన్నికల్లో ఎల్జేపీ పోషించిన పాత్రను ఇప్పుడు జన్ సురాజ్ పార్టీ పోషిస్తోంది. మహాగఠ్‌బంధన్‌లోకి వికాస్‌శీల్ ఇన్సాన్ పార్టీ రావడంతో ఇబ్బందులు తలెత్తాయి. జేఎంఎం, ఎల్జేపీలోని మరో గ్రూపు కూటమిలోకి వచ్చినా సీట్ల సర్దుబాటు జరగలేదు. దీంతో చాలా చోట్ల స్నేహపూర్వక పోటీ నెలకొంది.

నాయకత్వం: ముఖ్యమంత్రి అభ్యర్థిని చూసి ఓటేస్తామన్నవారు బిహార్‌లో 15 శాతమే ఉన్నారు. వారిలోనూ తేజస్వీ యాదవ్ ముందున్నా ఆయనను ముస్లిం-యాదవ్ అభ్యర్థిగానే చాలా మంది చూస్తున్నారు. 17 శాతం మంది ప్రధానిగా ఎవరుండాలనే అంశానికి ప్రాధాన్యమిస్తామని చెప్పారు. 23 శాతం మంది అభివృద్ధి చూసి ఓటేస్తామన్నారు. మిగిలినవారు కులం, మతం, ఉచితాలు, స్థానిక అంశాలనూ చూసి ఓటేస్తామని చెప్పారు.

ప్రభుత్వ వ్యతిరేకత: ప్రభుత్వ వ్యతిరేకత ప్రతి ఎన్నికల్లో ఉన్నట్లుగానే ఇక్కడా ఉంది. ఓ సర్వే ప్రకారం.. ప్రభుత్వ వ్యతిరేకత 48 శాతం మందిలో ఉండగా.. అనుకూలత 32 శాతం ఉంది. 14 శాతం మంది తటస్థంగా ఉన్నారు.

సంక్షేమం: యువత, మహిళలు, రైతులు, సీనియర్ సిటిజన్లు, కార్మికులే లక్ష్యంగా ఎన్డీయే ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేసింది. మరిన్ని పథకాలకు హామీ ఇచ్చింది. అయితే బిహార్ ఆర్థిక పరిస్థితి దృష్ట్యా ఇటువంటి పథకాలతో ఇబ్బందేనన్న వాదనా ఉంది. మరోవైపు ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ మరిన్ని సంక్షేమ వరాలను కురిపించారు.

మోదీ వర్సెస్ రాహుల్: జాతీయ నేతలైన ప్రధాని మోదీ, కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీకి మధ్య పోటీగా ఈ ఎన్నికలను కొంత మంది చూస్తున్నారు. తేజస్వీ, నీతీశ్‌ల ప్రభావం తగ్గడంతో జాతీయ రాజకీయాల పాత్ర పెరిగింది.

మహిళా ఓటర్లు: దేశంలో ఇటీవలి ఎన్నికల్లో మహిళలే కింగ్ మేకర్లుగా నిలుస్తున్నారు. ఇందుకు బిహార్ మినహాయింపు కాదు. కులమతాలకతీతంగా వారు తమ ఆకాంక్షలకు పట్టం కట్టేవారికే ఓటేస్తున్నారు. రాష్ట్రంలో 1.21 కోట్ల మందికి ఇటీవలే ఎన్డీయే ప్రభుత్వం రూ.10,000 చొప్పున అందించింది. 7.42 కోట్ల మంది ఓటర్లలో సగం మంది మహిళలే. వారి నిర్ణయం ఎన్నికల ఫలితాలను కచ్చితంగా ప్రభావితం చేయనుంది.

యువతరం: ప్రస్తుతం బిహార్‌లో ఎవరి నోట విన్నా యువతరం ఎటు మొగ్గుతుందో అన్న దానిపైన చర్చలు సాగుతున్నాయి. 18 నుంచి 29 సంవత్సరాల మధ్య వయసున్న యువతే బిహార్ మొత్తం ఓటర్లలో 25శాతం ఉన్నారు. 35 ఏళ్ల వరకూ లెక్కిస్తే 35 శాతం వరకూ ఉంటారు. వారు లాలూ హయాంలోని జంగిల్‌రాజ్ గురించి ఆలోచించడం లేదు. సంప్రదాయ ఓటు బ్యాంకు రాజకీయాలనూ నమ్మడం లేదు. భవిష్యత్తుకు భరోసా కావాలని కోరుతున్నారు. నిరుద్యోగం, వలసలే వారి ప్రాధాన్యాంశాలు. యువతలో ప్రభుత్వ వ్యతిరేకత తీవ్రంగా ఉంది. అయితే అది తేజస్వీ యాదవ్, ప్రశాంత్ కిశోర్‌ల మధ్య చీలిపోయే అవకాశం ఉంది.

కుల సమీకరణం: బిహార్‌లో తమ కులం వ్యక్తికి ఓటేస్తామని చెప్పేవారు 57 శాతం ఉంటారని అజీం ప్రేమ్‌జీ వర్సిటీ అధ్యయనంలో తేలింది. ఇక్కడ సంప్రదాయంగా అగ్ర వర్ణాలు ఒకటిగా, యాదవేతర ఓబీసీలు ఒకటిగా, ఈబీసీలు ఒకటిగా, మహా దళితులు ఒకటిగా, పాస్వాన్‌లు ఒకటిగా ఉంటారు. వీరంతా కలిసి మొత్తం ఓటర్లలో 68 శాతం ఉంటారు. ముస్లిం-యాదవ్‌లకు ఎస్సీలు తోడవడంతో 2024 లోక్‌సభ ఎన్నికల్లో మహాగఠ్‌బంధన్ మంచి ఫలితాలనే సాధించింది.

దళితులు: రాష్ట్రంలో 20 శాతం దళితులు ఎన్నికల్లో తీవ్ర ప్రభావం చూపుతారు. అందులో మళ్లీ పలు ఉపకులాలున్నాయి. వారిలో రవిదాస్, పాశ్వాన్, మాంఝీలది ఆధిపత్యం. పాస్వాన్, మాంఝీలు ఎన్డీయేతో ఉన్నారు. రవిదాస్‌లు మహాగఠ్‌బంధన్‌వైపు మొగ్గుచూపుతారు.

ముస్లింలు: రాష్ట్రంలో గణనీయంగా ఉన్న ముస్లింలు చాలాచోట్ల ఎన్నికలను ప్రభావితం చేయగలరు. వారు సంప్రదాయంగా ఆర్జేడీకి అండగా నిలుస్తుంటారు. అయితే ఎంఐఎం కొన్ని ఓట్లను చీలుస్తుంది.

ప్రశాంత్ కిశోర్: ఈసారి ప్రశాంత్ కిశోర్ ఎంత ప్రభావం చూపుతారన్నది అంతుచిక్కడం లేదు. విద్యావంతులు, మధ్యతరగతివారు, పట్టణ ప్రాంతాల్లో ఆయన ప్రభావం చూపే అవకాశముందని అంచనా వేస్తున్నారు. బిహార్‌లో మూడో శక్తిగా తాను అవతరిస్తానని ఆయన అంటున్నారు.

- నేషనల్ డెస్క్

ఎస్ఐఆర్‌పై ఆందోళన అవసరం లేదు

- ఆ ప్రక్రియ బాగా జరుగుతుంది
- మద్రాసు హైకోర్టుకు తెలిపిన ఈసీ

చెన్నై(ప్యారిస్), న్యూస్‌టుడే: ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ(ఎస్ఐఆర్)పై ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఆ ప్రక్రియ ఊహించిన దాని కన్నా బాగా జరుగుతుందని కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీ) మద్రాసు హైకోర్టుకు తెలిపింది. ఓటరు జాబితాలోని మృతుల పేర్లు, వలస కార్మికులు, అనర్హులను తొలగించాలని ఇచ్చిన ఫిర్యాదులను ఈసీ పట్టించుకోలేదని పేర్కొంటూ మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణన్, అన్నాడీఎంకే న్యాయవాది వినాయగం తదితరులు దాఖలు చేసిన పిటిషన్లను హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎం.ఎం.శ్రీవాస్తవ, జస్టిస్ అరుళ్‌మురుగన్ ధర్మాసనం సోమవారం విచారించింది. ఈసీ తరఫున న్యాయవాది సమాధానమిస్తూ "ఏటా జనవరిలో ఎస్ఐఆర్ జరుగుతుంది. ప్రతి ఎన్నికల ముందు ఈ ప్రక్రియ సాధ్యం కాదు. తమిళనాడు సహా 12 రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ చేపట్టే విషయమై గత నెల 27న ఈసీ ప్రకటన ఇచ్చింది. ఆ మేరకు మంగళవారం (నవంబరు 4) నుంచి ఆ ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఇందులో ఓటరు జాబితాను పూర్తిగా సవరించనున్నాం. కరూర్ నియోజకవర్గం ఓటరు జాబితాలోని మృతుల పేర్లను తొలగించాలని మాజీ మంత్రి ఎమ్మార్ విజయభాస్కర్ ఇచ్చిన ఫిర్యాదు పెండింగ్‌లో ఉంది" అని పేర్కొన్నారు. వీటిని నమోదు చేసుకున్న ధర్మాసనం ఈ విషయమై దాఖలైన అన్ని పిటిషన్లను నవంబరు 13న విచారిస్తామని తెలిపింది.

బిహార్‌లో చేసిన వ్యాఖ్యలు ఇక్కడా చేయగలరా?

ప్రధాని మోదీనుద్దేశించి తమిళనాడు సీఎం స్టాలిన్

చెన్నై, న్యూస్‌టుడే: బిహార్ ఎన్నికల ప్రచారంలో చేసిన వ్యాఖ్యలను ప్రధాని నరేంద్ర మోదీ తమిళనాడుకు వచ్చి అనగలరా అని ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ ప్రశ్నించారు. ధర్మపురిలో సోమవారం జరిగిన ఓ వివాహ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. భాజపా వ్యూహాలు తమిళనాడులో విఫలమవటంతో రాష్ట్రంపై మోదీ విద్వేష వ్యాఖ్యలు చేశారన్నారు. ఇక్కడ బిహార్ వలస కూలీలను దారుణంగా చూస్తున్నట్లు ఎన్నికల ప్రచారంలో మోదీ బిహార్‌లో ఆరోపించారని తెలిపారు.

‘వీధి కుక్కలకు ఆహారం’పై త్వరలో మార్గదర్శకాలు

- సుప్రీంకోర్టు వెల్లడి
- విచారణకు హాజరైన ఏపీ సీఎస్ విజయానంద్

ఈనాడు, దిల్లీ: ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాల్లో వీధి శునకాలకు ఉద్యోగులు ఆహారం పెట్టే విషయంలో తగు మార్గదర్శకాలను జారీ చేయనున్నట్లు సుప్రీంకోర్టు వెల్లడించింది. ఈ కేసులో రెండు రోజుల్లో ఉత్తర్వులిస్తామని జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్‌మెహతా, జస్టిస్ ఎన్వీ అంజారియాలతో కూడిన ధర్మాసనం సోమవారం స్పష్టంచేసింది. వీధి కుక్కల నియంత్రణకు తీసుకున్న చర్యలను పేర్కొంటూ అఫిడవిట్లు వేయని రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులంతా నవంబరు 3న కోర్టు ముందు హాజరుకావాలని అక్టోబరు 27న ధర్మాసనం ఆదేశించింది. ఆ మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సహా వివిధ రాష్ట్రాల సీఎస్‌లు హాజరయ్యారు. వారు దాఖలుచేసిన అఫిడవిట్లలోని అంశాలను క్రోడీకరించి బుధవారం నాటికి కోర్టుకు సమర్పించాలని అమికస్ క్యూరీ గౌరవ్ అగర్వాల్‌కు ధర్మాసనం సూచించింది. ఈ నెల 7న తదుపరి ఉత్తర్వులిస్తామని తెలిపింది.

ఈ సందర్భంగా గతంలోనే అఫిడవిట్ ఎందుకు వేయలేదు? రాష్ట్రం తరఫున ఎందుకు హాజరుకాలేదు? అని విజయానంద్‌ను న్యాయమూర్తి జస్టిస్ విక్రమ్‌నాథ్ ప్రశ్నించారు. అందుకు ఆయన తరఫు న్యాయవాదులిచ్చిన సమాధానాన్ని పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం తదుపరి విచారణకు సీఎస్‌లు హాజరుకావాల్సిన అవసరం లేదని పేర్కొంది. తాము ఇచ్చే ఉత్తర్వుల్ని అమలు చేయకపోతే మళ్లీ పిలిపించాల్సి వస్తుందని హెచ్చరించింది. కుక్కకాట్లకు గురైన బాధితులు ఇంప్లీడ్ కావడానికి ఈ సందర్భంగా అనుమతినిచ్చింది. ఇదివరకు ఇలాగే ఇంప్లీడ్ కావడానికి శునక ప్రేమికులను అనుమతినిచ్చినపుడు రూ.25 వేల నుంచి రూ.2 లక్షల దాకా పీజు డిపాజిట్ చేయాలని ఆదేశించిన ధర్మాసనం.. శునక బాధితులకు మాత్రం మినహాయింపునిచ్చింది. భారత జంతు సంక్షేమ మండలిని కక్షిదారుగా చేర్చి నోటీసు జారీచేసింది.

రాజధాని నిర్మాణానికి మరో రూ.32,500 కోట్ల రుణం

- ప్రపంచ బ్యాంకు-ఏడీబీ నుంచి రూ.14 వేల కోట్లు
- నాబార్డు, ఎన్‌ఏబీఎఫ్‌ఐడీ, ఏపీపీఎఫ్‌సీ నుంచి మిగతా నిధులు

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతి నిర్మాణానికి రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్‌డీఏ) మరో రూ.32,500 కోట్లు రుణం తీసుకోనుంది. ప్రపంచ బ్యాంకు-ఆసియా అభివృద్ధి బ్యాంకుల కన్సార్టియంతో పాటు ఆంధ్రప్రదేశ్ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఏపీపీఎఫ్‌సీ), నేషనల్ బ్యాంక్ ఫర్ ఫైనాన్సింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ డెవలప్‌మెంట్ (ఎన్‌ఏబీఎఫ్‌ఐడీ), నాబార్డ్ నుంచి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ అసిస్టెన్స్ (ఎన్‌ఐడీఏ) కింద రుణం సమీకరించనుంది. రూ.1,500 కోట్ల రుణానికి సంబంధించి ఏపీపీఎఫ్‌సీతో ఇప్పటికే ఒప్పందం కుదిరింది. మిగతా సంస్థలతోనూ సంప్రదింపుల ప్రక్రియ ముగిసింది. రుణం మంజూరుకు ఆ సంస్థలు అంగీకారం తెలిపాయి. ప్రపంచ బ్యాంకు- ఏడీబీ మరో రూ.14 వేల కోట్లు, ఎన్‌ఏబీఎఫ్‌ఐడీ రూ.10 వేల కోట్లు, నాబార్డు రూ.7,000 కోట్లు రుణం మంజూరు చేయనున్నాయి. సీఆర్డీఏ ఇప్పటికే ప్రపంచ బ్యాంకు, ఏడీబీల నుంచి రూ.15,000 కోట్లు, హడ్కో నుంచి రూ.11 వేల కోట్లు కలిపి మొత్తం రూ.26,000 కోట్ల రుణం తీసుకుంది.

ప్రపంచ బ్యాంకు, ఏడీబీ నుంచి మళ్లీ రుణం

రాజధాని అమరావతి ప్రాజెక్టుపై ప్రపంచ బ్యాంకు మొదటి నుంచీ సానుకూలంగా ఉంది. రాజధాని నిర్మాణానికి రుణం ఇచ్చేందుకు 2019కి ముందే ఆ సంస్థ సిద్ధమైంది. అప్పట్లో ఏఐఐబీతో కలిసి రుణం ఇచ్చేందుకు ముందుకు వచ్చింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా రాజధాని పనుల్ని నిలిపేసిన జగన్ ప్రభుత్వం.. ప్రపంచ బ్యాంకు నుంచి రుణం అవసరం లేదని కేంద్ర ప్రభుత్వానికి స్పష్టంచేసింది. 2024 జూన్‌లో కూటమి అధికారంలోకి వచ్చాక.. కేంద్ర ప్రభుత్వం కూడా చొరవ చూపడంతో శరవేగంగా రూ.15,000 కోట్ల రుణం ఇచ్చేందుకు ప్రపంచ బ్యాంకు ముందుకు వచ్చింది. ఈ మొత్తంలో ప్రపంచ బ్యాంకు, ఏడీబీ కలిసి సుమారు రూ.13,500 కోట్లు ఇస్తుండగా, రూ.1,500 కోట్లు మ్యాచింగ్ గ్రాంట్‌ను కేంద్ర ప్రభుత్వం సమకూర్చింది. రాజధాని నిర్మాణానికి మరో 1.6 బిలియన్ డాలర్లు (సుమారు రూ.14 వేల కోట్లు) రుణం ఇచ్చేందుకు కూడా ప్రపంచ బ్యాంకు, ఏడీబీ ముందుకొచ్చాయి. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం ఈ వారంలోనే కేంద్ర ఆర్థికశాఖకు అందజేయనుంది. అక్కడి నుంచి అది ప్రపంచ బ్యాంకు, ఏడీబీల బోర్డుల ఆమోదం కోసం వెళుతుంది. రూ.14,000 కోట్లలో కొంత మొత్తాన్ని మ్యాచింగ్ గ్రాంట్‌గా సమకూర్చాల్సి ఉంటుంది. దాన్ని కూడా కేంద్ర ప్రభుత్వమే ఇస్తుందా? రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చాలా? అన్న విషయంలో స్పష్టత రాలేదు. అమరావతి నిర్మాణంపై దేశీయ ఆర్థిక సంస్థలు కూడా ఆసక్తిగా ఉన్నాయనడానికి.. నాబార్డ్, ఎన్‌ఏబీఎఫ్‌ఐడీ వంటి సంస్థలు రుణాలు ఇచ్చేందుకు ముందుకు రావడమే నిదర్శనం.

చాలావరకు నిధులు సమకూరినట్లే!

★ రాజధాని అమరావతి నిర్మాణంలో భాగంగా రూ.91,639 కోట్ల అంచనా వ్యయంతో 112 పనులు చేపట్టేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ★ వాటిలో ప్రధాన మౌలిక వసతుల అభివృద్ధి, రైతులకు ఇచ్చిన స్థలాలు కేటాయించిన లేఅవుట్ల అభివృద్ధి, ప్రభుత్వ పరిపాలన నగరంలో నిర్మించే హైకోర్టు, సచివాలయం టవర్లు, శాసనసభ భవనం వంటి ఐకానిక్ నిర్మాణాలు, హైకోర్టు న్యాయమూర్తులు, మంత్రులు, అధికారుల నివాస గృహాలు వంటి 87 పనులకు ఇప్పటికే టెండర్లు పిలిచారు. వీటి అంచనా వ్యయం రూ.53,388 కోట్లు. ★ వీటిలో ప్రపంచ బ్యాంకు, ఏడీబీ నుంచి తీసుకుంటున్న రూ.15,000 కోట్లతో 30 పనులు, హడ్కో నిధులతో 50 పనులు చేపడుతున్నారు. ★ రూ.38,926 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. ★ ప్రపంచ బ్యాంకు-ఏడీబీ మంజూరు చేసిన రుణంలో రూ.4,285 కోట్లు ఇప్పటికే విడుదలయ్యాయి. ★ హడ్కో రూ.11 వేల కోట్ల రుణంలో ఇప్పటికే రూ.2,750 కోట్లు విడుదలయ్యాయి. మిగతా నిధులు దశల వారీగా అందనున్నాయి. ★ ఇప్పుడు తీసుకోబోయే రూ.32,500 కోట్ల రుణంతో రాజధాని నిర్మాణానికి చాలావరకు నిధులు సమకూరినట్లవుతుంది. దీంతో అన్ని పనుల్ని శరవేగంగా పరుగులు పెట్టించేందుకు వీలు కలుగుతుంది.

విజయవాడలో ఎల్ఐసీ హౌసింగ్ ఉప ప్రాంతీయ కార్యాలయం

- ఏపీ, తెలంగాణల్లో రూ.13 వేల కోట్ల గృహ రుణాలు లక్ష్యం
- సంస్థ ఎండీ త్రిభువన్ అధికారి వెల్లడి



త్రిభువన్ అధికారి

ఈనాడు, విశాఖపట్నం: వ్యక్తిగత గృహ రుణాల మంజూరులో ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ ఆశించిన ప్రగతి కనబరుస్తోందని, భవిష్యత్తులో మరింత పుంజుకుంటుందని ఆ సంస్థ ఎండీ, సీఈవో త్రిభువన్ అధికారి పేర్కొన్నారు. ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ ప్రాంతీయ కార్యాలయం హైదరాబాద్‌లో ఉండగా.. పరిపాలన సౌలభ్యం, అధిక రుణాల మంజూరుకు విజయవాడలో ఉప ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు చేశామని చెప్పారు. సోమవారం విశాఖపట్నంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మొదటి ఆరు నెలలకు ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో రూ.5,634 కోట్లు అందజేశామని.. మొత్తంగా రూ.13 వేల కోట్లు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఏపీలో నిర్మాణ రంగం ఊపందుకుంటోందన్నారు. ఈ తరుణంలో రాష్ట్రంలో గృహరుణాల అందజేతకు ఉత్సాహంగా ఉన్నామన్నారు. ముఖ్యంగా తక్కువ విలువ, మాధ్యమిక స్థాయి గృహాలకు రుణాలివ్వడం ప్రాధాన్యంగా పెట్టుకున్నామని చెప్పారు. కొత్తగా ఇళ్లు కొనేవారిని డిజిటల్ సేవల ద్వారా చేరుకునే ప్రయత్నం ప్రారంభించామన్నారు.

ప్రియుడిపై దాడిచేసి.. యువతిపై సామూహిక అత్యాచారం

- తమిళనాడులో ఘోరం

చెన్నై (ట్రిప్లికేన్, కోయంబత్తూరు), న్యూస్‌టుడే: ప్రేమజంట కారులో కూర్చొని మాట్లాడుకుంటుండగా అక్కడకు వచ్చిన దుండగులు యువతిపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన ఘటన తమిళనాడులో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. కోయంబత్తూరు శివారులో విమానాశ్రయం వెనుక ప్రాంతం నిర్మానుష్యంగా ఉంటుంది. ఆదివారం రాత్రి 11 గంటల ప్రాంతంలో విమానాశ్రయం వెనుక వైపు ఉన్న బృందావన్ నగర్‌లో 19 ఏళ్ల కళాశాల విద్యార్థిని, ఆమె ప్రియుడు కారులో కూర్చొని మాట్లాడుకుంటున్నారు. ద్విచక్ర వాహనంలో వచ్చిన ముగ్గురు దుండగులు వారితో వాగ్వాదానికి దిగారు. తర్వాత తమ వద్ద ఉన్న కొడవలితో ప్రియుడిపై దాడిచేశారు. తీవ్రంగా గాయపడిన యువకుడు స్పృహ కోల్పోయాడు. అనంతరం యువతిపై సామూహిక అత్యాచారానికి పాల్పడి పరారయ్యారు. తెల్లవారుజామున 3 గంటలకు స్పృహలోకి వచ్చిన ప్రియుడు ఫోన్ ద్వారా పోలీసులకు సమాచారం ఇచ్చాడు. వెంటనే వారు బాధితులిద్దరినీ ఆస్పత్రికి తరలించారు.

పిన్నెల్లి సోదరుల బెయిల్ పిటిషన్‌పై.. విచారణ 10కి వాయిదా

ఈనాడు, దిల్లీ: పల్నాడు జిల్లా తెదేపా నాయకులు వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావుల హత్యకేసులో నిందితులైన వైకాపా మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకటరామిరెడ్డిల ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ వచ్చే సోమవారానికి వాయిదా పడింది. జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం ముందుకు సోమవారం ఈ పిటిషన్ విచారణకు వచ్చింది. పిటిషనర్ల తరఫు న్యాయవాది సిద్ధార్థ దవే వాదనలు వినిపిస్తూ.. ఈ కేసులో ఇప్పటికే ఛార్జిషీట్ దాఖలైందని, పూర్తిస్థాయిలో వాదనలు వినిపించడానికి పిన్నెల్లి సోదరులకు సమయమివ్వాలని, అందువల్ల వాయిదా వేయాలని కోరారు. అందుకు ధర్మాసనం అంగీకరిస్తూ తదుపరి విచారణను ఈ నెల 10కి వాయిదా వేసింది.



డ్రోన్‌తో సర్వే చేపడుతున్న అధికారులు

ఓఎంసీ గనుల్లో డ్రోన్ సర్వే ప్రారంభం

డి.హీరేహాళ్, న్యూస్‌టుడే: ఓబుళాపురం మైనింగ్ కంపెనీ ప్రాంతంలో అంతర్రాష్ట్ర సరిహద్దు గుర్తింపు కోసం సోమవారం అధికారులు డ్రోన్‌తో సర్వే ప్రారంభించారు. అనంతపురం జిల్లా ఓబుళాపురం, సిద్ధాపురం గ్రామాల పరిధిలో అక్రమ తవ్వకాల కారణంగా కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సరిహద్దులు గల్లంతయ్యాయి. ఇప్పటికే పలు దఫాలుగా సర్వే చేసినప్పటికీ కొలిక్కి రాకపోవడంతో గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించడంతో వారం రోజులుగా సర్వే చేస్తున్నారు. ఇందులో భాగంగానే ఓఎంసీ, అంతర గంగమ్మ మైనింగ్ ప్రాంతాల్లో విజయవాడ సర్వే ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్ డిప్యూటీ డైరెక్టర్లు సూర్యారావు, జయరాజ్ ఆధ్వర్యంలో బృందం సర్వే చేపట్టింది. సోమవారం అంతర గంగమ్మ కొండలో ఉన్న ఓఎంసీ లీజు ప్రాంతంలో 68.5 హెక్టార్లకు డ్రోన్ సర్వే చేసినట్లు అధికారులు తెలిపారు. మిగిలిన 5 లీజుల గనులకు సంబంధించిన సర్వే చేయనున్నట్లు వివరించారు. వారి వెంట రేంజ్ అధికారి రామచంద్రుడు, డీఆర్వో దామోదర్‌రెడ్డి, మండల సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.



సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ విద్యార్థినులతో కాళ్లు నొక్కించుకుంటున్న ఉపాధ్యాయురాలు

టీచరమ్మా ఇది తగునా?

బాలికలతో కాళ్లు నొక్కించుకున్న ఉపాధ్యాయురాలు

ఈనాడు డిజిటల్, శ్రీకాకుళం: పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ఆ ఉపాధ్యాయురాలు వారితో కాళ్లు పట్టించుకున్న ఘటన శ్రీకాకుళం జిల్లా మెళియాపుట్టి మండలం బందపల్లి బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాలలో వెలుగు చూసింది. ఇక్కడి ఉపాధ్యాయురాలు సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ.. ఇద్దరు విద్యార్థినులతో కాళ్లు నొక్కించుకుంటున్న వీడియో ఆలస్యంగా బయటకు వచ్చింది. ఈ విషయాన్ని ఐటీడీఏ సీతంపేట పీవో పవార్ స్వప్నిల్ జగన్నాథ్ వద్ద ‘ఈనాడు’ ప్రస్తావించగా.. సంబంధిత ఉపాధ్యాయురాలికి ఇప్పటికే షోకాజ్ నోటీసు జారీ చేశామని, విచారణకు ఆదేశించామని తెలిపారు.

హాయ్‌ల్యాండ్‌కు తరలించాలన్న నిర్ణయం ఎవరిది?



- గ్రూప్-1 జవాబుపత్రాలను అక్కడ ఎన్నిరోజులు ఉంచారు?
- జవాబుపత్రాలను సీల్డ్ కవర్లో మా ముందుంచండి
- ఏపీపీఎస్సీకి హైకోర్టు ఆదేశం

ఈనాడు, అమరావతి: ‘ఏపీపీఎస్సీ కార్యాలయం నుంచి గ్రూప్-1 ప్రధాన పరీక్ష జవాబుపత్రాలను మంగళగిరి సమీపంలోని హాయ్‌ల్యాండ్ రిసార్ట్‌కు తరలించాలనే నిర్ణయం ఎవరిది? ఏపీపీఎస్సీ సమష్టిగా నిర్ణయం తీసుకుందా? లేదా అప్పటి ఛైర్మన్, లేదా కార్యదర్శి నిర్ణయం మేరకు వాటిని తరలించారా? ఇందుకు సంబంధించిన ఏమైనా ఉత్తర్వులున్నాయా? జవాబుపత్రాల్ని హాయ్‌ల్యాండ్‌లో ఎన్ని రోజులు ఉంచారు? తిరిగి ఏపీపీఎస్సీకి ఎప్పుడు తీసుకొచ్చారు తదితర అంశాలపై స్పష్టత ఇవ్వండి’ అని ఏపీపీఎస్సీని హైకోర్టు ఆదేశించింది. అభ్యర్థుల జవాబుపత్రాలను సీల్డ్ కవర్లో హైకోర్టు రిజిస్ట్రార్ (జ్యుడీషియల్)కు అందజేయాలని స్పష్టం చేసింది. హాయ్‌ల్యాండ్‌లో మొదటిసారి మూల్యాంకనం చేశారని అందుకు భారీగా సొమ్ము ఖర్చుపెట్టారని అభ్యర్థులు చెబుతున్న నేపథ్యంలో చెల్లింపులేమైనా జరిగాయా తదితర విషయాలను చెప్పాలని ఏపీపీఎస్సీ కార్యదర్శిని ఆదేశించింది. వివరాలు సమర్పించేందుకు సమయం కావాలని ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్ కోరడంతో విచారణను ఈ నెల 11కి వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ హరిహరనాథశర్మలతో కూడిన ధర్మాసనం సోమవారం ఈ ఉత్తర్వులిచ్చింది. గ్రూప్-1 ప్రధాన పరీక్ష జవాబుపత్రాల మాన్యువల్ మూల్యాంకనంలో అక్రమాలు జరిగాయన్న కారణంతో పరీక్షను రద్దు చేసి, తాజాగా నిర్వహించాలని హైకోర్టు సింగిల్ జడ్జి 2024 మార్చి 13న తీర్పిచ్చిన విషయం తెలిసిందే. దాన్ని సవాలు చేస్తూ ఏపీపీఎస్సీ, ఉద్యోగాలు పొందినవారు, పొందనివారు వేసిన అప్పీళ్లపై విచారణ చేపట్టిన ధర్మాసనం.. ఇటీవల తీర్పును రిజర్వు చేసింది. తీర్పు సిద్ధం చేసే క్రమంలో తలెత్తిన సందేహాల నివృత్తి కోసం సోమవారం విచారణ జరిపింది.

2022 జూన్ 24 నాటి ఉత్తర్వులివే

‘గ్రూప్-1 ప్రధాన పరీక్షలో ఎంపికైనవారు షెడ్యూల్ ప్రకారం ఇంటర్వ్యూకు హాజరయ్యేందుకు, ఎంపిక ప్రక్రియ కొనసాగించుకునేందుకు ఏపీపీఎస్సీకి అనుమతిస్తున్నాం. ఫలితాల ప్రకటన, పోస్టింగ్ ఉత్తర్వులు ఏమైనా ఇస్తే అవి సింగిల్ జడ్జి ఇచ్చే తీర్పునకు లోబడి ఉంటాయని పోస్టింగ్ ఉత్తర్వుల్లో ప్రస్తావించాలి. కోర్టు తుది తీర్పునకు కట్టుబడి ఉంటామని, ఎలాంటి హక్కులను కోరబోమంటూ ఎంపికైన అభ్యర్థుల నుంచి ఏపీపీఎస్సీ హామీ తీసుకోవాలి. ఎంపికైన అభ్యర్థులు సింగిల్ జడ్జి వద్ద వ్యాజ్యాల్లో ప్రతివాదులుగా చేరేందుకు వెసులుబాటు ఇస్తున్నాం. గ్రూప్-1 ప్రధాన పరీక్షలో పాల్గొన్న అభ్యర్థులందరి జవాబుపత్రాలను ఏపీపీఎస్సీ భద్రపరచాలి. డిజిటల్, మాన్యువల్ మూల్యాంకనంలో ఇంటర్వ్యూకు అర్హత సాధించిన అభ్యర్థుల జవాబుపత్రాలను సీల్డ్ కవర్లో హైకోర్టు రిజిస్ట్రార్ వద్ద ఉంచాలి’ అని 2022 జూన్ 24న హైకోర్టు ధర్మాసనం ఉత్తర్వులిచ్చింది. ఈ ఉత్తర్వుల్ని గుర్తు చేసిన ధర్మాసనం.. వాటి అమలుపై ఏజీని ప్రశ్నించింది.

రెండు రోజుల్లో కోర్టు ముందుంచుతాం: ఏజీ

ఏజీ వాదనలు వినిపిస్తూ.. పోస్టింగ్ పొందిన అభ్యర్థుల నుంచి హామీ పత్రం తీసుకున్నామన్నారు. మార్కుల వివరాలు, జవాబుపత్రాలను తుది విచారణ సమయంలో ధర్మాసనం ముందు ఉంచితే సరిపోతుందని ఏపీపీఎస్సీ తరఫు అప్పటి న్యాయవాది సలహా ఇచ్చారన్నారు. రెండు రోజుల్లో జవాబు పత్రాలను కోర్టు ముందు ఉంచుతామన్నారు.

చిన్నారి నాగవైష్ణవి హత్య కేసులో మావయ్య నిర్దోషి

- దిగువ కోర్టు తీర్పును పాక్షికంగా సవరించిన హైకోర్టు
- మొదటి, రెండో దోషులకు జీవిత ఖైదు సమర్థన

ఈనాడు, అమరావతి: ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో సంచలనం సృష్టించిన చిన్నారి నాగవైష్ణవి అపహరణ, హత్య కేసులో ముగ్గురు నిందితులకు జీవిత ఖైదు విధిస్తూ విజయవాడ మహిళా సెషన్స్ కోర్టు ఇచ్చిన తీర్పును ఏపీ హైకోర్టు పాక్షికంగా సవరించింది. మొదటి దోషి మోర్ల శ్రీనివాసరావు, రెండో దోషి యంపరాల జగదీష్‌కు కింది కోర్టు విధించిన జీవిత ఖైదును సమర్థించింది. వారిరువురి అప్పీళ్లను కొట్టేసింది. మూడో నిందితుడు, నాగ వైష్ణవికి వరసకు మావయ్య అయిన పంది వెంకటరావు అలియాస్ కృష్ణ (ఏ3)ను నిర్దోషిగా ప్రకటించింది. అతడికి విజయవాడ కోర్టు విధించిన జీవిత ఖైదును రద్దు చేసింది. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కె.సురేశ్‌రెడ్డి, జస్టిస్ ఎస్.సుబ్బారెడ్డిలతో కూడిన ధర్మాసనం సోమవారం ఈ మేరకు తీర్పు ఇచ్చింది.

★ విజయవాడకు చెందిన పలగాని ప్రభాకరరావు తన మేనకోడలిని వివాహం చేసుకున్నారు. పిల్లలు పుట్టి చనిపోతుండటంతో నిజామాబాద్‌కు చెందిన నర్మదాదేవిని రెండో పెళ్లి చేసుకున్నారు. వీరికి ఇద్దరు కుమారులు, కుమార్తె నాగవైష్ణవి జన్మించారు. నాగవైష్ణవి పుట్టాక ప్రభాకరరావు వ్యాపారం వృద్ధి చెందింది. ఆ పాపపై ఆయన మమకారం పెంచుకున్నారు. ఇది మొదటి భార్య కుటుంబంలో విభేదాలకు కారణమైంది. ప్రభాకరరావు మొదటి భార్య సోదరుడు పంది వెంకటరావు బావపై కక్ష పెంచుకున్నాడు. ఆస్తి అంతా రెండో భార్య పిల్లల పేరిట రాసేస్తారని అనుమానించాడు. నాగవైష్ణవిని హతమారిస్తే తప్ప తన అక్క కాపురం బాగుపడదని భావించాడు. ఆ చిన్నారి హత్యకు తన బంధువైన మోర్ల శ్రీనివాసరావుతో రూ.50 లక్షలకు ఒప్పందం చేసుకున్నాడు. శ్రీనివాసరావు తన వద్ద పనిచేసే జగదీష్ సాయం తీసుకున్నాడు.

★ 2010 జనవరి 30న నాగవైష్ణవి సోదరుడు తేజేష్‌గౌడ్‌తో కలిసి ఇంటి నుంచి కారులో బయలుదేరింది. ఇది గమనించిన శ్రీనివాసరావు, జగదీష్.. దారిలో వెనుక నుంచి వారి కారుపై రాళ్లతో దాడి చేశారు. డ్రైవర్ లక్ష్మణరావు కారు దిగి పరిశీలిస్తుండగా అతడిని కత్తులతో పొడిచారు. దీంతో భయపడిన చిన్నారి తేజేష్‌గౌడ్ కారులోంచి దూకి పారిపోయాడు. కత్తిపోట్లకు గురైన డ్రైవర్‌ను స్థానికులు ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే కన్నుమూశాడు.

★ నాగవైష్ణవిని అపహరించిన నిందితులు గుంటూరు జిల్లా తాడేపల్లిలో మరో కారులోకి మారారు. చిన్నారి కేకలు వేస్తుండటంతో గొంతునొక్కారు. దీంతో వైష్ణవి కారులోనే చనిపోయింది. ఒక ప్లాస్టిక్ డ్రమ్ము కొని మృతదేహాన్ని అందులో వేసిన నిందితులు.. గుంటూరు శివారు ఆటోనగర్‌లోని శారదా ఇండస్ట్రీస్‌కు తీసుకెళ్లారు. ఆ డ్రమ్మును విద్యుత్ కొలిమిలో వేసి అధిక ఉష్ణోగ్రత వద్ద బూడిద చేసేశారు. తన కుమార్తె హత్య విషయం తెలిసిన ప్రభాకరరావు వెంటనే గుండె ఆగి మరణించగా.. కేసు విచారణ జరుగుతున్న సమయంలోనే నాగవైష్ణవి తల్లి కన్నుమూశారు. ★ నాగవైష్ణవి హత్య ఘటనపై విచారణ జరిపిన విజయవాడ మహిళా సెషన్స్ కోర్టు.. ముగ్గురు నిందితులకు జీవిత ఖైదు విధిస్తూ 2018 జూన్ 14న తీర్పు ఇచ్చింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ దోషులు హైకోర్టులో వేర్వేరుగా అప్పీళ్లు వేశారు. తాజాగా జరిగిన తుది విచారణలో మూడో నిందితుడు పంది వెంకటరావు తరఫున న్యాయవాది ఎన్.రవిప్రసాద్ వాదనలు వినిపించారు. ఈ హత్యలో వెంకటరావు పాత్ర ఉన్నట్లు సాక్ష్యాలు, ఆధారాలు లేవని వాదించారు. అతనిని నిర్దోషిగా ప్రకటించాలని కోరారు. ఆ వాదనతో ధర్మాసనం ఏకీభవించింది.



పింఛనుదారు సెల్‌ఫోన్ ద్వారా ముఖ ఆధారిత నమోదును పరిశీలిస్తున్న ప్రవేశ్ కుమార్

పింఛనుదారులకు డిజిటల్ సాధికారత

ఇంటి వద్ద నుంచే లైఫ్ సర్టిఫికెట్ల సమర్పణ

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: పింఛనుదారులకు డిజిటల్ సాధికారత కల్పించడం, పింఛను పొందే ప్రక్రియను సులభతరం చేయడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా డిజిటల్ జీవన ప్రమాణ పత్రాన్ని (లైఫ్ సర్టిఫికెట్) విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చిందని కేంద్ర ప్రభుత్వ పింఛను, పింఛనర్ల సంక్షేమ మంత్రిత్వ శాఖ ముఖ్య కార్యదర్శి ప్రవేశ్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం ఆయన గుంటూరు జిల్లా తెనాలిలోని ఎస్‌బీఐ ప్రధాన శాఖ, తపాలా శాఖ కార్యాలయాలను సందర్శించారు. ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న నమోదు శిబిరాల్లో పాల్గొన్నారు. పింఛనుదారులు తమ ఆధార్‌కు అనుసంధానమైన సెల్‌ఫోన్‌లో 'జీవన్ ప్రమాణ్' యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, అందులో ముఖ ఆధారిత విధానంతో జీవన ప్రమాణ పత్రాన్ని సమర్పించవచ్చని చెప్పారు. పలువురు పింఛనర్ల సెల్‌ఫోన్లలో ముఖ ఆధారిత నమోదును ఆయనే స్వయంగా చేసి పరిశీలించారు. ఇంటి నుంచి బయటకు రాలేని వారు ఈ యాప్‌లో సమాచారం నమోదు చేస్తే సిబ్బందే ఇంటికి వచ్చి ప్రక్రియను పూర్తి చేస్తారన్నారు. ఆధార్, యాప్ అనుసంధానం, ఇతర సాంకేతిక అంశాల గురించి ఆధార్ రీజినల్ సెంటర్, హైదరాబాద్ ప్రాజెక్టు మేనేజర్ షేక్ జావేద్ పింఛనర్లకు తెలిపారు. సందేహాలను నివృత్తి చేశారు.



ఆరోగ్యానికి హాని చేసేది ఉప్పు కాదు

మన ఆరోగ్యానికి హాని చేసేది అధిక ఉప్పు వినియోగం కాదు, అధిక సోడియం. ఉప్పు ఆరోగ్యానికి అవసరం. దాన్ని పూర్తిగా త్యజించొద్దు కానీ సముద్రపు ఉప్పు, పింక్ హిమాలయన్ లాంటి సహజ ఉప్పును వాడండి. శుద్ధి చేసిన టేబుల్ ఉప్పును, సోడియం అధికంగా ఉండే సోడా, పిజ్జా, సాసేజ్‌లు, ఉప్పటి స్నాక్స్‌ను దూరం పెట్టండి. – కసెనెన్, న్యూట్రిషనిస్ట్

భక్తుల రద్దీకి తగ్గట్లు ఏర్పాట్లు చేయాలి

ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్



ఈనాడు, అమరావతి: 'కార్తిక మాసం సందర్భంగా ప్రముఖ ఆలయాలకు భక్తుల రద్దీ పెరిగినందున భక్తుల భద్రత, సౌకర్యాలపై యంత్రాంగం దృష్టి సారించాలి. క్యూలైన్లు, పారిశుద్ధ్య నిర్వహణ, భద్రతలపై తగిన చర్యలు చేపట్టాలి' అని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశించారు. సోమవారం కాకినాడ జిల్లా కలెక్టర్, ఎస్పీలతో పాటు వివిధ శాఖల అధికారులకు ఈ మేరకు దిశానిర్దేశం చేశారు. సామర్లకోట కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయం, పిఠాపురం పాదగయ, అన్నవరం రమా వీరవెంకట సత్యనారాయణస్వామి ఆలయంతో పాటు ఇతర ఆలయాల్లో భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుందని గుర్తించాలన్నారు. 'కాశీబుగ్గ ఘటన నేపథ్యంలో అప్రమత్తం కావాలి. ప్రైవేటు వ్యక్తులు, సంస్థల ఆధ్వర్యంలో ఎన్ని ఆలయాలు ఉన్నాయో దేవాదాయశాఖ అధికారులు నివేదిక సిద్ధం చేసి జిల్లా కలెక్టర్, ఎస్పీలకు సమర్పించాలి. ఈ నెల 5న కార్తిక పౌర్ణమి ఉన్నందున ఆ రోజు, తర్వాత రోజు రద్దీని అంచనా వేసుకోవాలి. శని, ఆది, సోమవారాల్లో భక్తుల రద్దీ ఊహించని విధంగా పెరుగుతోంది. క్యూలైన్ల నిర్వహణ పకడ్బందీగా ఉండాలి. సీసీ కెమెరాలతో పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలి' అని పవన్‌కల్యాణ్ సూచించారు.

ఔషధ తయారీకి ఏఐ ఊతం!

- సాంకేతికతతో పనిచేయించే 'ప్యూర్' విధానం ఆవిష్కరణ
- పరిశోధన సమయమూ తగ్గుతుందంటున్న పరిశోధకులు
- ఐఐటీ మద్రాస్, అమెరికా శాస్త్రవేత్తల ఘనత

ఈనాడు, చెన్నై: ఔషధాల కోసం ప్రపంచ దేశాలు ఏళ్ల తరబడి సమయాన్ని వెచ్చిస్తున్నాయి. ఓ మందు తయారు చేయాలంటే ట్రిలియన్ల సంఖ్యలో ఉన్న మాలిక్యూల్‌లపై వేట కొనసాగించాల్సి ఉంటుంది. వాటిలో పనికొచ్చేవి ఏమిటనేది తెలుసుకోవడం ఓ పెద్దపనైతే.. ఆ తెలుసుకున్న వాటిలోనూ ఏవి సమర్థంగా పనిచేస్తున్నాయో గుర్తించడం మరో పెద్దపని. ఈ తరుణంలో. . సరైన పరమాణువులను పట్టుకోవడంలో ఏఐ పాత్ర అత్యంత కీలకంగా మారబోతోందని అంటున్నారు ఐఐటీ మద్రాస్‌లోని వాధ్వానీ స్కూల్ ఆఫ్ డేటా సైన్స్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(డబ్ల్యూఎస్‌ఏఐ), అమెరికాలోని ఒహాయో స్టేట్ యూనివర్సిటీ(ఓఎస్‌యూ)కి చెందిన శాస్త్రవేత్తలు. ఔషధాల రూపకల్పనలో ఏఐని ఎలా ఉపయోగించవచ్చో.. ఓ విధానాన్ని వారు సంయుక్తంగా ప్రతిపాదించారు. దీనిపై డబ్ల్యూఎస్‌ఏఐ శాస్త్రవేత్త ప్రొఫెసర్ కార్తిక్ రామన్ 'ఈనాడు'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఆయన వెల్లడించిన విషయాలివీ..



తొలి మూణ్నాలుగేళ్లలో సమయం ఆదా

ఏఐ ప్రభావవంతంగా పనిచేయడానికి కచ్చితమైన గైడెన్స్ అవసరం. ఇదెలా ఉండాలనే దానిపై డబ్ల్యూఎస్ఏఐ, ఓఎస్‌యూకు చెందిన అభిర్ గుప్తా, భారతి లెనిన్, రోహిత్ బాత్రా, ప్రొఫెసర్ రవీంద్రన్, ప్రొఫెసర్ శ్రీనివాసన్ పార్థసారథి తదితర శాస్త్రవేత్తలు పరిశోధనలు చేశారు. మానవ శరీరంలో ప్రొటీన్లతో కలిసి మెరుగైన ఔషధంగా పనిచేసేవి ఏవో సరైన రీతిలో గుర్తించి పట్టుకునేందుకు ప్రత్యేక ఆల్గోరిథాన్ని తయారు చేశారు. దానికి 'పాలసీ గైడెడ్ అన్‌బయాస్డ్ రిప్రజెంటేషన్స్ ఫర్ స్ట్రక్చర్ కన్‌స్ట్రేయన్డ్ మాలిక్యులర్ జనరేషన్ (ప్యూర్)'గా నామకరణం చేశారు. ఏఐకి పనిచెప్పే ముందు ఇదివరకు పరిశోధనల ద్వారా వెలుగులోకి వచ్చిన ప్రభావవంతమైన పరమాణువుల జాబితాను అందించారు. రీఇన్‌ఫోర్స్‌మెంట్ లెర్నింగ్ (ఆర్ఎల్) టెక్నిక్‌తో పాటు ఇదెలా పనిచేయాలో మార్గం చూపేలా 'ప్యూర్' విధానాన్ని అన్వయించారు. ఈ క్రమంలో కొత్త ఔషధం తయారుచేసేందుకు ఏఐ పాత్ర చాలా కీలకంగా అనిపించింది. కొత్త ఔషధాన్ని కనుగొనేందుకు 10-12 ఏళ్ల సమయం పట్టొచ్చనుకుంటే.. తాజా పరిశోధన ద్వారా తొలి మూణ్నాలుగేళ్లలో పనిని ఏఐ సాయంతో చాలా తగ్గించొచ్చనే విషయమై స్పష్టత వచ్చినట్లయింది. దీనిపై మరిన్ని పరిశోధనలు చేయాల్సి ఉన్నా.. కచ్చితమైన మార్గమైతే దొరికిందని భరోసా ఉంది. క్యాన్సర్, ఇతర అంటువ్యాధులకు ప్రభావవంతంగా పనిచేయగల ఔషధాలను తీసుకురావడంలో ఈ విధానం కీలకపాత్ర పోషించే అవకాశముంది.

మన శరీరంలోని ప్రొటీన్లతో కలిసి ఏ పరమాణువులు ప్రభావవంతంగా పనిచేస్తాయి, అవే ఎందుకు పనిచేస్తాయనేది ప్రయోగశాలలోని కెమిస్టుకు తెలుస్తుంది. కొత్త మందుకు ఇంకేమేం కావాలనేది వారు వెతకాల్సి ఉంటుంది. ఈ పని ఏఐ అవలీలగా చేసేస్తోంది. అదికూడా వేగంగా! ఏది కచ్చితమో దాన్నే సూచిస్తోంది. 'ప్యూర్' ఆల్గోరిథమ్‌ను వాడి ఏ కెమిస్ట్ అయినా వేగంగా పరమాణువులను గుర్తించే ఫలితాల్ని పొందొచ్చు. ఈ నేపథ్యంలో ఔషధ తయారీ, అనుబంధ రంగాల్లో ఏఐ పాత్ర చాలా కీలకంగా ఉండబోతోంది.



స్వామి, అమ్మవార్లకు హారతులు ఇస్తున్న అర్చకులు

ముక్కంటికి కార్తిక హారతి

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: ప్రముఖ శైవ క్షేత్రం శ్రీశైలంలో కార్తిక మాసోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. రెండో కార్తిక సోమవారాన్ని పురస్కరించుకొని ఆలయ పుష్కరిణి వద్ద నిర్వహించిన లక్ష దీపోత్సవం కనుల పండువగా జరిగింది. సాయంత్రం ఆలయ పుష్కరిణి వద్ద దేవస్థానం ఆధ్వర్యంలో కార్తిక దీపాలు వెలిగించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను వేదికపై కొలువుదీర్చారు. అర్చకులు, వేదపండితులు శాస్త్రోక్తంగా స్వామి, అమ్మవార్లకు పూజలు చేసి దశవిధ హారతులు సమర్పించారు. తర్వాత భక్తులు పుష్కరిణి మెట్లపై దీపాలు వెలిగించారు.



పుష్కరిణికి హారతి ఇస్తున్న అర్చకుడు

మద్యం కుంభకోణంలో ఏ-49గా అనిల్ చోఖ్రా

- ముడుపుల సొమ్ము రూటింగ్‌కు డొల్ల కంపెనీలు ఏర్పాటు చేసింది ఆయనే

ఈనాడు, అమరావతి: వైకాపా హయాంలో జరిగిన రూ.వేల కోట్ల మద్యం కుంభకోణం కేసు నిందితుల జాబితాలో మరొకరు చేరారు. ముడుపుల సొమ్ము రూటింగ్, మనీ లాండరింగ్ కోసం పెద్ద ఎత్తున డొల్ల కంపెనీలు ఏర్పాటు చేసిన ముంబయి వాసి అనిల్ చోఖ్రాను 49వ నిందితుడిగా చేరుస్తూ సిట్ అధికారులు తాజాగా విజయవాడ ఏసీబీ కోర్టులో మెమో దాఖలు చేశారు. గత ప్రభుత్వంలో అత్యధికంగా మద్యం సరఫరా ఆర్డర్లు దక్కించుకున్న అదాన్ డిస్టిలరీస్, ఎస్పీవై ఆగ్రో ఇండస్ట్రీస్, లీలా డిస్టిలరీస్ సంస్థలు నాటి ప్రభుత్వ పెద్దలకు ముడుపులుగా చెల్లించాల్సిన మొత్తాల్ని ఓల్విక్ మల్టీ వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఏ11), క్రిపాటి ఎంటర్‌ప్రైజస్ ప్రైవేట్ లిమిటెడ్ (ఏ12), నైస్నా మల్టీవెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఏ13), ట్రిఫెర్ ఎంటర్‌ప్రైజస్ ప్రైవేట్ లిమిటెడ్ (ఏ14), విక్సీ ఎంటర్‌ప్రైజస్ (ఏ15) తదితర డొల్ల కంపెనీల ఖాతాల్లో జమ చేసేవి. అక్కడి నుంచి మరికొన్ని కంపెనీల ద్వారా రెండు, మూడు అంచెల్లో రూటింగ్ జరిగి, చివరిగా ముడుపుల సొమ్ము నగదు రూపంలో వైకాపా ముఠాకు, అంతిమ లబ్ధిదారుకు చేరేది. ఈ అక్రమ దందా కోసం పైన పేర్కొన్న డొల్ల కంపెనీలన్నీ అనిల్ చోఖ్రాయే ఏర్పాటు చేసినట్లు సిట్ గుర్తించింది. రికార్డుల్లో పేర్కొన్న చిరునామాల్లో అలాంటి కంపెనీలేవీ లేవని తేల్చింది. ఈ నేపథ్యంలో మరింత సమాచారం రాబట్టేందుకు మూడు రోజులుగా సిట్ బృందాలు ముంబయిలో సోదాలు చేస్తున్నాయి. అనిల్ చోఖ్రాను ప్రశ్నిస్తున్నాయి. మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద అనిల్ చోఖ్రాపై అనేక కేసులున్నాయి. గతంలో ఆయన్ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అరెస్టు చేసింది. ముంబయి విడిచిపెట్టి వెళ్లకూడదనే షరతుతో తర్వాత బెయిల్ లభించింది.

అమర్‌నాథ్‌గౌడ్‌ను సజీవ దహనం చేసినప్పుడు బీసీలు గుర్తుకురాలేదా?

జోగి రమేష్‌పై మంత్రి కొల్లు రవీంద్ర ధ్వజం

ఈనాడు, అమరావతి: తప్పు చేసి.. కులాలు, మతాలు, బీసీ వర్గాలంటూ జోగి రమేష్ తప్పించుకోవాలని చూడటం సిగ్గుచేటని మంత్రి కొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు. వైకాపా ప్రభుత్వంలో ఎందరో బీసీ నేతలు, నాయకులపై తప్పుడు కేసులు బనాయించి, అరెస్టులు చేసినప్పుడు కులం గుర్తుకు రాలేదా అని నిలదీశారు. మాచర్ల నియోజకవర్గంలో తోట చంద్రయ్యను నడిరోడ్డుపై చంపినప్పుడు, రేపల్లె నియోజకవర్గంలో అమర్‌నాథ్‌గౌడ్ అనే బాలుడిని సజీవ దహనం చేసినప్పుడు బీసీ సామాజిక వర్గాన్ని మర్చిపోయారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తనపైనా తప్పుడు కేసులు బనాయించారని గుర్తుచేశారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 'అన్ని ఆధారాలూ పరిశీలించాకే సిట్ అధికారులు జోగి రమేష్‌ను, ఆయన సోదరుడు రామును అరెస్టు చేశారు' అని రవీంద్ర పేర్కొన్నారు.

పెన్నా లీజుల్లో శ్రీలక్ష్మి అధికార దుర్వినియోగం

- నిబంధనలకు విరుద్ధంగా జీవోల జారీ
- ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించే తీవ్ర ఆర్థిక నేరంలో ఆమె పాత్ర
- హైకోర్టుకు నివేదించిన సీబీఐ

ఈనాడు, హైదరాబాద్: జగన్ అక్రమాస్తుల వ్యవహారంలో భాగంగా వైఎస్ రాజశేఖరరెడ్డి సన్నిహితుడైన ప్రతాప్‌రెడ్డికి చెందిన పెన్నా సిమెంట్స్‌కు లీజుల మంజూరులో పరిశ్రమల శాఖ అప్పటి కార్యదర్శి వై. శ్రీలక్ష్మి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారంటూ సీబీఐ సోమవారం హైకోర్టుకు నివేదించింది. ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించే తీవ్రమైన ఆర్థిక నేరంలో శ్రీలక్ష్మి పాత్ర ఉందని తెలిపింది. నిబంధనలను తుంగలో తొక్కి పెన్నా సిమెంట్స్‌కు లీజులు మంజూరు చేస్తూ జీవోలు ఇచ్చారని తెలిపింది. పెన్నా సిమెంట్స్ కేసులో తనపై సీబీఐ నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ శ్రీలక్ష్మి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్ సోమవారం విచారణ చేపట్టారు. సీబీఐ ప్రత్యేక న్యాయవాది శ్రీనివాస్ కపాటియా వాదనలు వినిపిస్తూ పెన్నా ప్రతాప్‌రెడ్డికి చెందిన పెన్నా సిమెంట్స్‌కు అనంతరపురం జిల్లా యాడికిలో 231 ఎకరాల భూ కేటాయింపు, కర్నూలు జిల్లా ప్యాపిలి మండలం కౌలపల్లిలో 304.70 హెక్టార్లలో ప్రాస్పెక్టింగ్ లీజు, రంగారెడ్డి జిల్లా తాండూరులో 822.13 ఎకరాల్లో లీజు రెన్యువల్‌తోపాటు హైదరాబాద్‌లో పయనీర్ హోటళ్ల నిర్మాణాలకు రాయితీల కల్పనలో నిబంధనల ఉల్లంఘన జరిగిందన్నారు. దీనికి సహకరించినందుకు వైఎస్సార్ కుమారుడైన జగన్‌మోహన్‌రెడ్డికి చెందిన కంపెనీల్లో ప్రతాప్‌రెడ్డి రూ.68 కోట్లు పెట్టుబడులు పెట్టినట్లు సీబీఐ కేసు నమోదు చేసిందన్నారు. కర్నూలు జిల్లాలో అల్ట్రాటెక్ సిమెంట్స్ దరఖాస్తు ఉండగా దాన్ని నిబంధనలకు విరుద్ధంగా తిరస్కరించి పెన్నాకు కేటాయించడంలో శ్రీలక్ష్మి కీలకపాత్ర పోషించారన్నారు. తాండూరులో లీజుల రెన్యువల్స్‌లో కూడా నిబంధనల ఉల్లంఘన జరిగిందన్నారు. వాల్‌చంద్ తాండూర్ సిమెంట్ పేరును పెన్నా తాండూరు సిమెంట్‌గా మార్చడంలోనూ నిబంధనలు ఉల్లంఘించారని, ఇవేవీ శ్రీలక్ష్మి పట్టించుకోలేదన్నారు. పర్యావరణ, మైనింగ్ ప్లాన్‌లు సమర్పించకముందే మైనింగ్‌కు అనుమతించారని చెప్పారు.

పిటిషన్ విచారణార్హం కాదు

కేసును కొట్టివేయాలంటూ శ్రీలక్ష్మి దాఖలు చేసిన పిటిషన్ విచారణార్హం కాదని సీబీఐ న్యాయవాది పేర్కొన్నారు. 'కేసును కొట్టివేయాలంటూ శ్రీలక్ష్మి గతంలో దాఖలు చేసిన పిటిషన్‌ను 2022లో ఉపసంహరించుకున్నారు. దీనికి కారణాలు ఆమెకే తెలియాలి. ఉపసంహరించుకున్న 9 నెలల తరువాత మళ్లీ పిటిషన్ వేయడం చెల్లదు. ఇది విచారణార్హం కాదు. అంతేగాకుండా సీబీఐ కోర్టులో కూడా డిశ్చార్జి పిటిషన్ దాఖలు చేశారు. అక్కడ రోజువారీ విచారణ జరుగుతోంది' అని కోర్టుకు తెలిపారు.

ఉనికిలో లేని సెక్షన్లు పెట్టారు

అవినీతి నిరోధక చట్టం కింద సెక్షన్ 13(1)(డి), 13(2) కింద ప్రభుత్వం 2022లో ప్రాసిక్యూషన్‌కు అనుమతించే సమయానికి ఆ సెక్షన్ల ఉనికే లేదని శ్రీలక్ష్మి తరఫు న్యాయవాది వాదించారు. ఉనికిలో లేని సెక్షన్ల కింద అనుమతులు చెల్లవన్నారు. సీబీఐ తరఫు న్యాయవాది అభ్యంతరం వ్యక్తం చేస్తూ అవినీతి నిరోధక చట్టానికి 2018లో సవరణ జరిగిందని, అంతకుముందే సీబీఐ 2016లో అభియోగపత్రం దాఖలు చేసిందని చెప్పారు. అందువల్ల నేరం జరిగిన సమయం ఆధారంగా అనుమతి మంజూరు చేసిందని, దీనికి సంబంధించి పలు సుప్రీంకోర్టు తీర్పులున్నాయన్నారు. పిటిషనర్ ప్రభుత్వం ప్రాసిక్యూషన్‌కు అనుమతిస్తూ జారీ చేసిన ప్రొసీడింగ్స్‌ను సవాలు చేయలేదన్నారు. వీటన్నింటినీ కింది కోర్టు విచారణలో తేల్చుకోవాల్సి ఉందని చెప్పారు. వాదనలు విన్న న్యాయమూర్తి రాతపూర్వక వాదనలను క్లుప్తంగా సమర్పించాలని ఆదేశిస్తూ విచారణను ఈ నెల 17కి వాయిదా వేశారు.



ఆలయం ఎదుట జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప కుటుంబం

శ్రీవారి సేవలో జస్టిస్ వెంకట జ్యోతిర్మయి

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప సోమవారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో కుటుంబసభ్యులతో కలిసి శ్రీవారి ఆలయం వద్దకు చేరుకున్న న్యాయమూర్తికి తితిదే అధికారులు స్వాగతం పలికి శ్రీవారి మూలమూర్తి దర్శనం చేయించారు. అనంతరం రంగనాయకుల మండపంలో అర్చకులు వేదాశీర్వచనం, అధికారులు తీర్థప్రసాదాలు అందించారు.

సమగ్ర నేత్ర ఆరోగ్య పరిరక్షణే ధ్యేయం

- ఎల్వీపీఈఐ ఛైర్మన్ జి.ఎన్.రావు
- సత్యసాయి జిల్లాలో ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి ప్రారంభం



విలేకర్లతో మాట్లాడుతున్న ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి ఛైర్మన్ జి.ఎన్.రావు. చిత్రంలో మాజీ మంత్రి రఘువీరారెడ్డి, మాజీ ఎంపీ కేవీపీ రామచంద్రరావు తదితరులు

మడకశిర గ్రామీణం, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లా నీలకంఠాపురం ఎల్వీ ప్రసాద్ కంటి వైద్యశాల పరిధిలో ఆంధ్ర, కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లో 5 లక్షల మందికి ఐదేళ్లలో అంధత్వ నివారణే లక్ష్యంగా పనిచేస్తామని ఎల్వీపీఈఐ ఛైర్మన్ జి.ఎన్.రావు అన్నారు. నీలకంఠాపురంలో మాజీ మంత్రి ఎన్.రఘువీరారెడ్డి విరాళంగా ఇచ్చిన 2 ఎకరాల భూమిలో రూ.6 కోట్లతో నిర్మించిన ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రిని సోమవారం ప్రారంభించారు. కార్యక్రమానికి ఎల్వీపీఈఐ ఛైర్మన్‌తోపాటు వైస్‌ఛైర్మన్ డాక్టర్ తారప్రసాద్, రోహిత్ ఖన్నా, పావగడ జపానందస్వామి, మాజీ ఎంపీ కేవీపీ రామచంద్రరావు, మాజీ పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, సీడబ్ల్యూసీ సభ్యుడు కొప్పులరాజు, మాజీ మంత్రి ఎన్.రఘువీరారెడ్డి, మాజీ కేంద్ర మంత్రి జేడీ శీలం హాజరయ్యారు. అనంతరం విలేకరులతో జి.ఎన్.రావు మాట్లాడుతూ కంటి సమస్యతో బాధపడుతూ ఏ ఒక్కరూ మారుమూల ప్రాంతం నుంచి వైద్యం కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా స్థానికంగానే చికిత్సలు చేయించుకునేలా ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రిని నిర్మించినట్లు తెలిపారు. ఇక్కడే 80 శాతం కంటి సమస్యల పరిష్కరించనున్నట్లు తెలిపారు. అత్యంత క్లిష్టతరమైతే హైదరాబాద్‌లోని కంటి వైద్యనిపుణులను సంప్రదించి చికిత్స అందిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు కె.సుధాకర్, డాక్టర్ తిప్పేస్వామి, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

ఆదరణ-3 కు రూ.1,000 కోట్లు

త్వరలో పథకం అమలు • బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత

ఈనాడు, అమరావతి: ఆదరణ-3 పథకం అమలుకు ప్రభుత్వం రూ.1,000 కోట్లు కేటాయించినట్లు బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. చేతి, కుల వృత్తిదారులకు ఆధునిక పరికరాలు అందించి ఆర్థిక భరోసా కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. గొల్లపూడిలోని బీసీ భవన్‌లో సోమవారం వివిధ బీసీ కుల కార్పొరేషన్ల ఛైర్మన్లు, డైరెక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఆదరణ-3, ఇతర పథకాల అమలుపై సలహాలు, సూచనలు తీసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 'బీసీ పథకాలను కార్పొరేషన్ ఛైర్మన్ల ఆధ్వర్యంలోనే కొనసాగిస్తాం. మూడు రోజులపాటు ఛైర్మన్లతో వర్క్‌షాపు కొనసాగుతుంది. అందరి అభిప్రాయాలు తీసుకున్న తర్వాతే ఆదరణ-3ను అమల్లోకి తీసుకువస్తాం' అని తెలిపారు.

సరస్వతిలో వాటాల బదలాయింపుపై మధ్యంతర ఉత్తర్వుల పొడిగింపు

విచారణ డిసెంబరు 12కు వాయిదా వేసిన ఎన్‌సీఎల్ఏటీ

ఈనాడు, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, భారతిరెడ్డి, క్లాసిక్ రియాల్టీలకు చెందిన వాటాలను వై.ఎస్.విజయమ్మ, చాగరి జనార్దన్‌రెడ్డిల పేరుతో బదలాయింపుపై యథాతథస్థితిని కొనసాగించాలంటూ చెన్నైలోని జాతీయ కంపెనీ లా అప్పిలేట్ ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్ఏటీ) గత నెల 14న జారీచేసిన మధ్యంతర ఉత్తర్వులను సోమవారం మరోసారి పొడిగించింది. ఈ మేరకు డిసెంబరు 12 వరకు మధ్యంతర ఉత్తర్వులను పొడిగించింది. ఆ ఉత్తర్వుల ప్రకారం జగన్, భారతిరెడ్డి, క్లాసిక్ రియాల్టీల వాటాల బదలాయింపు తరువాత విజయమ్మకు చెందిన 99.75 శాతం వాటా యథాతథంగా కొనసాగనుంది. విజయమ్మ, జనార్దన్‌రెడ్డిల పేరుతో వాటాలను బదలాయిస్తూ సరస్వతి పవర్ బోర్డు తీర్మానాన్ని, దాని ప్రకారం రిజిస్టర్‌లో సభ్యుల పేర్లను మార్చడాన్ని సవాలు చేస్తూ జగన్, భారతిరెడ్డి, క్లాసిక్ రియాల్టీలు హైదరాబాద్ ఎన్‌సీఎల్‌టీలో పిటిషన్ దాఖలు చేయగా వాటాల బదలాయింపును రద్దు చేస్తూ జగన్, భారతి, క్లాసిక్ రియాల్టీల పేర్లను పునరుద్ధరించాలంటూ జులై 29న తీర్పు వెలువరించిన విషయం విదితమే. హైదరాబాద్ ఎన్‌సీఎల్‌టీ ఇచ్చిన తీర్పు చట్టవిరుద్ధమని, దాని అమలును నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ చెన్నై ఎన్‌సీఎల్ఏటీలో సరస్వతి పవర్ లిమిటెడ్, విజయమ్మలు వేర్వేరుగా అప్పీళ్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లు మరోసారి ఎన్‌సీఎల్ఏటీ ముందుకు సోమవారం విచారణకు రాగా కోర్టు సమయం ముగిసిపోవడంతో మధ్యంతర ఉత్తర్వులను పొడిగిస్తూ విచారణను డిసెంబరు 12కు వాయిదా వేసింది. విజయమ్మ తరఫున న్యాయవాది మహర్షి విశ్వరాజ్ హాజరయ్యారు.

భక్తుల భద్రతపై మార్గదర్శకాల జారీ

- ఈవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన దేవాదాయశాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్

ఈనాడు, అమరావతి, అన్నవరం, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని ఆలయాల్లో భక్తుల భద్రతపై ప్రభుత్వం దృష్టిసారించింది. తిరుపతి, సింహాచలం, తాజాగా కాశీబుగ్గ ఘటనల నేపథ్యంలో ప్రత్యేక భద్రతా చర్యలు చేపడుతున్నారు. కార్తికమాసం, ఇతర ముఖ్య పర్వదినాల్లో భక్తుల రద్దీ నియంత్రణ, భద్రతా చర్యలు, అవగాహన కల్పించడంపై దేవాదాయశాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ ప్రధాన ఆలయాల ఈవోలతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమగ్ర మార్గదర్శకాలు జారీ చేశారు.

■ దర్శనానికి నిర్దేశించిన క్యూలైన్లలో మాత్రమే వెళ్లాలి. దర్శన సమయాల్లో, ప్రాంగణంలో క్రమశిక్షణతో మెలగాలి. సిబ్బంది సూచనలు పాటించాలి. రద్దీ సమయంలో దర్శనానికి సహనంతో వేచి ఉండాలి. వృద్ధులు, పిల్లలు, మహిళలు ముందుగా వెళ్లేలా సహకరించాలి.

చేయకూడనివి..

క్యూలైన్లలో నిర్దేశించిన మార్గంలోనే వెళ్లాలి. వ్యతిరేక దిశలో ప్రవేశించకూడదు. పరుగులు తీయడం, తోయడం చేయకూడదు. ముందున్న భక్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ నెట్టకూడదు. రెయిలింగ్‌లు, బారికేడ్లపై బరువును ఆన్చి నిలుచోకూడదు. పెద్ద గుంపులుగా గుమిగూడకూడదు. మైక్‌లో వచ్చే ప్రకటనలను నిర్లక్ష్యం చేయకూడదు.



అన్నవరం ఆలయంలో క్యూలైన్

సిబ్బంది సూచనలకు విరుద్ధంగా ప్రవర్తించొద్దు.

అధికారులు, సిబ్బంది ఇలా..

భక్తులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలి. ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు స్పష్టంగా గుర్తించేలా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి. క్యూలైన్లలో వ్యతిరేక దిశలో ఎవరూ ప్రవేశించకుండా, బారికేడ్లు, రెయిలింగ్‌లు పటిష్ఠంగా ఉండేలా చూడాలి. రద్దీ సమయాల్లో అదనపు సిబ్బంది, పోలీసు, గార్డులతో రోప్ పార్టీ ఏర్పాటు చేసుకోవాలి. భద్రతాసిబ్బంది, స్వచ్ఛంద సేవకులు, వైద్య బృందాలను అందుబాటులో ఉంచాలి. అత్యవసర పరిస్థితుల కోసం ఫస్ట్ ఎయిడ్, అంబులెన్స్‌లు, కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలి. రద్దీ నియంత్రణకు అవసరాన్ని బట్టి డ్రోన్ కెమెరాలను వినియోగించుకోవచ్చు. క్యూలైన్లు, బారికేడ్ల మార్గాల్లో సిబ్బందిని మార్చరాదు. అత్యవసర మార్గాలు, నిష్క్రమణలను అడ్డుకోవద్దు. ఏదైనా ఘటన సంభవించిన సందర్భంలో తక్షణ చర్యలు తీసుకోవాలి.

మా పార్టీ ఇచ్చిన స్క్రిప్టే చదివాను

- వాస్తవంగా ఏం జరిగిందో తెలియదు
- వైకాపా అధికార ప్రతినిధి శ్యామల

ఈనాడు, కర్నూలు, కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: కర్నూలు బస్సు ప్రమాద దుర్ఘటనకు అసలు కారణాలు తనకు తెలియవని.. వైకాపా ప్రతినిధులు ఇచ్చిన స్క్రిప్టే చదివానని ఆ పార్టీ అధికార ప్రతినిధి శ్యామల తేల్చిచెప్పారు. బస్సు ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారన్న కారణంతో కర్నూలు తాలూకా అర్బన్ పోలీసుస్టేషన్లో 27 మందిపై గతనెల 30న కేసు నమోదైన విషయం తెలిసిందే. వారిలో పలువురికి నోటీసులు పంపగా వైకాపా అధికార ప్రతినిధులు ఆరే శ్యామల, కారుమూరి వెంకటరెడ్డి, రాయలసీమ యునైటెడ్ ఫోర్స్ ప్రతినిధి టి.నాగార్జునరెడ్డి, వైకాపా అభిమాని నవీన్, సీవీ రెడ్డిలను పోలీసులు సోమవారం విచారించారు. శ్యామలను గంటన్నరపాటు విచారించారు. ప్రమాదానికి ముందు శివశంకర్, అతడి మిత్రుడు ఎర్రిస్వామిలు బెల్టు దుకాణంలోని మద్యం తాగారని ఎవరు చెప్పారు? దానికి తగిన ఆధారాలున్నాయా.. ఉంటే చూపాలంటూ పలు ప్రశ్నలు అడిగేసరికి ఆమె నీళ్లు నమిలారు. కర్నూలు డీఎస్పీ బాబూప్రసాద్ ఆధ్వర్యంలో పలువురు సీఐలు, మహిళా ఎస్సై సమక్షంలో ఆమెను ప్రశ్నించారు. అవాస్తవాలు ఎందుకు ప్రచారం చేశారని అడగ్గా.. వైకాపా అధికార ప్రతినిధి కావడంతో వారిచ్చిన స్క్రిప్టు ఆధారంగానే పార్టీ ఆదేశాల మేరకు చదివానని వెల్లడించినట్లు తెలిసింది.



కర్నూలు డీఎస్పీ కార్యాలయంలోకి వెళ్తున్న శ్యామల

బయటకు వచ్చి మరోలా వ్యాఖ్యలు

విచారణ అనంతరం బయటకు వచ్చిన శ్యామల మీడియాతో మాట్లాడుతూ.. నాడు తాడేపల్లి వైకాపా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో తాను వైకాపా అధికార ప్రతినిధిగా పది ప్రశ్నలు అడిగానని, వాటిలో తప్పేముందని ప్రశ్నించారు. ఆ ప్రశ్నలకు తెదేపా నాయకులు సమాధానం చెప్పకుండా కేసులు పెట్టడమేంటన్నారు. ఎన్ని కేసులు పెట్టినా, విచారణల పేరుతో ఎన్నిసార్లు తిప్పినా పోరాటం ఆపనని చెప్పారు. అయితే, పోలీసు విచారణ నిమిత్తం శ్యామల, కారుమూరి వెంకటరెడ్డి తదితరులు కర్నూలు డీఎస్పీ కార్యాలయానికి రాగా, మాజీ ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఎస్వీ మోహన్‌రెడ్డి, పలువురు వైకాపా కార్యకర్తలు వారివెంట వచ్చి హడావుడి చేశారు. చలో కర్నూలు పేరుతో వైకాపా కార్యకర్తలతో కలిసి రావడంతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి.

వేద పాఠశాల నిర్మాణానికి... 2 ఎకరాల భూమి.. 2 కోట్ల నగదు

ఆదాయ పన్ను శాఖ విశ్రాంత చీఫ్ కమిషనర్ విరాళం



శంకుస్థాపన కార్యక్రమంలో దాతలు వెంకటరామయ్య, జయలక్ష్మి దంపతులు


పాలకోడేరు, న్యూస్‌టుడే: పశ్చిమగోదావరి జిల్లా పాలకోడేరు మండలం పెన్నాడ అగ్రహారంలో కంచి కామకోటి పీఠం ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న వేద పాఠశాల నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. రూ.5 కోట్లతో చేపట్టే ఈ బృహత్తర కార్యక్రమానికి భీమవరానికి చెందిన వృద్ధ దంపతులు రాయసం వెంకటరామయ్య, జయలక్ష్మి భూరి విరాళం ఇచ్చారు. పెన్నాడ అగ్రహారం రైల్వే స్టేషన్ సమీపంలో రూ.3 కోట్ల విలువైన రెండెకరాల భూమి, రూ.2 కోట్లను వారు అందించారు. కేంద్ర ఆదాయపు పన్ను శాఖలో చీఫ్ కమిషనర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన వెంకటరామయ్య హైదరాబాద్‌లో స్థిరపడ్డారు.

మద్యం కుంభకోణం కేసులో బెయిలివ్వండి

హైకోర్టులో కెసిరెడ్డి పిటిషన్ దాఖలు

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణం కేసులో తనకు బెయిలు మంజూరు చేయాలని కోరుతూ ప్రధాన నిందితుడు కెసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి హైకోర్టులో సోమవారం పిటిషన్ వేశారు. 'మద్యం విధాన నిర్ణయంతో నాకు సంబంధం లేదు. మద్యం కేసులో సీఐడీ ఇప్పటికే అభియోగపత్రాలు వేసింది. ఇదే కేసులో పలువురు నిందితులకు బెయిలు లభించింది. నాకూ బెయిలివ్వాలి' అని అందులో కోరారు.

అంబరాన్ని అంటిన సంబరాలు



నవీ ముంబయి: దక్షిణాఫ్రికాపై అద్భుత విజయంతో వన్డే ప్రపంచకప్ అందుకున్న భారత్.. ఆదివారం రాత్రంతా సంబరాలు చేసుకుంది. "మువ్వన్నెల జెండా.. ఉవ్వెత్తున ఎగిరింది. మన టీమ్‌ఇండియా.. మన టీమ్‌ఇండియా' అనే థీమ్ సాంగ్‌తో స్టేడియం మార్మోగింది. జట్టు సభ్యులు, సహాయక సిబ్బంది, క్రీడాకారుల కుటుంబ సభ్యులు ఈ పాటను పాడుతూ విజయాన్ని ఆస్వాదించారు. నృత్యాలు చేస్తూ సంబరాలు చేసుకున్నారు. మ్యాచ్ ముగిసిన తర్వాత చాలా గంటల పాటు భారత జట్టు మైదానంలోనే గడిపింది. కప్పుతో వారి సంబరాలు అంబరాన్నంటాయి. అంతకుముందు ఫైనల్లో ఓడి తీవ్ర నిరాశలో ఉన్న దక్షిణాఫ్రికా ప్లేయర్లను భారత అమ్మాయిలు ఓదార్చారు. హోటల్‌కు వెళ్లేముందు స్టేడియం బయట భారీగా ఉన్న అభిమానులతో భారత అమ్మాయిలు ఫొటోలు దిగారు. హోటల్‌కు వెళ్లాక ప్రపంచకప్‌తో నిద్రిస్తున్నట్లుగా హర్మన్‌ప్రీత్, స్మృతి, జెమీమా ఫొటోలు తీసుకున్నారు.

పాపం.. ప్రతీక



ప్రతీక రావల్ ఈ ప్రపంచకప్‌లో భారత్ తరఫున రెండో అత్యధిక స్కోరర్. టోర్నీలో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్ల జాబితాలో నాలుగో స్థానంలో ఉంది. ఆరు ఇన్నింగ్స్‌ల్లో 51.33 సగటుతో 308 పరుగులు చేసింది. భారత జట్టు కప్పు గెలవడంలో తన వంతు పాత్ర పోషించింది. కానీ ప్రతీకకు విజేతలకు ఇచ్చే పతకం దక్కలేదు. గాయం కారణంగా ఆఖర్లో ఆమె టోర్నీకి దూరం కావడమే అందుకు కారణం. ఆమె స్థానంలో సెమీఫైనల్, ఫైనల్ కోసం షెఫాలి వర్మ జట్టులోకి వచ్చింది. ఐసీసీ నిబంధనల ప్రకారం 15 మంది సభ్యుల జట్టుకు పతకాలు ఇస్తారు. దీంతో ప్రతీక పతకం అందుకోలేకపోయింది. షెఫాలికి మాత్రం పతకం దక్కింది. ఫైనల్ అనంతరం ప్రతీక.. వీల్‌ఛైర్లో కూర్చునే సహచర ప్లేయర్లతో కలిసి సంబరాల్లో పాల్గొంది.

దిగ్గజాల చేతిలో కలల కప్పు



ప్రపంచ కప్ ట్రోఫీతో జులన్ గోస్వామి, మిథాలి రాజ్

ఛాంపియన్స్

నెల కిందట మహిళల వన్డే ప్రపంచకప్ ఆరంభమవుతున్నపుడు.. ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, దక్షిణాఫ్రికా లాంటి మేటి జట్లను వెనక్కి నెట్టి భారత మహిళల జట్టు విజేతగా నిలవగలదని అనుకున్నామా? ఆరంభ దశలో భారత జట్టు కూడా అలా అనుకుందో లేదో? కానీ టోర్నీ మధ్యలో జట్టు దృక్పథమే మారిపోయింది. మనం గెలవగలమని బలంగా నమ్మి, అసాధ్యాన్ని సుసాధ్యం చేసి.. ప్రపంచకప్ కలను నెరవేర్చుకుంది భారత బృందం. కప్పు గెలిచే క్రమంలో మన అమ్మాయిల ఆట చూసి క్రికెట్ ప్రపంచమే ఆశ్చర్యపోయింది. మరి ఉన్నట్లుండి జట్టులో అంత కసి ఎలా వచ్చింది? జట్టుకు అంతగా ప్రేరణనిచ్చిన విషయం మేంటి? వారి ఆత్మవిశ్వాసాన్ని పెంచిందేంటి?



షెఫాలి

"ఐసీసీ మహిళల వన్డే ప్రపంచకప్ గెలిచినందుకు భారత జట్టులోని ప్రతి సభ్యురాలికి నా అభినందనలు. తొలిసారి కప్పు నెగ్గడం ద్వారా వాళ్లు చరిత్ర సృష్టించారు. ఈ గొప్ప విజయం మహిళల క్రికెట్లో ఇంకా అత్యుత్తమ ప్రదర్శనలకు దారితీస్తుంది"
– రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

"మన క్రికెట్ జట్టు విజయానికి భారతదేశమంతా ఎంతో సంతోషిస్తోంది. భారతీయ ఇది తొలి మహిళల ప్రపంచ కప్. మహిళల క్రికెట్ జట్టుకు నా అభినందనలు. మీ విజయం దేశంలో కోట్లది యువతకు ప్రేరణనిస్తుంది"
– ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

క్రికెట్ అందరిదీ..



ప్రపంచకప్ గెలిచిన భారత జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్.. ఓ బలమైన సందేశాన్ని ఇచ్చింది. క్రికెట్ కేవలం పురుషులదే కాదని, ఆట అందరిదని చెప్పింది. "క్రికెట్ ఈజ్ ఎ జెంటిల్‌మన్స్ ఎవ్రీవన్స్ గేమ్" అని రాసి.. 'జెంటిల్‌మన్స్' అనే పదాన్ని కొట్టేసి ఉన్న టీషర్టును హర్మన్ ధరించింది. ఆ చిత్రాన్ని ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకుంది.

"ఇది ఆరంభం మాత్రమే. మేం అడ్డంకిని అధిగమించాలనుకున్నాం. ఇకపై విజయాన్ని అలవాటుగా మార్చుకోవాల్సింది మా ప్రణాళిక. మేం ఎదురుచూసిన క్షణం వచ్చింది. ముందు ముందు ఇలాంటి సందర్భాలు చాలా వస్తాయి. మేం మెరుగుపడుతూనే ఉండాలనుకుంటున్నాం. ఇది అంతం కాదు.. ఆరంభం"
– హర్మన్‌ప్రీత్

మేటి క్రికెటర్లందరూ గొప్ప కెప్టెన్లు అవుతారనే గ్యారంటీ లేదు. అందుకు చరిత్రలో ఎన్నో ఉదాహరణలు కనిపిస్తాయి. కానీ కొందరిని చూస్తే సహజ నాయకుల్లా కనిపిస్తారు. వాళ్లు జట్టును ముందుండి నడిపిస్తారు. ఉన్న అందరిలో స్ఫూర్తి నింపుతారు. ఒక ప్రణాళిక ప్రకారం జట్టును నిర్మిస్తారు. అవసరమైనపుడు కఠిన నిర్ణయాలూ తీసుకుంటారు. మహిళల క్రికెట్లో ఈ లక్షణాలన్నీ ఉన్న అమ్మాయే హర్మన్‌ప్రీత్ కౌర్. ప్రపంచకప్ గెలిచిన బృందం ఆమె నిర్మించిన జట్టు. సారథిగా ఎన్నో ఏళ్ల తన కృషి ఫలితమే.. ఈ గెలుపు.



హర్మన్‌ప్రీత్

కసి రేగెను కథ మారెను

ఫోర్త్ అంపైర్

మహిళల విజయం గురించి మాట్లాడుకునే ముందు పాతికేళ్లు వెనక్కి వెళ్దాం. అప్పటికి పురుషుల క్రికెట్లో భారత్ సాధారణ జట్టే. ఇప్పుడంటే పాకిస్థాన్‌పై మన జట్టు అలవోకగా గెలిచేస్తోంది కానీ.. అప్పట్లో ఆ జట్టు చేతిలో తరచుగా ఓడిపోయేది. ఆస్ట్రేలియా ముందైతే అస్సలు నిలవలేకపోయేది. టెస్టు మ్యాచ్‌ను డ్రా చేసుకోవడమే లక్ష్యంగా ఆడేది భారత్. ఆస్ట్రేలియాతో మ్యాచ్ అంటే అస్సలు విజయం గురించి ఆలోచించే పరిస్థితే ఉండేది కాదు. కానీ 2001 ఈడెన్ గార్డెన్స్ టెస్టుతో మొత్తం మారిపోయింది. లక్ష్మణ్ చరిత్రాత్మక ఇన్నింగ్స్ (281) సాయంతో ఫాలోఆన్ ఆడుతూ కూడా గొప్పగా పుంజుకుని ఆస్ట్రేలియాను భారత్ ఓడించడం ప్రపంచ క్రికెట్లో ఒక పెను సంచలనం. అది భారత క్రికెట్ చరిత్రనే మార్చేసిన విజయం. గెలవగలం అనే ధీమా ఫలితాన్నే మార్చేస్తుందనడానికి ఇది ఉదాహరణ. మైదానంలో లక్ష్మణ్ పోరాటం.. భారత జట్టు దృక్పథాన్నే మార్చేసింది. డ్రా కోసం ఆడడం పాత కథగా మారింది. గంగూలీ రూపంలో జట్టుకు దూకుడైన నాయకుడు రావడం కూడా కలిసొచ్చి విజయం కోసమే ఆడడం జట్టుకు అలవాటైంది. ఎలాంటి ప్రత్యర్థి అయినా బెదురు లేకుండా ఎదుర్కోవడం జట్టు శైలిగా మారింది. ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ పర్యటనలంటే ముందే జావగారిపోయే జట్టు.. సై అంటే సై అంటూ ఢీకొట్టడం మొదలైంది. వివిధ ఫార్మాట్లలో నిలకడగా విజయాలు సాధిస్తూ సాగిన భారత్.. 18 ఏళ్ల వ్యవధిలో రెండు టీ20 ప్రపంచకప్‌లు, ఒక వన్డే ప్రపంచకప్, రెండు ఛాంపియన్స్ ట్రోఫీలను సాధించి.. ఇప్పుడు ప్రపంచ మేటి జట్లలో ఒకటిగా కొనసాగుతోంది.

ఇప్పుడు మహిళల జట్టు విషయానికి వద్దాం. ప్రపంచకప్ ఆరంభానికి ముందు జట్టుపై పెద్దగా అంచనాలు లేవు. ఈ ఏడాది ప్రదర్శన మెరుగ్గా ఉన్నా.. ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్‌లను దాటి కప్పు గెలవడం చాలా కష్టమనే అంచనా వేశారు క్రికెట్ పండితులు. బలహీన శ్రీలంక, పాకిస్థాన్‌లపై విజయాలతో టోర్నీని ఆరంభించినా.. తర్వాత బలమైన జట్లయిన దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్‌ల చేతుల్లో ఓడిపోవడంతో ఈ అంచనానే నిజమవుతుందనిపించింది. అయితే సెమీస్ బెర్తు ప్రమాదంలో పడ్డ స్థితిలో జట్టు బలంగా పుంజుకుంది. అప్పటిదాకా పెద్దగా రాణించని స్మృతి మంధాన మెరుపు శతకం సాధించింది. ముందు మ్యాచ్‌కు తుది జట్టులో లేని జెమీమా రోడ్రిగ్స్.. ఈ మ్యాచ్‌కు తిరిగి జట్టులోకి వచ్చి కసిగా ఆడి అర్ధశతకం సాధించింది. ఈ మ్యాచ్‌లో ఘనవిజయంతో జట్టు ఆత్మవిశ్వాసం పెరిగింది. అయినా సరే ఆస్ట్రేలియాపై సెమీస్ అనగానే ఫైనల్ చేరడం కష్టమనే అభిప్రాయం విస్తృతంగా వినిపించింది. కానీ మిగతా జట్లకు అందనంత ఎత్తులో నిలిచే ఆస్ట్రేలియాపై 339 పరుగుల లక్ష్యాన్ని ఛేదించి హర్మన్‌సేన ప్రపంచ రికార్డు నెలకొల్పడం అసామాన్యమైన విషయం. ఈ మ్యాచ్‌లో జెమీమా చూపించిన దృఢచిత్తం అమోఘం. లీగ్ దశ ఆరంభంలో ఫామ్ లేమి, ఒక మ్యాచ్‌పై వేటు పడడం ఆమె మీద గట్టి ప్రభావమే చూపించాయి. అందుకామె కుంగిపోకుండా, కసితో ఆడింది.

తుది పోరులోనూ అమ్మాయిల ఆట స్ఫూర్తిదాయకం. టాస్ ఓడినా ఆందోళన చెందలేదు. అనుకోకుండా జట్టులోకి వచ్చిన షెఫాలి కీలక భాగస్వామ్యాలతో జట్టుకు బలమైన పునాది వేసింది. తర్వాత దీప్తి కీలక ఇన్నింగ్స్ ఆడింది. బౌలింగ్‌లో భారత అమ్మాయిలు సమష్టిగా కదిలారు. దీప్తితో పాటు కడప అమ్మాయి శ్రీ చరణి ఒత్తిడిలో గొప్పగా బౌలింగ్ చేసింది. చరణి రూపంలో భారత్‌కు ఒక తెలివైన స్పిన్నర్ దొరికింది. మిగతా అందరి బౌలింగ్‌లో ధాటిగా ఆడిన దక్షిణాఫ్రికా కెప్టెన్ లారా.. చరణిని మాత్రం ఆచితూచి ఆడడం తన ప్రతిభకు నిదర్శనం. ఫైనల్లో ఓ భాగస్వామ్యం ప్రమాదకరంగా మారుతున్న దశలో కెప్టెన్ హర్మన్‌ప్రీత్.. షెఫాలితో బౌలింగ్ చేయించడం గొప్ప ఎత్తుగడ. బ్యాటింగ్‌లోనే కాదు, బౌలింగ్‌లోనూ మ్యాచ్‌ను మలుపు తిప్పింది షెఫాలినే. జట్టులో ప్రతి ఒక్కరూ ప్రాణం పెట్టి ఆడుతున్నారని ఫైనల్ చూసిన ప్రతి ఒక్కరికీ అర్థమైంది. గెలవాలన్న కసి ఉంటే ఫీల్డింగ్‌లోనూ అద్భుతాలను చూస్తామనడానికి అమన్‌జ్యోత్ పట్టిన క్యాచ్ ఓ ఉదాహరణ. ఆ క్యాచ్ తర్వాత విజయాన్ని విడిచిపెట్టేదే లేదన్నట్లు దూసుకెళ్లారు అమ్మాయిలు. ఫైనల్లో భారత అసాధారణ పోరాటానికి ప్రేరణ.. సెమీస్‌లో జెమీమా ఇన్నింగ్సే అంటే అతిశయోక్తి కాదు. క్రికెట్ అనే కాదు.. మరో రంగంలో అయినా, వ్యక్తిగత జీవితంలోనైనా కష్టపడే తత్వానికి కసి తోడైతే విజయం దానంతట అదే వస్తుంది. మనం సాధించగలం అని నమ్మడమే అన్నింటికంటే ముఖ్యం అనడానికి నాడు ఈడెన్ విజయం ఉదాహరణ కాగా.. నేటి అమ్మాయిల గెలుపు అందుకు మరో రుజువు!



జెమీమా



2011 ప్రపంచకప్‌తో ధోని



2001లో లక్ష్మణ్

ఆస్ట్రేలియాతో మ్యాచ్‌లో ఇన్నింగ్స్ ఆద్యంతం జెమీమా తపన స్పష్టంగా కనిపించింది. అర్ధశతకం చేసినపుడు, శతకం పూర్తయినపుడు జెమీమా సంబరాలు చేసుకోలేదు. ఏదైనా జట్టును గెలిపించాకే అనుకుంది. పూర్తి ఏకాగ్రతను ఆటపై పెట్టింది. నేను ఆడాలి.. గెలిపించాలి అని పట్టుబట్టి చివరి వరకు నిలబడింది. అనుకున్నది సాధించింది. తన ప్రదర్శన, జట్టు విజయం మొత్తం జట్టు దృక్పథాన్నే మార్చేశాయి. అందరిలోనూ మనం గెలవగలం అనే ధీమా వచ్చింది. ఫైనల్లోనూ నెగ్గాలన్న కసి పెరిగింది.

కథానాయకి

ఈనాడు క్రీడావిభాగం

ఒక జట్టు ప్రపంచకప్ గెలిచినంత మాత్రాన ఈ ఘనతనంతా తీసుకెళ్లి కెప్టెన్‌కు కట్టబెట్టేయలేం. కానీ హర్మన్‌ది ఈ విజయంలో అత్యంత కీలక పాత్ర. వన్డేల్లో పూర్తిస్థాయి కెప్టెన్‌గా ఆమె 3 ఏళ్లుగా జట్టును నడిపిస్తోంది. తన సారథ్యంలో జట్టు ఎంత మెరుగైందో ఏడాది ఆడిన సిరీస్‌లు, ప్రస్తుత ప్రపంచకప్ చూసిన వాళ్లకు బాగానే అర్థమై ఉంటుంది. ఒకప్పుడు భారత జట్టు ఆట ఎలా ఉండేదో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. 2005లో కేవలం 215 పరుగుల లక్ష్యం నిలిచినా.. 98 పరుగుల తేడాతో ఓడింది భారత్. 2017 సమయానికి ఆట మెరుగుపడ్డా.. అప్పుడు 229 పరుగుల లక్ష్యానికి చేరువగా వెళ్లి త్రుటిలో ఓడింది భారత్. కానీ ప్రస్తుత ప్రపంచకప్‌లో అత్యధిక స్కోరు ఘనత భారత్‌దే. ఆస్ట్రేలియా లాంటి మేటి జట్టుపై ఏకంగా 339 పరుగుల ఛేదనతో ప్రపంచ రికార్డు నెలకొల్పింది ఇండియా. భారత్ ఆటతీరు, దృక్పథం ఎంతగా మారిందో చెప్పడానికి ఇంతకంటే రుజువేం కావాలి? ఈ మార్పులో కెప్టెన్‌గా హర్మన్‌ప్రీత్ పాత్ర కీలకం. అలా అని ఆమె సారథి కావడానికి ముందు కెప్టెన్లను తగ్గించడానికేమీ లేదు. అంతకుముందు 15 ఏళ్లలో ఎక్కువ కాలం సారథిగా ఉన్నది మిథాలీనే. 2005 ప్రపంచకప్ ఫైనల్లోనే కాదు.. 2017, 2022 టోర్నీల్లోనూ ఆమే కెప్టెన్. అయితే తన సారథ్యంలో చాలా ఏళ్లు మహిళల క్రికెట్ ప్రమాణాలే అంతంత మాత్రం. దేశంలో క్రికెట్ ఆడే అమ్మాయిలే తక్కువ. ఆడేవాళ్లలోనూ ఆత్మవిశ్వాసం ఉండేది కాదు. దూకుడుగా ఆడలేకపోయేవారు. ఉన్న తక్కువ వనరులతోనే ఓ మోస్తరుగా జట్టును నడిపిస్తూ సాగింది మిథాలి. అప్పుడు బ్యాటింగ్ భారాన్ని ప్రధానంగా ఆమే మోసింది. హర్మన్‌ప్రీత్, స్మృతి లాంటి ప్రతిభావంతులను గుర్తించి జట్టులోకి తెచ్చి, మార్పునకు పునాది వేసిన ఘనత మిథాలీదే. కానీ మొత్తంగా మహిళల క్రికెట్లో వేగం, పోటీ పెరిగిన దశలో జట్టును మరో స్థాయికి తీసుకెళ్లడానికి ఒక దూకుడైన కెప్టెన్ అవసరమైంది. ఆ బాధ్యత తనే హర్మన్ తీసుకుంది. అప్పటికే బ్యాటర్‌గా మహిళల క్రికెట్లో తనదైన ముద్రను వేసిందామె. మహిళల క్రికెట్ చరిత్రలో అత్యంత ముఖ్యమైన విజయాల్లో ఒకటైన 2017 ప్రపంచకప్ సెమీస్ విజయంలో హర్మన్ (171 నాటౌట్)దే కీలక పాత్ర.

మిథాలినే పక్కన పెట్టి..

మిథాలి ఉండగానే టీ20 పగ్గాలందుకున్న హర్మన్.. జట్టు ఆడే తీరులో మార్పు తీసుకొచ్చింది. ఈ క్రమంలో దిగ్గజ క్రికెటర్ అయిన మిథాలిని సైతం ఒక మ్యాచ్‌కు పక్కన పెట్టడానికి వెనుకాడలేదు. దీనిపై విమర్శలు వచ్చినా వెనక్కి తగ్గలేదు. హర్మన్ వచ్చాక వన్డేల్లో సైతం భారత జట్టు వేగం అందుకుంది. షెఫాలి, రిచా లాంటి యువ క్రికెటర్ల రాకతో భారత జట్టులో దూకుడు మరింత పెరిగింది. ఈ క్రమంలోనే 2020 టీ20 ప్రపంచకప్ ఫైనల్‌కు అర్హత సాధించింది భారత్. కానీ ఆ సమయానికి ఆస్ట్రేలియాను ఓడించి కప్పు గెలిచే సామర్థ్యం జట్టుకు లేకపోయింది. మొత్తంగా జట్టు దృక్పథమే మారాల్సిన అవసరాన్ని హర్మన్ గుర్తించి.. ఆ దిశగా ప్రయత్నం చేసింది. ఈ క్రమంలో మహిళల ప్రిమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) ఆరంభం, అమోల్ మజుందార్ కోచ్ కావడం కీలక మలుపు. మజుందార్‌తో కలిసి సరైన జట్టును ఎంచుకుని.. ఒక ప్రణాళిక ప్రకారం ముందుకు నడిపించింది హర్మన్. అందువల్లే ఈ ఏడాది ఇంగ్లాండ్ పర్యటనలో భారత జట్టు వన్డే, టీ20 సిరీస్‌లు సాధించగలిగింది. ప్రపంచకప్ ముంగిట ఆస్ట్రేలియాకు సిరీస్‌ను కోల్పోయినా.. ఒక మ్యాచ్‌లో ప్రత్యర్థిని చిత్తుగా ఓడించారు భారత అమ్మాయిలు. మరో మ్యాచ్‌లో 412 పరుగుల భారీ లక్ష్యం నిలిచినా డీలా పడకుండా విజయం కోసం ప్రయత్నించడం, 43 పరుగుల తేడాతో ఓడడం హర్మన్ సారథ్యంలో మారిన జట్టు దృక్పథానికి నిదర్శనం. ఇక ప్రపంచకప్‌లోనూ అదే ప్రదర్శనను కొనసాగించింది భారత్. లీగ్ దశలో 3 మ్యాచ్‌లు ఓడినా.. అవి స్వల్ప తేడాతోనే. ఆ ఓటముల నుంచి పాఠాలు నేర్చుకుని సెమీస్, ఫైనల్‌లో అద్భుత ఆట తీరుతో అమ్మాయిలు కప్పు సాధించారు. భారత్‌కు సెమీస్ బెర్తు సాధించి పెట్టిన కివీస్ మ్యాచ్‌లో 70 పరుగులు చేసిన హర్మన్.. సెమీస్‌లో ఆస్ట్రేలియాపై 89 పరుగుల అమూల్యమైన ఇన్నింగ్స్ ఆడింది. ఫైనల్లో బ్యాటుతో రాణించకపోయినా కెప్టెన్సీతో తనదైన ముద్ర వేసింది హర్మన్. లారా, లుజ్ భాగస్వామ్యం ప్రమాదకరంగా మారుతున్న దశలో షెఫాలికి బంతినివ్వడం కెప్టెన్‌గా హర్మన్ మాస్టర్ స్ట్రోక్. బౌలర్లను మార్చి మార్చి ప్రయోగిస్తూ.. చక్కటి ఫీల్డింగ్ ఏర్పాట్లతో హర్మన్ తన ముద్రను చూపించింది. భారత్‌కు విజయాన్నందించిన డిక్లెర్క్ క్యాచ్‌ను హర్మన్ భలేగా అందుకుంది. ఈ ప్రపంచకప్ ఆరంభానికి ముందు హర్మన్ ఆట చూస్తే.. తన ఆటతో స్ఫూర్తినివ్వలేని కెప్టెన్ జట్టును ఏం నడిపిస్తుందో అనుకున్నారు. కానీ తాను రాణించడంతో పాటు జట్టునూ గొప్పగా నడిపించి 47 ఏళ్ల సుదీర్ఘ కలను నెరవేర్చిన హర్మన్.. భారత మహిళల క్రికెట్ చరిత్రలో తన పేరును సువర్ణాక్షరాలతో లిఖించుకుంది.

కోట్ల రూపాయలు.. వజ్రాల హారాలు

ముంబయి: చరిత్రాత్మక వన్డే ప్రపంచకప్ గెలిచిన భారత మహిళల జట్టుపై నజరానాల వర్షం కురుస్తోంది. హర్మన్‌ప్రీత్ బృందానికి బీసీసీఐ రూ.51 కోట్ల నగదు బహుమతిని ప్రకటించింది. కప్ గెలిచినందుకు భారత్‌కు ఐసీసీ నుంచి రూ.37.3 కోట్లు దక్కాయి. వ్యక్తిగతంగానూ క్రీడాకారులకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు నగదు బహుమతి ప్రకటించాయి. హిమాచల్ ప్రదేశ్.. పేసర్ రేణుక సింగ్‌కు రూ.కోటి ఇవ్వనుంది. ఆమెకు ప్రభుత్వ ఉద్యోగం కూడా ఇస్తామని ఆ రాష్ట్ర సీఎం సుఖ్విందర్ సింగ్ తెలిపారు. పేసర్ క్రాంతి గౌడ్‌కు ఆమె సొంత రాష్ట్రం మధ్యప్రదేశ్ రూ.కోటి నజరానా ఇస్తున్నట్లు తెలిపింది.

వజ్రాల హారాలతో..: సూరత్‌కు చెందిన వ్యాపారవేత్త, రాజ్యసభ సభ్యుడు గోవింద్ డోలాకియా భారత మహిళా క్రికెటర్లకు ఒక్కొక్కరికి వజ్రాల హారాలు ఇస్తున్నట్లు ప్రకటించారు. అంతేకాక క్రికెటర్ల ఇళ్లకు సోలార్ ప్యానళ్లను ఏర్పాటు చేస్తామని తెలిపారు.

ప్రపంచకప్‌లో

టాప్‌-5 బ్యాటర్లు		టాప్‌-5 బౌలర్లు	
బ్యాటర్	పరుగులు	బౌలర్	వికెట్లు
వోల్వార్ట్ (దక్షిణాఫ్రికా)	571	దీప్తి (భారత్)	22
స్మృతి (భారత్)	434	అనాబెల్ (ఆస్ట్రేలియా)	17
గార్డ్‌నర్ (ఆస్ట్రేలియా)	328	ఎకిల్‌స్టోన్ (ఇంగ్లాండ్)	16
ప్రతీక (భారత్)	308	శ్రీ చరణి (భారత్)	14
లిచ్‌ఫీల్డ్ (ఆస్ట్రేలియా)	304	అలానా (ఆస్ట్రేలియా)	13

ఈ 7 గంటలు మీవే కావాలి..



అమోల్

చక్‌దే ఇండియా సినిమా గుర్తుందా? భారత మహిళల హాకీ జట్టు కోచ్ కబీర్‌ఖాన్ (షారుక్ ఖాన్) ఫైనల్‌కు ముందు తన ప్లేయర్లలో ఎలాగైనా గెలవాలన్న కాంక్షను రగిలిస్తాడు. భారత క్రికెట్ జట్టు కోచ్ అమోల్ మజుందార్ కూడా కబీర్ పాత్రనే పోషించాడు. దక్షిణాఫ్రికాతో ప్రపంచకప్ ఫైనల్‌కు ముందు అతడు మాట్లాడిన మాటలు అమ్మాయిల్లో ఎంతో స్ఫూర్తి నింపాయి. "రాబోయే ఏడు గంటలు చాలా కీలకం. ఎవరితో మాట్లాడొద్దు.. ఏదీ పట్టించుకోవద్దు. కప్పే మన లక్ష్యం కావాలి. ప్రతి అడుగు ఆ దిశగానే పడాలి. మన కథను మనమే రాసుకోవాలి. చరిత్ర సృష్టించాలి" అని మజుందార్ జట్టుతో అన్నాడు. "మన అమ్మాయిలను చూసి ఎంతో గర్వంగా అనిపిస్తోంది. ఈ విజయాన్ని ఇంకా నమ్మలేపోతున్నా. వారి కఠోరశ్రమ ఫలించింది" అని మజుందార్ తెలిపాడు. టీ20 ప్రపంచకప్ నెగ్గిన తర్వాత కెప్టెన్ రోహిత్ వెస్టిండీస్‌లోని బ్రిడ్జ్‌టౌన్ మైదానంలో జెండా పాతినట్లే.. మజుందార్ ముంబయిలో జెండా పాతాడు.

దివ్య ఔట్



దివ్య

పంజిమ్: భారత స్టార్ దివ్య దేశ్‌ముఖ్.. చెస్ ప్రపంచకప్‌లో ఓడిపోయింది. ఈ మహిళల ప్రపంచకప్ విజేత.. తొలి రౌండ్లో 0-2తో అర్డిటిస్ (గ్రీస్) చేతిలో పరాజయం చవిచూసింది. తొలి గేమ్‌లో సత్తా చాటలేకపోయిన దివ్య.. రెండో గేమ్‌లోనూ పుంజుకోలేకపోయింది. ఎస్ఎల్.నారాయణన్, ప్రణవ్, రౌనక్ సధ్వాని, ప్రణేష్, ఇనియన్, కార్తీక్ వెంకటరామన్, ఆర్యాంక్ ఘోష్, దీప్తాయన్ ఘోష్, సూర్యశేఖర గంగూలీ రెండో రౌండ్ చేరారు.

సినర్ @ 1

రోమ్: ఇటలీ టెన్నిస్ స్టార్ యానిక్ సినర్ మళ్లీ నంబర్‌వన్ ర్యాంకు దక్కించుకున్నాడు. తాజాగా పారిస్ మాస్టర్స్ టైటిల్ గెలిచిన సినర్ (11500 పాయింట్లు).. సోమవారం ప్రకటించిన ర్యాంకింగ్స్‌లో కార్లోస్ అల్కరాస్ (11250, స్పెయిన్)ను వెనక్కి నెట్టాడు. యుఎస్ ఓపెన్ గెలిచిన తర్వాత సినర్ నుంచి అల్కరాస్ నంబర్‌వన్ ర్యాంకును సొంతం చేసుకున్నాడు. దాదాపు రెండు నెలల తర్వాత సినర్ మళ్లీ అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నాడు.

హైదరాబాద్ లక్ష్యం 344

రాంచి: హిమాచల్ ప్రదేశ్‌తో రంజీ మ్యాచ్ (గ్రూప్‌-డి)లో హైదరాబాద్ గట్టి పరీక్షనే ఎదుర్కొంటోంది. ఓవర్‌నైట్ స్కోరు 274/8తో మూడో రోజు, సోమవారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన హైదరాబాద్.. మరో నాలుగు పరుగులే జోడించి 278కి ఆలౌటైంది. 40 పరుగుల ఆధిక్యం సంపాదించిన హిమాచల్.. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో 303 పరుగులకు ఆలౌటైంది. ఆకాశ్ వశిష్ఠ్ (101 నాటౌట్) శతకం బాదాడు. మిలింద్ మూడు వికెట్లు పడగొట్టాడు. 344 పరుగుల లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్‌లో బరిలోకి దిగిన హైదరాబాద్.. ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టపోకుండా 8 పరుగులు చేసింది. తన్మయ్ (8), అభిరత్ రెడ్డి (4) క్రీజులో ఉన్నారు. హిమాచల్ తొలి ఇన్నింగ్స్‌లో 318 పరుగులు చేసింది.

పట్టుబిగించిన ఆంధ్ర

కటక్: ఒడిశాతో రంజీ మ్యాచ్ (గ్రూప్‌-ఎ)లో ఆంధ్ర పట్టుబిగించింది. గెలుపుపై కన్నేసింది. ఓవర్‌నైట్ స్కోరు 80/4తో మూడో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఒడిశా.. ఆంధ్ర బౌలర్ల ధాటికి 151 పరుగులకే కుప్పకూలింది. విజయ్ (3/14), సౌరభ్ (3/32), సాయితేజ (3/30) ఆ జట్టును దెబ్బతీశారు. సందీప్ (58) టాప్ స్కోరర్. ఆంధ్రకు 324 పరుగుల ఆధిక్యం లభించింది. ఫాలో ఆన్‌లో పడ్డ ఒడిశా.. రెండో ఇన్నింగ్స్‌లో పోరాడుతోంది. ఆట ముగిసే సమయానికి రెండు వికెట్ల నష్టానికి 190 పరుగులు చేసింది. గౌరవ్ (79 బ్యాటింగ్), సందీప్ (63) రాణించారు. తొలి ఇన్నింగ్స్‌ను ఆంధ్ర 475/7 వద్ద డిక్లేర్ చేసింది.

ఎరక్కపోయి వచ్చారు..

శ్రీనగర్: ఓ టీ20 లీగ్‌లో ఆడేందుకు జమ్ముకశ్మీర్ వచ్చిన వెస్టిండీస్ క్రికెట్ దిగ్గజం క్రిస్‌గేల్‌కు చేదు అనుభవం ఎదురైంది. అందరినీ దిగ్భ్రాంతికి గురి చేస్తూ టోర్నీ నిర్వాహకులు లీగ్‌ను రద్దు చేసి రాత్రికి రాత్రి పారిపోయారు. అక్టోబరు 23న ఆరంభమైన ద హెవెన్ ప్రిమియర్ లీగ్ (ఐహెచ్‌పీఎల్) ప్రజల నుంచి పెద్దగా స్పందన రాలేదు. టికెట్ ధరను రూ.90కి తగ్గించినా ప్రేక్షకులను ఆకర్షించలేకపోయారు. గేల్, రైడర్, తిసార వంటి మాజీ ఆటగాళ్లు కూడా లీగ్‌లో ఆడేందుకు వచ్చారు. కానీ ఎలాంటి ఆదాయం లేకపోవడంతో నిర్వాహకులు చెప్పాపెట్టకుండా ఉడాయించారు. హోటల్ బిల్లులు కూడా చెల్లించకపోవడంతో గేల్ సహా అనేక మంది అంతర్జాతీయ మాజీ క్రికెటర్లు, మ్యాచ్ అధికారులు శ్రీనగర్‌లోని హోటల్లో చిక్కుకుపోయారు. లీగ్‌లో విధులు నిర్వర్తించేందుకు వచ్చిన ఓ ఇంగ్లిష్ అంపైర్ బ్రిటన్ రాయబార కార్యాలయాన్ని సంప్రదించడంతో హోటల్ మేనేజ్‌మెంట్‌తో సమస్య పరిష్కారమై.. ఆటగాళ్లు వారి స్వదేశాలకు పయనమయ్యారు.

వసుంధర

vasundhara@eenadu.in

● మన అమ్మాయిలు మొదటిసారి ఐసీసీ వరల్డ్ ఛాంపియన్‌షిప్ గెలుచుకున్నారు. ఎంతో ధైర్యం, నమ్మకం, ఆత్మవిశ్వాసంతో మీరు ఆడిన తీరుకి దేశమంతా గర్వంతో ఉప్పొంగిపోతోంది. మీ అందరికీ కృతజ్ఞతలు.
- **నీతా అంబానీ**, రిలయన్స్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్

● ఛాంపియన్స్... మీ విజయం భవిష్యత్తుకి బాట వేసుకునే ఆత్మవిశ్వాసాన్ని ప్రతి అమ్మాయిలోనూ నింపింది. బౌండరీల నుంచి బోర్డ్‌రూమ్‌ల వరకూ విజయాన్ని పునర్నిర్వచించారు. కంగ్రాట్స్ క్వీన్స్..!
- **ఫల్గుణీ నాయర్**, ఫౌండర్, సీఈవో నైకా

● ప్రపంచకప్–2025 అందుకున్న మహిళా జట్టుకి హృదయపూర్వక అభినందనలు. ఈ చారిత్రక విజయం మీ స్థైర్యం, టీమ్ వర్క్‌కి నిదర్శనం. ఆయా పరిశ్రమల్లో అడ్డంకులు ఛేదించి ఎదగాలనుకునే మహిళలకు స్ఫూర్తి.
- **సావిత్రి జిందాల్**, ఛైర్‌పర్సన్(జేఎస్‌డబ్ల్యూ గ్రూప్)

సొంత గడ్డమీద, వేల మంది అభిమానుల మధ్య ఆడటం బలమే కాదు, ఒత్తిడి కూడా! ఎందుకంటే, అంచనాలు అందుకోవడం అంత సులభం కాదు! గతంలో కప్ గెలిచిన చరిత్రా లేదు! ఉన్నదల్లా ఈసారి గెలిచి తీరాలన్న దృఢ సంకల్పం. గెలిస్తే దేశంలో మహిళా క్రికెట్‌కు జోష్ వస్తుందన్న విశ్వాసం! వరుస ఓటములకు బెదరకుండా, నిలిచి పోరాడి గెలిచారు మన అమ్మాయిలు!



హ్యాట్సాఫ్... అమ్మాయిలూ

క్రికెట్ వదిలేయాలనుకుంది... కానీ!

'భూమ్మీద జీవించడానికి మీకు గంటే సమయం మిగిలి ఉంటే... మీరేం చేస్తారని అడిగితే... 'అందులో అరగంట బ్యాటింగ్ చేస్తా' అందట స్మృతీ మంధాన. క్రికెట్ మీద ఆమెకున్న ఇష్టం అది. కానీ ఒకానొక సమయంలో ఈ ఆటనే వదిలేయాలనుకుంది. సైన్స్ మీద ఇష్టంతో చదువుపై దృష్టి పెట్టాలనుకుంది. అప్పుడు వాళ్లమ్మే ఆ నిర్ణయం తీసుకోకుండా ఆపింది. అప్పటికే తను అండర్-15లో ఆడి, ప్రతిభ కనబరచడం వల్ల క్రికెట్‌ను కెరియర్‌గా మలచుకోమని సలహా ఇచ్చింది. తండ్రి శ్రీనివాస్ డిస్ట్రిక్ట్ లెవెల్ క్రికెటర్. క్రికెట్ అంటే ప్రాణం. కానీ కుటుంబ పరిస్థితుల వల్ల ఆటను కొనసాగించలేకపోయారు. అందుకే అన్నయ్యను ఈ దిశగా ప్రోత్సహించారు. నాన్నకు ఎడమచేతితో ఆడేవాళ్లు అంటే చాలా ఇష్టం. అందుకే కుడిచేతి వాటం ఉన్నా ఎడమచేతితో ఆడటం నేర్చుకున్నానని చెబుతారు స్మృతి. ఈమెకు అన్నయ్య శ్రవణ్‌ని చూసే ఆటపై ఇష్టం కలిగిందట. పత్రికల్లో ప్రచురితమైన అన్నయ్య ఫొటోలూ, వార్తల క్లిప్పింగ్స్‌నూ కట్‌చేసి దాచి పెట్టేది మంధాన. 'ఏదో ఒక రోజు నేను కూడా ఇలా పరుగులు చేస్తా' అని అమ్మతో చెప్పేది. తన ఆసక్తిని గమనించిన తండ్రి శిక్షణలో చేర్చారు. అలా తొమ్మిదేళ్ల వయసులోనే మహారాష్ట్ర అండర్-15 టీమ్‌కి సెలెక్ట్ అయ్యిందామె. ఆది మొదలు వెనుదిరగలేదు. ఒడుదొడుకులన్నీ తట్టుకుని అంతర్జాతీయ స్థాయిలో అతిపిన్న వయసులో 7వేల పరుగులు చేసిన రికార్డును సొంతం చేసుకుంది. ఒత్తిడి, వైఫల్యం దిశగా టీమ్ ఉన్న సమయంలో... స్మృతి బరిలోకి దిగి గెలుపువైపు నడిపించిన సందర్భాలు చాలానే. అందుకే క్రీడాభిమానులు ఈమెను 'క్లచ్ క్వీన్'గా పిలుచుకుంటారు.


- స్మృతి మంధాన

సెమీస్‌లో అద్భుత పోరాటం!


- జెమీమా రోడ్రిగ్స్

ప్రపంచకప్ విజయం ఎంత గొప్పదో ముంబయి బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్‌కు చిన్నప్పుడే అర్థమైంది. తనకు 11 ఏళ్లప్పుడు భారత పురుషుల జట్టు ప్రపంచ కప్(2011) గెలిచింది. ఆ సమయంలో తమ పొరుగున ఉండే సచిన్‌కు జనాలు నీరాజనం పలకడాన్ని చూసింది. అప్పట్నుంచి క్రికెట్ గురించి కలలుకంది. అదే నగరంలో 14 ఏళ్ల తర్వాత ప్రపంచకప్ గెలిచి తన కల నిజం చేసుకుంది. 2018లోనే సీనియర్ జట్టులోకి వచ్చినా, 2022 ప్రపంచకప్ ఆడే అవకాశం రాలేదు. ఏడాది కిందట కొన్ని వివాదాలు చుట్టుముట్టినా... ఆటపైనే దృష్టిపెట్టింది. మొదటి నాలుగు మ్యాచ్‌ల్లో 0, 32, 0, 33 పరుగులు చేయడంతో సిరీస్ మొత్తం ఆత్మవిశ్వాసం లోపించి... తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంది జెమీమా. ఒక మ్యాచ్‌లో తుది జట్టులో లేదు కూడా. ఆ సమయంలో స్మృతి, అరుంధతి, రాణా... తనకు అండగా నిలిచారు. మళ్లీ అవకాశం వచ్చినప్పుడు తప్పనిసరిగా గెలవాల్సిన న్యూజిలాండ్ మ్యాచ్‌లో 55 బంతుల్లో 76 పరుగులు చేసింది. సెమీస్‌లో ఆస్ట్రేలియా నిర్దేశించిన 339 పరుగుల లక్ష్యం చూసి, కప్ చేజారినట్టేనని భావించారంతా. కానీ జెమీమా అద్భుతంగా పోరాడి 127 పరుగులతో అజేయంగా నిలిచి జట్టుని ఫైనల్‌కు చేర్చింది. ఆసీస్‌పైన ఆమె ఆడిన ఇన్నింగ్స్ కొత్త తరం బ్యాట్ పట్టేలా స్ఫూర్తినిస్తుందనడంలో సందేహం లేదు.

అమ్మానాన్నకు ఇష్టం లేకుండానే..!


- శ్రీచరణి

క్రీజులోకి దిగిందంటే... వికెట్లు తీయడం మీదే ధ్యాసంతా. పరిస్థితులకూ ప్రత్యర్థులకూ అనుగుణంగా తన బౌలింగ్‌ను మార్చుకోగల సామర్థ్యం ఉన్న అమ్మాయి నల్లపురెడ్డి శ్రీచరణి. ఆటలో తన వ్యూహం అర్థంకాక... ప్రత్యర్థి కూడా చెమటలు పట్టాల్సిందే. పొదుపుగా పరుగులు ఇస్తూ... ఆటలో రాణిస్తుందనే పేరు సంపాదించుకుంది. పేరుకు తగ్గట్టుగానే... భారత్ కప్ గెలవడంలోనూ తనవంతు ప్రతిభ కనబరిచింది. దీప్తి శర్మ తరవాత అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ శ్రీచరణి. ఈమెది కడప. చిన్నప్పట్నుంచీ ఆటలంటే ఇష్టం. దాంతో బ్యాడ్మింటన్, ఖోఖో, లాంగ్‌జంప్, పరుగు... వంటి వాటిల్లో రాష్ట్రానికి ఆడింది కూడా. బ్యాడ్మింటన్‌లో రాణించాలని కలలు కనేది. ఈ క్రమంలోనే క్రికెట్ ఆమె దృష్టిని ఆకర్షించింది. కోచ్‌ని అడిగితే అథ్లెటిక్స్‌తోపాటు దీన్నీ ప్రయత్నించమన్నారు. 'ఇంట్లో చెబితే అమ్మానాన్నలు వద్దన్నారు. మామయ్య ప్రోత్సాహంతోనే శిక్షణలో చేరా. ఏడాదిలోపే బాల్, బ్యాట్ రెండింటితోనూ సత్తా చాటుతూ ఆల్‌రౌండర్‌గా ఎదిగా' అని చెప్పే శ్రీచరణి ప్రారంభంలో కుటుంబ మద్దతు లేకపోవడం వల్ల మ్యాచ్‌లకు ఒంటరిగానే వెళ్లేదట. పరిమిత వనరులున్నా వాటిని సద్వినియోగం చేసుకుంటూ అవకాశాల్ని అందిపుచ్చుకుంది. తన ఆటతో గుర్తింపు సంపాదించుకుంది.

ఆమె స్థానంలో అడుగుపెట్టి...


- షెఫాలీ వర్మ

అభిమానులు... లేడీ సెహ్వాగ్‌గా పిలుచుకునే షెఫాలీ వర్మ దూకుడుకు పెట్టింది పేరు. ప్రతీక గాయం కారణంగా వారం క్రితమే ఆమె స్థానంలో జట్టులోకి వచ్చింది. సెమీస్‌లో విఫలమైనా... తుదిపోరులో విశ్వరూపాన్ని ప్రదర్శించింది. ప్రపంచ కప్ సాధించడంలో కీలకంగా మారి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' టైటిల్‌నీ అందుకుంది. ఫైనల్లో తనే టాప్ స్కోరర్. అతిపిన్న వయసులోనే అన్ని ఫార్మాట్లలోనూ దేశానికి ప్రాతినిధ్యం వహించిన ఘనత కూడా షెఫాలీదే. టెస్టులో అత్యంత వేగంగా డబుల్ సెంచరీ (197 బంతుల్లో 205 పరుగులు)చేసిన రెండో భారతీయ మహిళగానూ నిలిచింది. అయితే, ప్రపంచకప్‌కి ముందు జరిగిన పలు మ్యాచ్‌ల్లో రాణించలేకపోవడంతో తుది జట్టులో స్థానాన్ని సంపాదించుకోలేకపోయింది. సెమీఫైనల్‌కి ముందు ప్రతీక గాయంతో వెనుదిరగడంతో తన స్థానంలోకి అడుగుపెట్టింది. అప్పుడు కూడా ఆస్ట్రేలియాతో జరిగిన సెమీఫైనల్స్‌లో సరైన ప్రదర్శన చేయలేకపోయింది. కానీ, ఫైనల్స్‌లో అందరి అంచనాల్నీ తలకిందులు చేస్తూ.. అద్భుతమైన ప్రదర్శన చేసింది. ప్రపంచకప్పునే తెచ్చిపెట్టింది. షెఫాలీది హరియాణాలోని రోహ్‌తక్. తన ఇంటి పరిసరాల్లో అబ్బాయిలు క్రికెట్ ఆడటం చూసి ఆట నేర్చుకోవాలనుకుంది. కానీ, ఆడపిల్లలకు ఆటలంటే అభ్యంతరం చెప్పే ప్రాంతమది. దాంతో ముందు భయపడినా తర్వాత ఆ కోరికను తండ్రితో చెప్పిందట. ఆయన 'ఆడటం ముఖ్యం కాదు... నీకంటూ ఓ ప్రత్యేకత ఉండాలి. దాంతో భారత జట్టులో స్థానం సంపాదించగలగాలి' అన్నారట. ఆ మాటలే స్ఫూర్తిగా బ్యాటింగ్‌పై దృష్టిపెట్టింది షెఫాలీ. మరింత శిక్షణ తీసుకోవాలనుకుంటే ఆడపిల్లని నిరాకరించారట. అప్పుడు జుట్టు కత్తిరించుకుని, అబ్బాయిలా వేషం మార్చి మరీ సాధన చేసింది. తండ్రి మాటను నిజం చేసింది.

డీఎస్పీ దీప్తి...


- దీప్తి శర్మ

ప్రపంచకప్‌లో 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'గా ఎంపికయిందంటేనే ఆమె సామర్థ్యాన్ని అర్థం చేసుకోవచ్చు. టోర్నీలో అత్యధికంగా 22 వికెట్లు తీసింది. 215 విలువైన పరుగులూ చేసింది. ప్రత్యర్థి జట్టు ఏదైనా బ్యాటింగ్, బౌలింగ్‌లో మధ్య ఓవర్లలో ఆటను తన చేతుల్లోకి తీసుకుంటుంది దీప్తి. ఈమెది ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఆగ్రా. ఆమె మ్యాచ్ ఉందంటే... శాస్త్రిపురంలోని దీప్తి ఇల్లు మినీ స్టేడియంగా మారిపోతుంది. అన్నయ్య సుమిత్ ద్వారా దీప్తికి క్రికెట్ పరిచయమైంది. వీధిలో అన్నయ్య స్నేహితులతో ఆడేది. నగరంలోని ఓ అకాడమీలో శిక్షణ తీసుకునేవాడు సుమిత్. రోజూ అన్నయ్యతోపాటు వచ్చి ఓ పక్కన కూర్చొని ఆటను గమనించేదంతే. ఒకరోజు తనవైపు వచ్చిన బంతిని 50 మీటర్ల దూరంలోని స్టంప్స్‌కి గురిచూసి కొట్టిందట. ఆరోజు అక్కడ ఉన్న భారత మాజీ క్రికెటర్ హేమలత కళ.. దీప్తి ప్రతిభని గుర్తించి ప్రోత్సహించారు. సుమిత్ ఫాస్ట్ బౌలర్. ఉత్తర్‌ప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహించాడు. అన్నలానే దీప్తి మొదట మీడియం పేస్ వేసేది. అయితే తన ఎత్తుని చూసి స్పిన్ బౌలింగ్‌కు మారమని సెలెక్టర్లు, కోచ్‌లు సలహా ఇవ్వడంతో 16 ఏళ్లప్పుడు తనను స్పిన్నర్‌గా మలచుకుంది. 2014లోనే భారత జట్టులో అడుగుపెట్టింది. ప్రస్తుతం ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వంలో డీఎస్పీగా ఉంది.

కీలకమైన క్యాచ్‌తో గెలుపు బాట...


- అమన్‌జ్యోత్

ఓ పక్క బ్యాటింగ్‌తో ఆటాడేస్తూనే... మరోపక్క బౌలింగ్‌తో మాయాజాలం చేయగలదు అమన్‌జ్యోత్. ఫైనల్లో... సెంచరీ కొట్టి సవాల్ విసిరిన సౌతాఫ్రికా జట్టు కెప్టెన్ లారా వోల్వార్ట్‌ను తన క్యాచ్‌తో పెవిలియన్‌కి పంపింది అమన్. మ్యాచ్‌నే మలుపు తిప్పిన క్యాచ్ అది. అమన్ పుట్టి పెరిగింది మొహాలీలో. ఆటలపై ఉన్న ఇష్టంతో క్రికెట్‌నే కెరియర్‌గా ఎంచుకోవాలనుకుందట. కానీ, ఆర్థిక ఇబ్బందుల మధ్య జీవితాన్ని సాగించే మధ్యతరగతి కుటుంబం వాళ్లది. క్రికెటర్ కావాలనుకుంటున్నానని చెబితే ఒప్పుకొంటారా? దీనికితోడు ఆడపిల్లలకు ఆటలేంటి? అంటూ బంధువులూ, ఇరుగుపొరుగు ఆక్షేపణలు. ఆ పరిస్థితుల్లో నానమ్మ భగవంతినే... ఎవరికీ తెలియకుండా రోజూ క్రికెట్ మైదానానికి తీసుకెళ్లేవారట. తోటివారితో ఆడాలన్నా బ్యాట్ లేకపోవడంతో ఎవరూ అమన్‌ని ఆడనిచ్చేవారు కాదట. వడ్రంగి అయిన తండ్రే చెక్కతో బ్యాట్‌ని చేసిచ్చారట. ఆపై స్థానిక క్రికెట్ అకాడమీలో చేరి శిక్షణ తీసుకుంది. తర్వాత పంజాబ్ తరపున అండర్-19, అండర్ -23 జట్లలో ఆడే అవకాశం వచ్చింది. 2023లో దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగుపెట్టి తొలి మ్యాచ్‌లోనే విజయం అందుకుంది. డబ్ల్యూపీఎల్‌లో ముంబయి ఇండియన్స్ ట్రోఫీ తీసుకోవడంలో తన వంతు పాత్ర పోషించింది. ఇప్పుడు ప్రపంచకప్‌ని అందించడంలోనూ కీలకంగా మారింది. అయితే, వరల్డ్‌కప్ మొదలైన కొన్ని రోజులకే... తన ఆటకు ప్రాణం పోసిన నానమ్మ గుండెపోటుకు గురయ్యారట. ఐసీయూలో ఉన్న విషయాన్ని అమన్‌కు తెలియనివ్వకుండా బాధను దిగమింగుకుని ఇంట్లోవాళ్లంతా తన గెలుపుకోసం ఎదురుచూశారట. అందుకే, అమన్ ఈ విజయాన్ని నానమ్మకే అంకితం చేశానంటోంది.

విమర్శల్ని తిప్పికొట్టి... కప్పు పట్టి!


- హర్మన్ ప్రీత్ కౌర్

'హర్మన్ సారథ్యం అద్భుతం...' మాజీ కెప్టెన్ మిథాలీ ఒక్కరే కాదు, దేశమంతా ఈ రకమైన ప్రశంసలే. అందుకు పూర్తి అర్హురాలు హర్మన్. ప్రస్తుతం భారీ ఇన్నింగ్స్ ఆమె ఖాతాలో లేకపోవచ్చు. కానీ సారథిగా జట్టును నడిపించిన తీరు, సందిగ్ధంలో ఉన్నప్పుడు చూపిన స్థైర్యం, కీలక సమయంలో తీసుకున్న నిర్ణయాలు జట్టును గెలిపించాయి. కప్‌ను ముద్దాడేలా చేశాయి. సెమీస్‌లో 88 బంతులకి 89 పరుగులు చేసి అద్భుత విజయానికి మార్గం సుగమం చేసిన భయమెరుగని క్రికెటర్... హర్మన్ ప్రీత్ కౌర్.

అంతర్జాతీయ మహిళా దినోత్సవం(8మార్చి)1989 హర్మన్ పుట్టినతేదీ. ఊరు పంజాబ్‌లోని మోగా. తండ్రి హర్మందర్ సింగ్ జిల్లా కోర్టు గుమస్తా. తల్లి సత్వీందర్ కౌర్. ముందే ఊహించారో కాకతాళీయమో తెలియదు కానీ పుట్టగానే తండ్రి 'గుడ్ బ్యాట్స్‌మన్' క్యాప్షన్ ఉన్న టీషర్టు కొన్నారట. 'తొలిసారి కూతురు పుట్టిన ఆనందంతోనే కొన్నా. కానీ మంచి ప్లేయర్ అవుతుందని త్వరలోనే గ్రహించా. హాకీ ఆడింది. అథ్లెటిక్స్‌లో ఉండేది. క్రికెట్ బ్యాట్ చేతిలోకి తీసుకున్నాక... అదే ఆమె ప్రపంచమైంది. ఆ ఇష్టాన్ని గ్రహించే ఇంటికి ఎదురుగా ఉన్న స్టేడియంకి తీసుకెళుతూ తొలి కోచ్‌గా మారా. సీనియర్ అబ్బాయిలతో ఆడుతూ సులభంగా బౌండరీలూ సిక్సర్లూ కొట్టేది. వాళ్లంతా కంచె వైపే చూస్తుంది అనుకునేవారు కానీ తను కంచె అవతల ఉన్న చెట్లపైకే గురిపెట్టేది' అని చిన్ననాటి హర్మన్ గురించి చెబుతారామె తండ్రి. క్రికెట్ ప్లేయర్ కావాలనుకున్న ఆయన కల నెరవేరలేదు. అది కూతురిలో చూసుకోవాలనుకున్నారు. ఒక దశలో స్కూలు టీచర్లు 'చదువుకోమని చెప్పకుండా మగరాయడిలా ఏమిటా ఆటలు' అని తల్లిదండ్రుల్ని కోప్పడితే... ఆట సమయం కుదించాలనుకున్నారు. హర్మన్ ఆగితేనా... ఆ సమయంలోనే ఓసారి జిల్లా జట్టుకోసం అబ్బాయిల్ని వెతుకుతోన్న స్థానిక కోచ్ కమల్దీష్ సింగ్ సోధి దృష్టిలో పడిందీమె. ఆమె వేగం, శక్తి ఆయన్ని ఆకట్టుకున్నాయి.

'మీ అమ్మాయిని నాకివ్వండి... అన్నీ నేను చూసుకుంటా' అన్నారాయన. ముందు సందేహించినా తరవాత ఒప్పుకొని ఆయనతో పక్క ఊరికి పంపించారు. అలా ప్రైవేటు అకాడమీలో చేరిన హర్మన్ జిల్లాస్థాయిలో 9 సార్లు ఛాంపియన్‌గా నిలిచింది. ఓసారి పాటియాలాలో మ్యాచ్ ఆడుతున్నప్పుడు ఆమె కొట్టిన సిక్సర్ పొరుగింటి కిటికీ అద్దాన్ని బద్ధలుకొట్టింది. ఆ ఇంటివాళ్లు ముందు కోప్పడ్డా ఓ అమ్మాయి సిక్సర్‌వల్లే అలా జరిగిందని తెలిశాక నవ్వుకున్నారట. కమల్దీష్ కొడుకే యద్వీందర్ సింగ్ సోధి... హర్మన్‌కి తొలి కోచ్... ఆరోజు అతనికి తెలియదు, భారత్ మహిళా క్రికెటర్లలో ఒకరిని తయారుచేస్తున్నానని. అలా గుర్తింపులేని పాఠశాల జట్టు నుంచి ఫిరోజ్‌పుర్ జిల్లా తరపున స్థిరమైన ఆల్‌రౌండ్ ప్రదర్శనలతో పంజాబ్ క్రికెట్ అసోసియేషన్ శిబిరాల్లోకి ప్రవేశించింది. ఆపై రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారిణిగా ఎదిగింది. ఈ మధ్యలో వైఫల్యాల్నీ చూసింది. ప్రభుత్వ కొలువుకి ప్రయత్నించి అవమానాలపాలైంది. కానీ పట్టుదలతో శ్రమించింది. ఆమె కష్టం వృథా కాలేదు. 2017 ప్రపంచకప్ సెమీఫైనల్లో ఆస్ట్రేలియాపై 115 బంతుల్లో... 20 బౌండరీలు, ఏడు భారీ సిక్సర్లతో 171 పరుగులతో అజేయంగా నిలిచి సంచలనం సృష్టించింది. విదేశీ టీ20 లీగ్‌లో ఆడిన తొలి భారత మహిళా క్రికెటర్, టీ20లో సెంచరీ చేసిన తొలి భారతీయ మహిళ, అర్జున అవార్డు గ్రహీత... ఇలా ఎన్నో రికార్డుల్నీ అవార్డుల్నీ అందుకుంది. అయితే కెప్టెన్‌గా ఎన్నో విమర్శల్నీ సవాళ్లనీ ఎదుర్కొంది. ఏమైతేనేం, నాయకురాలిగా అద్భుత విజయాన్ని తన ఖాతాలో వేసుకుందీ సిక్స్-హిట్టింగ్ మెషీన్!

ప్రపంచ కప్ గెలిచిన ఆనందంలో... కృతజ్ఞతగా కోచ్ అమోల్ ముజుందార్‌కు పాదాభివందనం చేసి గురుభక్తిని చాటుకుని క్రీడాభిమానుల్నే కాదు, ప్రజలందరి మనసుల్నీ గెలుచుకుందీ డైనమిక్ ఆల్ రౌండర్... హర్'మన్' ప్రీత్ కౌర్!

పేదింటి వెలుగు...


- క్రాంతి గౌడ్

22 ఏళ్ల క్రాంతి గౌడ్‌ది మధ్యప్రదేశ్‌లోని ఛతర్‌పుర్ జిల్లా, ఘౌరా గ్రామం. ఇంటి ఎదురుగా ఉన్న మైదానంలో అబ్బాయిలతో కలిసి చిన్నప్పుడు క్రికెట్ ఆడటం మొదలుపెట్టింది. ఆమెకు మొదట తల్లి నుంచి ప్రోత్సాహం అందింది. ఆరుగురు సంతానంలో ఈమె చిన్న. కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే కావడంతో ఎనిమిదో తరగతిలో చదువు ఆపేసింది. ఆమెకు క్రికెట్‌పైన ఉన్న ఇష్టాన్ని గమనించి... తండ్రి, అన్నయ్య ఛతర్‌పుర్‌లో శిక్షణకు చేర్పించారు. ఈ కుటుంబ ఆర్థిక పరిస్థితిని, క్రాంతిలో వేగాన్ని చూసి కోచ్ రాజీవ్ బిల్తారే షూస్, కిట్ అందించడమే కాదు, ఉచిత శిక్షణ ఇచ్చారు. కూతురు క్రికెట్‌లో రాణించడం చూసి ఖర్చుల కోసం తన నగలు అమ్మి డబ్బు ఇచ్చింది తల్లి. విమెన్ ప్రీమియర్ లీగ్(డబ్ల్యూపీఎల్) 2025 సీజన్లో యూపీ వారియర్స్‌కు ఆడుతూ నిరూపించుకోవడంతో ఈ మేలోనే టీమ్ ఇండియాకి ఎంపికైంది. మొదటి పర్యటన శ్రీలంకలో, రెండోది ఇంగ్లండ్‌లో. ఆడింది కేవలం ఎనిమిది మ్యాచ్‌లే అయినా ప్రపంచకప్ జట్టులో స్థానం సాధించింది. సీనియర్లు గాయాలతో సతమతమవుతుంటే పేస్ దళానికి నాయకత్వం వహించింది. పాకిస్థాన్‌తో మ్యాచ్‌లో 20 పరుగులిచ్చి మూడు వికెట్లు పడగొట్టి ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా ఎంపికైంది. అమ్మాయికి క్రికెట్ ఎందుకన్న ఇరుగుపొరుగు... ఇప్పుడు క్రాంతి ఆడే ప్రతి మ్యాచ్‌నీ ఊళ్లో పెద్ద ఎల్ఈడీ తెర వేసుకుని మరీ కలిసి చూస్తున్నారట. ఎంత మార్పో!

గాయంతోనే గెలుపుని ఆస్వాదించి...


- ప్రతీకా రావల్

భారత్ మహిళల ప్రపంచకప్ గెలవగానే... టీమిండియా సభ్యులంతా అంబరాన్ని తాకేలా సంబరం చేసుకున్నారు. ఆ సమయంలో కెమెరా కళ్లన్నీ వీల్‌ఛైర్‌లోంచే డ్యాన్స్ చేస్తున్న ప్రతీకా రావల్ మీదే! ఎందుకంటే, ఈ మెగా టోర్నీలో ఏడు మ్యాచ్‌లు ఆడింది. ఓపెనర్‌గా వైస్ కెప్టెన్ స్మృతి మంధానతో కలిసి అద్భుతమైన ఆరంభాలెన్నో అందించింది. బంగ్లాతో జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో(వర్షం కారణంగా రద్దయింది) బంతిని ఆపే క్రమంలో తీవ్రగాయం కావడంతో నాకౌట్ మ్యాచ్‌లకు దూరమైంది. సెమీఫైనల్, ఫైనల్‌లో ఆడలేకపోయింది. కప్పు గెలిచిన వేళ స్మృతి... ప్రతీకను క్రచెస్‌తోనే పోడియం మీదకు తీసుకురావడంతో ఆ సంబరాల్లో భాగమైంది. ప్రతీక రావల్‌ది దిల్లీ. తండ్రి ప్రదీప్ రావల్ అంపైర్. సైకాలజీలో డిగ్రీ పూర్తి చేసిన ప్రతీక మొదట దిల్లీ, రైల్వేస్ తరపున దేశవాళీ క్రికెట్‌లో ఆడి... తన సత్తా చాటింది. ఆపై భారత మహిళల వన్డే జట్టులో చోటు సంపాదించుకుంది.

ఆట... కష్టాన్ని మరిపించింది!


- స్నేహ్ రాణా

జట్టు సీనియర్లలో స్నేహ్ రాణా ఒకరు. దశాబ్దకాలంగా మూడు ఫార్మాట్‌లలోనూ సీనియర్ జట్టుకు ఆడుతూ వస్తోంది. స్నేహ్‌ది ఉత్తరాఖండ్, దేహ్రాదూన్ దగ్గర్లోని సినాలా అనే చిన్న పల్లె. నాన్న రైతు. ఇద్దరమ్మాయిల్లో చిన్నది స్నేహ్. మగపిల్లలతో పోటీపడుతూ ఆడేది. ఊళ్లోవాళ్లంతా 'టామ్ బాయ్' అన్నా... తండ్రి మాత్రం మురిపెంగా చూసేవారు. స్కూల్లో బ్యాడ్మింటన్ నేర్చుకునేది. తర్వాత క్రికెట్‌కు మారింది. శిక్షణ తీసుకుంటానంది. ఇంటి ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రం. దగ్గర్లో శిక్షణ సంస్థ కూడా లేదు. అయినా స్నేహ్ మాట వింటేనా? కాదనలేక చేర్పించారు. రోజూ తొమ్మిది కి.మీ. ప్రయాణించాలి. కాబట్టి, కొన్నిరోజులకు మానేస్తుంది అనుకున్నారు. కానీ ఆటలోని మజా కష్టాల్ని మర్చిపోయేలా చేసింది. స్పిన్ బౌలర్‌గా, బ్యాటర్‌గా రాణించింది. తన రాష్ట్రానికి క్రికెట్ అసోసియేషన్ లేకపోవడంతో హరియాణాకి, తర్వాత రైల్వేస్‌కు మారింది. 2014 నుంచి జాతీయ జట్టులో కొనసాగుతోంది. గాయాల కారణంగా 2016, 2021లో నెలలపాటు జట్టుకు దూరమైనా తన ఆల్‌రౌండ్ ప్రతిభ కారణంగా తిరిగి రాగలిగింది. ప్రపంచకప్ లీగ్ దశలో దక్షిణాఫ్రికాపై బ్యాట్‌తో, పాకిస్థాన్‌పై బంతితో రాణించింది.

అబ్బాయిలతోనే సాధన...


- రిచా ఘోష్

గెలిచినా... ఓడినా... ఆఖరి బంతులు ఆడటానికి ధోని క్రీజులోకి వచ్చాడంటే... స్టేడియం అంతా హోరెత్తిపోతుంది. ఆయన రాక క్రీడాభిమానుల్లో నూతన ఉత్తేజం నింపుతుంది. ఎంత ఒత్తిడున్నా చివరి బంతి వరకూ ఆటలో తనదైన మార్క్ వేయడం ఆయన నైజం మరి. అదే తరహా ఆటను అందిపుచ్చుకుంది రిచా ఘోష్ కూడా. అన్నట్టు రిచాకు ప్రేరణ కూడా ఆయనే. అందుకే వికెట్ కీపర్, బ్యాటర్‌గా మారింది. పవర్ హిట్టింగ్‌తో ప్రతి బంతినీ బౌండరీ దాటించాలనే లక్ష్యంతో ఆడుతుందీమె. ఈ ప్రతిభతోనే అనతి కాలంలోనే ఫినిషర్‌గానూ గుర్తింపు తెచ్చుకుంది. రిచాది పశ్చిమ్‌బంగాలోని సిలిగుడి. నాన్న మానవేంద్ర ఘోష్ క్లబ్ క్రికెట్ ఆడేవారు. వీళ్లది మధ్యతరగతి కుటుంబం. తండ్రి ఆటను చూసే రిచాకు క్రికెట్‌పై ఇష్టం కలిగిందట. దాంతో ఆయనే కోచ్‌గా మారి రిచాకు ఆట నేర్పించారు. స్థానికంగా అమ్మాయిల టీమ్ లేకపోవడంతో... అబ్బాయిలతోనే ప్రాక్టీసు చేసేది రిచా. ఆర్థికంగా పోషణ, శిక్షణ కష్టమైనా... రిచా ఆట ఆగకుండా చూశారు. 16 ఏళ్లకే టీ20 విమెన్స్ వరల్డ్‌కప్‌తో అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగుపెట్టిందీమె. అవకాశాల్ని అందిపుచ్చుకుంటూ అంతర్జాతీయ స్థాయిలో మంచి పేరు తెచ్చుకుంది.

- వీళ్లతోపాటు భారతజట్టులో సభ్యులుగా ఉన్న హర్లీన్ డియోల్, ఉమా ఛెత్రీ, అరుంధతీ రెడ్డి, రాధా యాదవ్, రేణుకా సింగ్ ఠాకూర్‌ల గురించి www.eenadu.net లో చూడండి!

నా ఇంట్లోకి నేను వెళ్లలేనా?

మా ఆడపడుచు భర్త చనిపోయాక పిల్లల్ని తీసుకుని మా ఇంటికి వచ్చేసింది. ఆవిడ వచ్చాక గొడవలు పెరుగుతున్నాయని మేం విడిగా వేరే ఊళ్లో ఉండటం మొదలుపెట్టాం. కొన్నాళ్ల క్రితం మావారు చనిపోయారు. పిల్లలిద్దరూ ఇంటికి దూరంగా ఉంటున్నారు. ఇక, నేను ఒంటరిగా ఉండటం ఇష్టంలేక అత్తింటికే వెళ్లిపోవాలనుకున్నా. అందుకు వాళ్లు ఒప్పుకోవడం లేదు. ఒంటరిదాన్ని... నా ఇంట్లో నాకు ఉండే హక్కు లేదా? అవసరమైతే ఆమెపై కేసు పెట్టాలనుకుంటున్నా. సరైన ఆలోచనేనా? – ఓ సోదరి

డియర్ వసుంధర


జి. వరలక్ష్మి
న్యాయవాది

మీకు ఆడపడుచుతో పడక ఇంట్లో నుంచి బయటకు వచ్చేశామని చెబుతున్నారు. మరి ఇప్పుడెలా ఉండగలరు? ఆ ఇంట్లో ఇప్పుడావిడకు స్థాన బలం వచ్చింది. వృద్ధులైన తల్లిదండ్రులకు తను అండగా ఉన్నారు. ఇన్నాళ్లూ దూరంగా ఉండి కొడుకు చనిపోయాడు... కోడలితో అనుబంధం నిలుపుకోవాలి అనుకుంటే వాళ్లు రానిచ్చేవారు. కొడుకుని దూరం చేసింది అనే బాధ కూడా వారికి ఉండి ఉండొచ్చు. మీ పిల్లల్ని ముందు తాత, నానమ్మలతో బంధం పెంచుకోవడానికి ప్రయత్నించమని చెప్పండి.

రక్తసంబంధాన్ని కాదనలేక దగ్గరకి చేర్చుకుంటారు. కేసులు వేసి ఈ వయసులో వాళ్లని కోర్టుల చుట్టూ తిరిగేలా చేయడమెందుకు...

అయినప్పటికీ మిమ్మల్ని మీరు పోషించుకోలేని పరిస్థితి ఉంటే హిందూ మెయింటెనెన్స్ అండ్ అడాప్షన్ యాక్ట్‌లోని సెక్షన్-23 ప్రకారం మీ మామగారి నుంచి మెయింటెనెన్స్ కోరవచ్చు. గృహహింస చట్టం కింద నెలవారీ మెయింటెనెన్స్ కూడా తీసుకోవచ్చు. అయితే, వారికి ఆ స్థోమత ఉందని నిరూపించాలి. ఒకవేళ మీ మామగారికి పూర్వికుల ఆస్తి ఉంటే భర్త వాటా, పిల్లల తరపున పార్టిషన్ అడుగుతూ సూట్ వేయవచ్చు. అయితే, అది మామగారి పిత్రార్జితం అని నిరూపించాలి.

చర్మం రిపేర్ చేశారా?

వేడుకేదైనా ఇంట్లో కనిపించే సందడే వేరు కదూ! కానీ మనకే బోలెడు పని. అంతా పూర్తయ్యేసరికి అలసట. ఇది శరీరానికే కాదు చర్మానికీ ఉంటుంది. దీనికి తోడు ఫొటోల్లో మెరిసిపోవాలని మేకప్ టచ్ ఇస్తాం. ఇదీ చేటు చేసేదే. అందుకే, వేడుకలేవైనా తరవాత స్కిన్ రిపేర్ తప్పనిసరి.

చెమట, మేకప్ తాలూకూ అవశేషాలు చర్మరంధ్రాల్లోకి చేరి సమస్యలకి దారితీస్తాయి. అందుకే మేకప్‌ని రిమూవర్‌తో తొలగించినా... డీప్ క్లీనింగ్ తప్పనిసరి. మొదట ఆయిల్, తరవాత వాటర్ క్లెన్సర్లతో చర్మాన్ని శుభ్రం చేయాలి. లేదంటే మృతకణాలు ముఖాన్ని నిర్జీవంగా కనిపించేలా చేస్తాయి. స్క్రబింగ్ చేస్తే చర్మానికి రక్తప్రసరణ బాగా జరిగి మెరుస్తుంది. అది పూర్తవ్వగానే ఏదైనా టోనర్ రాసి, షీట్ మాస్క్ వేయండి. అది తొలగించాక మాయిశ్చరైజర్ రాస్తే సరి. వీలైనంతవరకూ ఈ ప్రక్రియను రాత్రివేళ అనుసరిస్తే మేలు. అలాగే పైపై చికిత్సే సరిపోదు. లోపల్నుంచీ పోషణ కావాలి. అసలే వేడుకలంటే విందు భోజనాలు ఖాయం. ఆ సమయంలో తినే నూనె పదార్థాలు, స్వీట్లు కూడా చర్మానికి చేటు చేసేవే. అందుకే లోపల్నుంచీ తేమ అందాలంటే నీటిని ఎక్కువగా తీసుకోవాలి. ముఖ్యంగా నిమ్మ, తేనె కలిపినవి కానీ, పుదీనా, కీర, బెర్రీలు వేసిన నీటినిగానీ ఎక్కువగా తీసుకోవాలి. ఇవి పోషకాలను అందిస్తూనే సహజంగా మెరవడంలోనూ సాయపడతాయి.



పదేళ్లుగా స్వచ్ఛ భారత్

ఒడిశాలోని బలంగీర్‌కు చెందిన వైద్యుడు మన్మోహన్ బాగ్.. గత పదేళ్లుగా స్వచ్ఛ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరిస్తున్నారు. పర్యావరణాన్ని రక్షించడానికి స్వచ్ఛందంగా ఆయన ఈ పని చేస్తున్నారు. ఏటా 1,000 టన్నుల చెత్తను ఆయన సేకరిస్తారు. రీసైక్లింగ్ చేయిస్తారు. రోజుకు 12 నుంచి 14 గంటలపాటు ఈ పనులకు తన సమయాన్ని ఆయన కేటాయిస్తారు. ఈ ప్రక్రియలో ఆయన కొంతమంది



మహిళలు, యువతకు ఉపాధి కల్పిస్తున్నారు. బలంగీర్‌లోని భీమా భోయ్ వైద్య కళాశాలలో ఆయన పని చేస్తున్నారు.

నక్సల్స్ ఇలాకాలో సినిమా షూటింగ్

ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ప్రాంతంలో ఉన్న అబూజ్‌మడ్ ఒకప్పుడు తుపాకీ మోతలతో దద్దరిల్లేది. అక్కడి సహజ అందాలు, దట్టమైన అడవులు, చూడచక్కని కొండ ప్రాంతాలు, పచ్చిక బయళ్లు దశాబ్దాలపాటు రక్తమోడాయి. నక్సల్స్ కార్యకలాపాల కారణంగా ఆ ప్రాంతంలో హింస, భయం రాజ్యమేలాయి. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌తో



ఇప్పుడా ప్రాంతంలో ప్రశాంత పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో ఈ ప్రాంతంలోని మాస్‌పూర్ సినిమా షూటింగ్‌లతో కళకళలాడుతోంది. అక్కడ దండా కోటుమ్ అనే సినిమా చిత్రీకరణ సాగుతోంది. మాస్‌పూర్‌కు 200 మీటర్ల దూరంలో పోలీస్ క్యాంపు కొనసాగుతోంది. దీంతో సినిమా షూటింగ్‌లు స్వేచ్ఛగా జరుగుతున్నాయి.

ఖర్జూర చెట్ల ఆకులతో కళాకృతులు

ఒడిశాలోని పూరీ జిల్లా కాకత్‌పుర్‌కు చెందిన 24 ఏళ్ల సత్యజిత్ మహారాణా.. ఖర్జూర చెట్ల ఆకులతో అద్భుత కళాకృతులను తయారు చేస్తున్నారు. వాటితో ఆయన పుష్పగుచ్ఛాలు, లోటస్, రోజెస్, సన్‌ఫ్లవర్ ఆకారంలో పలు వస్తువులను రూపొందిస్తున్నారు. లైట్లకు కవర్లనూ తయారు చేస్తున్నారు. భువనేశ్వర్‌లో ఆదివారం జరిగిన ఆర్ట్ ఎగ్జిబిషన్‌లో ఆయన వాటిని ప్రదర్శించారు. ప్లాస్టిక్‌కు



ప్రత్యామ్నాయంగా వినియోగించేందుకు వాటిని తయారు చేస్తున్నట్లు సత్యజిత్ తెలిపారు.

కుటుంబ వారసత్వ రాజకీయాలు ప్రజాస్వామ్యానికి తీవ్ర ముప్పు

కాంగ్రెస్ నేత శశి థరూర్ వ్యాఖ్య



దిల్లీ: భారత ప్రజాస్వామ్యానికి కుటుంబ వారసత్వ రాజకీయాలు తీవ్ర ముప్పుగా మారాయని కాంగ్రెస్ నేత శశి థరూర్ వ్యాఖ్యానించారు. రాజకీయ అధికారాన్ని సామర్థ్యం, నిబద్ధత, క్షేత్రస్థాయి బలం కన్నా.. కుటుంబ వారసత్వాలు నిర్ణయిస్తే పరిపాలన దెబ్బతింటుందని పేర్కొన్నారు. దేశంలో ఇలాంటి విధానాలకు స్వస్తి పలకాల్సిన సమయం ఆసన్నమైందని చెప్పారు. 'భారత రాజకీయాలు - కుటుంబ వ్యవహారాలు' అనే శీర్షికతో ఓ అంతర్జాతీయ మీడియా సంస్థకు గత నెల 31న రాసిన వ్యాసంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "భారత రాజకీయాల్లో ఒక కుటుంబం దశాబ్దాలుగా పాతుకుపోయింది. కాంగ్రెస్‌కు చెందిన మాజీ ప్రధానులు నెహ్రూ నుంచి ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ వరకు.. ఆ తర్వాత ప్రస్తుత కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ వరకు నెహ్రూ-గాంధీల కుటుంబం వారసత్వాలతోనే ముడిపడి ఉన్నారు. ఇది ఏ ఒక్క ప్రాంతానికో, పార్టీకో పరిమితం కాలేదు. ఒడిశాలో పట్నాయక్‌లు, మహారాష్ట్రలో ఠాక్రేలు, ఉత్తర్‌ప్రదేశ్‌లో ములాయం కుటుంబం ఇలా ప్రతిచోటా రాజకీయ నాయకత్వం జన్మహక్కు అన్నట్లు కుటుంబ వారసత్వాలు పాతుకుపోయాయి" అని థరూర్ అందులో పేర్కొన్నారు.



జ్ఞానాన్ని బుట్టదాఖలు చేయకండి

జ్ఞానం ఓ పనికిరాని చెత్తతో సమానం- దాన్ని ఉపయోగించనంతవరకూ. జ్ఞానం లోకాన్ని విధ్వంసం చేసే విపత్తు- దాన్ని దుర్వినియోగం చేసినప్పుడు. అందుకే జ్ఞానసముపార్జనతోనే ఆగిపోకండి. దాన్ని సమాజ పురోగతి కోసం వినియోగించండి.

– ఆర్యన్ కాకడ్, యూట్యూబర్

అమెరికా హైర్ ఆందోళనకరం

- ఆ చట్టంతో మన ఐటీ సేవలు, వాటి ఎగుమతులపై ప్రభావం
- ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రఘురాం రాజన్

దిల్లీ: అమెరికాలో ప్రతిపాదిత అంతర్జాతీయ ఉపాధి తరలింపు నిలిపివేత(హెచ్ఐఆర్ఈ-హైర్) చట్టం.. హెచ్-1బీ వీసా రుసుం లక్ష డాలర్లకు పెంపు కంటే ఆందోళనకరమని ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రఘురాం రాజన్ పేర్కొన్నారు. ముఖ్యంగా ఈ పరిణామం మనదేశానికి తీవ్ర నష్టం కలిగిస్తుందన్నారు. హైర్ చట్టం అమల్లోకి వస్తే అన్నిరకాల అవుట్‌సోర్సింగ్ సేవలపైనా సుంకాలు విధించే అవకాశం ఉందన్నారు. ఇది మనదేశానికి చెందిన ఐటీ సేవలు వాటి ఎగుమతులపై ప్రత్యక్షంగా ప్రభావం



చూపుతుందన్నారు. "మన దేశ వస్తువులపై సుంకాల విధింపు కంటే అత్యంత ఆందోళనకరమైన అంశమేంటంటే.. అమెరికా యంత్రాంగం మన ఐటీ సేవలపై సుంకాలు విధించేందుకు మార్గాలను అన్వేషిస్తుందా? లేదా? అన్నదే. ఇదే అతిపెద్ద ముప్పు" అని రఘురాం రాజన్ అన్నారు. అవుట్‌సోర్సింగ్ సేవలు లక్ష్యంగా రూపొందించిన హైర్ చట్టంపై అమెరికా కాంగ్రెస్ చర్చిస్తోందన్నారు. హెచ్-1బీ వీసా ఫీజు పెంపు సమస్యపై రఘురాం రాజన్ స్పందిస్తూ.. ఇప్పటికే ఈ వీసాను పొంది ఉన్నవారు, స్టెమ్ కోర్సులు చేస్తున్న విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది ఉండదని అభిప్రాయపడ్డారు.

అసలు ఏమిటీ చట్టం?

అమెరికా కంపెనీలు తమ పనిని ఇతర దేశాలకు అవుట్‌సోర్స్ చేయడాన్ని నిరుత్సాహపరిచి దేశంలో ఉద్యోగ సృష్టికి ప్రోత్సాహం అందించాలన్నది హైర్ చట్టం ప్రధాన ఉద్దేశం. అమెరికాలో అందించే సేవల కోసం విధులు నిర్వహించే విదేశాల్లోని ఉద్యోగుల జీతభత్యాల మొత్తాలపై 25 శాతం సుంకం విధించాలనేది చట్టంలో ప్రతిపాదన. ఇది విదేశాల్లో అవుట్‌సోర్సింగ్ ద్వారా ప్రాజెక్టులు నిర్వహించుకునే అమెరికా సంస్థలకు మోయలేని భారంగా మారనుంది. అదేవిధంగా అవుట్‌సోర్సింగ్ చెల్లింపులను పన్ను మినహాయింపు ఖర్చులుగా కూడా చూపించుకునే అవకాశాన్ని కోల్పోతాయి. ఈ సుంకాల ద్వారా సమకూరే మొత్తాన్ని అమెరికాలో నూతన దేశీయ మానవ వనరుల నిధికి జమ చేస్తారు. ఈ నిధులను అమెరికాలోని ఉద్యోగుల నైపుణ్యాలను పెంచేందుకు అవసరమైన శిక్షణ, అప్రెంటీస్‌షిప్ కార్యక్రమాలకు వినియోగిస్తారు. తద్వారా వారికి ఉద్యోగాల్లో మరిన్ని అవకాశాలు దక్కేలా చూస్తారు.

ఆర్జేడీ-కాంగ్రెస్‌లది ప్రమాదకర కుట్ర

- చొరబాటుదారుల్ని ఆ నేతలు ప్రోత్సహిస్తున్నారు
- బిహార్‌లో ప్రధాని మోదీ ఆరోపణ

కటిహార్: చొరబాటుదారుల్ని ప్రోత్సహించి, సీమాంచల్ ప్రాంతంలో జనాభాపరమైన మార్పుల్ని తీసుకువచ్చేందుకు ఆర్జేడీ-కాంగ్రెస్ ప్రమాదకరమైన కుట్రపన్నుతున్నాయని ప్రధాని మోదీ ఆరోపించారు. బిహార్‌లో ముస్లింల జనాభా ఎక్కువగా ఉన్న జిల్లాల్లో ఒకటైన కటిహార్‌లో సోమవారం ఎన్నికల ప్రచార సభలో ఆయన ప్రసంగించారు. అతివాదులకు విపక్షం లొంగిపోతోందని విమర్శించారు. కటిహార్, అరరియా, పూర్ణియా వంటి జిల్లాల్లో విపక్షం



ఎలాంటి కుట్రలు చేస్తోందో ప్రజలు గుర్తించాల్సిన అవసరం ఉందని చెప్పారు. "సీమాంచల్ ప్రాంతమంటే మన సంస్కృతి, నాగరికతలకు కావలి లాంటిది. ఇలాంటి చోట్ల కొన్నేళ్లుగా ఆర్జేడీ, కాంగ్రెస్ కుట్రలు చేస్తున్నాయి. కేవలం కొన్ని ఓట్ల కోసం.. మీ పిల్లల భవితవ్యాన్ని ప్రమాదంలో పడేస్తున్నాయి. చొరబాటుదారుల్ని తరిమికొట్టాల్సిన అవసరాన్ని ఎన్డీయే చెబుతుంటే విపక్షాలు మాత్రం వారికి వత్తాసు పలుకుతున్నాయి. అతివాదులన్నా, నాటు పిస్తోళ్లన్నా ఆ రెండు పార్టీలకు ఎంతో ప్రేమ" అని మోదీ పేర్కొన్నారు.



భూకంప తీవ్రతకు ఖుల్మ్‌లో ధ్వంసమైన ఇళ్లు

అఫ్గాన్‌లో భారీ భూకంపం.. 20 మంది మృతి

640 మందికి గాయాలు

కాబుల్: ఉత్తర అఫ్గానిస్థాన్‌లో 6.3 తీవ్రతతో సంభవించిన భారీ భూకంపం కారణంగా కనీసం 20 మంది మృతిచెందారని, 640 మందికి పైగా గాయపడ్డారని అధికారులు తెలిపారు. ఖుల్మ్ పట్టణానికి 22 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం ఉందని అమెరికా జియోలాజికల్ సర్వే తెలిపింది. ఇది ఆదివారం అర్ధరాత్రి దాటాక 12:59 గంటలకు సంభవించిందని స్పష్టం చేసింది. శాహర్ ఏ బోజోర్గ్ జిల్లాలోని ఓ గ్రామంలో 800 ఇళ్లు పూర్తిగా నేలమట్టమయ్యాయి. భూకంపం.. బల్ఖ్, సమంగన్, బాగలాన్ ప్రావిన్స్‌లను తాకిందని తాలిబన్ ప్రభుత్వ ప్రతినిధి జబీహుల్లాహ్ ముజాహిద్ 'ఎక్స్'లో పేర్కొన్నారు. ఉత్తర బల్ఖ్ ప్రావిన్స్ రాజధాని మజార్-ఏ-షరీఫ్‌లో కూడా భూకంప ప్రభావం పడడంతో చరిత్రాత్మక బ్లూ మసీదు దెబ్బతిన్నట్లు తెలుస్తోంది.

80% రైతుల వార్షికాదాయం రూ.60వేలలోపే: నీతి ఆయోగ్

ఈనాడు, దిల్లీ: దేశంలో దాదాపు 80% మంది రైతుల వార్షికాదాయం రూ.17వేల నుంచి రూ.60 వేలలోపే ఉందని నీతి ఆయోగ్ పేర్కొంది. భూ కమతాలు 2 హెక్టార్లలోపే ఉండటం, వర్షాల మీదే ఆధారపడటం, ఒక ట్రెండు పంటల సాగుకే పరిమితంకావడం, అవి కూడా ఆహార ధాన్యాలే కావడం వీరి ఆదాయం తక్కువగా ఉండటానికి కారణమని పేర్కొంది. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవడంలోనూ అల్పాదాయ రైతులు వెనుకబడి ఉన్నారని సోమవారం విడుదల చేసిన 'రీ ఇమాజినింగ్ అగ్రికల్చర్: ఎ రోడ్ మ్యాప్ ఫర్ ఫ్రాంటియర్ టెక్నాలజీ లెడ్ ట్రాన్స్‌ఫర్మేషన్' నివేదిక పేర్కొంది. దేశంలో వ్యవసాయ ఖర్చు గత నాలుగేళ్లలో 40%దాకా పెరిగినట్లు వెల్లడించింది.

- పూర్తి వివరాలు www.eenadu.net లో..

పాక్ అణ్వాయుధ పరీక్షలు నిర్వహిస్తోంది

- చైనా, రష్యా కూడా..
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంచలన వ్యాఖ్యలు

వాషింగ్టన్: పాకిస్థాన్ అణ్వాయుధ పరీక్షలు నిర్వహిస్తోందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. "పరీక్షలు నిర్వహిస్తున్నామని ఎవరికీ చెప్పరు. ఎక్కడ పరీక్ష చేస్తున్నారో తెలియదు. భూగర్భంలో నిర్వహిస్తారు. ఈ విషయం ఎవరికీ తెలియదు" అని ఆయన పేర్కొన్నారు. పాకిస్థాన్ లాంటి దేశం నిర్వహిస్తున్నప్పుడు తాము కూడా అణు ఆయుధాలను పరీక్షించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ మేరకు ఇప్పటికే




రక్షణశాఖకు ట్రంప్ ఇటీవల ఆదేశాలిచ్చారు. పాక్‌తో పాటు.. చైనా, రష్యా, ఉత్తరకొరియా కూడా అణ్వాయుధ పరీక్షలు జరుపుతున్నాయని సీబీఎస్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో అమెరికా అధ్యక్షుడు తెలిపారు. ఈ వ్యాఖ్యలను చైనా ఖండించింది. తాము అణ్వాయుధ పరీక్షల నిషేధానికి కట్టుబడి ఉన్నామని పేర్కొంది. పాకిస్థాన్ మాత్రం ఇప్పటివరకు స్పందించకపోవడం గమనార్హం. తైవాన్ అంశంపైనా ట్రంప్ మాట్లాడారు. ఆ దేశంపై దాడి చేస్తే ఎలాంటి పరిణామాలు ఉంటాయో చైనాకు బాగా తెలుసన్నారు. తన హయాంలో దాడికి పాల్పడే సాహసం చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ చేయరని అన్నారు.

రూ.3 వేల కోట్లు కొల్లగొట్టారా..

- డిజిటల్ అరెస్టు కేసులపై సుప్రీంకోర్టు విస్మయం
- వీటిని ఉక్కుపాదంతో అణచివేయాలని వ్యాఖ్య

దిల్లీ: దేశవ్యాప్తంగా ఇటీవలి కాలంలో పెచ్చరిల్లుతున్న డిజిటల్ అరెస్టు కేసులు, సైబర్ మోసాలపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. ఈ మోసాలను ఉక్కుపాదంతో అణచివేయాల్సిన అవసరం ఉందని జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం పేర్కొంది. డిజిటల్ అరెస్టు కేసులు, సైబర్ నేరాలపై కొద్దిరోజులుగా సుప్రీంకోర్టులో విచారణ జరుగుతోంది. "ఒక్క మనదేశంలోనే ఈ అరెస్టు బాధితుల నుంచి రూ.3వేల కోట్లు కొల్లగొట్టడం దిగ్భ్రాంతికరం. వీటిపై కఠినమైన ఉత్తర్వులు జారీ చేయకపోతే.. ఈ సమస్య మరింత పెద్దదవుతుంది" అని ధర్మాసనం పేర్కొంది. "డిజిటల్ అరెస్ట్ సమస్య పెద్ద సవాల్‌గా ఉంది. ఇతర దేశాల్లో ఎలాంటి పరిస్థితి ఉందో తెలియదు. సాంకేతిక, ఆర్థిక విభాగాలు ఎలా పనిచేస్తున్నాయో తెలియదు. ఆ విభాగాలు మరింత సమర్థంగా పనిచేసేందుకు



చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది" అని హెచ్చరించింది. ఇలాంటి కేసుల్లో బాధితులు ఎక్కువగా వయోధికులే ఉండటం అత్యంత దయనీయమని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా న్యాయస్థానానికి వెల్లడించారు. అలాగే ఈ కేసుల్లో ఫిర్యాదులపై దర్యాప్తు చేసేందుకు కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక యూనిట్ ఉందని తెలిపిన మెహతా.. ఈ అంశంలో సమగ్ర వివరాలు దాఖలు చేసేందుకు సమయం కావాలని కోరారు. దేశవ్యాప్తంగా ఈ మోసాలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో మొత్తం వ్యవహారంపై దర్యాప్తును సీబీఐకి అప్పగించాలని యోచిస్తున్నట్లు గత విచారణలో సుప్రీంకోర్టు పేర్కొంది. దేశవ్యాప్తంగా విభిన్న రాష్ట్రాల్లో నమోదైన ఎఫ్ఐఆర్‌లను కలిపి విస్తృతస్థాయిలో దర్యాప్తు జరిపే సాంకేతిక, సిబ్బందిపరమైన వనరులు సీబీఐకి ఉన్నాయా? అని కూడా ఆరా తీసింది. ఇందుకు మెహతా సమాధానం ఇస్తూ ఇప్పటికే సీబీఐ ఇలాంటి మోసాలపై దర్యాప్తు చేస్తోందని చెప్పారు. కేంద్రహోంశాఖ పరిధిలోని సైబర్ క్రైమ్ డివిజన్ నుంచి ఇందుకు అవసరమైన సాంకేతిక సాయం అందుతున్నట్లు వివరించారు.

అసదుద్దీన్ అభ్యర్థనపై విచారణకు సుప్రీం సుముఖత

వక్ఫ్ ఆస్తుల రిజిస్ట్రేషన్‌కు మరింత గడువు కోరిన ఎంఐఎం అధినేత

దిల్లీ: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'ఏకీకృత వక్ఫ్ నిర్వహణ, సాధికారత, సమర్థత, అభివృద్ధి చట్టం' (యుఎంఈఈడి-ఉమీద్) పోర్టల్‌లో వక్ఫ్ ఆస్తులన్నింటినీ రిజిస్ట్రేషన్ చేసేందుకు విధించిన గడువును పెంచాలని కోరుతూ ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు సోమవారం అంగీకరించింది. విచారణ తేదీని ఖరారు చేస్తామని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్ ధర్మాసనం తెలిపింది. అసదుద్దీన్ దాఖలు చేసిన ఈ పిటిషన్‌పై అక్టోబరు 28నే విచారణ జరగాల్సింది. అయితే, ఆ రోజు విచారణకు రాకపోవడంతో సోమవారం సీజేఐ ధర్మాసనం ముందు అసదుద్దీన్ తరఫు న్యాయవాది ప్రస్తావించారు. కేంద్ర ప్రభుత్వం విధించిన 6 నెలల గడువు త్వరలోనే ముగియనుందని తెలిపారు.

మూకదాడుల బాధితులకు పరిహారంపై ఉలేమా ఎ హింద్ పిటిషన్ కొట్టివేత

దిల్లీ: ఉత్తర్‌ప్రదేశ్‌లో మూకదాడుల బాధితులకు పరిహారం చెల్లించేలా ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ 'ఉలేమా ఎ హింద్' దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం కొట్టివేసింది. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వాన్ని సంప్రదించాలంటూ అలహాబాద్ హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వులో జోక్యం చేసుకోవడానికి జస్టిస్ జె.కె.మహేశ్వరి, జస్టిస్ విజయ్ బిష్ణోయి ధర్మాసనం నిరాకరించింది. మూకదాడుల బాధితులకు పరిహారం చెల్లించాలని సూచిస్తూ గతంలో సర్వోన్నత న్యాయస్థానం మార్గదర్శకాలు జారీ చేసిందని, వాటిని అమలయ్యేలా చూడాలని తొలుత అలహాబాద్ హైకోర్టును, ఆ తర్వాత సుప్రీంకోర్టును ఆ సంస్థ ఆశ్రయించింది.

పార్టీ నిబంధనలను అధికారిక వెబ్‌సైట్‌లో ప్రచురించాలి

ఈ మేరకు ఆదేశాలు జారీ చేస్తాం: సుప్రీంకోర్టు

దిల్లీ: ప్రతి రాజకీయ పార్టీ తమ అధికారిక వెబ్‌సైట్‌లో పార్టీ నిబంధనలను ప్రచురించేలా ఎన్నికల సంఘం(ఈసీ) మార్గదర్శకాలు జారీ చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు సానుకూలంగా స్పందించింది. ఈ మేరకు ఈసీకి సోమవారం నోటీసులు జారీ చేసింది. చాలా బలమైన అడ్డంకులుంటే తప్ప ఈ అంశంపై తాము కొన్ని ఆదేశాలు జారీ చేస్తామని తెలిపింది. మరో కేసులో దిల్లీ-ఎన్సీయార్‌లో వాయు కాలుష్యం మరింత దిగజారకుండా నిరోధించడానికి తీసుకుంటున్న చర్యలపై అఫిడవిట్ సమర్పించాలని కమిషన్ ఫర్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ (సీఏక్యూఎం)ను సుప్రీంకోర్టు సోమవారం ఆదేశించింది.

ఏడాదిలో 29 కీమోథెరపీ సెషన్లు, 3 సర్జరీలు

రొమ్ము క్యాన్సర్‌ను జయించిన జయాజైట్లీ

ఈటీవీ భారత్: ప్రాణాంతక క్యాన్సర్ వ్యాధిని 83 ఏళ్ల జయా జైట్లీ జయించారు. అంత పెద్ద వయసులోనూ రొమ్ము క్యాన్సర్‌తో ఆమె పోరాడి విజయం సాధించారు. జయా జైట్లీ సామాజిక కార్యకర్త, రక్షణశాఖ మాజీ మంత్రి జార్జ్ ఫెర్నాండెజ్‌కు సన్నిహితురాలు. గతేడాది మే నెలలో ఆమెకు రొమ్ము క్యాన్సర్ ఉన్నట్లు నిర్ధారణైంది. విదేశీ పర్యటనకు వెళ్లడానికి సిద్ధమవుతున్న సమయంలో టెస్టులు చేయించుకోగా ప్రాణాంతక వ్యాధి బయటపడింది. బ్రెస్ట్ క్యాన్సర్ స్టేజ్ 3లో ఉన్నట్లు తెలిసింది. దీంతో జయా జైట్లీ.. దిల్లీలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స తీసుకోవడం ప్రారంభించారు. ఏడాది వ్యవధిలో 29 కీమోథెరపీ సెషన్లు, మూడు సర్జరీలు, సమతుల్య ఆహారం తీసుకుని రొమ్ము క్యాన్సర్‌ను ఓడించానని ఆమె వెల్లడించారు. 'ప్రస్తుతం నా వయసు 83 ఏళ్లు. ఈ ఏడాది మేలో నా క్యాన్సర్ చికిత్స పూర్తైంది. అప్పటి నుంచి బాగానే ఉన్నాను. ఎటువంటి ఆరోగ్య సమస్యలు లేవు' అని నవంబరు 7న క్యాన్సర్ అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇటీవల జరిగిన ఒక కార్యక్రమంలో జయాజైట్లీ వివరించారు.

బిహార్‌లో భాజపా ప్రచారాన్ని పరిశీలించిన దౌత్యవేత్తలు

దిల్లీ: భాజపా తరఫున బిహార్ ఎన్నికల్లో ప్రచారం కొనసాగుతున్న తీరు, ప్రజల నుంచి వస్తున్న స్పందనను విదేశీ దౌత్యవేత్తల బృందం పరిశీలించింది. సోమవారం ఆరాలో ప్రధాని నరేంద్రమోదీ ప్రసంగించిన సభను వారు ప్రత్యక్షంగా తిలకించారు. జపాన్, ఇండోనేసియా, డెన్మార్క్, ఆస్ట్రేలియా, బ్రిటన్, భూటాన్, దక్షిణాఫ్రికాలకు మన దేశంలో దౌత్యవేత్తలుగా వ్యవహరిస్తున్నవారు ఈ బృందంలో ఉన్నారు. రెండ్రోజుల పర్యటన నిమిత్తం వారు ఆదివారం బిహార్‌కు వెళ్లారు. సభల్లో ప్రజల ఉత్సాహాన్ని వారు స్వయంగా చూశారని భాజపా విదేశీ వ్యవహారాల విభాగం బాధ్యుడు విజయ్ చౌథాయివాలె తెలిపారు. భాజపా సీనియర్ నేతలు రవిశంకర్ ప్రసాద్, ధర్మేంద్ర ప్రధాన్, వినోద్ తావ్డే తదితరులనూ దౌత్యవేత్తలు కలిశారు. పట్నాలో పార్టీ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించి మరికొందరు నేతలతో సమావేశమై పార్టీ సంస్థాగత నిర్మాణం, కమ్యూనికేషన్ వ్యూహాలు, ఎన్నికల నిర్వహణ విధానాన్ని పరిశీలించారు.

14న రాహుల్, లాలూ పార్టీలు తుడిచిపెట్టుకుపోతాయ్: అమిత్ షా



శివ్‌హర్: బిహార్‌లో ఎన్డీయే అధికారంలోకి వస్తే డిఫెన్స్ కారిడార్‌తోపాటు పారిశ్రామిక నడవాలు ప్రతిజిల్లాలో ఏర్పాటవుతాయని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చెప్పారు. సోమవారం శివ్‌హర్, సీతామఢీ జిల్లాల్లో ఎన్నికల ప్రచార సభల్లో ఆయన పాల్గొన్నారు. ఈ నెల 14న మధ్యాహ్నం ఒంటిగంట కల్లా ఆర్జేడీ-కాంగ్రెస్‌లు తుడిచిపెట్టుకుపోతాయని, మళ్లీ ఎన్డీయే సర్కారే కొలువుదీరుతుందని జోస్యం చెప్పారు. సీతామందిర్‌కు ప్రాణప్రతిష్ఠ చేసినరోజే సీతామఢీ నుంచి అయోధ్యకు వందే భారత్ రైలును ప్రారంభిస్తామని వెల్లడించారు. మహాగఠ్‌బంధన్ అన్నివిధాలా అయోమయంలో ఉందని విమర్శించారు. కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద రైతులకిచ్చే రూ.6,000ను రూ.9,000కు పెంచనున్నట్లు ప్రకటించారు.

బెల్జియం సుప్రీంకోర్టును ఆశ్రయించిన మెహుల్ ఛోక్సీ



దిల్లీ: ఆర్థిక నేరగాడు మెహుల్ ఛోక్సీని అప్పగించాలన్న భారత్ అభ్యర్థన ఆమోదయోగ్యమైనదేనంటూ బెల్జియంలోని యాంట్వెర్ప్ న్యాయస్థానం అక్టోబరు 17న ఇచ్చిన తీర్పును అక్కడి సుప్రీంకోర్టులో ఛోక్సీ సవాల్ చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ అభ్యర్థన న్యాయపరమైన అంశాలకు లోబడి ఉంటుందని, దీన్ని బెల్జియం సుప్రీంకోర్టు విచారిస్తుందని పేర్కొన్నారు. కాగా, పంజాబ్ నేషనల్ బ్యాంక్‌కు రూ.13 వేల కోట్లు ఎగ్గొట్టి, పారిపోయిన ఛోక్సీ బెల్జియంలో బందీగా ఉన్న విషయం తెలిసిందే!

45 మంది పాలస్తీనియన్ల మృతదేహాలను అప్పగించిన ఇజ్రాయెల్

డెయిర్-అల్ బలా: గాజా కాల్పుల విరమణ ఒప్పందం తొలి దశలో భాగంగా మృతదేహాల అప్పగింత కార్యక్రమం కొనసాగుతోంది. 45 మంది పాలస్తీనియన్ల భౌతిక కాయాలను హమాస్‌కు ఇజ్రాయెల్ సోమవారం అప్పగించింది. అంతకుముందు ముగ్గురు బందీల మృతదేహాలను రెడ్‌క్రాస్ ద్వారా ఇజ్రాయెల్‌కు హమాస్ పంపింది. ఈ మూడూ.. 2023 అక్టోబరు 7న హమాస్ చేసిన దాడిలో చనిపోయిన సైనికుల మృతదేహాలుగా గుర్తించినట్లు ఇజ్రాయెల్ అధికారులు తెలిపారు.

అవమానాల శాఖను ఏర్పాటు చేయండి

- ప్రధానిపై ప్రియాంకా గాంధీ విమర్శలు

సహర్సా: కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకా గాంధీ ప్రధానమంత్రి మోదీపై తీవ్ర విమర్శలు చేశారు. దేశాన్ని, బిహార్‌ను అవమానించారంటూ ప్రతిపక్ష నేతలందరిపై ప్రధానమంత్రి మోదీ ముద్ర వేస్తున్నారని మండిపడ్డారు. దీనికోసం కేంద్రంలో కొత్తగా 'అవమానాల మంత్రిత్వ శాఖ'ను ఏర్పాటు చేయాలని ఎద్దేవా చేశారు. బిహార్‌లోని సహర్సా జిల్లా సోనాబర్సాలో నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో పాల్గొన్న ప్రియాంక.. ఈ మేరకు వ్యాఖ్యానించారు. 'ప్రధాని అనవసరపు విషయాలపై మాట్లాడతారు తప్ప, బిహార్‌లోని ఎన్డీయే ప్రభుత్వపు అవినీతి, వైఫల్యం, నిరుద్యోగం గురించి ఒక్కమాట మాట్లాడరు. అభివృద్ధి గురించి మాట్లాడాల్సింది పోయి, ప్రతిపక్షనేతల మీద నిందలు వేస్తుంటారు. ప్రధానిని ఏదైనా ప్రశ్న అడగాలనుకుంటే ఆయన భూగోళ పర్యటనలోనైనా ఉంటారు లేదా అందరూ నిందిస్తారని విచారిస్తారు. ఇలా తప్పించుకుని తిరిగే బదులు.. ప్రభుత్వ వైఫల్యం గురించి యువతకు, ప్రజలకు చెప్పాలి' అని విమర్శలు గుప్పించారు.



సహర్సా జిల్లాలోని సోనాబర్సా వద్ద ర్యాలీలో ప్రజలకు అభివాదం చేస్తున్న ప్రియాంకాగాంధీ

బిహార్ ప్రభుత్వాన్ని నీతీశ్ కుమార్ నడపడం లేదని, దిల్లీ నుంచి 'రిమోట్ కంట్రోల్' ద్వారా నియంత్రిస్తున్నారని మండిపడ్డారు. బిహార్‌లో ప్రజల ఓటు హక్కులను ఎన్డీయే బెదిరింపుల ద్వారా అణచివేస్తోందని ఆరోపించారు. అగ్నిపథ్ పథకం అటు దేశానికి గానీ, ఇటు యువతకు గానీ ఉపయోగపడడం లేదన్నారు. దేశానికి సేవ చేయాలని కలలు కంటోన్న లక్షల మంది యువత భవిష్యత్తుతో ఎందుకు ఆటలాడుతున్నారో సమాధానం చెప్పాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఎన్డీయే మళ్లీ వచ్చినా నీతీశ్‌ను సీఎంను చేయదు: ఖర్గే



హాజీపుర్: బిహార్‌లో ఎన్డీయే తిరిగి అధికారంలోకి వచ్చినా.. నీతీశ్‌కుమార్‌ను మాత్రం మళ్లీ ముఖ్యమంత్రిని చేయదని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యానించారు. దానికి బదులుగా కాషాయ పార్టీలోని మరొకరికి ఆ పదవి కట్టబెడుతుందన్నారు. బిహార్‌లోని వైశాలీ జిల్లా రాజాపకర్ వద్ద సోమవారం నిర్వహించిన తొలి ఎన్నికల ర్యాలీలో ఆయన ప్రసంగించారు. "మనుస్మృతిని నమ్మే భాజపా ఒడిలో నీతీశ్ కూర్చున్నారు. సోషలిస్టు చిహ్నాలైన జయప్రకాశ్ నారాయణ్, రామ్ మనోహర్ లోహియా, కర్పూరీ ఠాకుర్‌ల వారసత్వాన్ని మోసం చేశారు. మోదీ, నీతీశ్ తమ కుర్చీలను కాపాడుకోవడం కోసమే పాకులాడుతారు. ప్రపంచ పర్యటనలు చేయడానికి మోదీకి సమయం ఉంటుంది గానీ రాష్ట్ర పరిస్థితుల విశ్లేషణకు తీరిక ఉండదు. ఆయన ఎన్నికల సమయంలోనే కనిపిస్తారు. మున్సిపల్ ఎన్నికలైతే నగర వీధుల్లో దర్శనమిస్తారు. మోదీ, నీతీశ్ ఇప్పటికీ యువతకు ఉద్యోగాలు కల్పించలేదు. బిహార్‌లో వలసలను ఆపలేదు" అని ఖర్గే దుయ్యబట్టారు. బిహార్‌లో రూ.70 వేల కోట్ల కుంభకోణానికి ఎన్డీయే పాల్పడిందని ఆరోపించారు. మోదీని ఎవరైనా ధైర్యంగా ప్రశ్నించడానికి సాహసం చేస్తే వారిపై దేశద్రోహులుగా ముద్ర వేస్తారని మండిపడ్డారు.

ప్రధాని ర్యాలీలకు నీతీశ్ ఎందుకు రాలేదు?

బిహార్‌లో ప్రధాని మోదీ నిర్వహించిన ఎన్నికల ర్యాలీలకు నీతీశ్ ఎందుకు గైర్హాజరయ్యారని ఖర్గే ప్రశ్నించారు. భాజపా నాయకులు ఆయనపై కుట్రలు పన్నుతున్నారని, ఎన్డీయే మ్యానిఫెస్టో విడుదల సమయంలోనూ ఆయన మాట్లాడటానికి అనుమతించలేదని ఆరోపించారు. నీతీశ్ మళ్లీ సీఎం కాబోరనడానికి ఇదే నిదర్శనమన్నారు. పట్నాలో విలేకరులతో ఖర్గే మాట్లాడుతూ మోదీని అబద్ధాల రారాజుగా అభివర్ణించారు. ఇది అభ్యంతరకర భాష అని భాజపా ఖండించింది. వివిధ రంగాల్లో బిహార్ సాధిస్తున్న అభివృద్ధి కాంగ్రెస్ పార్టీకి కనిపించడం లేదా అని ప్రశ్నించింది.

రాష్ట్రాల్లో నేటి నుంచి ఓటర్ల జాబితాల ప్రక్షాళన

దిల్లీ: దేశంలో తొమ్మిది రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితాల ప్రక్షాళన మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. 'ప్రత్యేక ముమ్మర సవరణ' (ఎస్ఐఆర్) పేరుతో మొత్తం 51 కోట్లమంది ఓటర్ల పరిశీలనను చేపట్టి వచ్చేఏడాది ఫిబ్రవరి 7న తుది జాబితాలను ప్రచురించనున్నారు. ఉత్తర్‌ప్రదేశ్, పశ్చిమబెంగాల్, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, కేరళ, మధ్యప్రదేశ్, పుదుచ్చేరి, రాజస్థాన్, తమిళనాడు, అండమాన్-నికోబార్ దీవులు, లక్షద్వీప్, గోవాలలో ఒకేసారి ఎస్ఐఆర్ చేపడుతున్నారు. డిసెంబరు 4 వరకు ఇది కొనసాగుతుంది. ఆ నెల 9న ముసాయిదా జాబితాలు ప్రచురిస్తారు.

బిహార్‌లో రూ.108 కోట్ల జప్తులు: ఎన్నికలు జరగనున్న బిహార్‌లో ఇప్పటివరకు అక్రమ నగదు, మాదకద్రవ్యాలు, మద్యం, ఉచిత తాయిలాల రూపంలో రూ.108 కోట్ల మేర జప్తులు చేసినట్లు ఈసీ తెలిపింది. దీనిలో మద్యం ఒక్కటే రూ.42 కోట్ల విలువ చేస్తుంది.

ఎస్‌జీపీసీ అధ్యక్షుడిగా మళ్లీ హర్జిందర్ సింగ్ ఎన్నిక



అమృత్‌సర్: సిక్కుల అత్యున్నత పీఠం శిరోమణి గురుద్వారా ప్రబంధక్ కమిటీ(ఎస్‌జీపీసీ) అధ్యక్షుడిగా హర్జిందర్ సింగ్ ధామీ వరుసగా ఐదోసారి ఎన్నికయ్యారు. కమిటీలోని 136 మంది సభ్యుల్లో 117 మంది హర్జిందర్‌కు, ఆయన ప్రత్యర్థి మిథూసింగ్‌కు 18 మంది ఓటేశారు. ఒక ఓటు చెల్లలేదు. ఎన్నికల ఫలితాల్ని సోమవారం సాయంత్రం ప్రకటించారు.

జైన సన్యాసి నిరాహార దీక్ష

దాదర్ కబూతర్‌ఖానాను పునఃప్రారంభించాలని డిమాండ్




ముంబయి: మహారాష్ట్ర రాజధాని ముంబయిలో నగరపాలక సంస్థ మూసివేసిన దాదర్ కబూతర్‌ఖానాను తక్షణం పునఃప్రారంభించాలని జైన సన్యాసి నీలేశ్‌చంద్ర విజయ్ సోమవారం డిమాండ్ చేశారు. ఇందుకోసం అజాద్ మైదానంలో నిరాహారదీక్ష చేపట్టారు. అంతకుముందు బృహన్ ముంబయి మునిసిపల్ కార్పొరేషన్(బీఎంసీ) ప్రధాన కార్యాలయం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. నిరసనలో భాగంగా నీటిని తాగడం కూడా ఆపేశానని తెలిపారు. శ్వాసకోశ సమస్యలు సహా ప్రజారోగ్యం, భద్రతా చర్యల్లో భాగంగా దాదర్ సహా పలు ప్రాంతాల్లోని పావురాల సంరక్షణ కేంద్రాలను బీఎంసీ మూసివేసింది.

కనీస హాజరు లేని న్యాయవిద్యార్థుల్ని పరీక్ష రాయకుండా అడ్డుకోవద్దు: దిల్లీ హైకోర్టు

దిల్లీ: న్యాయ విద్యార్థులను పరీక్షకు అనుమతించే విషయంలో దిల్లీ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. కనీస హాజరు కొరవడిందనే ఒక్క కారణంతో విశ్వవిద్యాలయాలు, న్యాయ కళాశాలలు ఆ విద్యార్థులను పరీక్ష రాయకుండా అడ్డుకోరాదని స్పష్టం చేసింది. తరగతులకు హాజరుకావడాన్ని తప్పనిసరి చేస్తూ గతంలో రూపొందించిన నిబంధనలను పునఃపరిశీలించాలని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ)కి సోమవారం జస్టిస్ ప్రతిభా ఎం.సింగ్, జస్టిస్ అమిత్ శర్మ ధర్మాసనం సూచించింది. తరగతులకు హాజరీ విషయంలో ఇతర విద్యా కోర్సుల మాదిరిగా న్యాయ విద్య విషయంలో కఠినంగా ఉండరాదని అభిప్రాయపడింది. న్యాయ విద్యార్థులు తరగతి గదిలో పాఠాలు వినడంతోపాటు కోర్టులు, జైళ్ల పనితీరుపై అవగాహన ఏర్పరచుకోవాల్సి ఉంటుందని తెలిపింది. న్యాయ సహాయం అందించడంలో ప్రాక్టికల్ అనుభవం కూడా అవసరమేనని పేర్కొంది. ఈ అంశాలన్నీ న్యాయ విద్యలో భాగంగా చేర్చాలని ధర్మాసనం అభిప్రాయపడింది.

ఇది ఊపిరితిత్తి క్యాన్సర్ అవగాహన మాసం



ఊపిరితిత్తి క్యాన్సర్. మనదేశంలో మగవారిలో అతి ఎక్కువగా కనిపిస్తున్న క్యాన్సర్ ఇదే. ప్రతి లక్ష మందిలో సుమారు 5.4 మంది దీని బారినపడుతున్నారని అంచనా. కొన్ని పట్టణాల్లోనైతే లక్షకు 15-20 మంది దీని కోరల్లో చిక్కుకుంటున్నారు. ముమ్ముందు ఇది 13 శాతానికీ ఎగబాకొచ్చని భావిస్తున్నారు. క్యాన్సర్లకు బలవుతున్నవారిలో 9.3% మంది ఊపిరితిత్తి క్యాన్సర్ బాధితులే కావటం గమనార్హం. నిజానికి ఊపిరితిత్తి క్యాన్సర్ కేసుల్లో 50-60% నివారించదగ్గవే. దీని బారినపడ్డా తొలిదశలో గుర్తిస్తే నయం చేయొచ్చు కూడా. కానీ నూటికి 90 మందిలో ముదిరిన తర్వాతే బయటపడుతుండటం ఆందోళనకరం. దీంతో చికిత్సా కష్టమవుతోంది. అందుకే 'అడ్డంకులను ఛేదిద్దాం. తొలిదశలో గుర్తించటానికి, అందరికీ చికిత్స సమానంగా అందించటానికి ప్రాధాన్యమిద్దాం' అని ఊపిరితిత్తి క్యాన్సర్ అవగాహన మాసం ఉద్బోధిస్తోంది. ఇది సాధ్యం కావాలంటే జబ్బు గురించీ.. కారణాలు, నివారణ గురించీ సమగ్రంగా తెలుసుకొని ఉండటం అత్యవసరం.

ఊపిరి భద్రం!

శ్వాసే ప్రాణం. ఇది ఒక్క క్షణం ఆగినా ఉక్కిరిబిక్కిరి అవుతాం. కాబట్టే ఊపిరితిత్తులకు అంత ప్రాధాన్యం. రక్తంలోకి ఆక్సిజన్‌ను చేరవేసేవి, రక్తంలోని కార్బన్‌డయాక్సైడ్‌ను బయటకు పంపించేవి ఇవే. మన ఊపిరితిత్తులు తిరగేసిన చెట్టులా ఉంటాయి. కాండంలాంటి శ్వాసమార్గం రెండు వాయు నాళాలుగా చీలిపోయి.. అలా అలా గాలిగొట్టాలుగా శాఖోపశాఖలుగా కిందికి విస్తరిస్తూ వస్తాయి. వీటి చివర ఉండే గాలిగదులే ఆక్సిజన్, కార్బన్ డయాక్సైడ్ మార్పిడి ప్రక్రియను నిర్వహిస్తాయి. ఊపిరితిత్తి క్యాన్సర్ వాయునాళాల దగ్గరి నుంచి గాలిగొట్టాలు, ఊపిరితిత్తుల్లోని మృదుకణజాలం వరకూ ఎక్కడైనా తలెత్తొచ్చు. ప్రధానంగా గాలిగొట్టాల్లో ఎక్కువగా వస్తుంటుంది. ఇది మగవారిలో ఎక్కువే అయినా ఆడవారికి రాకూడదనేమీ లేదు. స్త్రీలు, పురుషులు.. ఇద్దరినీ కలిపి చూస్తే- రొమ్ము క్యాన్సర్ తర్వాత రెండో స్థానంలో ఇదే నిలుస్తుండటం గమనార్హం. పొగాకు అలవాట్లు, వాయు కాలుష్యం పెరగటం వంటివి దీనికి ఆజ్యం పోస్తున్నాయి. క్షయ, సీవోపీడీ వంటి శ్వాసకోశ జబ్బులుగా పొరపడటంతో బాగా ముదిరిన తర్వాతే బయటపడుతుండటం సమస్యను మరింత క్లిష్టం చేస్తోంది.



డా॥ సింహాద్రి చంద్రశేఖర రావు
ఛైర్మన్ అండ్ చీఫ్ ఆఫ్ సర్జికల్ ఆంకాలజీ
రెనోవా సౌమ్య హాస్పిటల్
కార్ఖానా, సికింద్రాబాద్

ఎలా మొదలవుతుంది?

శరీరంలోని కణాలన్నీ క్రమ పద్ధతిగా విభజన, వృద్ధి చెందుతాయి. ఈ పనిని జన్యువులు నియంత్రిస్తుంటాయి. ఎందుకనో కొందరిలో ఈ ప్రక్రియ దెబ్బతింటుంది. సాధారణంగా మామూలు కణాలు ఒకదశకు వచ్చాక వృద్ధి చెందటం నిలుస్తుంది. వయసు మీరితే విభజన చెందటమూ ఆగుతుంది. ఒకవేళ దెబ్బతింటే తమకు తామే చనిపోతాయి (అటాప్సిస్) కూడా. కానీ క్యాన్సర్ కణాలు అలా కాదు. అవసరం లేకపోయినా విభజన, వృద్ధి చెందుతూ వస్తాయి. మరణించకుండా అలా పెరుగుతూ ఉంటాయి. ఇవన్నీ ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోయి కణితులుగా మారతాయి. ఊపిరితిత్తి క్యాన్సర్‌లోనూ ఇలాగే జరుగుతుంది. దీంతో ఊపిరితిత్తుల పనితీరు మందగిస్తుంది. ఆక్సిజన్‌ను గ్రహించుకునే సామర్థ్యం తగ్గుతుంది.

కారణాలేంటి? ఎవరికి వస్తుంది?

ఊపిరితిత్తి క్యాన్సర్ ఎందుకొస్తుంది, ఎవరికి వస్తుందనేది కచ్చితంగా తెలియదు. కానీ కొన్ని అంశాలు దీని ముప్పు పెరిగేలా చేస్తాయి.

- **పొగాకు అలవాటు:** ప్రధాన కారణం ఇదే. 85-90% కేసులకు పొగాకులోని క్యాన్సర్ కారకాలే కారణం. సిగరెట్లు, బీడీలు, చుట్టలు కాల్చటం.. ఇతరులు కాల్చిన సిగరెట్ పొగను పీల్చటం.. జర్దా, గుట్కా, ఖైనీ నమలటం ద్వారా ఇవి శ్వాసనాళం లేదా రక్తం ద్వారా ఊపిరితిత్తుల్లోకి చేరుకొని, స్థిరపడతాయి. క్రమంగా అక్కడి జన్యువులను దెబ్బతీసి, మార్పులు కలగజేస్తాయి. దీంతో కణ నియంత్రణ ప్రక్రియ అస్తవ్యస్తమై క్యాన్సర్‌కు బీజం పడుతుంది.
- **పర్యావరణ కాలుష్యం:** ఇంటా బయటా, పనిచేసే చోట కాలుష్యమూ కారణమే. సిమెంట్ పరిశ్రమలు, బొగ్గు గనులు, పెట్రోలియం కంపెనీల నుంచి వెలువడే ఆస్‌బెస్టాస్, ఆర్సెనిక్ వంటి క్యాన్సర్ కారకాలు ముప్పును తెచ్చిపెడతాయి. వీటికి ఎంత ఎక్కువకాలం ప్రభావితమయ్యారనేదాన్ని బట్టి ప్రమాదం పొంచి ఉంటుంది. ఇంట్లో వంట చెరకు, బొగ్గు మండించటం వల్ల వెలువడే పొగ కూడా ప్రమాదమే. అరుదుగా భూగర్భం నుంచి వెలువడే రంగు, వాసన లేని రాడాన్ అనే వాయువూ క్యాన్సర్‌కు బీజం వేయొచ్చు.
- **జన్యువులు:** క్యాన్సర్ తలెత్తటంలో వంశపారంపర్యంగా సంక్రమించే జన్యువులూ కీలకపాత్ర పోషిస్తాయి. ఇలా క్యాన్సర్ వచ్చే అవకాశం 5% వరకూ ఉండొచ్చు.
- **ఇతర కారణాలు:** రోగనిరోధక వ్యవస్థను పక్కదారి పట్టించే జబ్బులు, ఇతర భాగాల్లో తలెత్తే క్యాన్సర్ కణాలు ఊపిరితిత్తులకు వ్యాపించటమూ కణితులకు దోహదం చేయొచ్చు.

ప్రధానంగా రెండు రకాలు

ఊపిరితిత్తి క్యాన్సర్ ప్రధానంగా నాన్ స్మాల్ సెల్, స్మాల్ సెల్ అని రెండు రకాలు. మైక్రోస్కోప్‌లో చూసినప్పుడు కనిపించే తేడాలు, ఐహెచ్‌సీ పరీక్షతో వీటిని వర్గీకరిస్తారు. సుమారు 80% మందిలో కనిపించేది నాన్ స్మాల్ సెల్ లంగ్ క్యాన్సరే. ఇందులోనూ స్క్వామస్ సెల్ క్యాన్సర్, ఎడినోకార్సినోమా, లార్జ్ సెల్ కార్సినోమా అని మూడు ఉప రకాలున్నాయి. స్మాల్ సెల్ లంగ్ క్యాన్సర్ సుమారు 15-20% మందిలో కనిపిస్తుంటుంది. ఇది ప్రధానంగా శ్వాసమార్గం రెండుగా చీలిపోయే చోట తలెత్తుతుంది. చాలా తీవ్రమైంది, వేగంగా వృద్ధి చెందుతుంది. స్వల్పకాలంలోనే పక్క ఊపిరితిత్తి మెదడు, కాలేయం, వంటి అవయవాలకు విస్తరిస్తుంది. దీని బారినపడ్డవారిలో జీవనకాలం తక్కువ. కానీ ప్రస్తుతం కీమోథెరపీతో చాలావరకూ నియంత్రణలో ఉంచటం సాధ్యమవుతోంది.

చోటును బట్టి లక్షణాలు

ఊపిరితిత్తిని చేత్తో తాకి తెలుసుకోలేం. అందువల్ల కణితి వంటి మార్పులను గుర్తించటం కష్టం. తొలిదశలో లక్షణాలు అంత స్పష్టంగా ఉండవు. ముదిరాకే బయటపడుతుంటాయి. క్యాన్సర్ తలెత్తిన భాగాన్ని బట్టి లక్షణాలు కనిపిస్తుంటాయి.

- ఛాతీ మధ్యలో కణితి ఏర్పడితే ప్రధాన శ్వాసమార్గం లేదా రక్తనాళాన్ని నొక్కటం వల్ల దగ్గు, ఆయాసం, దగ్గినప్పుడు కళ్లెతో రక్తం పడటం వంటి లక్షణాలు కనిపిస్తాయి. అందువల్ల మూడువారాలు దాటినా దగ్గు తగ్గకపోతే.. ముఖ్యంగా పొగతాగేవారిలో అసలే నిర్లక్ష్యం చేయొద్దు.
- కణితి శ్వాసమార్గానికి అడ్డుపడితే స్రావాలు, బ్యాక్టీరియా పోగుపడి తరచూ న్యుమోనియా తలెత్తొచ్చు.
- ఛాతీ గోడకు దగ్గర్లో కణితి ఏర్పడితే ఊపిరితిత్తుల వెలుపల, ఛాతీ గోడ మధ్య నీరు చేరి నొప్పి, దగ్గు, ఆయాసం రావొచ్చు.
- స్వర తంత్రులకు వెళ్లే నాడిని కణితి నొక్కితే గొంతు బొంగురు పోవచ్చు. అన్నవాహికను నొక్కితే ముద్ద సరిగా మింగలేకపోవచ్చు.
- గుండెకు రక్తాన్ని తీసుకెళ్లే నాళాన్ని కణితి నొక్కితే మెడ, భుజాలు, చేతుల్లో వాపు తలెత్తొచ్చు. అదే ఊపిరితిత్తి పైన కణితి ఉంటే వెన్నుపాము, భుజప్లక్షములోకి వెళ్లే నాడులను నొక్కటం వల్ల చంకలు, భుజాలు, చేతుల్లోకి నొప్పి పాకొచ్చు. కొందరికి పళ్ల వరకూ నొప్పి విస్తరించొచ్చు.
- లింఫ్ గ్రంథులు ఉబ్బటం, ఆకలి లేకపోవటం, బరువు తగ్గటం, వేళ్ల ఉబ్బటం వంటివీ కనిపిస్తాయి.
- కొందరికి సీవోపీడీ వంటి లక్షణాలూ ఉండొచ్చు. కొందరు క్యాన్సర్‌ను క్షయగా పొరపడుతుంటారు. దీంతో నిర్ధరణ అయ్యేసరికే బాగా ముదిరిపోతుంది.
- కాలేయం, ఎముక, మెదడుకు విస్తరిస్తే- ఆకలి తగ్గటం, కామెర్లు, ఎముక నొప్పి, తలనొప్పి, వాంతి వంటివి కనిపిస్తాయి.

నిర్ధారణ ఎలా?

- **సీటీ స్కాన్:** ఊపిరితిత్తి క్యాన్సర్ నిర్ధారణకు హైరెజల్యూషన్ లోడోస్ రేట్ సీటీ స్కాన్ పరీక్ష ఉత్తమం. ఇందులో రేడియేషన్ మోతాదు తక్కువగా ఉంటుంది. కణితి ఉంటే స్పష్టంగా బయటపడుతుంది.
- **బయాప్సీ:** కణితి ఉన్నట్టు తేలితే దాన్నుంచి చిన్న ముక్కను తీసి పరీక్షించాల్సి (బయాప్సీ) ఉంటుంది. కణితి ఉన్న చోటును బట్టి బ్రాంకోస్కోపీ, సీటీ గైడెడ్, ఎండోబ్రాంకియల్ అల్ట్రాసౌండ్ గైడెడ్ నీడిల్ బయాప్సీ చేస్తారు. వీటితో క్యాన్సర్ నిర్ధారణతో పాటు అది ఏ రకాన్ని చెందిందో కూడా బయటపడుతుంది.
- **పెట్ స్కాన్:** క్యాన్సర్ అక్కడే ఉందా? ఎక్కడికైనా పాకిందా? ఏ దశలో ఉంది? అనేవి తెలుసుకోవటమూ ముఖ్యమే. ఇందుకు పెట్ స్కాన్ ఉపయోగపడుతుంది.
- **ఎంఆర్ఐ:** మెదడులోకి క్యాన్సర్ విస్తరిస్తే పెట్ స్కాన్‌లో స్పష్టంగా తెలియదు. కాబట్టి మెదడుకు ఎంఆర్ఐ పరీక్ష చేయాల్సి ఉంటుంది.
- **ఇతర పరీక్షలు:** కాలేయం, ఊపిరితిత్తి సామర్థ్య పరీక్షలు.. గుండె పరీక్షలూ అవసరమవుతాయి.

దశలు- నాలుగు

- **స్టేజ్ 1:** క్యాన్సర్ ఊపిరితిత్తులకే పరిమితం కావటం. కణితి 2 సెంటీమీటర్ల కన్నా తక్కువ సైజులో ఉండటం. లింఫ్ గ్రంథులకు విస్తరించకపోవటం.
- **స్టేజ్ 2:** కణితి సైజు 2-4 సెంటీమీటర్లు ఉండటం, లింఫ్ గ్రంథులకు పాకటం.
- **స్టేజ్ 3:** కణితి సైజు 4 సెం.మీ. కన్నా ఎక్కువగా ఉండటం. ఎక్కువ లింపు గ్రంథులకు, ఛాతీ గోడకు, డయాఫ్రం వరకూ వ్యాపించటం.
- **స్టేజ్ 4:** క్యాన్సర్ ఒక ఊపిరితిత్తి నుంచి మరో ఊపిరితిత్తికి, కాలేయం, ఎముక, మెదడు వంటి వాటికి విస్తరించటం. ఊపిరితిత్తుల్లో, గుండె చుట్టూ నీరు చేరటం

- స్మాల్ సెల్ రకం క్యాన్సర్ అయినట్టయితే అది ఒక వైపే ఉంటే పరిమిత జబ్బుగా, చాలాచోట్లకు విస్తరిస్తే తీవ్ర జబ్బుగా పరిగణిస్తారు.

తీవ్రతను బట్టి చికిత్స

1, 2 దశలకు

- వీటికి శస్త్రచికిత్స చేయటం ఉత్తమమైన పద్ధతి. ఊపిరితిత్తిలో కణితి తలెత్తిన భాగాన్ని తీసేస్తే (లోబెక్టమీ) అక్కడితోనే నయమవుతుంది. వృద్ధులకు, లోబెక్టమీ కుదరనివారికి కణితి, చుట్టుపక్కల సెంటీమీటరు వరకు ఊపిరితిత్తిని కత్తిరించి, తొలగించొచ్చు (వెడ్జ్ రిసెక్షన్). శ్వాసనాళం వద్ద కణితి ఉండి, వేరే చోటుకి విస్తరించని వారికి ఒక ఊపిరితిత్తిని పూర్తిగా తొలగించాల్సి ఉంటుంది (న్యుమోనెక్టమీ) కూడా.
- బయటకు తీసిన కణితిని పరిశీలించి, జబ్బు తిరగబెట్టే అవకాశముంటే కీమోథెరపీ, రేడియో థెరపీ అవసరమవుతుంది. కణితి సైజు పెద్దగా ఉన్నవారికి, లింఫ్ గ్రంథులు ఉబ్బినవారికి, స్మాల్ సెల్ రకం కణితి గలవారికి, రక్తనాళాల్లో క్యాన్సర్ కణాలు గలవారికి, ఊపిరితిత్తి గోడల్లో క్యాన్సర్ తలెత్తినవారికి కీమోథెరపీ అవసరం. కణితిని తొలగించటం సాధ్యం కానివారికి కీమోతో పాటు రేడియోథెరపీ కూడా ఇస్తారు.
- చాలాకాలం నుంచి పొగ తాగేవారికి, సీవోపీడీ సమస్యలు గలవారికి, క్యాన్సర్ రెండు మూడు లింఫ్ గ్రంథులకు వ్యాపించినవారికి శస్త్రచికిత్స చేస్తే సమస్యలు తలెత్తొచ్చు. ఇలా శస్త్రచికిత్స కుదరనివారికి రేడియేషన్ ఉపయోగపడుతుంది. ఇప్పుడు అధునాతన స్టీరియోటాక్టిక్ రేడియోథెరపీ అందుబాటులో ఉంది. ఇది ఊపిరితిత్తి కదులుతున్నా సరిగ్గా కణితి మీదే రేడియేషన్ ప్రభావం పడేలా చేస్తుంది.

3వ దశకు

- దీనికి కీమో, రేడియోథెరపీ రెండూ ఒకేసారి చేస్తారు. కొందరికి శస్త్రచికిత్సా అవసరపడొచ్చు. అయితే మూడో దశలో క్యాన్సర్ నయమయ్యే అవకాశం తక్కువ. ఒకవేళ తగ్గినా మళ్లీ తిరగబెట్టొచ్చు.

4వ దశకు

- ఇది నయం కావటం అసాధ్యం. కాబట్టి బతికినంత కాలం హాయిగా జీవించేలా చూడటం ముఖ్యం. ఇందుకు టార్గెటెడ్ థెరపీ ఉపయోగపడుతుంది. ప్రస్తుతం జన్యుమార్పులను బట్టి క్యాన్సర్ ఉపరకాల వర్గీకరణా సాధ్యమవుతోంది. వీటికి జెఫ్టినిబ్, ఎర్లోటినిబ్, ఆస్మర్టినిబ్ వంటి మందులు బాగా ఉపయోగపడుతున్నాయి. రోగనిరోధక వ్యవస్థను ప్రేరేపించి క్యాన్సర్ కణాలను నిర్మూలించే ఇమ్యునోథెరపీ కూడా ప్రాచుర్యం పొందుతోంది. పెంబ్రోలిజుమాబ్ వంటి మందులు అద్భుతాలు సృష్టిస్తున్నాయి. ఒకప్పుడు నాలుగోదశ ఊపిరితిత్తి క్యాన్సర్ గలవారు కొద్ది నెలలే బతికేవారు. టార్గెటెడ్, ఇమ్యునోథెరపీలతో ఇప్పుడు కొందరు 5, 6 సంవత్సరాల కన్నా ఎక్కువ కాలమే జీవిస్తున్నారు.

నివారణ ప్రధానం

ఊపిరితిత్తుల క్యాన్సర్‌ను నివారించుకోవటమే ఉత్తమం.

- అన్నింటికన్నా ముఖ్యమైంది పొగాకు జోలికి వెళ్లపోవటం. సిగరెట్లు, బీడీలు, చుట్టలు కాల్చటం.. పొగాకు, జర్దా, గుట్కా నమలటం మానెయ్యాలి. ఇంట్లో ఎవరినీ సిగరెట్లు కాల్చనీయొద్దు.
- పండ్లు, కూరగాయలు ఎక్కువగా తినాలి.
- మద్యం జోలికి వెళ్లొద్దు. అలవాటుంటే పరిమితం చేసుకోవాలి.
- క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి.
- అధికబరువు, ఊబకాయం తగ్గించుకోవాలి.
- వాయు కాలుష్యం బారినపడకుండా చూసుకోవాలి. సిమెంట్ పరిశ్రమలు, గనుల వంటి చోట్ల పనిచేసేవారు విధిగా మాస్కులు వాడుకోవాలి.

ముందస్తు పరీక్ష ఉంది గానీ

ఊపరితిత్తి క్యాన్సర్‌ను ముందుగా గుర్తించటానికి స్క్రీనింగ్ అందుబాటులో ఉంది. 55 ఏళ్లు పైబడి, 20 ఏళ్లకు పైగా పొగ తాగేవారికి ఏటా తక్కువ మోతాదు సీటీస్కాన్ పరీక్ష చేయొచ్చు. అమెరికా వంటి దేశాల్లో దీన్ని అనుసరిస్తున్నారు. కానీ మనదేశంలో ఇది సులువైన పనికాదు.

ఎగ్జిమా పుండు మానేదెలా?

సమస్య | సలహా

సమస్య: నాకు 25 ఏళ్లు. ఏడాదిన్నర నుంచి ఎగ్జిమా (మానని పుండు)తో బాధపడుతున్నాను. డాక్టర్ దగ్గరికి వెళ్తే కొన్ని పరీక్షలు చేయించారు. రిపోర్టులన్నీ నెగెటివ్‌గా వచ్చాయి. నా సమస్య ఎలా తగ్గుతుంది?

– పి.రాగశ్రీ

సలహా: దురదతో తీవ్రంగా వేధించే ఏనుగు గజ్జి (ఎగ్జిమా) దీర్ఘకాల సమస్య. డెర్మటైటిస్‌లో ఇదో రకం. ఇందులో శరీర స్వభావంతో తలెత్తే అటోపిక్ డెర్మటైటిస్, శరీరానికి పడనివి తాకినప్పుడు వచ్చే కాంటాక్ట్ డెర్మటైటిస్ వంటి రకాలెన్నో ఉంటాయి. చర్మం పొడిబారటంతో దురద మొదలవుతుంది. దీంతో గోకాలని అనిపిస్తుంది. గోకినప్పుడు తాత్కాలికంగా దురద తగ్గుతుంది గానీ చర్మం పైపొర కాస్త లేచి మంట పుడుతుంది. కొద్దిసేపయ్యాక అక్కడ హిస్టమిన్లు పుట్టుకొచ్చి మళ్లీ దురద పుడుతుంది. మళ్లీ గోకుతారు. మళ్లీ మంట పుండుతుంది. ఇలా ఇదొక విషవలయంలా తయారవుతుంది. అదే పనిగా గోకటం వల్ల రక్తస్రావం కావొచ్చు. దీంతో ఇన్‌ఫెక్షన్ తలెత్తి, రసి కారటం మొదలవుతుంది. పక్కు కడుతుంది. గోకినప్పుడు పక్కు లేచిపోయి పుండు పడొచ్చు. కొన్నిసార్లు ఇది మానకుండా దీర్ఘకాలం వేధిస్తుంటుంది. ఇలాంటప్పుడు ముందు యాంటీబయాటిక్స్‌తో ఇన్‌ఫెక్షన్‌ను నియంత్రణలోకి తేవాల్సి ఉంటుంది. తర్వాత దురద తగ్గే మందులు, అనంతరం కొద్దిమోతాదు స్టిరాయిడ్ మలాము వాడితే ఉపశమనం కలుగుతుంది. కొద్దిరోజులయ్యాక స్టిరాయిడ్ మలామును ఆపేసి, చర్మం పొడిబారకుండా చూసే ఎమోలియెంట్లు వాడుకోవాలి. దీంతో ఎగ్జిమా నయమవుతుంది. ఎమోలియెంట్లతో సమస్య మళ్లీ మళ్లీ రాకుండా చూసుకోవచ్చు. అయితే మీరు మానని పుండుతో బాధపడుతున్నాననీ చెబుతున్నారు. ఇదెక్కడుందో తెలియజేయలేదు. ఒకవేళ కాళ్ల మీద పుండు మానకుండా వేధిస్తుంటే సిరల ఉబ్బు కారణమై ఉండొచ్చు. మధుమేహం వంటి సమస్యల తోనూ పుండు మానకపోవచ్చు. కాబట్టి దురద తీరు, పుండు లక్షణాలు.. మీకు ఇతరత్రా సమస్యలేవైనా ఉన్నాయా అనేవీ నిశితంగా చూడాల్సి ఉంటుంది. మీరు అనుభవం గల చర్మ నిపుణులను సంప్రదిస్తే తగు పరీక్షలు చేసి, కారణాన్ని గుర్తిస్తారు. అప్పుడే సరైన చికిత్స సాధ్యమవుతుంది.



- డా॥ జి.నరసింహారావు నేత,
సీనియర్ చర్మ నిపుణులు

మీ ఆరోగ్య సమస్యలను sukhi@eenadu.in కు పంపొచ్చు.

షూతో నడుంనొప్పి!

నడుంనొప్పి అనగానే సుదీర్ఘంగా పనులు చేయటం, శరీర భంగిమ అస్తవ్యస్తం కావటం, కండరాలు క్షీణించటం వంటి కారణాలే ముందుగా గుర్తుకొస్తాయి. కానీ మనకు తెలియని, పెద్దగా పట్టించుకోని, అసలు ఊహలోకే రానిది దోహదం చేస్తుంటే? నిశ్శబ్దంగా నడుంనొప్పిని ప్రేరేపిస్తుంటే? అంతటి అనూహ్య మైనదేంటని అనుకుంటున్నారా? షూ. అవును.. ఇవి నడకను, కదలికలను, పాదాల మీద పడే ఒత్తిడిని గ్రహించుకోవటాన్ని కూడా ప్రభావితం చేస్తాయి. షూ, చెప్పులు సరిగ్గా లేకపోతే పాదాలపై ఒత్తిడి పడుతుంది. ఇది వెన్నెముక మీదా ప్రభావం చూపుతుంది.



మన శరీరానికి పాదాలే పునాది. ఇవి సక్రమంగా ఉంటేనే శరీరం బలంగా నిలబడుతుంది. కీళ్లు, కండరాల సమన్వయంతోనే మన కదలికలు సాగుతాయి. మనం నడవటంలో వెన్నెముక దగ్గరి నుంచి కటి, తుంటి, తొడలు, కాళ్లు, మోకాళ్లు, మడమలు, పాదాలు, వేళ్ల వరకూ అన్నీ తోడ్పడతాయి. వీటిల్లో ఎక్కడ సమన్వయం లోపించినా చలన పరంపర దెబ్బ తింటుంది. మనం నడుస్తున్నప్పుడు, పరుగెత్తు తున్నప్పుడు, గెంతుతున్నప్పుడు పాదాలు షాక్ అబ్జార్జర్లలా పనిచేస్తాయి. పాదం మధ్యలో ఉండే సహజమైన ఒంపు పైనుంచి పడే ఒత్తిడిని తీసుకొని శరీరం స్థిరంగా, సక్రమంగా ఉండటానికి తోడ్పడుతుంది. సరైన షూ వేసుకోకపోతే ఈ ఒంపునకు తగినంత దన్ను దొరకదు. పాదాలు లోపలి వైపునకు లేదా బయటి వైపునకు ఒరిగిపోవచ్చు. దీంతో నడక తీరు మారొచ్చు. శరీర సమతుల్యత కొరవడొచ్చు. ఫలితంగా పైనుండే మోకాళ్లు, తుంటితో పాటు వెన్నెముక మీదా ఒత్తిడి పెరుగుతుంది. క్రమంగా నడుంనొప్పికి దారితీస్తుంది. అందువల్ల పాదాలకు మంచి దన్నునిచ్చే షూ, చెప్పులు ధరించాలి. సరైనవి ఎంచుకోవాలి.

▼ షూ కొనేటప్పుడు పాదాలను, వేళ్లను నొక్కనివే ఎంచుకోవాలి. వాటిని ధరించి కాసేపు అటూ ఇటూ నడిచి, సౌకర్యంగా ఉన్నాయేమో చూసుకోవాలి. కదులుతున్నప్పుడు నొప్పి గానీ చిరాకు గానీ పెడుతుంటే ఇబ్బంది తప్పదని గుర్తించాలి.

▼ ఎత్తు మడమలు (హీల్స్) లేనివి లేదా తక్కువ ఎత్తు మడమలు ఉన్నవైతే మంచిది. ఎక్కువకాలం ఎత్తు మడమల చెప్పులు ధరిస్తే వెన్నెముక ఒంపు పెరిగి, నడుంనొప్పికి దారితీస్తుంది. హీల్స్ రెండు అంగుళాల కన్నా తక్కువ ఉండేలా చూసుకోవాలి.


▼ శరీర భంగిమను దెబ్బతీసే షూ నడుంనొప్పికి దారితీస్తుంది. కాబట్టి షూ ధరించి నడుస్తున్నప్పుడు, కదులుతున్నప్పుడు శరీర భంగిమ సరిగ్గా ఉందేమో చూసుకోవాలి.

గుండెపోటు, పక్షవాతం ముప్పు తగ్గించుకోవాలని అనుకుంటున్నారా? అయితే ఇన్‌ఫెక్షన్ జబ్బుల నివారణ మీదా దృష్టి పెట్టండి. ఫ్లూ, కొవిడ్ వంటి తక్షణ ఇన్‌ఫెక్షన్ల బారినపడ్డ కొద్దివారాల తర్వాత గుండెపోటు, పక్షవాతం ముప్పు గణనీయంగా పెరుగుతున్నట్టు జర్నల్ ఆఫ్ ద అమెరికన్ హార్ట్ అసోసియేషన్‌లో ప్రచురితమైన అధ్యయనం హెచ్చరిస్తోంది.

ఇన్‌ఫెక్షన్లతో గుండెపోటు

హెచ్‌పీవీ, హెపటైటిస్ బి, ఇతర వైరస్‌లు క్యాన్సర్‌కు కారణమవుతున్నట్టు తెలిసిన విషయమే. కానీ వైరల్ ఇన్‌ఫెక్షన్లకూ గుండెజబ్బుల వంటి సాంక్రమికేతర జబ్బులకూ మధ్య సంబంధం గురించి అంతగా తెలియదు. దీన్ని అర్థం చేసుకోవటానికే యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా పరిశోధకులు ప్రయత్నించారు. దాదాపు 52వేల ప్రచురిత అధ్యయనాలను నిశితంగా విశ్లేషించారు. ఇందులో ఏం గుర్తించారంటే..

- ఫ్లూ బారినపడినవారికి నెలలోపు గుండెపోటు ముప్పు 4 రెట్లు, పక్షవాతం ముప్పు 5 రెట్లు ఎక్కువగా ఉంటోంది.
- కొవిడ్ అనంతరం 14 వారాల్లోపు గుండెపోటు, పక్షవాతం ముప్పులు 3 రెట్లు ఎక్కువగా ఉంటున్నాయి. ఏడాది వరకూ వీటి ముప్పు ఎక్కువగా ఉంటుండటం గమనార్హం.



-వైరల్ ఇన్‌ఫెక్షన్లను ఎదుర్కొనే క్రమంలో రోగనిరోధక వ్యవస్థ ప్రతిస్పందనలో భాగంగా వాపుప్రక్రియ (ఇన్‌ఫ్లమేషన్) ప్రేరేపితమవుతుంది. ఇది రక్తం గడ్డలు ఏర్పడే స్వభావాన్నీ ప్రోత్సహిస్తుంది. ఇన్‌ఫెక్షన్ నయమైన తర్వాతా వాపుప్రక్రియ, రక్తం గడ్డలు ఏర్పడటం కొనసాగొచ్చు. ఇవి రెండూ గుండె సామర్థ్యాన్ని తగ్గించేవే. వాపుప్రక్రియతో రక్తనాళాల్లో పూడికలు ఏర్పడటమే కాదు, అవి చిట్లిపోయే ప్రమాదమూ ఉంది. ఫలితంగా గుండెపోటు, పక్షవాతం ముప్పులూ పెరుగుతాయి.

దీర్ఘ కాలంలోనూ: దీర్ఘకాల వైరల్ ఇన్‌ఫెక్షన్లతో బాధపడేవారిలోనూ గుండెరక్తనాళాల జబ్బుల తీరును ఈ అధ్యయనంలో పరిశీలించారు.

- హెచ్ఐవీ ఇన్‌ఫెక్షన్ గలవారికి గుండెపోటు ముప్పు 60%, పక్షవాతం ముప్పు 40% ఎక్కువగా ఉంటున్నాయి.
- హెపటైటిస్ సి ఇన్‌ఫెక్షన్ గలవారికి గుండెపోటు ముప్పు 27%, పక్షవాతం ముప్పు 23% ఎక్కువగా ఉంటున్నాయి.
- సర్పి (షింగెల్స్) గలవారికి గుండెపోటు ముప్పు 12%, పక్షవాతం ముప్పు 18% అధికంగా ఉంటున్నాయి.

- ఫ్లూ, కొవిడ్‌తో పోలిస్తే ఈ దీర్ఘకాల ఇన్‌ఫెక్షన్లతో ముప్పు అంత ఎక్కువగా లేకపోయినా నిర్లక్ష్యం చేయటానికి లేదు. ఇవి ఎక్కువకాలం కొనసాగుతూ రావటం వల్ల ముప్పులూ అదే స్థాయిలో పొంచి ఉంటాయి మరి.

టీకాలతో రక్షణ

ఫ్లూ, కొవిడ్, షింగెల్స్‌కు టీకాలు తీసుకుంటే గుండెపోటు, పక్షవాతం ముప్పులూ తగ్గుతున్నట్టు అధ్యయనంలో తేలింది. ఉదాహరణకు- ఫ్లూ టీకా తీసుకోనివారితో పోలిస్తే దీన్ని తీసుకున్నవారికి ఈ జబ్బుల ముప్పు 34% తక్కువగా ఉంటుండటం గమనార్హం. ఇన్‌ఫెక్షన్ల నివారణ చాలా ముఖ్యమనే విషయాన్ని ఇది గట్టిగా సూచిస్తోంది. అప్పటికే గుండెజబ్బులు, గుండెజబ్బు ముప్పు కారకాలు గలవారికిది మరింత ముఖ్యమని చెబుతున్నారు.

ఏకబిగిన నడిస్తే

ఎక్కువ లాభం

రోజూ ఉదయాన్నే నడవటం చాలామందికి అలవాటు. కొందరు అరగంట సేపూ ఏకబిగిన నడిచేస్తుంటారు. మీరూ ఈ కోవలోకే వస్తున్నారా? అయితే ఇప్పటికే ఆయుష్షు పెంచుకునే రహస్యాన్ని ఒడిసిపట్టుకున్నట్టే. రోజులో అప్పుడప్పుడూ తక్కువసేపు నడిచేవారితో పోలిస్తే ఆగకుండా 10 నిమిషాల కన్నా ఎక్కు సేపు నడిచేవారికి గుండెజబ్బు, అకాల మరణం ముప్పు గణనీయంగా తగ్గుతున్నట్టు తాజాగా బయటపడింది మరి.



స్మార్ట్‌వాచీలు, మొబైల్ ఫోన్లు వచ్చాక ఎన్ని అడుగులు వేశామో లెక్కించుకోవటం తేలికైపోయింది. రోజుకు 10వేల అడుగులు వేయటం ఆరోగ్యానికి మంచిదని చాలాకాలంగా భావిస్తూ వస్తున్నారు. అందుకే చాలా అధ్యయనాలు రోజుకు వేసే అడుగుల సంఖ్య మీదే దృష్టి సారిస్తున్నాయి. అయితే వీటిని ఎలా వేస్తున్నారన్నదీ కీలకమేనని.. ముఖ్యంగా అంతగా శ్రమ చేయనివారికిది చాలా ముఖ్యమని యానల్స్ ఆఫ్ ఇంటర్నల్ మెడిసిన్‌లో ప్రచురితమైన తాజా అధ్యయనం పేర్కొంటోంది. రోజుకు 10వేలు అడుగుల లక్ష్యాన్ని చేరకపోయినా కూడా ఏకబిగిన కాస్త ఎక్కువసేపు నడిచినా మంచి ఫలితం కనిపిస్తుండటం విశేషం.

ప్రపంచవ్యాప్తంగా సుమారు 31% మంది అంతగా శారీరక శ్రమ చేయటం లేదు. వారానికి కనీసం 150 నిమిషాలు వ్యాయామం చేయాలనే సిఫారసుకు చేరుకోవటం లేదు. ఇలాంటివారికి నిద్రలేమి, గుండెజబ్బులు, మరణం ముప్పులు ఎక్కువ. కనీసం నడిచినా కూడా వీటిని తప్పించుకోవచ్చు. నడక ఎవరికైనా మేలు చేస్తుంది. తాజా అధ్యయన ఫలితాలు దీన్ని మరోసారి గట్టిగా నొక్కి చెబుతున్నాయి. బద్ధకంగా గడిపేవారికి, రోజుకు 8వేల కన్నా తక్కువ అడుగులు నడిచేవారికివి మరింత సమంజసంగానూ కనిపిస్తున్నాయి. ఇందులో యూకే బయోబ్యాంక్ నుంచి 33,560 మందిని పరిశీలించారు. వీరి సగటు వయసు 62 ఏళ్లు. మణికట్టుకు యాక్సెలరోమీటర్‌ను చుట్టి మూడు నుంచి ఏడు రోజుల పాటు శారీరక శ్రమను లెక్కించారు. అనంతరం

- 5 నిమిషాల కన్నా తక్కువసేపు
- 5-10 నిమిషాల సేపు
- 10-15 నిమిషాల సేపు
- 15 నిమిషాలు, అంతకన్నా ఎక్కువసేపు

- ఇలా నాలుగు బృందాలుగా వీరిని విభజించి సగటున 8 ఏళ్ల పాటు పరిశీలించారు. *5 నిమిషాల కన్నా తక్కువసేపు నడిచినవారిలో అన్నిరకాల మరణాలు 4.36% ఉండగా.. 15 నిమిషాలు, అంతకన్నా ఎక్కువసేపు నడిచినవారిలో కేవలం 0.8% మాత్రం మరణాలే సంభవించాయి. అంటే మరణం ముప్పు 83% తగ్గుతోందన్నమాట. గుండెజబ్బుల విషయంలోనూ ఇలాంటి ధోరణే కనిపించింది. తక్కువసేపు నడిచినవారికి గుండెజబ్బు ముప్పు 13% ఉండగా.. ఎక్కువసేపు నడిచినవారికి 4.39% మాత్రమే ఉంది.*

ఆరోగ్యానికి దగ్గరి దారి లేదు

వ్యాయామం చేస్తే కండరాలు రక్తంలోంచి ఆక్సిజన్‌ను బాగా సంగ్రహించుకుంటాయి. ఫలితంగా గుండె వేగం, ఒంట్లో వాపుప్రక్రియ, మానసిక ఒత్తిడి తగ్గుతాయి. ఏకబిగిన ఎక్కువసేపు నడవటం వల్ల రక్త ప్రసరణ బాగా పుంజుకుంటుంది. రక్తపోటు, రక్తంలో గ్లూకోజు మోతాదులు తగ్గుతాయి. ఇవన్నీ గుండెకు మేలు చేసేవే. సాధారణంగా రోజుకు 10వేల అడుగులు నడవటం మంచిదని చెబుతుంటారు. అయితే అందరూ అన్నిసార్లూ అడుగులను లెక్కపెట్టుకోలేరు కదా. అందుకే పరిశోధకులు సమయం మీద దృష్టి సారించారు. వేగం కూడా ముఖ్యమే. కానీ సమయం, స్థిరంగా నడకను కొనసాగించటం ముఖ్యమని ఈ అధ్యయన ఫలితాలు చెబుతున్నాయి. కాబట్టి అడుగుల సంఖ్యను లెక్కించుకోవటం కన్నా రోజులో కాస్త ఎక్కువసేపు నడవటానికి ప్రాధాన్యం ఇవ్వటం మేలు. ఒకట్రెండు నిమిషాలు, ఐదు నిమిషాలు నడవటం తేలికే. కానీ 20, 30 నిమిషాల సేపు నడవటమే కష్టంగా తోస్తుంది. ఈ సామర్థ్యాన్ని సంతరించుకోవటానికే ప్రయత్నించాలి.

సరైన పద్ధతిలో

వ్యాయామాల్లో అన్నింటికన్నా తేలికైంది, ఖర్చులేనిది నడక ఒక్కటే. నడిచేటప్పుడు శరీరం తిన్నగా ఉంచటం, భుజాలు వెనక్కి వంచటం, చేతులు ఊపటం ద్వారా నడుం నొప్పి వంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవచ్చు. ఇది శ్వాస తేలికగా తీసుకోవటానికి, శరీర నియంత్రణ కోల్పోకుండా ఉండటానికీ తోడ్పడుతుంది. నడుస్తున్నప్పుడు కాళ్లు మాత్రమే కదులుతాయని అనుకోవద్దు. శరీరమంతా కదులుతుంది. అయితే ఆగకుండా నడవటానికి కండరాలు అంతగా సహకరించకపోవచ్చు. అందువల్ల అలవాటు లేనివారు వెంటనే ఏకబిగిన నడవటం తగదు. క్రమంగా సమయాన్ని పెంచుకుంటూ రావాలి. కండరాల సామర్థ్యం పెరిగిన తర్వాత ఎక్కువసేపు నడక సాగించొచ్చు. మొత్తమ్మీద రోజుకు సుమారు అరగంట సేపు నడిచేలా చూసుకోవాలి. కాస్త వేగంగా నడిస్తే ఇంకా మంచిది. నడుస్తున్నప్పుడు పక్కవారితో మాట్లాడటం, పాటలు పాడటం కష్టంగా అనిపిస్తుంటే ఒకింత తీవ్రంగా శ్రమిస్తున్నారనే అర్థం.



రామచక్కని సీతకి.. చక్కనైన గజవాహనం

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారికి హైదరాబాద్‌కు చెందిన శంకర్‌రావు-రాజ్యలక్ష్మి అనే దంపతులు రెండ్రోజుల కిందట రూ.40 లక్షల విలువైన రజత గజ వాహనాన్ని అందజేశారు. సీతాదేవి ఊరేగింపు నిమిత్తం దాతలు అందించిన ఈ వాహనాన్ని ఈఓ దామోదర్‌రావు, స్థానాచార్యులు స్థలసాయి, ప్రధానార్చకులు సీతారామానుజాచార్యులు, విజయరాఘవన్, వేదఘ్నో సాయిబాబా సోమవారం కోవెల ప్రాంగణంలో ఆవిష్కరించారు. నిపుణులు ముందుగా 80 కిలోల నాణ్యమైన టేకు కర్రతో ఏనుగు ఆకారాన్ని తయారు చేసి దానిపై 31 కిలోల వెండి కవచాన్ని అలంకరించారు. దీని తొండం, కొమ్ములు, కళ్లు, చెవులు, పాదాలు ఇలా ప్రతీ అంశం ఉట్టిపడేలా రూపొందించారు. ముఖ్య ఉత్సవాల పూర్వం రామయ్యవారికి భక్త రామదాసు తయారు చేయించిన వాహనాలపై ఊరేగిస్తున్నారు. సీతమ్మవారికి ప్రత్యేకంగా వాహనాలు ఉన్నప్పటికీ అందులో పూర్తిస్థాయిలో భక్తులకు కనిపించడం లేదు. ఇప్పుడు వచ్చిన గజ వాహనంతో ఈ ఇబ్బంది తొలగనుంది. అందులో అమ్మవారు మరింత దైవత్వం ఉట్టిపడేలా దర్శనమిస్తారని ఆలయ సిబ్బంది తెలిపారు. -న్యూస్‌టుడే, భద్రాచలం



అబ్బో.. ఎంత పొడగరో!

తిరుమలలో ఓ విదేశీ మహిళ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. 6 అడుగుల 10 అంగుళాల ఎత్తు ఉన్న శ్రీలంకకు చెందిన నెట్‌బాల్ ప్లేయర్ తార్జిని శివలింగం సోమవారం సంప్రదాయ వస్త్రధారణతో శ్రీవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఆమెను చూసిన పలువురు భక్తులు అయ్య బాబోయ్ ఎంత పొడుగో అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేశారు.
– న్యూస్‌టుడే, తిరుమల



మీ ఆనందాన్ని ఇంకెక్కడో వెతుక్కోకండి

'నాకు ఆనందం కలిగేది ఎప్పుడంటే..' అని మీరు చెబుతున్నారంటే, మీరెప్పటికీ ఆనందంగా ఉండలేరని అర్థం. ఎందుకంటే ఫలానా విజయాన్ని సాధించడంలోనో లేదా ఫలానా వస్తువును సొంతం చేసుకోవడంలోనో ఆనందాన్ని వెతుక్కోవడం మొదలుపెడితే, ప్రస్తుత క్షణాలను మీరు ఏ మాత్రం ఆస్వాదించలేరు. ఏ పరిస్థితుల్లోనైనా ఆనందంగా ఉండటం అలవాటు చేసుకొంటే, మీ జీవితం అందంగా ఉంటుంది.
–టామ్ హగెస్,
ఆన్‌లైన్ బిజినెస్ మెంటార్

చేజారితే చేటే...

చెల్లింపులకు క్రెడిట్ కార్డును వినియోగిస్తున్నారా? ఈ క్రమంలో, అంకెలన్నీ సరిగ్గానే ఎంటర్ చేస్తున్నారా? ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా.. జేబుకు చిల్లు పడ్డట్లే..!

విజయవాడకు చెందిన మహిళ ఇటీవల తన కారులో రూ.2,000 విలువైన పెట్రోల్ కొట్టించారు. క్రెడిట్ కార్డు నుంచి ఆ మొత్తాన్ని చెల్లించే క్రమంలో పొరపాటున పోస్ మెషిన్‌లో రూ.20,000గా ఎంటర్ చేశారు. నెల రోజుల తర్వాత ఆమెకు క్రెడిట్ కార్డు వినియోగంపై బ్యాంకు నుంచి బిల్లు వచ్చింది. అందులో రూ.20,000 లావాదేవీ చూసి ఉలిక్కి పడ్డారు. సైబర్ క్రైం జరిగిందనుకొని పోలీసులను ఆశ్రయించగా.. పెట్రోల్ బంకు ఖాతాకు వెళ్లినట్లు గుర్తించారు. దీంతో అదనపు మొత్తాన్ని వెనక్కి ఇప్పించారు.

క్రెడిట్, డెబిట్ కార్డుల ద్వారా చెల్లింపులు చేసే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోనట్లయితే ఎంత నష్టం జరుగుతుందో ఈ ఘటనే ఉదాహరణ. పెట్రోల్ పోయించినపుడు చాలామంది కార్లోంచే కార్డు లిచ్చేస్తారు. ఇంకొందరు పోస్ (పాయింట్ ఆఫ్ సేల్) మెషిన్ చేతుల్లోకి తీసుకుంటారు. ఈ రెండు సందర్భాల్లోనూ ఎంటర్ చేసిన మొత్తానికి సంబంధించి అంకెలు ఒకటికి రెండుసార్లు సరిచూసుకోవాలి. ఒక్క డిజిట్ అదనంగా ఎంటర్ చేసినా అంతే సంగతి. ప్రత్యేకించి క్రెడిట్ కార్డుల విషయంలో చాలా అప్రమత్తంగా ఉండాలి. బ్యాంకు ఖాతాలో ఉన్న బ్యాలెన్స్ మేరకే డెబిట్ కార్డులో చెల్లింపులు చేయొచ్చు. క్రెడిట్ కార్డులో అలాంటి నియంత్రణ ఉండదు.



జాగ్రత్తలు ఇలా తీసుకోవాలి

- పోస్‌మెషిన్, యాప్‌లో మొత్తం ఎంటర్ చేసిన తరువాత ఎమౌంట్ స్క్రీన్ చూశాకే పిన్, ఓటీపీ నంబర్ నమోదు చేయాలి. అవతలి వ్యక్తి ఎంటర్ చేసే సందర్భంలోనూ ఎమౌంట్ చూడాలి.
- చెల్లించిన మొత్తానికి రసీదు తీసుకోవడం అలవాటు చేసుకోవాలి. తప్పుడు లావాదేవీలు జరిగితే రసీదు ఉపయోగపడుతుంది.
- ప్రతి లావాదేవీ తరువాత వచ్చే బ్యాంకు ఎలర్ట్‌లను వెంటనే చెక్ చేయాలి. మొత్తం సరిపోలక పోతే వెంటనే ఫిర్యాదు చేయాలి.

పొరపాటు జరిగితే...

- తక్షణం బ్యాంకుకి సమాచారం ఇవ్వాలి. కస్టమర్ కేర్ నంబరుకు కాల్ చేయాలి. యాప్‌లోని 'డిస్ప్యూట్ ట్రాన్సాక్షన్' ఆప్షన్ ద్వారా ఫిర్యాదు చేయాలి.
- ఆన్‌లైన్ చెల్లింపులకు సంబంధించిన రసీదులు, స్టేట్‌మెంట్లు, స్క్రీన్ షాట్లు భద్రపరుచుకోవాలి.
- బ్యాంకు మీ ఫిర్యాదు పరిశీలించి వ్యాపార సంస్థతో మాట్లాడి తప్పు నిర్ధారణ అయిన తరువాత 7-15 రోజుల్లో రిఫండ్ ఇస్తుంది.
- బ్యాంకు స్పందించనట్లయితే రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ఇంటిగ్రేటెడ్ అంబుడ్స్‌మన్ పోర్టల్‌లో scms.rbi. org.in ఫిర్యాదు చేయొచ్చు.





మళ్లీ జరగకుండా....

- బ్యాంకు యాప్‌లో టాప్ అండ్ పే/కాంటాక్ట్ లెస్ ట్రాన్సాక్షన్లు ఉంటే లిమిట్ తక్కువగా సెట్ చేయండి.
- ప్రతి నెలా స్టేట్‌మెంట్ పూర్తిగా చదవండి
- క్రెడిట్ కార్డు ఇతరుల చేతికి ఇవ్వొద్దు. మీరే స్వయంగా చెల్లింపులు చేయడం మంచిది.
- బ్యాంక్ యాప్‌లో 'స్పెండ్ లిమిట్ ఎలర్ట్' ఆన్ చేసుకోండి.

- ఈనాడు, అమరావతి

రైతుల అప్పు తీర్చిన బాబూభాయ్



గుజరాత్‌లోని సూరత్‌కు చెందిన వ్యాపారవేత్త బాబూభాయ్ జిరావాలా (ఛాద్వాడియా).. 290 మంది రైతుల అప్పులను తీర్చారు. దశాబ్దాలుగా అప్పులు తీర్చలేక ఇబ్బంది పడుతున్న వారి కష్టాన్ని చూసి చలించిపోయి ఈ నిర్ణయం తీసుకున్నారు. మొత్తం రూ.89,89,209ను ఆయన రైతులకు అందజేశారు. తన తల్లి వర్ధంతి సందర్భంగా ఆయన ఈ సాయం చేశారు. ఈ రుణ సమస్య అమ్రేలీ జిల్లాలోని జిరా గ్రామస్థులను 1995 నుంచీ వేధిస్తోంది. 290 మంది రైతులు ఎంత రుణం తీర్చినా ఇంకా మిగిలిపోతోంది. దీనికి శాశ్వత పరిష్కారంగా బాబూభాయ్.. రుణాన్ని తీర్చాలని నిర్ణయించి తీర్చేశారు.

ఈటీవీ భారత్
యాప్ స్టోర్ & గూగుల్ ప్లే ద్వారా డౌన్‌లోడ్ చేసుకోండి

ముళ్ల కంపలో దూకే ఆచారం



మహారాష్ట్రలోని బారామతి ప్రాంతంలో ఉన్న గులంకీ గ్రామంలో భక్తులు నల్ల తుమ్మ చెట్టు ముళ్ల కంపలోకి దూకే ఆచారం వందల ఏళ్లుగా కొనసాగుతోంది. చాలా మంది ఇలా ముళ్ల కంపలోకి దూకుతుంటారు. కాటేబరాస్ యాత్రలో భాగంగా సోమవారం మరోసారి ఈ ఆచారం కొనసాగింది. అయితే గ్రామంలో అది తప్పనిసరి కాదు. ఇష్టమున్నవారు దూకవచ్చని గ్రామస్థులు చెబుతున్నారు. కొంత మంది దీనిని మూఢాచారమని అంటున్నారు. అయినా ఆ ఊరి జనం ఆగడం లేదు. ఇది 300 ఏళ్లుగా ఏటా సాగుతున్న ఆచారమని వారు అంటున్నారు.

ఓటు వేటలో నాగసాధువులు



జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో నాగసాధువులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. యుగతులసి పార్టీ అభ్యర్థి కొలిశెట్టి శివకుమార్‌కు మద్దతుగా వారణాసి నుంచి వచ్చిన 11 మంది సోమవారం ప్రచారం నిర్వహించారు. సోమాజిగూడ, వెంగళరావునగర్, బోరబండ డివిజన్ ప్రాంతాల్లో అభ్యర్థితోపాటు ఉండి ఓటు అభ్యర్థించారు. యుగతులసి పార్టీ వ్యవస్థాపకుడు శివకుమార్ గోవధను నిషేధించి.. గోవును జాతీయ మాతగా గుర్తించాలని పోరాడుతున్నారు. నాగసాధువులు నియోజకవర్గంలో మూడురోజుల పాటు ప్రచారం నిర్వహిస్తారని తెలిపారు. –న్యూస్‌టుడే, యూసుఫ్‌గూడ

వ్యర్థానికి అర్థం.. చిన్నారులకు ఆహ్లాదం



ఎందుకూ పనికి రావని పక్కన పడేసే వాహనాల టైర్లను సరికొత్తగా వినియోగించవచ్చని నిరూపించారు గుంటూరు లక్ష్మీపురంలోని పాటిబండ్ల సీతారామయ్య ప్రైవేట్ పాఠశాల నిర్వాహకులు. వందల కొద్దీ పాత టైర్లకు రంగులద్ది పాఠశాల ఆవరణలో పార్కు నిర్మాణంలో ఉపయోగించారు. క్రీడాస్థలం చుట్టూ టైర్లను వరుసగా పేర్చి ప్రహరీలా తీర్చిదిద్దారు. ఈ టైర్లనే వివిధ ఆట పరికరాలుగా మార్చారు. అంతేకాకుండా పాడైపోయిన ప్లాస్టిక్ వాటర్ క్యాన్లను వివిధ జంతువుల ఆకారాలుగా తయారుచేసి వాటిని పూలకుండీలుగా వాడుతున్నారు. 'పాత టైర్లను తగలబెట్టడం వల్ల పర్యావరణానికి హాని కలుగుతుండటంతో ఇలా మార్చేశాం. ఈ ప్రయత్నాన్ని చూసి కొందరైనా అనుసరిస్తారని భావిస్తున్నాం' అని పాఠశాల కార్యదర్శి పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. –ఈనాడు, గుంటూరు, న్యూస్‌టుడే, పట్టాభిపురం





రైల్వే స్టేషన్లే విద్యుత్ కేంద్రాలు



రైల్వేస్టేషన్లలో ప్లాట్‌ఫారాలపై లైట్లు, ఫ్యాన్లు, అనౌన్స్‌మెంట్ సిస్టమ్, టికెట్ కౌంటర్లు.. ఇలా అన్నింటికి కలిపి పెద్ద ఎత్తున విద్యుత్ కావాలి. దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలోని 55 రైల్వేస్టేషన్లు, కార్యాలయ భవనాలకు ఇప్పుడు ఆ శక్తి సూర్యుడి నుంచే అందుతోంది. 2030 నాటికి 'నెట్ జీరో కార్బన్ ఎమిషన్ లక్ష్యాన్ని' నిర్దేశించుకున్న భారతీయ రైల్వే.. జోన్ల వారీగా రైల్వేస్టేషన్లు, కార్యాలయాల భవనాల్ని సోలార్ విద్యుత్‌తో నడిచేలా మార్పులు చేస్తోంది. స్టేషన్లు, భవనాల పైకప్పులపై సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేస్తోంది. తద్వారా విద్యుత్ ఖర్చులు తగ్గడం, కర్బన ఉద్గారాల నియంత్రణ..సాధ్యం అవుతోంది. అవసరమైన దాని కంటే ఎక్కువ సౌర విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తూ 38 స్టేషన్లు, భవనాలు శూన్య ప్లస్, అవసరమైన మేర సూర్య శక్తి ఉత్పత్తితో 17 స్టేషన్లు, భవనాలు శూన్య రేటింగ్ పొందాయి. 2025 సెప్టెంబరు 30 నాటికి దేశవ్యాప్తంగా 205 స్టేషన్లు, భవనాలు శూన్య, శూన్య+ రేటింగ్ సాధిస్తే.. అందులో ఏకంగా 55 ద.మ.రైల్వే పరిధిలో ఉన్నాయి. శూన్య+ రేటింగ్ సాధించిన దేశంలోనే మొట్టమొదటి భవనం లేఖా భవన్ ద.మ.రైల్వే పరిధిలోనే ఉంది. లింగంపల్లి స్టేషన్‌లో ప్లాట్‌ఫారాలపై ఏర్పాటు చేసిన సౌర ప్యానెళ్లను చిత్రంలో చూడవచ్చు. –ఈనాడు, హైదరాబాద్

విజయనగరంలోనూ డబ్బావాలా..



వ్యక్తిగత పని అనో, ఉద్యోగమనో, వ్యాపారమనో చాలా మంది ఉదయం నిద్ర లేచింది మొదలు ఉరుకులు పరుగులు పెడుతుంటారు. ఓ వైపు పాఠశాలలకు పిల్లల్ని సిద్ధం చేస్తూనే వారికి అల్పాహారం వండుతూ తీరిక లేకుండా ఉంటారు. ఈ క్రమంలో కొందరు తమ మధ్యాహ్న భోజనాన్ని తీసుకెళ్లడం మానేస్తుంటారు. అలాంటి వారికి సేవలు అందించేందుకు, తద్వారా ఉపాధి పొందేందుకు ముందుకొచ్చారు విజయనగరం జిల్లా కేంద్రానికి చెందిన పూసర్ల స్వాతి. 'డబ్బావాలా' వాహనంతో ఇంట్లోని లంచ్ బాక్సులను ఆయా వినియోగదారులకు చేరవేస్తున్నారు. సాధారణంగా ఇలాంటి సేవలు ముంబయి, దిల్లీ, బెంగళూరు వంటి నగరాల్లో ఎక్కువగా ఉంటాయి. ఇప్పుడీమె రూ.3 లక్షలతో ఓ వాహనాన్ని సిద్ధం చేసుకుని, విజయనగరంలోని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలు వంటి చోట్ల అవసరమైన వారికి లంచ్ బాక్సులను ఇస్తున్నారు. ఇలా ఏ ప్రాంతానికైనా మధ్యాహ్నం 12.30 గంటలలోపు అందజేస్తున్నామని స్వాతి చెప్పారు.
– న్యూస్‌టుడే, విజయనగరం రింగురోడ్డు

ఈ దండలను ఎంచక్కా తినేయొచ్చు!



పాయసంలోకి కమ్మని రుచిని ఇచ్చేది జీడిపప్పు. అదే జీడిపప్పుతో చేసిన దండలను నూతన వధూవరులు, రాజకీయ నాయకుల మెడలో వేస్తే ప్రత్యేకమే కదా. జీడిపప్పునకు పేరు గాంచిన బాపట్ల జిల్లా వేటపాలెంలో ఈ తరహా దండలను తయారుచేస్తున్నారు. ఇందు కోసం జీడిపప్పు గుండ్లు మాత్రమే వినియోగిస్తారు. వీటిని చాలా ఓర్పుతో పూలు కట్టినట్లు కడతారు. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా గుండు చిట్లిపోయి దండకు పనికిరాకుండా పోతుంది. నాలుగు కిలోల నుంచి పది కిలోల వరకు ఇలా కడతారు. ప్రస్తుతం జీడిపప్పు బొకేలు కూడా వచ్చాయి. ఖర్చుతో కూడుకున్నా చూపరులను ఆకర్షించేలా ఉంటాయి. – న్యూస్‌టుడే, వేటపాలెం

ఇటలీ వాసి.. గోరింటకు మురిసి



విశ్వశాంతి కాంక్షిస్తూ ఇటలీ దేశీయుడైన జాన్ సైకిల్‌పై ప్రపంచ దేశాలను చుట్టేస్తున్నారు. ఇప్పటికే స్పెయిన్, ఫ్రాన్స్, తుర్కియే, ఇండోనేసియా, జర్మనీ తదితర దేశాల్లో యాత్ర పూర్తిచేశారు. కొన్నాళ్ల క్రితం భారత్‌కు రాగా, సోమవారం శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలికి చేరుకున్నారు. ఈయన చేతులకు గుడ్లూరు మండలం రామాయపట్నానికి చెందిన బాలిక సౌమ్య గోరింటాకు పెట్టడంతో ఎంతో మురిసిపోయారు. ఎర్రగా పండిన తన చేతులు చూపుతూ ఆనందాన్ని 'న్యూస్‌టుడే'తో పంచుకున్నారు. గోరింటాకు పెట్టిన బాలిక అభిమానాన్ని తాను మరిచిపోలేనన్నారు. భారత్‌లో మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణలో పర్యటించానని, ఇక్కడ తనకు ఎన్నో మధురానుభూతులు మిగిలాయని వివరించారు. – న్యూస్‌టుడే, కావలి

కోటి కాంతుల అఖండ జ్యోతి



కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం ములగపూడిలో ఏటా కార్తిక పౌర్ణమి రోజు కోదండరాముడి తెప్పోత్సవం ఘనంగా నిర్వహిస్తారు. ఆ రోజు శ్రీరాముని సన్నిధిలో అఖండ జ్యోతి వెలిగిస్తారు. గతేడాది 15 లక్షల వత్తులతో చేసిన దీపం వెలిగించారు. ఈ ఏడాది బుధవారం నిర్వహించబోయే ఉత్సవంలో కోటి వత్తులతో తయారు చేసిన అఖండ జ్యోతిని సిద్ధం చేశారు. దీన్ని హైదరాబాద్ నుంచి తెప్పించినట్లు నిర్వాహకులు తెలిపారు. –ఈనాడు, కాకినాడ

ఎన్నారై... ఐతే వెయిట్ చెయ్

నా దగ్గర 300కు పైగా ఎన్నారై సంబంధాలున్నాయి. వాటిలో కేవలం అమెరికాలో ఉన్న వారివే 200. గత ఆరు నెలల నుంచి ఒక్క పెళ్లి కూడా కుదరడం లేదు.
- ఓ మ్యారేజ్ బ్యూరో ప్రతినిధి

మా అబ్బాయి అమెరికా వెళ్లి మూడేళ్లవుతోంది. పెళ్లి చేయాలని గత జనవరి నుంచి సంబంధాలు వెతుకుతున్నాను. కొంతమంది అబ్బాయి ఉద్యోగ వివరాలతో పాటు పేస్లిప్ కూడా పంపమని అడిగారు.
- ఓ తల్లి, హైదరాబాద్

పెట్టుబడులు, చదువులు, ఉద్యోగాలపైనే కాదు ట్రంప్ ప్రభావం వివాహ బంధాలపైనా పడుతోంది. ఎన్నారై పెళ్లి సంబంధాల విషయంలో తల్లిదండ్రులు ఆచితూచి అడుగేస్తున్నారు.

ఐటీ ఉద్యోగాల్లో ఒడిదొడుకులు, ఆర్థిక అస్థిర పరిస్థితుల కారణంగా ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తున్నారు. అమెరికా, యూకేల్లో కొత్తవారికి ఉద్యోగాలు రావడం లేదని, ఉన్న ఉద్యోగాలే పోతున్నాయన్న సమాచారం ఇక్కడి యువత, తల్లిదండ్రుల ఆలోచనలపై తీవ్ర ప్రభావం చూపుతోంది.



- గతంలో అమెరికా, యూకేలో కుర్రాడు ఎం.ఎస్. చేసి ఉద్యోగం చేస్తున్నాడనగానే మిగతా విషయాలు పెద్దగా పట్టించుకోకుండా పెళ్లి సంబంధం కుదుర్చుకోవడానికి బాగా ఆసక్తి చూపేవారు. తమ కుమార్తె అమెరికాలో స్థిరపడితే చాలు అని ఏడాది క్రితం వరకూ తల్లిదండ్రులు, అమ్మాయిలు ఎన్నారై పెళ్లి కొడుకుల వివరాలను అడిగేవారు. కానీ ఇప్పుడు నెలకు కనీసం ఒకరు కూడా అడగటం లేదు.
- ఎన్నారై సంబంధం ఉందని చెప్పినా ఇప్పుడు వద్దులే...వేచి చూద్దాం...ఇండియాలోనే ఏదైనా మంచి ఉద్యోగం చేస్తున్న అబ్బాయిల వివరాలుంటే ఇవ్వండని అడుగుతున్నారు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి నగరాల్లో ఐటీ లేదా ఇతర ఏదైనా మంచి ఉద్యోగం చేసే పెళ్లి సంబంధాలను ఎక్కువగా ఇష్టపడుతున్నారు.
- తెలుగు రాష్ట్రాల యువతీ, యువకులు అమెరికా, యూకేల్లోని నగరాల్లో మాస్టర్స్ చేయడానికి ఖర్చులు, ఫీజుల కోసం ఇక్కడ బ్యాంకు రుణాలు తీసుకుని వెళుతున్నారు. మాస్టర్స్‌కి కనీసం రూ.40 లక్షలు రుణాలు తీసుకునేవారే అత్యధికంగా ఉన్నారని ప్రధాన బ్యాంకు జనరల్ మేనేజర్ ఒకరు చెప్పారు.
- ఇలాంటివారు అక్కడ మాస్టర్స్ పూర్తిచేసి ఏదైనా ఉద్యోగంలో చేరి వేతనం వస్తేనే ఇక్కడ తీసుకున్న రుణం తీర్చడానికి కనీసం ఒకటి, రెండేళ్లు పడుతుంది. ఎం.ఎస్‌కు, బ్యాంకు రుణం తీర్చడానికి కనీసం నాలుగైదేళ్లు అక్కడుండి, ఉద్యోగం చేస్తే తప్ప ఆర్థికంగా నిలదొక్కుకోలేని పరిస్థితులున్నాయి. ఈ నేపథ్యంలో ఉద్యోగం దొరక్కపోయినా లేదా చేరిన ఉద్యోగం హఠాత్తుగా పోతుందేమోనని వారు పెళ్లి చేసుకోవాలంటే భయపడుతూ వాయిదా వేస్తున్నారు. తీసుకున్న బ్యాంకు రుణం అయినా తీరకుండా పెళ్లి చేసుకుంటే ఎలా అని కొందరు వెనుకంజ వేస్తున్నారు.

● ఎన్నారై సంబంధాల్లో చాలామంది కట్నం డిమాండ్ చేస్తున్నారని... ఇలాంటివారికి పెళ్లి కుదర్చడం చాలా కష్టంగా ఉంటోందని ఓ మ్యారేజ్ బ్యూరో నిర్వాహకులు వివరించారు. వారి ఉద్యోగాల్లో ఒడిదొడుకులున్నా ఇక్కడున్న అమ్మాయి ఆస్తులు అడుగుతున్నారని... దీంతో ఆడపిల్లల తల్లిదండ్రులు ముందుకు రావడం లేదని పేర్కొన్నారు.



- ఒక అబ్బాయి గతేడాది ఎం.ఎస్. పూర్తిచేసి అమెరికాలో చిన్న ఉద్యోగం చేస్తూ పెళ్లి సంబంధాలు చూశారు. ట్రంప్ వచ్చిన తరవాత పెళ్లి ఆలోచన వాయిదా వేసుకుని అక్కడే పీహెచ్‌డీలో చేరి స్టూడెంట్ వీసా కాలపరిమితి గడువు పొడిగించుకున్నారు. మరో మూడేళ్ల దాకా పెళ్లి వద్దు అని తల్లిదండ్రులకు చెప్పారు.
- తమిళనాడులోని కారైకల్ ప్రాంతానికి చెందిన యువతి హైదరాబాద్‌లో ఐటీ ఉద్యోగం చేస్తోంది. తనకు చాలా అమెరికా సంబంధాలు వచ్చినా తిరస్కరించింది. చివరికి గుంటూరు జిల్లాకు చెందిన యువకుడు హైదరాబాద్‌లో ఐటీ ఉద్యోగం చేస్తుంటే పెళ్లి చేసుకుంది. అమెరికా ఉద్యోగాల పరిస్థితిపై అక్కడున్నవారు పెడుతున్న రీల్స్‌ను ఇన్‌స్టాలో చూసి భయపడి ఎన్నారై సంబంధాలను తిరస్కరించినట్లు ఆ యువతి చెబుతోంది. "హైదరాబాద్‌లో ఐటీ ఉద్యోగం పోయినా జీవితంపై పెద్దగా భయం ఉండదు...ఇక్కడే ఏదో ఒకటి చేసుకుంటూ ప్రశాంతంగా ఉండవచ్చు. పైగా నా స్నేహితురాలు అమెరికా సంబంధం చేసుకుని అక్కడ చాలా ఇబ్బందులు పడుతోంది. అందుకే వద్దనుకున్నాను" అని ఆమె వివరించింది.
- తెలుగు రాష్ట్రాల నుంచి పలువురు అమ్మాయిలు కూడా ఎం.ఎస్. చేయడానికి అమెరికా ఇతర దేశాలకు వెళుతున్నారు. వారు అక్కడే ఎం.ఎస్.పూర్తిచేసి ఉద్యోగం చేస్తూ హెచ్1బి లేదా గ్రీన్‌కార్డు ఉన్నవారితోనే పెళ్లికి ప్రాధాన్యమిస్తున్నారు. కానీ అక్కడ చదివిన అబ్బాయిలు మాత్రం తెలుగు రాష్ట్రాల్లో చదివి ఉద్యోగం చేస్తున్న అమ్మాయి సంబంధం దొరికినా చాలని ఆరా తీస్తున్నారు. అయినా వీరికి సంబంధాలు కుదరడం ప్రస్తుతం కష్టంగా మారిందని మ్యారేజ్‌బ్యూరోల ప్రతినిధులు చెబుతున్నారు.


- ఈనాడు, హైదరాబాద్

EENADU Vol: 52, Issue: 84 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

న్యూసెలియన్ నుంచి కణ, జన్యు చికిత్సలు

- భారత్ బయోటెక్ అనుబంధ సంస్థ ఇది
- 'జీనోమ్‌వ్యాలీ'లో విశాల ప్రాంగణం

ఈనాడు, హైదరాబాద్: భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్‌కు పూర్తిస్థాయి అనుబంధ సంస్థ న్యూసెలియన్ థెరప్యూటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ లాంఛనంగా తన కార్యకలాపాలు ప్రారంభించింది. హైదరాబాద్ సమీపంలోని జీనోమ్‌వ్యాలీలో ప్రత్యేకంగా నిర్మించిన 30,000 చదరపు అడుగుల విస్తీర్ణం గల ప్రాంగణంలో ఈ సంస్థ కార్యకలాపాలు కొనసాగుతాయి. కాంట్రాక్టు పరిశోధన, అభివృద్ధి, ఉత్పత్తి సేవల (సీడీఎంఓ) విభాగానికి చెందిన ఈ సంస్థ ప్రధానంగా కణ, జన్యు చికిత్సల (సెల్, జీన్ థెరపీ) పై దృష్టి సారించింది. క్యాన్సర్, ఆటో ఇమ్యూన్ వ్యాధులు, అరుదైన జన్యు సంబంధ రుగ్మతలకు అత్యాధునిక చికిత్సకు అవసరమైన విధానాలను, ఔషధాలను ఆవిష్కరించటం ఈ సంస్థ ప్రధాన లక్ష్యం. సమీప భవిష్యత్తులో ఔషధ పరిశోధన అంతా బయోలాజికల్ విభాగంలోనే ఉన్నట్లు, ఈ కొత్త పరిష్కారాలు ప్రపంచ వ్యాప్తంగా ఉన్నాయని భారత్ బయోటెక్ వ్యవస్థాపకుడు, న్యూసెలియన్ నాన్-ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణ ఎల్ల అన్నారు. ఇందులో సెల్, జీన్ థెరపీ విభాగం ఎంతో కీలకమని పేర్కొన్నారు. అత్యంత సంక్లిష్ట వ్యాధులకు తగిన పరిష్కారాలు కనుగొనాలనే సంకల్పంతో ఉన్నామని తెలిపారు. క్లినికల్ దశ నుంచి వాణిజ్య స్థాయి ఉత్పత్తి వరకు పూర్తిస్థాయి సేవలు అందించటానికి తాము సిద్ధపడుతున్నామని న్యూసెలియన్ థెరప్యూటిక్స్ ముఖ్య వ్యాపార అధికారి (సీబీఓ) రఘు మలపాక వివరించారు. ప్లాస్మిడ్ డీఎన్ఏ, వైరల్ వెక్టార్స్, ఆటోలోగస్, అల్లోజెనీక్ సెల్ థెరపీస్ విభాగాల్లో అభివృద్ధి-ఉత్పత్తి సేవలు అందిస్తామని తెలిపారు.





ఓపెన్‌ఏఐ, అమెజాన్ రూ.3.34 లక్షల కోట్ల ఒప్పందం

సియాటెల్: ఇ-కామర్స్ దిగ్గజం అమెజాన్, కృత్రిమ మేధ (ఏఐ) సేవల సంస్థ ఓపెన్ ఏఐ 38 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.3.34 లక్షల కోట్లు) విలువైన ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. అమెజాన్ క్లౌడ్ కంప్యూటింగ్ ప్లాట్‌ఫామ్‌పై ఓపెన్‌ఏఐ ఏఐ వ్యవస్థలను నడిపేందుకు ఈ ఒప్పందం వీలు కల్పించనుంది. ఈ ఒప్పందంలో భాగంగా అమెజాన్ వెబ్ సర్వీసెస్ ద్వారా లక్షలాది ఎన్‌విడియా ప్రత్యేకమైన ఏఐ చిప్‌లను వినియోగించే సౌలభ్యాన్ని ఓపెన్‌ఏఐ పొందనుంది. మైక్రోసాఫ్ట్‌తో భాగస్వామ్యాన్ని ముగించుకున్న వారం రోజుల్లోపే ఓపెన్‌ఏఐ ఈ ఒప్పందాన్ని కుదుర్చుకోవడం గమనార్హం.

✦ ఎన్విడియా జీబీ 300 చిప్‌ను యాక్సిస్ చేయడానికి దాదాపుగా 9.7 బిలియన్ డాలర్ల (సుమారు రూ.86 వేల కోట్ల) ఒప్పందాన్ని డేటా కేంద్రాల సంస్థ ఐఆర్ఈఎన్‌తో కుదుర్చుకున్నట్లు మైక్రోసాఫ్ట్ ప్రకటించింది.

ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీతో కంట్రోల్‌ఎస్ జట్టు

ఈనాడు, హైదరాబాద్: డేటా కేంద్రాలను నిర్వహించే కంట్రోల్‌ఎస్, ఎన్‌టీపీసీ అనుబంధ సంస్థ ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ (ఎన్‌జీఈఎల్) కలిసి 2 గిగావాట్లకు పైగా పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులు ప్రారంభించేందుకు వ్యూహాత్మక ఒప్పందం కుదుర్చుకున్నాయి. దీని ప్రకారం కంట్రోల్‌ఎస్, ఎన్‌జీఈఎల్ సంయుక్తంగా కొత్తగా ప్లాంట్లను ఏర్పాటు చేయడం, లేదా ఇతర సంస్థలను స్వాధీనం చేసుకోవడం ద్వారా గ్రిడ్‌కు అనుసంధానించే పునరుత్పాదక ఇంధనాన్ని ఉత్పత్తి చేయనున్నాయి. డేటా సెంటర్లను పునరుత్పాదక ఇంధన శక్తితో నిర్వహించడం వల్ల వాటి సామర్థ్యం పెరుగుతుందని కంట్రోల్‌ఎస్ వ్యవస్థాపకుడు, సీఈఓ శ్రీధర్ పిన్నపురెడ్డి అన్నారు. కంట్రోల్‌ఎస్‌తో ఒప్పందం వల్ల తక్కువ కర్బన ఉద్గారాలతో కూడిన డిజిటల్ మౌలిక వసతులు సాకారమవుతాయని ఎన్‌జీఈఎల్ సీఈఓ సరిత్ మహేశ్వరి తెలిపారు.

ఆర్థిక ఫలితాలు

తాజ్‌జీవీకే హోటల్స్ అండ్ రిసార్ట్స్: సెప్టెంబరు త్రైమాసికంలో రూ.109 కోట్ల ఆదాయంపై రూ.23.5 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. 2024-25 ఇదే కాలంలో ఆదాయం రూ.107 కోట్లు, నికర లాభం రూ.20 కోట్లుగా ఉన్నాయి. 256 గదులతో ఉత్తర బెంగళూరులో నిర్మిస్తున్న తాజ్ యెలహంక హోటల్ కార్యకలాపాలు కొన్ని నెలల్లో ప్రారంభమవుతాయని సంస్థ ఛైర్మన్ జీవీకే రెడ్డి పేర్కొన్నారు.

విమ్టా ల్యాబ్స్: సెప్టెంబరు త్రైమాసికానికి రూ.104.5 కోట్ల మొత్తం ఆదాయం, రూ.19.9 కోట్ల నికరలాభం ఆర్జించింది. 2024-25 ఇదేకాలంలో ఆదాయం రూ.85.4 కోట్లు, నికరలాభం రూ.17 కోట్లు ఉన్నాయి. దీంతో పోల్చితే ఆదాయం 22.3%, నికరలాభం 17.1% పెరిగాయి. క్లినికల్ పరిశోధనలు చేపట్టడానికి వీలుగా ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆడిట్‌ను విజయవంతంగా పూర్తిచేసినట్లు విమ్టా ల్యాబ్స్ ఎండీ హరిత వాసిరెడ్డి తెలిపారు.

వింటేజ్ కాఫీ అండ్ బెవరేజెస్: సెప్టెంబరు త్రైమాసికానికి రూ.135.61 కోట్ల ఆదాయంపై రూ.17.83 కోట్ల పన్ను తర్వాత లాభం (పీఏటీ) ఆర్జించింది. 2024-25 ఇదే కాల ఆదాయం రూ.71.56 కోట్లతో పోలిస్తే 90%, నికరలాభం రూ.7.51 కోట్లతో పోలిస్తే ఈసారి 137% అధికంగా ఆర్జించింది. 2026 మార్చి చివరకు 4,500 టన్నుల స్ప్రే డ్రైడ్ అండ్ అగ్లమరేటెడ్ కాఫీ ఉత్పత్తి సామర్థ్యం అందుబాటులోకి వస్తుందని వింటేజ్ కాఫీ ఎండీ తాతి బాలకృష్ణ తెలిపారు. దీనికి అదనంగా 5,000 టన్నుల సామర్థ్యం గల ఫ్రీజ్ డ్రైడ్ కాఫీ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

గ్లాండ్ ఫార్మా: సెప్టెంబరు త్రైమాసికంలో రూ.184 కోట్ల పన్ను తర్వాత లాభాన్ని (పీఏటీ) ఆర్జించింది. 2024-25 ఇదేకాలంలో పీఏటీ రూ.163 కోట్లు మాత్రమే. దీంతో పోల్చితే ఈసారి లాభం 12% పెరిగింది. సీడీఎంఓ విభాగం మెరుగైన పనితీరు ప్రదర్శించటంతో పాటు ఐరోపాలో కొనుగోలు చేసిన సంస్థ సెనెగ్జి నుంచి ఆదాయాలు పెరిగినందున, ఆకర్షణీయ గణాంకాలు నమోదైనట్లు సంస్థ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ శ్రీనివాస సాదు తెలిపారు. ఆదాయం రూ.1,406 కోట్ల నుంచి రూ.1,487 కోట్లకు పెరిగింది.

భారతీ ఎయిర్‌టెల్: జులై- సెప్టెంబరులో రూ.8,651 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ఆర్జించింది. 2024-25 ఇదే కాల లాభం రూ.4,153.4 కోట్లతో పోలిస్తే ఇది రెట్టింపు కంటే అధికం. కార్యకలాపాల ఆదాయం రూ.41,473.3 కోట్ల నుంచి 25.7% వృద్ధి చెంది రూ.52,145 కోట్లకు చేరింది. ప్రతి వినియోగదారుపై సగటు ఆర్జన (ఆర్పు) 2024 సెప్టెంబరు ఆఖరులో రూ.233 కాగా, సమీక్షా త్రైమాసికం చివరకు 10% వృద్ధితో రూ.256కి పెరిగింది. మొత్తం చందాదారుల సంఖ్య 10.7% పెరిగి 62.35 కోట్లకు చేరింది. భారత చందాదారుల సంఖ్య 10.6% వృద్ధి చెంది 44.97 కోట్లుగా నమోదైంది.

20 ఏళ్లలో 50 రెట్ల వృద్ధి

- రూ.91 లక్షల కోట్లు దాటిన బీఎఫ్‌ఎస్ఐ
- బజాజ్ ఫిన్‌సర్వ్ ఏఎంసీ నివేదిక



ఈనాడు, హైదరాబాద్: దేశ బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా (బీఎఫ్‌ఎస్ఐ) రంగం మార్కెట్ విలువ గత 20 ఏళ్లలో 50 రెట్లు పెరిగింది. దేశ జీడీపీకి ప్రధాన ఆధారంగా ఇది మారింది. 2005లో రూ.1.8 లక్షల కోట్లుగా ఉన్న బీఎఫ్‌ఎస్ఐ రంగం మార్కెట్ విలువ, 2025 నాటికి రూ.91 లక్షల కోట్లకు పెరిగింది. ఏటా సగటున 22% వార్షిక వృద్ధితో ఇది సాధ్యమైందని బజాజ్ ఫిన్‌సర్వ్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ (ఏఎంసీ) నివేదిక వెల్లడించింది. 2005లో దేశ జీడీపీలో ఈ రంగం వాటా కేవలం 6 శాతమే కాగా, ఇప్పుడు 27 శాతానికి చేరుకుంది. బీఎఫ్‌ఎస్ఐ ఇప్పుడు దేశ ఆర్థిక శక్తికి ఎంతో కీలకమని నివేదిక స్పష్టం చేసింది.

ఇప్పటికీ బ్యాంకులదే ఆధిపత్యం: బీఎఫ్‌ఎస్ఐ రంగం మొత్తం మార్కెట్ విలువలో 57% బ్యాంకులదే. 2005లో ఇది 85%. మిగిలిన వాటా బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు, ఫిన్‌టెక్ సంస్థలు, ఏఎంసీలు, ఇన్సూరెన్స్ కంపెనీలకు వెళ్తోంది. బీఎఫ్‌ఎస్ఐ షేర్లు ఎప్పటికప్పుడు మార్కెట్ వృద్ధిని మించి రాబడిని అందించాయి.

ఎన్‌బీఎఫ్‌సీలు దూసుకెళ్తున్నాయ్

బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు (ఎన్‌బీఎఫ్‌సీ)లు ఇప్పుడు ప్రధాన రుణదాతలుగా మారాయి. గత 20 ఏళ్లుగా ఎన్‌బీఎఫ్‌సీల రుణ వితరణలో సగటు వార్షిక వృద్ధి 15%, లాభాలు 31.7% కనిపించాయి. ప్రస్తుతం బీఎఫ్‌ఎస్ఐ ఆదాయాల్లో ఎన్‌బీఎఫ్‌సీల వాటా 18%. రిటెయిల్, గ్రామీణ ప్రాంతాలు, ఎంఎస్ఎంఈల రుణాల్లో వీటి పాత్ర పెరుగుతోంది. స్థూల నిరర్థక ఆస్తులు 2022లో 4.5% ఉండగా, గత ఆర్థిక సంవత్సరంలో 2.6 శాతానికి తగ్గాయి. డిజిటల్, వాహన, సహ రుణ భాగస్వామ్యాలు ఎన్‌బీఎఫ్‌సీల వృద్ధిని బలోపేతం చేస్తున్నాయి.

✦ 2032 నాటికి భారత్ ప్రపంచంలో ఆరో అతిపెద్ద బీమా మార్కెట్‌గా అవతరిస్తుందనీ నివేదిక అంచనా వేసింది.

✦ మ్యూచువల్ ఫండ్ల నిర్వహణలో ఉన్న ఆస్తుల విలువ రూ.75 లక్షల కోట్లను చేరింది.

అనిల్ అంబానీ ఇల్లు సహా రూ.7,500 కోట్ల ఆస్తుల జప్తు: ఈడీ

హైదరాబాద్, తూ.గోదావరిల్లోనూ



రిలయన్స్ గ్రూప్ ఛైర్మన్ అనిల్ అంబానీ, ఆయన గ్రూపు కంపెనీలు, సంబంధిత సంస్థలకు చెందిన రూ.7,500 కోట్లకు పైగా విలువైన ఆస్తులను అటాచ్ చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) సోమవారం ప్రకటించింది. మనీలాండరింగ్ దర్యాప్తులో భాగంగా ఈ చర్యలకు దిగింది.

అటాచ్ చేసిన ఆస్తులు ఇవీ: ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్(పీఎంఎల్ఏ) కింద 42 ఆస్తులను అటాచ్ చేస్తున్నట్లు ఈడీ పేర్కొంది. ఇందులో అనిల్ అంబానీ కుటుంబానికి ముంబయిలోని పాలిహిల్‌లోని ఉన్న ఇంటితో పాటు ఆయన గ్రూపు కంపెనీలకు చెందిన నివాస, వాణిజ్య ఆస్తులను అటాచ్ చేశారు. హైదరాబాద్‌లోని కామస్ కాప్రి అపార్ట్‌మెంట్స్‌లోని ఫ్లాట్లతో పాటు, ఆంధ్రప్రదేశ్ తూర్పు గోదావరి జిల్లాలోని ఆస్తులను జప్తు చేశారు. ముంబయి, నోయిడా, దిల్లీ, థానే, పుణె, చెన్నై, ఘజియాబాద్ ల్లోని ఆస్తులనూ జప్తు చేశారు.

ఆ ఒక్కటే రూ.4,462 కోట్లు: నవీ ముంబయిలోని ధీరూభాయ్ అంబానీ నాలెడ్జ్ సిటీ (డీఏకేసీ)కి చెందిన 32 ఎకరాలనూ అటాచ్ చేశారు. దీని విలువే రూ.4,462 కోట్లు. రిలయన్స్ కమ్యూనికేషన్స్ ఒక బ్యాంకును మోసం చేసిన కేసులో ఈ అటాచ్‌మెంట్ జరిగింది.

కేసు వివరాలు: రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ (ఆర్‌హెచ్‌ఎఫ్ఎల్)లో రూ.2,935 కోట్లు, రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ (ఆర్‌సీఎఫ్ఎల్) లో రూ.2,045 కోట్లను యెస్ బ్యాంక్ పెట్టుబడులుగా పెట్టగా, 2019 నాటికి అవి 'నిరర్థక' పెట్టుబడులుగా మారాయి. ఈ రెండు కంపెనీలు గ్రూప్‌లోని ఇతర కంపెనీలకు, ఆ డబ్బులను బదిలీ చేసినట్లు తేలింది.

ఆర్‌కామ్ కేసులో దర్యాప్తు వేగవంతం: రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కామ్), సంబంధిత కంపెనీల రుణాలను 'మోసపూరితమైనవి'గా తేలిన కేసు దర్యాప్తును వేగవంతం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కంపెనీలు రూ.13,600 కోట్లను ఇతర గ్రూపు కంపెనీల్లోకి మళ్లించినట్లు సమాచారం. మొత్తం మీద రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఇతర గ్రూపు కంపెనీలు రూ.17,000 కోట్లకు పైగా నిధుల మళ్లింపు చేపట్టిన నేపథ్యంలో అంబానీని ఆగస్టులో ఈడీ విచారించింది. ఇప్పుడు ఆస్తుల జప్తు ప్రారంభించింది.

వొడాఫోన్ ఐడియాలో టీజీహెచ్ రూ.53,000 కోట్ల పెట్టుబడి!

వొడాఫోన్ ఐడియా (వీఐ)లో 4-6 బిలియన్ డాలర్లు (సుమారు రూ.35,000 కోట్లు- 53,000 కోట్లు) పెట్టుబడి పెట్టేందుకు అమెరికాకు చెందిన ప్రైవేట్ ఈక్విటీ సంస్థ టిల్‌మన్ గ్లోబల్ హోల్డింగ్స్ (టీజీహెచ్) చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. వీఐకి ఉన్న బకాయిల సమస్య పరిష్కారమయ్యాకే, తాము పెట్టుబడులు పెడతామనే షరతును టీజీహెచ్ పెట్టినట్లు సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. పూర్తిగా బకాయిల మాఫీ అడగడం లేదు కానీ, ప్రభుత్వం నుంచి సంస్థ బకాయిల పునర్వ్యవస్థీకరణకు ఒక ప్యాకేజీని ప్రకటిస్తే, వీఐకి కొంత ఉపశమనం ఉంటుందనే విషయాన్ని ప్రస్తావించినట్లు ఆ వర్గాలు తెలిపాయి. వీఐలో ప్రమోటర్ హోదా, నియంత్రణ అధికారాన్ని కూడా టీజీహెచ్ అడిగే అవకాశం ఉందని అంటున్నాయి. బకాయిలను వాటాగా మార్చిన నేపథ్యంలో, వీఐలో మన ప్రభుత్వానికి 48.99% వాటా లభించిన సంగతి విదితమే. తాజా పెట్టుబడి ప్రతిపాదన వార్తల నేపథ్యంలో వొడాఫోన్ ఐడియా షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. బీఎస్ఈలో షేరు 9.28% పెరిగి రూ.9.54 వద్ద ముగిసింది.

కోడి గుడ్లు

4న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	570
వరంగల్	572
విజయవాడ	575
తూ/ప గోదావరి	580
విశాఖపట్నం	570
చిత్తూరు	593

రూ.120 కోట్లతో ఫాబెక్స్ స్టీల్ కొత్త యూనిట్

ఈనాడు, హైదరాబాద్: ఫాబెక్స్ స్టీల్ స్ట్రక్చర్స్ రూ.120 కోట్ల పెట్టుబడితో రెండో యూనిట్‌ను హైదరాబాద్ సమీపంలోని చిట్యాలలో 40 ఎకరాల స్థలంలో ఏర్పాటు చేసింది. ఈ సంస్థకు విజయవాడ వద్ద ఒక యూనిట్ ఉంది. ప్రీ-ఇంజినీర్డ్ భవనాలు, స్ట్రక్చరల్ స్టీలు ఉత్పత్తులను దేశీయ విపణికి అందించడంతో పాటు విదేశాలకు ఎగుమతి చేస్తోంది. సామర్థ్య విస్తరణకు రెండేళ్లలో మరో రూ.100 కోట్ల పెట్టుబడి పెడతామని సంస్థ ఎండీ వేణు చావ తెలిపారు. చిట్యాల యూనిట్‌తో తమ ఉత్పత్తి సామర్థ్యం లక్ష టన్నులకు చేరిందని.. మల్టీ-సైట్ పీఈబీ ఉత్పత్తులు, టర్న్‌కీ డిజైన్ ఇన్‌స్టలేషన్ ప్రాజెక్టులు నిర్వహించగలమని వివరించారు.

నన్ను అడక్కుండా ఎలా తొలగిస్తారు?

- మహారాష్ట్ర ఛారిటీ కమిషనర్ చెంతకు మెహ్లీ మిస్త్రీ

టాటా ట్రస్ట్స్ నుంచి తనను తొలగించడాన్ని, మహారాష్ట్ర ఛారిటీ కమిషనర్ వద్ద మెహ్లీ మిస్త్రీ సవాలు చేశారు. మహారాష్ట్ర పబ్లిక్ ట్రస్ట్స్ యాక్ట్, 1950 కింద ఆ రాష్ట్రంలోని ట్రస్టుల కార్యకలాపాలను ఛారిటీ కమిషనర్ పర్యవేక్షిస్తారు. అక్టోబరు 28న ట్రస్టీగా మెహ్లీ నియామకాన్ని పునరుద్ధరించడానికి టాటా ట్రస్ట్స్ నిరాకరించడంతో ఈ పరిణామం చోటు చేసుకుంది. 'ట్రస్టీల జాబితా మార్పులో ఏదైనా ప్రతిపాదన ఉంటే, అధికారికంగా నా దృష్టికి తీసుకురావాలి. ఏదైనా నిర్ణయం ఉన్నపుడు, నా వైపు వాదన విని ఉండాల'ని మిస్త్రీ రాతపూర్వకంగా తన వాదనను కమిషనర్‌కు తెలియజేసినట్లు తెలుస్తోంది. దీనిపై టాటా ట్రస్ట్స్ 'ఛేంజ్ రిపోర్ట్' ఫైల్ చేయాల్సి ఉందని, దానిపై పనిచేస్తోందని ఈ అంశంతో దగ్గరి సంబంధమున్న వ్యక్తుల సమాచారం.

లెన్స్‌కార్ట్ నుంచి ఏఐ స్మార్ట్ గ్లాసెస్

దిల్లీ: కృత్రిమ మేధ (ఏఐ)తో పనిచేసే స్మార్ట్ గ్లాసెస్‌ను విడుదల చేయడానికి కళ్లజోళ్ల సంస్థ లెన్స్‌కార్ట్ సన్నాహాలు చేస్తోంది. టెక్నాలజీ ఆధారిత లైఫ్‌స్టైల్ బ్రాండ్‌గా ఎదగడానికి, కంపెనీకి ఇది తొలి అడుగని సంబంధిత వర్గాలు తెలిపాయి. 'బీ బై లెన్స్‌కార్ట్ స్మార్ట్ గ్లాసెస్'గా పిలుస్తున్న ఈ పరికరంతో ఏఐ ఆధారిత సందేశాలు, ఆరోగ్య- వెల్ బీయింగ్ వివరాలు, యూపీఐ చెల్లింపులు చేయొచ్చని సమాచారం. గూగుల్ జెమినై 2.5పై అభివృద్ధి చేసిన ఈ స్మార్ట్ గ్లాసెస్‌ను, కొన్ని వారాల్లో విడుదల చేయనున్నారు. నవంబరు 10న స్టాక్ ఎక్స్ఛేంజీల్లో కంపెనీ షేర్ల నమోదు తర్వాత, ఈ విడుదల ఉండే అవకాశం ఉంది. లెన్స్‌కార్ట్ స్మార్ట్ గ్లాసెస్ ధరలను ఇంకా ఖరారు చేయలేదని తెలుస్తోంది.

ఏఐ, వ్యాపార లావాదేవీలను కళ్లజోళ్లతో కలపడమే ఈ స్మార్ట్‌గ్లాసెస్ లక్ష్యమని, కేవలం చూపునకే పరిమితం కాకుండా ఇతర అవసరాలకు ఇది ఉపయోగపడుతుందని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. క్వాల్‌కామ్ స్నాప్‌డ్రాగన్ ఏఆర్ 1 జెన్ 1 ప్లాట్‌ఫామ్‌తో ఈ స్మార్ట్‌గ్లాసెస్ పనిచేయనున్నాయి. ఈ స్మార్ట్‌గాసెస్‌తో ఏఐ ఆధారిత కళ్లజోళ్లను తీసుకొస్తున్న మొదటి భారతీయ బ్రాండ్‌గా లెన్స్‌కార్ట్ నిలవనుంది.

జులై - సెప్టెంబరు త్రైమాసిక ఫలితాలు (రూ.కోట్లలో)

కంపెనీ	నికర లాభం/(నష్టం)		మొత్తం ఆదాయం	
	2025-26	2024-25	2025-26	2024-25
గాడ్‌ఫ్రే ఫిలిప్స్ ★	304.99	248.31	1632.21	1627.81
అరవింద్ ఫ్యాషన్స్	56.35	45.03	1417.51	1273.59
సిటీ యూనియన్ బ్యాంక్	329.00	285.00	1912.00	1660.00
వెస్ట్‌లైఫ్ ఫుడ్‌వరల్డ్	27.70	0.35	637.48	615.35
వోఖార్డ్	82.00	16.00	782.00	818.00
అంబుజా సిమెంట్స్	2302.00	496.00	9129.73	7304.77
ఏడబ్ల్యూఎల్ అగ్రిబిజినెస్	244.85	311.02	17525.61	14552.04
టీసీపీఎల్	406.51	367.21	4965.90	4214.45
జేకే పేపర్	77.80	128.85	1768.18	1714.88

★ మధ్యంతర డివిడెండు - రూ.2

రూ.6 లక్షల కోట్ల పండగ విక్రయాలు

కలిసొచ్చిన జీఎస్‌టీ రేట్ల కోతలు



దసరా-దీపావళి పండగ సీజన్ అంటేనే ఉద్యోగులకు బోనస్.. ఇంట్లోకి కొత్తగా కొనుగోలు చేయాలనుకున్న వస్తువును తెచ్చుకునేందుకు శుభగడియలుగా ఎక్కువ మంది భావిస్తుంటారు. ఈ నేపథ్యంలోనే కొనుగోలుదార్లను ఆకట్టుకునేందుకు కంపెనీలు, విక్రయ సంస్థలు ఆఫర్లు ప్రకటిస్తుంటాయి. ఈసారి ప్రభుత్వం కూడా వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) రేట్లను నవరాత్రుల ప్రారంభం (సెప్టెంబరు 22) నుంచి తగ్గించడంతో, విక్రయాలు మరింత భారీగా జరిగాయి. అక్టోబరు 21 (దీపావళి) వరకు నెల రోజుల పాటు సాగిన పండగల సీజన్‌లో కార్ల నుంచి వంట సామగ్రి వరకు అన్ని విభాగాల్లో అమ్మకాలు వృద్ధి చెందాయి. మన ఉత్పత్తులపై అమెరికా 50% టారిఫ్ విధించడంతో, కలవరపడ్డ మన ఆర్థిక వ్యవస్థకు ఇది సానుకూల పరిణామమే. గతేడాదితో పోలిస్తే ఈసారి పండగల సీజన్‌లో విక్రయాలు 8.5% పెరిగాయని రిటెయిల్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫామ్ బిజోమ్ వెల్లడించింది. ఈ ఏడాది పండగ విక్రయాలు రూ.6 లక్షల కోట్ల (67.6 బి.డాలర్ల)కు చేరాయని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆలిండియా ట్రేడర్స్ (కాయిట్) తెలిపింది. ఆభరణాలు, ఎలక్ట్రానిక్స్, దుస్తులు, ఫర్నీచర్, స్వీట్లు వంటి వాటికి ఎక్కువగా గిరాకీ లభించిందని వివరించింది.

కార్ల విక్రయాలు రయ్ రయ్..: పన్ను రేట్ల కోతలతో కార్ల ధరలు తగ్గడంతో, గత నెలలో మారుతీ సుజుకీ, టాటా మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా మంచి విక్రయాలు నమోదుచేశాయి. ధన త్రయోదశ రోజు విక్రయాలు 20% పెరిగాయని హ్యుందాయ్ మోటార్ ఇండియా తెలిపింది. నవరాత్రుల నుంచి ధన త్రయోదశి మధ్య 1,00,000కు పైగా కార్లను టాటా మోటార్స్ డెలివరీ చేసింది. మహీంద్రా ట్రాక్టర్ విక్రయాలు 27% వృద్ధి సాధించాయి. ఈ ఏడాది మంచి వర్షపాతం నమోదుకావడంతో గ్రామీణ ఆదాయాలు మెరుగుపడటం కూడా కలిసొచ్చింది.

✦ ధరలు తగ్గడంతో ముఖ్యంగా చిన్నకార్లకు మంచి గిరాకీ లభిస్తోంది. ముందస్తు బుకింగ్స్ పెరగడంతో ఆదివారం కూడా తమ ఉత్పత్తి బృందం పనిచేస్తోందని మారుతీ సుజుకీ ఇండియా చెబుతోంది.

గిరాకీ విషయంలో అప్రమత్తత అవసరం: సాధారణం కంటే అధిక గిరాకీ లభిస్తున్న నేపథ్యంలో అమ్మకాల విషయంలో అప్రమత్తత అవసరమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. సరైన వినియోగదారు ధోరణుల కోసం డిసెంబరు- జనవరి వరకు వేచిచూడాలని సూచిస్తున్నారు.

2030 కల్లా రూ.26.40 లక్షల కోట్లకు!

భారత బయోఎకానమీ రంగంపై నీతి ఆయోగ్ నివేదిక



దిల్లీ: మన దేశ బయోఎకానమీ రంగం 2030 నాటికి 300 బిలియన్ డాలర్ల (సుమారు రూ.26.40 లక్షల కోట్ల) స్థాయికి చేరుతుందని నీతి ఆయోగ్ నివేదిక అంచనా వేసింది. వ్యవసాయం, అటవీ, మత్స్య సంపద, ఆక్వాకల్చర్‌లను కలుపుకుని, మన దేశంలో బయోఎకానమీ రంగం వేగంగా అభివృద్ధి చెందుతోందని వెల్లడించింది. 2047 నాటికి భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా మారాలనే దార్శనికతకు, వ్యవసాయ పరివర్తన కేంద్రంగా ఉందని 'రీఇమాజినింగ్ అగ్రికల్చర్: ఎ రోడ్‌మ్యాప్ ఫర్ ఫ్రంటియర్ టెక్నాలజీ లీడ్ ట్రాన్స్‌ఫర్మేషన్' పేరుతో విడుదల చేసిన నివేదికలో నీతి ఆయోగ్ వివరించింది. ఆహార వ్యవస్థలకు అతీతంగా, మన దేశ వ్యవసాయరంగం, వేగంగా అభివృద్ధి చెందుతున్న బయోఎకానమీ రంగం కలిసి ఆర్థిక వృద్ధికి శక్తిమంతమైన ఇంజిన్‌లా మారుతుందని వెల్లడించింది. గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్రభాయ్ పటేల్ ఈ నివేదికను విడుదల చేశారు. వ్యవసాయంలోని ప్రతి దశలోనూ సాంకేతికతను సమగ్రంగా, సజావుగా వాడే పర్యావరణ వ్యవస్థ నిర్మిస్తున్నట్లు పటేల్ తెలిపారు. మన రైతులు పంట తెగుళ్లను ఎదుర్కొనేందుకు, ఉత్పాదకతను పెంచడానికి, సాగు వ్యయాలను తగ్గించే తదుపరి తరం విత్తనాలు, సాధనాలను పొందేందుకు ఆవిష్కరణలు తోడ్పడతాయని వివరించారు.


టైటన్ లాభం రూ.1,120 కోట్లు

దిల్లీ: టైటన్, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జులై-సెప్టెంబరులో రూ.1,120 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ప్రకటించింది. 2024-25 ఇదే కాల లాభం రూ.704 కోట్లతో పోలిస్తే ఇది 59% అధికం. విక్రయాలు రూ.13,473 కోట్ల నుంచి 22.17% పెరిగి రూ.16,461 కోట్లకు చేరాయి. మొత్తం వ్యయాలు 26.3% పెరిగి రూ.17,316 కోట్లకు చేరాయి. ఇతర ఆదాయంతో కలుపుకుని టైటన్ మొత్తం ఆదాయం 28.5% పెరిగి రూ.18,837 కోట్లకు చేరింది. ఆభరణాల వ్యాపారం 29.3% వృద్ధితో రూ.16,522 కోట్లకు చేరింది. ఇందులో దేశీయంగా తనిష్క్, మియా, జోయాల ద్వారా వ్యాపారం 18% పెరిగి రూ.12,460 కోట్లకు చేరింది. క్యారట్‌లేన్ దేశీయ వ్యాపారం 32% వృద్ధితో రూ.1,072 కోట్లకు పెరిగింది. సమీక్షా త్రైమాసికంలో టైటన్ ఆభరణాల విభాగంలో మన దేశంలో 34 కొత్త విక్రయశాలలను ప్రారంభించింది. ఇందులో తనిష్క్ స్టోర్లు 6, మియా స్టోర్లు 18, క్యారట్‌లేన్ స్టోర్లు 10 ఉన్నాయి.

రూ.2.25 లక్షల కోట్లు పెరిగిన సంపద

- వాహన, బ్యాంకింగ్ షేర్లకు మద్దతు
- రూ.2.25 లక్షల కోట్లు పెరిగిన సంపద

ఎఫ్ఐఐ విక్రయాలు.. రూ.1883.78 కోట్లు
డీఐఐ కొనుగోళ్లు.. రూ.3516.36 కోట్లు



సెన్సెక్స్ ▲ 40 — 83978
నిఫ్టీ ▲ 41 — 25763

రెండు రోజుల వరస నష్టాలకు తెరదించుతూ సోమవారం స్టాక్ మార్కెట్ స్వల్ప లాభాల్లో ముగిసింది. వాహన, బ్యాంకింగ్ రంగంలో కొన్ని కంపెనీల షేర్లల్లో కొనుగోళ్లు ఇందుకు ఉపకరించాయి. అయితే దేశీయంగా మద్దతునిచ్చే పరిణామాలు లేనందున, అధిక స్థాయుల వద్ద మదుపర్లు లాభాల స్వీకరణకు దిగడం సూచీలపై ప్రభావం చూపింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 7 పైసలు బలహీనపడి 88.77 వద్ద ముగిసింది. బ్రెంట్ ముడి చమురు 0.02% లాభంతో 64.77 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

✦ బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.2.25 లక్షల కోట్లు పెరిగి రూ.472.51 లక్షల కోట్ల (5.32 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది.

ఒడుదొడుకుల మధ్య..: బీఎస్ఈ సెన్సెక్స్ (గత ముగింపు 83,938.71) స్వల్ప నష్టంతో 83,835.10 పాయింట్ల వద్ద ఆరంభమైంది. ఆ తర్వాత వెంటనే లాభాల్లోకి వచ్చినా, ఒడుదొడుకుల మధ్య స్వల్ప శ్రేణిలోనే చలించింది. చివరకు 39.78 పాయింట్ల లాభంతో 83,978.49 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 41.25 పాయింట్లు పెరిగి 25,763.35 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 25,803.10 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని, 25,645.50 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని నమోదుచేసింది.

✦ జులై- సెప్టెంబరు త్రైమాసికానికి నికర లాభంలో నాలుగు రెట్లకు పైగా వృద్ధి ప్రకటించడంతో **అంబుజా సిమెంట్స్** షేరు బీఎస్ఈలో 2.14% పెరిగి రూ.577.35 వద్ద ముగిసింది.

✦ **లెన్స్‌కార్ట్** ఐపీఓ రెండో రోజుకు 2.01 రెట్ల స్పందన లభించింది. చిన్న మదుపర్ల విభాగంలో 3.33 రెట్లు అధికంగా బిడ్‌లు దాఖలయ్యాయి.

✦ ఫిన్‌టెక్ సంస్థ **పైన్ ల్యాబ్స్** తొలి పబ్లిక్ ఇష్యూకు (ఐపీఓ) ధరల శ్రేణి రూ.210- 221.

✦ బోనస్ ఇష్యూ ప్రతిపాదనను ప్రస్తుతానికి ఉపసంహరించుకుంటున్నట్లు ఆతిథ్య సేవల సంస్థ ఓయో ప్రకటించింది.

✦ అక్టోబరులో దేశీయ తయారీ రంగ ఉత్పత్తిలో బలమైన వృద్ధి నమోదైంది. జీఎస్‌టీ రేట్ల కోత ఇందుకు దోహదం చేసిందని నెలవారీ సర్వే వెల్లడించింది. హెచ్ఎస్‌బీసీ ఇండియా మ్యాన్యుఫ్యాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ సూచీ (పీఎంఐ) అక్టోబరులో 59.2 పాయింట్లకు పెరిగింది.

మహీంద్రా పైకి.. మారుతీ కిందకు..

సెన్సెక్స్ 30 కంపెనీల షేర్లలో 16 లాభపడగా, మిగతావి నష్టాల్లో ముగిశాయి. మహీంద్రా అండ్ మహీంద్రా 1.78%, టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ 1.69%, ఎటర్నల్ 1.48%, ఎస్‌బీఐ 1.41%, సన్‌ఫార్మా 1.03%, భారతీ ఎయిర్‌టెల్ 0.93%, కోటక్ మహీంద్రా బ్యాంక్ 0.54% చొప్పున లాభపడ్డాయి. మారుతీ సుజుకీ 3.37%, ఐటీసీ 1.5%, టీసీఎస్ 1.36%, ఎల్అండ్‌టీ 1.27%, బెల్ 0.92% నష్టపోయాయి.

పబ్లిక్ ఇష్యూకు మీషో, షిప్‌రాకెట్

మరో 5 సంస్థల ఐపీఓలకూ సెబీ పచ్చజెండా

దిల్లీ: మీషో, షిప్ రాకెట్ సహా 7 కంపెనీల తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) దరఖాస్తులకు మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ ఆమోదం తెలిపింది. ఈ 7 సంస్థలు కలిపి ఐపీఓల ద్వారా మొత్తంగా రూ.7,700 కోట్లు సమీకరించే అవకాశం ఉంది. పబ్లిక్ ఇష్యూకు సెబీ అనుమతి పొందిన మిగతా 5 కంపెనీల్లో జర్మన్ గ్రీన్ స్టీల్ అండ్ పవర్, అల్లైడ్ ఇంజినీరింగ్ వర్క్స్, స్కైవేస్ ఎయిర్ సర్వీసెస్, రాజ్‌పుతానా స్టెయిన్‌లెస్, మనికా ప్లాస్టెక్ ఉన్నాయి. .

✦ **మీషో, షిప్‌రాకెట్** తమ ఐపీఓ ముసాయిదా పత్రాలను కాన్ఫిడెన్షియల్ ప్రి- ఫిల్లింగ్ పద్ధతిలో సమర్పించాయి. అందువల్ల ఆ పత్రాల్లో ఉన్న వివరాలు బహిర్గతం కావు. అయితే సంబంధిత వర్గాల సమాచారం ప్రకారం.. ప్రతిపాదిత ఐపీఓలో మీషో రూ.4,250 కోట్ల విలువైన తాజా షేర్లను జారీ చేయనున్నట్లు తెలుస్తోంది. ఆఫర్ ఫర్ సేల్ ద్వారా ప్రస్తుత వాటాదార్లు 17.57 కోట్ల షేర్లను విక్రయించనున్నారు. షిప్‌రాకెట్ ఐపీఓ ద్వారా రూ.2,000- 2,500 కోట్లు సమీకరించనున్నట్లు సమాచారం.

✦ గుజరాత్‌కు చెందిన **జర్మన్ గ్రీన్ స్టీల్ అండ్ పవర్** రూ.450 కోట్ల తాజా షేర్లను జారీ చేయనుంది. ఆఫర్ ఫర్ సేల్‌లో ప్రమోటర్లు మరో 20 లక్షల షేర్లను విక్రయించనున్నారు. **అల్లైడ్ ఇంజినీరింగ్ వర్క్స్** రూ.400 కోట్ల తాజా షేర్లను జారీ చేయనుంది. ఓఎఫ్ఎస్ ద్వారా ప్రమోటరు 75 లక్షల షేర్లను విక్రయించనున్నారు. **స్కైవేస్ ఎయిర్‌సర్వీస్** 3.29 కోట్ల తాజా షేర్ల జారీతో పాటు, ఓఎఫ్ఎస్ ద్వారా 1.33 కోట్ల ఈక్విటీ షేర్లను ప్రమోటర్లు విక్రయించనున్నారు. **రాజ్‌పుతానా స్టెయిన్‌లెస్** 1.46 కోట్ల తాజా షేర్లను జారీ చేయనుంది. ఆఫర్ ఫర్ సేల్ ద్వారా 62.5 లక్షల షేర్లను విక్రయించనున్నారు. **మనికా ప్లాస్టెక్** రూ.115 కోట్ల విలువైన తాజా షేర్ల జారీతో పాటు ఓఎఫ్ఎస్ ద్వారా 1.50 కోట్ల షేర్లు విక్రయించనుంది.

ఈనాడు సినిమా



ఆషికా రంగనాథ్



రవి తేజ

జానపదానికి స్టెప్పేస్తే..!

కథానాయకుడు రవి తేజ.. దర్శకుడు కిశోర్ తిరుమల కలయికలో ఓ చిత్రం ముస్తాబవుతోంది. సుధాకర్ చెరుకూరి నిర్మాత. ఆషికా రంగనాథ్ కథానాయిక. ముగింపు దశలో ఉన్న ఈ సినిమా హైదరాబాద్‌లో శరవేగంగా చిత్రీకరణ చేసుకుంటోంది. దీనిలో భాగంగా ప్రస్తుతం ఓ భారీ సెట్‌లో రవితేజ - ఆషికలపై ఓ పాట చిత్రీకరిస్తున్నట్లు సమాచారం. ఇది జానపద శైలిలో సాగే రొమాంటిక్ డ్యూయెట్‌గా ఉండనున్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించిన డ్యాన్స్ రిహార్సల్స్ వీడియోను ఆషికా ఇన్‌స్టాగ్రామ్ వేదికగా పంచుకుంటూ.. "ఆర్‌టీ76' కోసం చాలా రోజుల తర్వాత ఓ జానపద గీతానికి నృత్యం చేస్తున్నాను" అని తెలిపింది. ఇది వినోదం, ఎమోషన్, రవితేజ మార్క్ మాస్ ఎలిమెంట్స్‌తో మిళితమైన కుటుంబ కథా చిత్రంగా రూపొందుతోంది. దీనికి 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' అనే టైటిల్ పరిశీలనలో ఉన్నట్లు తెలిసింది. దీన్ని సంక్రాంతి సందర్భంగా ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతమందిస్తున్నారు. ప్రసాద్ మూరెళ్ల ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తున్నారు.

ఆ రాకెట్‌కు 'బాహుబలి' పేరు పెట్టడం సంతోషాన్నిచ్చింది



రాజమౌళి

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో తన 'ఎల్‌వీఎం3-ఎం5' రాకెట్‌కు 'బాహుబలి' అని పేరు పెట్టడం పట్ల దర్శకుడు రాజమౌళి సంతోషం వ్యక్తం చేశారు. ఇస్రో ఇటీవల ఈ వాహక నౌక సాయంతోనే తన బరువైన కమ్యూనికేషన్ ఉపగ్రహం సీఎంఎస్-03ని విజయవంతంగా అంతరిక్షంలోకి పంపిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే రాజమౌళి ఇస్రోకి సామాజిక మాధ్యమాల వేదికగా అభినందనలు తెలుపుతూ ఓ పోస్ట్ పెట్టారు. "అంతరిక్ష పరిశోధనలో మన సాంకేతిక బలాన్ని ప్రదర్శించిన ఈ క్షణాలు భారత దేశానికి ఎంతో గర్వకారణం. దాని బరువు, బలం కారణంగా ఈ రాకెట్‌కు 'బాహుబలి' అని ప్రేమగా పేరు పెట్టారు. ఇది నిజంగా మనందరికీ లభించిన గౌరవం. మా బాహుబలి చిత్ర బృందమంతా ఎంతో సంతోషించింది" అని ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు.

ఓటీటీలో ఈ వారం

ఈ వారాంతం ఎలాంటి కొత్త కథలతో ఎంజాయ్ చేయాలని ఆలోచిస్తున్నారా..? ఇలాంటి సినీప్రియుల కోసమే అదిరిపోయే కంటెంట్‌తో వినోదాలు పంచడానికి రెడీగా ఉన్నాయి ఓటీటీలు. ఎప్పటిలాగే ఈ వారం కూడా భిన్నమైన సినిమాలు, థ్రిల్ పంచే సిరీస్‌లు అలరించడానికి సన్నద్ధమయ్యాయి.

బ్యాడ్‌గర్ల్ (సినిమా)	మంగళవారం	జియోహాట్‌స్టార్
ఆల్స్ ఫెయిర్(సిరీస్)	మంగళవారం	జియోహాట్‌స్టార్
ఫైండింగ్ జాయ్ (సినిమా)	బుధవారం	అమెజాన్ ప్రైమ్ వీడియో
ది మానిప్యులేటెడ్(సిరీస్)	బుధవారం	జియోహాట్‌స్టార్
ఆల్ హర్ ఫాల్ట్(సిరీస్)	గురువారం	జియోహాట్‌స్టార్
డెత్ బై లైట్నింగ్(సిరీస్)	గురువారం	నెట్‌ఫ్లిక్స్
బారాముల్లా (సినిమా)	శుక్రవారం	నెట్‌ఫ్లిక్స్
చిరంజీవ(సినిమా)	శుక్రవారం	ఆహా
ఫ్రాంకెన్‌స్టైయిల్ (సినిమా)	శుక్రవారం	నెట్‌ఫ్లిక్స్
యాజ్ యు స్టుడ్ బై(సిరీస్)	శుక్రవారం	నెట్‌ఫ్లిక్స్
మార్క్సన్ హాల్ 2 (సిరీస్)	శుక్రవారం	అమెజాన్ ప్రైమ్ వీడియో
మ్యాంగో (సినిమా)	శుక్రవారం	నెట్‌ఫ్లిక్స్

ఒక్కటిగా పోరాడదాం



'ప్రపంచవ్యాప్తంగా పేరొందిన వీరికి స్వాగతం పలకండి..' అంటూ ఇటీవలే 'ది ఫెంటాస్టిక్ ఫోర్: ఫస్ట్ స్టెప్స్' చిత్రం ప్రేక్షకుల్ని పలకరించింది. ప్రముఖ నిర్మాణ సంస్థ మార్వెల్ స్టూడియోస్ రూపొందించిన ఈ చిత్రంలో పెడ్రో పాస్కల్, వన్నెస్సా కిర్బీ, జోసెఫ్ క్విన్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. మ్యాట్ షాక్మెన్ తెరకెక్కించారు. "మనం ఒక కుటుంబంలా కలిసి దీన్ని ఎదుర్కొందాం" అంటూ థియేటర్లలో సినీప్రియుల్ని ఫిదా చేసిన ఈ సినిమా ఇప్పుడు మీ ఇళ్లలో సందడి చేయడానికి సిద్ధమైంది. బుధవారం జియోహాట్‌స్టార్ వేదికగా అలరించనుంది చిత్రం. మరి ఆ ఫెంటాస్టిక్ ఫోర్ బృందం ఎలాంటి సాహసాలు చేసిందో మీరూ చూసేయ్యండి.



రాణికి మాత్రమే సాధ్యమిది

చదువు కూడా లేని ఓ సాధారణ గృహిణి సీఎంగా మారి.. అక్కడి రాజకీయ రాబందులకు కూడా చెక్ పెట్టే స్థాయికి ఎలా ఎదిగిందన్న కథాంశం ఆధారంగా రూపొందిన సిరీస్ 'మహారాణి సీజన్ 4'. బాలీవుడ్ కథానాయిక హ్యూమా ఖురేషీ ప్రధాన పాత్రలో పునీత్ ప్రకాశ్ దీన్ని తెరకెక్కించారు. ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకున్న 'మహారాణి' ఫ్రాంచైజీలో రాబోతున్న సిరీస్ ఇది. "ఒక వ్యక్తిని కుర్చీలో నుంచి కింద పడేయ్యాలంటే అది ఒక్క రాణి భారతికి మాత్రమే సాధ్యం" అంటూ ఇటీవలే విడుదలైన ట్రైలర్ ఆకట్టుకుంది. ఇప్పుడీ సిరీస్ శుక్రవారం నుంచి సోనీలివ్‌లో అలరించడానికి రెడీగా ఉంది.

స్వర్ణోత్సవ వేడుకకు రంగం సిద్ధం



మోహన్‌బాబు

విలక్షణ నటుడిగా.. అభిరుచి గల నిర్మాతగా సినీప్రియుల మదిపై చెరగని ముద్ర వేశారు మంచు మోహన్‌బాబు. ఆయన చిత్రసీమలోకి అడుగు పెట్టి ఈ ఏడాదితో 50వసంతాలు పూర్తయిన నేపథ్యంలో ఈ నెల 22న 'ఎంబీ50 - ఎ పెర్ల్ వైట్ ట్రిబ్యూట్' పేరుతో హైదరాబాద్‌లో స్వర్ణోత్సవ వేడుకను నిర్వహించేందుకు మంచు విష్ణు సిద్ధమవుతున్నారు. భారతీయ సినిమాకి మోహన్‌బాబు చేసిన సేవల్ని గుర్తు చేసుకునేలా.. ఇదొక చారిత్రక ఘట్టంగా అందరికీ గుర్తుండిపోయేలా ఈ వేడుకను జరిపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. తెలుగు, తమిళ, కన్నడ, హిందీ, మలయాళ భాషలకు చెందిన పలువురు ప్రముఖ సినీ తారలు ఈ వేడుకలో పాలుపంచుకోనున్నట్లు సమాచారం. త్వరలోనే ఈ కార్యక్రమానికి సంబంధించిన ఇతర విషయాల్ని వెల్లడించనున్నారు. మోహన్‌బాబు ప్రస్తుతం నాని హీరోగా నటిస్తున్న 'ది ప్యారడైజ్' చిత్రంలో ప్రతినాయక పాత్ర పోషిస్తున్నారు.

ఆమె ఓ స్టార్ అనే భావన రానివ్వలేదు

"ప్రేమని మరో కోణంలో చూపించే సినిమా 'ది గర్ల్‌ఫ్రెండ్'. ఇందులోని పాత్రలు, సందర్భాలు మన జీవితాలతో రిలేట్ చేసుకునేలా ఉంటాయి" అన్నారు హీరో దీక్షిత్ శెట్టి. ఆయన.. రష్మిక జంటగా నటించిన ఈ చిత్రాన్ని రాహుల్ రవీంద్రన్ తెరకెక్కించారు. ఇది ఈ నెల 7న రానుంది. ఈ నేపథ్యంలోనే సోమవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు దీక్షిత్.



దీక్షిత్

◆ "ఈ సినిమాలో నా నటన నచ్చి నిర్మాత అల్లు అరవింద్ ప్రత్యేకంగా ప్రశంసించడంతో పాటు మరో సినిమాకి అడ్వాన్స్ కూడా ఇచ్చారు. అది చాలా ఆనందాన్నిచ్చింది. నేను నటుడిగా వైవిధ్యభరితమైన కథలు, పాత్రలు చేయాలనుకుంటున్నా"

◆ "మనం వినోదం కోసం సినిమాలు చూస్తుంటాం. అయితే కొన్ని చిత్రాల్లోని ఫీల్ మాత్రం థియేటర్ల నుంచి బయటకొచ్చినా మనల్నే వెంటాడుతుంటుంది. ఈ 'గర్ల్‌ఫ్రెండ్' అలాంటి చిత్రమే. ఈ కథలో ప్రతి ఒక్కరూ తమని తాము చూసుకుంటారు. రష్మిక ఈ సినిమా గురించి ఓ ఇంటర్వ్యూలో చెప్తూ.. 'కొన్నేళ్ల కిందట తానిలాంటి చిత్రం చూసుంటే జీవితం పట్ల తన దృక్పథం మరోలా ఉండేద'ని చెప్పింది. ఈ సినిమాని 18-25ఏళ్ల మధ్య ఉన్న యువత చూస్తే కొన్ని విషయాలు నేర్చుకుంటారు".

◆ "'దసరా' చిత్ర ఇంటర్వ్యూల్లో నన్ను చూసి దర్శకుడు రాహుల్ రవీంద్రన్ ఈ సినిమా కోసం సంప్రదించారు. ఈ స్క్రిప్ట్ చదివాక ఆయన నన్నీ పాత్ర కోసం ఎందుకు ఎంపిక చేసుకున్నారో అర్థమైంది. నేనిందులో విక్రమ్ అనే టాక్సిక్ బాయ్‌ఫ్రెండ్ తరహా పాత్ర పోషిస్తున్నాను. దీంట్లో రష్మిక నటన చూశాక ఈ చిత్రానికి తాను తప్ప మరెవరూ న్యాయం చేయలేరేమో అనిపించింది. ఈ సినిమా చూస్తున్నంత సేపూ తెరపై భూమా పాత్రే కనిపిస్తుంది తప్ప రష్మిక ఎక్కడా కనిపించదు. మేము ఈ సినిమా చేస్తున్నప్పుడే తన 'యానిమల్' చిత్రం విడుదలై పెద్ద హిట్టయ్యింది. కానీ, తనతో కలిసి పని చేస్తున్నప్పుడు ఓ స్టార్‌తో ఉన్నామనే ఫీల్ ఎక్కడా కలగనివ్వలేదు. ఆమె అంత స్నేహపూర్వకంగా సెట్లో అందరితో ఉండేది".

కేరళ అడవుల్లో మైసా



రష్మిక

రష్మిక తొలిసారి యాక్షన్ పాత్రలో అలరించేందుకు సిద్ధమవుతోంది. ఇప్పుడామె ప్రధాన పాత్రధారిగా కొత్త దర్శకుడు రవీంద్ర పుల్లె తెరకెక్కిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'మైసా'. అన్ ఫార్ములా ఫిల్మ్స్ సంస్థ నిర్మిస్తోంది. ఇప్పటికే అధికారికంగా ప్రకటించిన ఈ సినిమా కేరళలోని అతిరపల్లి అటవీ ప్రాంతంలో చిత్రీకరణ ప్రారంభించుకున్నట్లు దర్శకుడు రవీంద్ర ఇన్‌స్టా వేదికగా ప్రకటించారు. ప్రస్తుతం 'ది గర్ల్‌ఫ్రెండ్' ప్రచార కార్యక్రమాలతో బిజీగా ఉన్న రష్మిక.. త్వరలోనే ఈ చిత్ర సెట్స్‌లోకి అడుగు పెట్టనుంది. గోండు తెగల నేపథ్యంలో సాగే ఈ భావోద్వేగభరిత యాక్షన్ థ్రిల్లర్‌లో రష్మిక శక్తిమంతమైన గిరిజన యువతిగా కనిపించనుంది. ఇది వచ్చే ఏడాది ద్వితీయార్ధంలో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశముంది.

ఓ తండ్రిగా ఎంతో ఆనందంగా ఉన్నా

– విజయ్ సేతుపతి



విజయ్ సేతుపతి, సూర్య సేతుపతి

"యాక్షన్‌తో పాటు బలమైన భావోద్వేగాలతో నిండిన చిత్రం 'ఫీనిక్స్'. తప్పకుండా తెలుగు ప్రేక్షకుల్ని మెప్పిస్తుందన్న నమ్మకముంది" అన్నారు కథానాయకుడు విజయ్ సేతుపతి. ఆయన తనయుడు సూర్య సేతుపతి హీరోగా పరిచయమవుతున్న ఈ సినిమాని స్టంట్ మాస్టర్ అనల్ అరసు తెరకెక్కించారు. రాజ్యలక్ష్మి అనల్ అరసు నిర్మించారు. ఇప్పటికే తమిళంలో విడుదలైన ఈ చిత్రం ఈ నెల 7న తెలుగు ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే సోమవారం హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ వేడుకని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హీరో విజయ్ సేతుపతి మాట్లాడుతూ.. "ఈ చిత్రం నేను చూశా. నాకు చాలా నచ్చింది. మా అబ్బాయికి చాలా మంచి ఆరంభం ఇది. ఓ తండ్రిగా నేను ఎంతో ఆనందంగా ఉన్నాను. దీంట్లో యాక్షన్, ఎమోషన్ చక్కగా కుదిరాయి" అన్నారు. దర్శకుడు అనల్ అరసు మాట్లాడుతూ.. "ఈ చిత్రం ఇప్పటికే తమిళంలో పెద్ద హిట్టయ్యింది. తెలుగులోనూ అదే స్థాయి విజయాన్ని అందుకుంటుందని నమ్ముతున్నా" అన్నారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు గోపీచంద్ మలినేని, సూర్య సేతుపతి, వరలక్ష్మీ శరత్‌కుమార్, భాష్యశ్రీ, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆస్కార్‌లో లాబీయింగ్‌కు అవకాశం



పరేశ్ రావెల్

తనకు అవార్డుల కంటే నటన బాగుందని ప్రశంసలు వస్తే ఎంతో ఆనందంగా ఉంటుందన్నారు బాలీవుడ్ నటుడు పరేశ్ రావెల్. ఎన్నో ప్రతిష్ఠాత్మక అవార్డుల విషయంలో లాబీయింగ్‌కు ఆస్కారం ఉందని చెప్పారు. "నాకు అవార్డుల గురించి పెద్దగా తెలియదు. నేషనల్ అవార్డ్స్‌ల విషయంలో కొంచెం లాబీయింగ్ ఉండవచ్చని అనుకుంటున్నాను. లాబీయింగ్ కేవలం భారతదేశానికే పరిమితం కాదు.. ఆస్కార్ అవార్డుల్లో కూడా ఇది జరుగుతుంది. చిత్రబృందం నెట్‌వర్క్, కొన్ని పార్టీల ద్వారా ప్రయత్నాలు జరుగుతాయి. చిత్ర నిర్మాతలు జ్యూరీ సభ్యులను ఆకర్షించడానికి ప్రయత్నిస్తారు. 'ఇది ఫలానా దర్శకుడి సినిమా' అని ఒక్కోసారి ప్రత్యేక శ్రద్ధ చూపిస్తుంటారు. కానీ నాకు బిరుదులు, ట్రోఫీల కంటే దర్శకనిర్మాతలు, సహనటుల నుంచి వచ్చే ప్రశంసలే గొప్పవని నా అభిప్రాయం" అని అన్నారు.

కాలాన్ని వెనక్కి తీసుకొస్తే..!



దేవన్

"మనిషి కాలాన్ని వెనక్కి తిరిగి తీసుకురాలేడు. కానీ, ఒక దైవత్వంతో కాలం మళ్లీ తిరిగి వస్తే ఎలా ఉంటుందనే నేపథ్యంతో అల్లుకున్న ప్రేమకథా చిత్రమే 'కృష్ణ లీల" అన్నారు దేవన్. ఆయన హీరోగా నటిస్తూ.. స్వయంగా తెరకెక్కించిన ఈ చిత్రాన్ని జి.జ్యోత్స్న నిర్మించారు. ధన్య బాలకృష్ణన్ కథానాయిక. ఈ సినిమా ఈనెల 7న విడుదల కానున్న నేపథ్యంలో దేవన్ సోమవారం హైదరాబాద్‌లో విలేకర్లతో మాట్లాడుతూ.. "ఈ చిత్రానికి కథే హీరో. కృష్ణ లీల అంటే కృష్ణుడు ఆడిన ఆట. ఆయన ఓ ప్రేమకథను ఎలా నడిపించారన్నదే ఈ చిత్ర ఇతివృత్తం" అన్నారు.

డిసెంబరులో అనన్య చిత్రం



అనన్య పాండే, కార్తిక్ ఆర్యన్

బాలీవుడ్ నటుడు కార్తిక్ ఆర్యన్, అనన్య పాండే జంటగా నటిస్తున్న చిత్రం 'తు మేరీ మై తేరా మై తేరా తు మేరీ'. గతంలో కార్తిక్ 'సత్య ప్రేమ్ కీ కథ' చిత్రానికి దర్శకత్వం వహించిన సమీర్ విద్వాన్స్ ఈ సినిమాని తెరకెక్కిస్తున్నారు. కరణ్ జోహార్, అదార్ పూనవల్లా, అపూర్వ మెహతా, షరీన్ మంత్రి కేడియా, కిశోర్ అరోరా, భూమిక తివారీ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. రొమాంటిక్ కామెడీ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రం తాజాగా విడుదల తేదీని ఖరారు చేసుకుంది. ఈ సినిమా క్రిస్మస్ సందర్భంగా డిసెంబరు 25న థియేటర్లలో విడుదలకానుందని ప్రకటిస్తూ చిత్రబృందం సామాజికమాధ్యమాల వేదికగా ఓ పోస్టర్‌ను ఆవిష్కరించింది. ప్రేమను స్వచ్ఛమైన భావోద్వేగాలతో, హాస్యాన్ని మేళవించి రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమాని రూపొందించినట్లు తెలుస్తోంది. కార్తిక్ తదుపరి అనురాగ్ బసు దర్శకత్వంలో ఇంకా పేరు ఖరారు కాని ఓ చిత్రం, 'నాగ్జిల్లా' సినిమాలో కనిపించనున్నాడు. అనన్య 'కాల్ మీ బే సీజన్ 2' సిరీస్‌తో పాటు లక్ష్య సరసన 'చాంద్ మేరా దిల్' సినిమాతో త్వరలోనే ప్రేక్షకుల్ని అలరించనుంది.

ఒక్క క్షణమైనా ప్రేమించావా?



ధనుష్, కృతి సనన్

"మీరు ఎక్కువగా ప్రేమించే వ్యక్తే.. మిమ్మల్ని ఎక్కువగా బాధించేవాడు! కళ్లతో చెప్పగలిగినది, మనసుతో చెప్పలేకపోయింది" అంటూ శంకర్ ముక్తిల గొప్ప ప్రపంచం నుంచి 'ఉసే కహ్నో' అనే గీతాన్ని విడుదల చేసింది 'తేరే ఇష్క్ మే' చిత్ర బృందం. ధనుష్ హీరోగా, కృతి సనన్ కథానాయికగా తెరకెక్కిన ఈ సినిమాకి ఆనంద్ ఎల్ రాయ్ దర్శకత్వం వహించారు. ఆయన హిమాన్షు శర్మ, భూషణ్ కుమార్, క్రిషన్ కుమార్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఏఆర్ రెహమాన్ స్వరాలు సమకూర్చి స్వయంగా ఆలపించిన ఈ గీతానికి ఇర్షద్ కామిల్ సాహిత్యమందించారు. ఈ సినిమా ఈ నెల 28న థియేటర్లలో విడుదల కానున్న సందర్భంగా తాజాగా చిత్రబృందం రెండవ గీతాన్ని విడుదల చేసింది. ఈ పాట "నువ్వు నన్ను ఎప్పుడైనా ప్రేమించావా? ఒక్క రోజు ఒక్క క్షణమైనా.."అంటూ హీరో.."అమ్మాయిలు ఎప్పుడు రాకుమారుల గురించి కలలు కనరు.. ప్రేమలో తెలివిగా ఉండడానికి ప్రయత్నిస్తారు"అనే హీరోయిన్ సంభాషణలతో ప్రారంభమైన ఈ గీతం సినీ ప్రియులను ఆకట్టుకుంటోంది.

ఒక రాత్రి... ఒక రహస్యం



నవాజుద్దీన్ సిద్ధిఖీ

క్రైమ్ థ్రిల్లర్ నేపథ్యంలో రూపొంది ప్రేక్షకులకు అదిరిపోయే ట్విస్టులతో థ్రిల్‌ను పంచింది 'రాత్ అకేలీ హై' చిత్రం. బాలీవుడ్ నటుడు నవాజుద్దీన్ సిద్ధిఖీ ఇందులో పోలీసు అధికారి జతిల్ యాదవ్ పాత్రలో తన నటనతో కట్టిపడేశారు. ఇప్పుడీ సినిమాకు సీక్వెల్‌గా 'రాత్ అకేలీ హై: ది బన్సాల్ మర్డర్స్' రాబోతుంది. హనీ ట్రెహాన్ దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ విషయాన్ని ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ ఇన్‌స్టా వేదికగా అధికారికంగా ప్రకటించింది. "ఒక రాత్రి.. ఒక రహస్యం.. ఒక హత్య.. ఇన్స్‌పెక్టర్ జతిల్ యాదవ్ ఈజ్ బ్యాక్" అంటూ ఓ వ్యాఖ్యను జోడించింది. రాబోయే ఈ సీక్వెల్‌లో మరో కొత్త కేసుతో నవాజుద్దీన్ రంగంలోకి దిగనున్నారు. త్వరలో విడుదల తేదీని ప్రకటించనున్నట్లు చిత్ర వర్గాలు తెలిపాయి. రాధికా ఆప్టే, చిత్రాంగద సింగ్, రజత్ కపూర్, సంజయ్ కపూర్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

కేరళ పురస్కారాల్లో మంజుమ్మల్ బాయ్స్ సత్తా



వయసుతో సంబంధం లేకుండా పాత్రలతో ప్రయోగాలు చేసే అగ్రహీరో మమ్ముట్టి మరోసారి ఉత్తమ నటుడిగా సత్తా చాటారు. సోమవారం 55వ చలన చిత్ర అవార్డులను కేరళ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో భాగంగానే 'భ్రమయుగం'లో మాంత్రికుడి పాత్రలో మెప్పించిన మమ్ముట్టి తన నటనకుగానూ ఉత్తమ నటుడిగా పురస్కారాన్ని అందుకున్నారు. ఉత్తమ నటిగా షమ్లా హంజా (ఫెమినించి ఫాతిమా) నిలిచారు. స్నేహం బంధం విలువ తెలుపుతూ ప్రేక్షకుల్ని మెప్పించిన 'మంజుమ్మల్ బాయ్స్' ఉత్తమ చిత్రంగా పురస్కారం దక్కించుకుంది. దీంతో పాటు ఉత్తమ దర్శకుడు, ఉత్తమ సహాయ నటుడు, ఉత్తమ సినిమాటోగ్రాఫర్, ఉత్తమ గీత రచయిత, ఉత్తమ కళా దర్శకుడు, ఉత్తమ సౌండ్ మిక్సింగ్, బెస్ట్ సౌండ్ డిజైన్‌తో సహా పలు కేటగిరీల్లో అత్యధిక అవార్డులు ఈ సినిమాకే దక్కడం విశేషం. యువతను విశేషంగా ఆకట్టుకున్న 'ప్రేమలు' అత్యంత ప్రజాదరణ పొందిన సినిమాగా నిలిచింది.

కరెంట్ అఫైర్స్

మాదిరి ప్రశ్నలు



■ ప్రపంచ వ్యాపార నాయకత్వంలో చేసిన విశేష కృషికి ప్రతిష్ఠాత్మక 2025 క్యామెల్ ఇంటర్నేషనల్ అవార్డును గెలుచుకున్న కేరళకు చెందిన ఎన్నారై వ్యాపారవేత్త ఎవరు?
జ: యూనస్ అహ్మద్

■ అంతరించిపోతున్న రాబందుల అవగాహన పరిశోధన, సంరక్షణను పెంచడానికి దేశంలోనే మొదటి రాబందుల నాలెడ్జ్ పోర్టల్‌ను 2025, సెప్టెంబరు 2న ఏ రాష్ట్రంలో ప్రారంభించారు?
జ: అస్సాం

■ అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా 2025, సెప్టెంబరు 8న ఏ రాష్ట్రాన్ని ఆ రాష్ట్ర ముఖ్య మంత్రి పూర్తి అక్షరాస్యత ఉన్న రాష్ట్రంగా ప్రకటించారు? జ: హిమాచల్ ప్రదేశ్ (రాష్ట్రం 99.3 శాతం అక్షరాస్యత రేటును సాధించినట్లు రాష్ట్ర ముఖ్య మంత్రి సుఖ్‌విందర్ సింగ్ సుఖు ప్రకటించారు.)

■ ప్రముఖ అస్సామీ గాయకుడు, కవి, భారతరత్న అవార్డు గ్రహీత డాక్టర్ భూపేన్ హజారికా శతజయంతిని పురస్కరించుకుని ఆర్‌బీఐ ఎన్ని రూపాయల స్మారక నాణాన్ని విడుదల చేసింది?
జ: రూ.100

■ ప్రపంచవ్యాప్తంగా 30 సంవత్సరాల లోపు యువత మెచ్చిన నగరాల్లో అగ్రస్థానంలో ఉన్న మొదటి మూడు నగరాలు వరుసగా?
జ: బ్యాంకాక్, మెల్‌బోర్న్, కేప్‌టౌన్

మరింత సమాచారం

జనరల్ స్టడీస్

ఇండియన్ జాగ్రఫీ

ఆహార భద్రతకు.. ఆర్థిక వృద్ధికి!

భారతదేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక వ్యవసాయం. జనాభాలో సగభాగానికి ఉపాధి కల్పిస్తూ, దేశానికి ఆహారభద్రతను అందిస్తోంది. గ్రామీణాభివృద్ధికి చోదకశక్తిగా, ప్రజల జీవితాలను మెరుగుపరిచే ప్రధాన వనరుగా కొనసాగుతోంది. భవిష్యత్తులోనూ జీడీపీలో వ్యవసాయం వాటా మరింత పెరుగుతుందని అంచనా. దేశంతో పాటు ప్రపంచ ఆహార అవసరాలను తీర్చడంలో కీలకంగా ఉన్న భారత వ్యవసాయ రంగం స్థితిగతులపై పోటీ పరీక్షార్థులకు స్థూల అవగాహన ఉండాలి. దేశవ్యాప్తంగా సాగు తీరుతెన్నులు, పంటకాలాలు, ముఖ్య పంటలు, నీటివనరులతో పాటు మౌలిక సవాళ్లనూ తప్పకుండా తెలుసుకోవాలి.



వ్యవసాయం

ప్రపంచ వ్యవసాయ దేశాల్లో భారత్ ప్రముఖ స్థానంలో ఉంది. అత్యధిక జనాభా ఉన్న దేశంలో నేటికీ 45%-50% ప్రజలకు వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాలే ముఖ్య ఉపాధి వనరులు. దేశ ఆర్థికాభివృద్ధిలో వ్యవసాయ రంగం ప్రధాన పాత్ర పోషిస్తోంది. ప్రస్తుతం దేశ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో సుమారు 18% వ్యవసాయ రంగం సమకూరుస్తోంది. 2025 లెక్కల ప్రకారం ఈ వాటా సుమారు 567 బిలియన్ డాలర్లు. 2030 నాటికి నూతన వ్యవసాయ విధానాలు, సాంకేతిక పరిజ్ఞానం, ప్రభుత్వ విధానాల కారణంగా జీడీపీలో వ్యవసాయ రంగం వాటా 20% వరకు పెరిగే అవకాశం ఉంది. వ్యవసాయ రంగం దేశ జనాభాకు ఆహారంతో పాటు, పరిశ్రమలకు ముడిసరకును అందిస్తుంది. ఎగుమతుల రూపేణా పెద్దమొత్తంలో విదేశీ మారకద్రవ్యాన్ని ఆర్జిస్తోంది. ప్రస్తుతం దేశంలో నీటిపారుదల సౌకర్యాల ద్వారా సాగవుతున్న భూమి నికరంగా 45.5% ఉండగా, వర్షాధారంగా పండే భూమి 54.5%. ప్రస్తుత నికర సాగు విస్తీర్ణం 145 మిలియన్ హెక్టార్లు.

భారతదేశ వ్యవసాయాన్ని నేలలు, వర్షపాతం, ఉష్ణోగ్రత, పంటల విధానం ఆధారంగా వర్గీకరించారు. దేశవ్యాప్తంగా 14 ప్రధాన, 44 మధ్యస్థ, 55 చిన్నతరహా నదులన్నీ కలిపి సుమారు 83% నదీ వ్యవస్థను ఏర్పరుస్తున్నాయి. సాగునీటి పారుదలలో మెజారిటీ వాటా ఈ నదుల నుంచే వస్తోంది. కొన్ని రాష్ట్రాలు భూగర్భ జలాలను వ్యవసాయానికి ఎక్కువగా ఉపయోగిస్తున్నాయి. ఇటీవల కాలంలో వ్యవసాయ ఉత్పత్తిలో గణనీయమైన పురోగతి నమోదైంది. మేలు జాతి వంగడాల సాగు, ఎరువుల వాడకం, సమర్థ నీటి నిర్వహణ, సాంకేతిక పరిజ్ఞాన వినియోగం తదితరాలన్నీ ఉత్పాదకతను మరింత పెంచాయి. దేశీయంగా ఆహారభద్రత సాధించడంతో పాటు ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న జనాభా ఆహార డిమాండ్ తీర్చడంలో భారత్ సహాయపడుతోంది.

☛ ప్రభుత్వ గణాంకాల ప్రకారం 1950-51లో సాగు కింద ఉన్న భూమి 119 మిలియన్ హెక్టార్లు. 1970-71 నాటికి 140 మి.హెక్టార్లకు, 1990-91లో 142 మి.హెక్టార్లకు పెరిగింది. 2018-19లో 139 మి.హెక్టార్లకు, 2023-24లో 138.9 మి.హెక్టార్లకు తగ్గింది. వ్యవసాయ భూములు నెమ్మదిగా వ్యవసాయేతర అవసరాలకు, పట్టణీకరణ ప్రభావంతో నివాస ప్రాంతాలుగా మారుతుండటమే ఇందుకు కారణం.

భారతదేశం - పంట కాలాలు

పంటలు నాటిన సమయం, పండించిన కాలం ఆధారంగా పంట కాలాలను మూడు రకాలుగా వర్గీకరించారు.

1) **ఖరీఫ్:** ఈ పంటలను వర్షాకాలంలో అంటే జూన్ నుంచి సెప్టెంబరు వరకు పండిస్తారు. వీటినే 'వర్షాకాల పంటలు' అంటారు. ఉదా: వరి, మొక్కజొన్న, సజ్జ, రాగులు, వేరుశనగ, పత్తి మొదలైనవి. జూన్‌లో రుతుపవనాలు మొదలవగానే విత్తనాలు వేస్తారు. సెప్టెంబరు నాటికి కోతకు వస్తుంది.

2) **రబీ:** ఇవి రెండో రకం పంటలు. రబీ అనే పదం అరబిక్ భాష నుంచి వచ్చింది. అంటే వసంతకాలం అని అర్థం. అక్టోబరు నుంచి మార్చి వరకు పండించే వీటిని 'శీతాకాలం పంటలు' అంటారు. **ఉదా:** గోధుమ, ఆవాలు, బఠానీ, బార్లీ మొదలైనవి. వీటికి తక్కువ నీరు సరిపోతుంది.

3) **జైద్:** ఇవి మూడో రకం పంటలు. మార్చి నుంచి జూన్ వరకు పండిస్తారు. ఖరీఫ్, రబీతో పోల్చుకుంటే తక్కువకాలపు పంట. ఈ కాలంలో ఎక్కువగా కాకర, పుచ్చ, గుమ్మడి, దోసకాయలు లాంటివి పండుతాయి.

భారతదేశం - భూవినియోగం

భూమి రకం	(విస్తీర్ణం మిలియన్ హెక్టార్లలో) 1990-91	2023-24
1) అడవులు	67.99	72.02
2) నిష్ప్రయోజన భూములు	19.66	16.58
3) వ్యవసాయేతర పనుల కింద ఉన్న భూములు	21.22	28.54
4) సాగుకు ఉపయోగపడే బంజరు భూమి	15.02	11.58
5) శాశ్వత పచ్చికబయళ్లు	11.80	10.21
6) వృక్షజాతి పంటలు	3.70	2.94
7) బీడు భూమి	13.81	11.16
8) ఇతర బీడు భూమి	9.51	-
9) నికర సాగు	142.33	138.99

వ్యవసాయ రంగంలోని సవాళ్లు

☛ దేశంలో గత 4-5 వేల సంవత్సరాలుగా వ్యవసాయం చేస్తుండటంతో నేలసారం తగ్గిపోతోంది. ☛ మృత్తికా క్రమక్షయానికి కారణం అడవుల నరికివేత, అత్యధిక వర్షపాతం, తద్వారా సంభవించే వరదలు. ☛ కుటుంబాలు క్రమంగా చిన్నవిగా మారడంతో కమతాల పరిమాణం కూడా ఏటా తగ్గుతూ వస్తుంది. ☛ 1970-71లో సగటు కమత పరిమాణం 2.28 హెక్టార్లు ఉండగా, 1990-91 నాటికి 1.6 హెక్టార్లకు, ప్రస్తుతం 2015-16 లెక్కల ప్రకారం 1.08 హెక్టార్లకు తగ్గిపోయింది. ☛ ఆధునికత ఎంత పెరిగినా నేటికీ మారుమూల ప్రాంతాల్లో పాతతరం పనిముట్లే వాడుతున్నారు. ☛ కొన్ని ప్రాంతాల్లో పెట్టుబడుల సౌకర్యం, రుణ సౌకర్యం, బ్యాంకింగ్ సేవలు అందుబాటులో లేకపోవడంతో నేటికీ వ్యవసాయ ఖర్చుల కోసం ప్రైవేటు వ్యక్తులను ఆశ్రయిస్తున్నారు. ☛ పండిన పంటకు సరైన గిట్టుబాటు ధర, సరిపడా గిడ్డంగి సౌకర్యాలు అందుబాటులో లేకపోవడంతో కోతల సమయంలో దళారులకు తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తోంది. ☛ అతిపెద్ద నదీ వ్యవస్థ, కాలువలు ఉన్నప్పటికీ ఇంకా సాగుయోగ్యమైన చాలా భూమికి నీటిపారుదల వసతి లేదు.

ముఖ్యాంశాలు

☛ ప్రస్తుతం ప్రపంచంలో ఎక్కువ విస్తీర్ణంలో వ్యవసాయం చేసే దేశాల్లో భారత్ 4వ స్థానంలో ఉంది. (చైనా, అమెరికా, బ్రెజిల్ మొదటి మూడు స్థానాలు) ☛ దేశంలోని నికర సాగు భూమి 138.99 మిలియన్ హెక్టార్లు. మొత్తం వ్యవసాయ భూమి 140-157 మి.హె. ☛ దేశ విస్తీర్ణంలో అడవులు 24% మేర ఉన్నాయి. అటవీ విస్తీర్ణం పరంగా మనది ప్రపంచంలో 9వ స్థానం. ☛ 1950 నాటికి జీడీపీలో వ్యవసాయ రంగం వాటా 67.5% ఉండగా, ప్రస్తుతం (2023-24 ఐబీఈఎఫ్ లెక్కలు) సుమారు 18%. ☛ 1908లో దేశంలో బిహార్‌లోని పూసా వద్ద వ్యవసాయ కళాశాల, పరిశోధనశాల స్థాపించారు. ☛ భారతదేశ వ్యవసాయ ఉత్పత్తులు ఖరీఫ్ కాలంలో అధికంగా 47%-49%, రబీలో 44%-45%, జైద్‌లో 5%-7% వస్తున్నాయి. ☛ దేశంలో ప్రస్తుతం నికర నీటిపారుదల వసతులున్న సాగుభూమి 45.5%. వర్షాధార వ్యవసాయ భూమి 54.5%. ☛ దేశవ్యాప్తంగా 14 ప్రధాన, 44 మధ్యతరహా, 55 చిన్న నదులు 83% నదీపరీవాహక ప్రాంతాన్ని ఏర్పరుస్తున్నాయి.





రచయిత: డాక్టర్ గోపగోని ఆనంద్

ఆఫర్ చేజారిందా.. ఆందోళన అక్కర్లేదు! | జాబ్ స్కిల్స్



క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఎంపికయితే ఒకప్పుడు ఎంతో ధీమా అనిపించేది. ఇక జీవితంలో స్థిరపడినట్లే అనుకునేవారు. కానీ ప్రపంచవ్యాప్త పరిణామాలు, ఆర్థికమాంద్యం దెబ్బకు చేతికొచ్చిన అవకాశాలు కూడా ఒక్కోసారి జారిపోతున్నాయి. కొన్ని ఐటీసంస్థలు 'ఆఫర్‌ను రివోక్ చేస్తున్నాం' అనే చేదు వార్తలనూ చెబుతున్నాయి. అభ్యర్థి ప్రమేయం లేకుండా జరిగే ఆ పరిణామాలకు ఎక్కువగా బాధపడొద్దు. అదే సమయంలో ప్రయత్నాలను మరింత శ్రద్ధతో కొనసాగించాలి. ఆందోళనను పెంచే ఆ సందర్భాలను ఏ విధంగా ఎదుర్కోవాలి, ఎలాంటి ముందు జాగ్రత్తలను తీసుకోవాలో తెలుసుకోవడానికి **క్యూఆర్ కోడ్** స్కాన్ చేయండి.

సేవల్లో సాంకేతికతతో పారదర్శక పాలన!

సైన్స్ అండ్ టెక్నాలజీ

సమాచార సాంకేతికత అనువర్తనాల్లో ముఖ్యమైనవి ఈ-గవర్నెన్స్, డిజిటల్, ఆన్‌లైన్ సర్వీసులు. ప్రభుత్వ సేవలు, పథకాలు ప్రజలకు వేగంగా, పారదర్శకంగా, అవినీతికి తావు లేకుండా అందించేందుకు ఇవి ఉపయోగపడుతున్నాయి. అరచేతిలోని మొబైల్ ఫోన్‌తోనే డిజిటల్ చెల్లింపులు, అనుమతులు తెచ్చుకోవడం, పత్రాలు డౌన్‌లోడ్ చేయడం, బ్యాంకింగ్ పనులు తదితరాలన్నీ చకచకా జరిగిపోతున్నాయి. ఇవన్నీ ఈ-గవర్నెన్స్ ఫలితాలు, అద్భుత విజయాలే. ప్రస్తుతం ఈ పరిణామం మరింత అభివృద్ధి చెంది యాప్ ఆధారిత సేవలుగా మారింది. ఆ డిజిటల్ విప్లవం విశేషాలపై పోటీ పరీక్షల అభ్యర్థులకు సమగ్ర అవగాహన ఉండాలి. అందరికీ అందుబాటులోకి వచ్చిన యూపీఐ సేవలు, పల్లెలకూ చేరువైన బ్రాడ్‌బ్యాండ్ సౌకర్యం, పన్ను చెల్లింపుల నుంచి ప్రభుత్వ రాయితీల వరకు ఆధార్ సీడింగ్‌తో ఉన్న సౌలభ్యం, చదువులతో పాటు శిక్షణకూ ఉపయోగపడుతున్న ఈ-లెర్నింగ్ సౌకర్యం, వివిధ ఉద్దేశాలతో ప్రభుత్వం ప్రారంభించిన ప్రత్యేక పోర్టళ్లతో పాటు డిజిటల్ అక్షరాస్యత విషయంలో ఉన్న సమస్యలను, సవాళ్లనూ తెలుసుకోవాలి.



ఈ-గవర్నెన్స్, డిజిటల్ ఇండియా

1. ఎలక్ట్రానిక్ గవర్నెన్స్ (ఈ-గవర్నెన్స్) గురించి కింది వాటిలో సరైన వాక్యాలు?
ఎ) ప్రభుత్వ సేవల్లో సమాచార సాంకేతికతను వినియోగించడం.
బి) ఈ-గవర్నెన్స్ వల్ల ప్రభుత్వ సేవల్లో పారదర్శకత పెరుగుతుంది.
సి) అవినీతిరహిత, వేగవంతమైన పాలన సాధ్యమవుతుంది.
1) ఎ, బి, సి 2) బి, సి
3) ఎ, సి 4) ఏదీకాదు

2. కింది వేటిని ఎలక్ట్రానిక్ గవర్నెన్స్‌కు మూల స్తంభాలుగా పిలుస్తారు?
ఎ) ప్రభుత్వ విధానాలు బి) ప్రజలు
సి) సాంకేతికత డి) వనరులు
1) ఎ, బి 2) బి, సి
3) సి, డి 4) ఎ, బి, సి, డి

3. నేషనల్ ఈ-గవర్నెన్స్ గురించి కింది వాక్యాల్లో సరైన వాటిని గుర్తించండి.
ఎ) దీన్ని మొదటిసారిగా 2006లో ప్రారంభించారు.
బి) దీనిలో భాగంగా కేంద్ర,రాష్ట్ర స్థాయుల్లో, సంయుక్తంగా మొత్తం 31 మిషన్ మోడ్ ప్రాజెక్టులు ప్రారంభించారు.
సి) ఈ-డిస్ట్రిక్, ఈ-పంచాయత్‌లు, ఈ-బిజ్‌లు, ఈ-కోర్టులు అనేవి దీనిలో భాగంగా ఉన్నాయి.
డి) స్టేట్ వైడ్ ఏరియా నెట్‌వర్క్స్, రాష్ట్ర సమాచార కేంద్రాలు దీనిలో భాగంగా ఏర్పరిచారు.
1) ఎ, బి, సి 2) బి, సి, డి
3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి

4. నేషనల్ ఈ-గవర్నెన్స్ ప్లాన్-2006లో భాగంగా కింది ఏ రంగాల్లో మిషన్ మోడ్ ప్రాజెక్టులను ప్రారంభించారు?
ఎ) బ్యాంకింగ్ రంగం బి) ఆదాయపు పన్ను
సి) బీమా డి) పాస్‌పోర్టు ఇ) కస్టమ్స్
1) ఎ, బి, సి 2) సి, డి, ఇ
3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి, ఇ

5. ఈ-గవర్నెన్స్‌కు సంబంధించిన కార్యక్రమాల్లో కింది ఏవి భాగంగా లేవు?
ఎ) ప్రభుత్వం - సాధారణ ప్రజలు
బి) ప్రభుత్వం - ఉద్యోగులు
సి) ప్రభుత్వం - వ్యాపారం
డి) ప్రభుత్వం - విదేశీ వ్యవహారాలు
ఇ) ప్రభుత్వం - అంతర్జాతీయ సంబంధాలు
1) డి, ఇ 2) ఎ, బి, 3) సి, డి 4) సి, ఇ

6. కింది వాటిలో తప్పుగా జతపరిచినవి?
ఎ) డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ - లబ్ధిదారుల ఖాతాల్లోకి నేరుగా డబ్బులు జమకావడం.
బి) మై గవర్నమెంట్ - ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకోవడం.
సి) ఈ-సంజీవని - మారుమూల ప్రాంతాల ప్రజలకు టెలిమెడిసిన్ సేవలు అందించడం.
డి) ఈ-హాస్పిటల్ - ప్రభుత్వ ఆసుపత్రుల్లో డిజిటల్ పరికరాలు అమర్చడం.
1) ఎ, బి 2) బి, డి 3) సి, డి 4) డి, సి

7. కింది వాటిలో సరైన క్రమాన్ని గుర్తించండి.
ఎ) MCA 21 — 1) ముఖ్యమైన పత్రాలు భద్రపరచుకోవడం
బి) ఈ-నామ్ — 2) కార్పొరేట్ కంపెనీలను ఏర్పరచడం కోసం
సి) ఈ-ఆఫీస్ — 3) వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్
డి) డిజిలాకర్ — 4) కాగితరహిత ప్రభుత్వ సేవలు
1) ఎ-1, బి-3, సి-2, డి-4 2) ఎ-4, బి-3, సి-2, డి-1
3) ఎ-2, బి-3, సి-4, డి-1 4) ఎ-3, బి-2, సి-1, డి-4

8. ఈ-గవర్నెన్స్‌కు ఏవి అవరోధాలుగా ఉన్నాయి?
ఎ) డిజిటల్ అక్షరాస్యత లేకపోవడం
బి) పలు డిపార్ట్‌మెంట్‌ల మధ్య సమన్వయం లేకపోవడం
సి) భారతదేశంలో అనేక భాషలు ఉండటం
డి) ఎక్కువ జనాభా ఉండటం
ఇ) సమాచార గోప్యత లేకపోవడం
1) ఎ, బి, సి, డి, ఇ 2) బి, సి, డి
3) సి, డి, ఇ 4) ఎ, సి, డి

9. డిజిటల్ ఇండియా మిషన్ గురించి కింది వాటిలో సరికాని వాక్యాలను గుర్తించండి.
ఎ) దీన్ని 2015, జులైలో ప్రారంభించారు.
బి) ఈ మిషన్‌లో భాగంగా భారతదేశ స్వరూపాన్ని డిజిటలీకరించనున్నారు.
సి) దీనివల్ల ఇంటర్నెట్ కనెక్షన్లు, డిజిటల్ అక్షరాస్యత పెరుగుతాయి.
డి) ఈ-మిషన్ వల్ల విదేశీ పెట్టుబడులు, వాణిజ్యం పెరుగుతాయి.
1) ఎ, సి 2) బి, డి 3) ఎ, డి 4) సి, డి

10. కింది వేటిని డిజిటల్ ఇండియాకు మూల స్తంభాలుగా చెప్పవచ్చు?



ఎ) బ్రాడ్‌బ్యాండ్ హైవేలు
బి) అందరికీ మొబైల్ అందుబాటులో ఉంచడం
సి) ఎలక్ట్రానిక్ పరికరాల తయారీ
డి) డిజిటల్ అక్షరాస్యత పెంచడం
ఇ) అందరికీ సమాచారం అందుబాటులో ఉంచడం.
1) ఎ, బి, సి, డి, ఇ 2) సి, డి, ఇ
3) ఎ, బి, డి 4) బి, సి, ఇ

11. 2011లో ప్రారంభించిన నేషనల్ ఆప్టిక్ ఫైబర్ నెట్‌వర్క్‌లో ఏవి భాగంగా ఉంటాయి?
ఎ) ఆప్టికల్ ఫైబర్ కేబుల్‌ను తయారుచేయడం.
బి) ఆప్టికల్ ఫైబర్ కేబుల్‌ను విదేశాలకు ఎగుమతి చేయడం.
సి) రెండు లక్షల గ్రామ పంచాయతీలకు బ్రాడ్‌బ్యాండ్ కనెక్షన్లు ఇవ్వడం.
డి) ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార వ్యవస్థను ఏర్పరచడం.
1) బి 2) బి, సి 3) సి 4) డి

12. 2018లో ఏర్పాటు చేసిన నేషనల్ డిజిటల్ కమ్యూనికేషన్ పాలసీలో 2022 వరకు ఏ లక్ష్యాలను సాధించాలని నిర్ణయించారు?
ఎ) ప్రతి వ్యక్తికి 50 Mbps బ్రాడ్ బ్యాండ్ కనెక్టివిటీ ఇవ్వడం.



బి) గ్రామ పంచాయతీలకు 10 Gbps కనెక్టివిటీ ఇవ్వడం.
సి) డిజిటల్ కమ్యూనికేషన్ రంగంలో 100 బిలియన్‌ల అమెరికా డాలర్ల పెట్టుబడులు ఆకర్షించడం.
డి) పది లక్షల మంది యువతకు శిక్షణ ఇచ్చి మానవవనరులను మెరుగుపరచడం.
1) ఎ, బి, సి, డి 2) బి, సి, డి
3) ఎ, బి, సి 4) సి, డి

13. ప్రభుత్వం చేపట్టిన కింది ఏ కార్యక్రమాలు డిజిటల్ ఇండియాకు తోడ్పాటు అందించాయి?



ఎ) నేషనల్ ఆప్టిక్ ఫైబర్ నెట్‌వర్క్ - 2011
బి) నేషనల్ డిజిటల్ కమ్యూనికేషన్ పాలసీ - 2018
సి) నేషనల్ బ్రాడ్‌బ్యాండ్ మిషన్
1) ఎ, బి 2) బి, సి 3) ఎ, సి 4) ఎ, బి, సి

14. కింది వాటిలో డిజిటల్ ఇండియా కార్యక్రమం ముఖ్య ఉద్దేశాలు?
ఎ) ప్రజల్లో డిజిటల్ అంతరాన్ని తగ్గించడం.
బి) డిజిటల్ సాంకేతికత ద్వారా అందరికీ విద్య, వైద్యం, ప్రభుత్వ సేవలు అందించడం.
సి) ఆర్థికాభివృద్ధి సాధించడం.
డి) ప్రజల జీవన ప్రమాణాన్ని పెంచడం.
1) ఎ, డి 2) ఎ, బి, సి, డి
3) సి, డి 4) ఎ, సి, డి

15. కింది జతలను సరైన క్రమంలో అమర్చండి.
ఎ) భారత్ నెట్ — 1) నేషనల్ నెట్‌వర్క్‌ను అందుబాటులో ఉంచడం.
బి) బ్రాడ్ బ్యాండ్ ఫర్ ఆల్ — 2) గ్రామ పంచాయతీలకు అధిక వేగం ఉన్న బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందించడం.
సి) పబ్లిక్ వై-ఫై హాట్‌స్పాట్‌లు — 3) మొబైల్ చెల్లింపుల వ్యవస్థ
డి) యునిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ — 4) ప్రజలకు ఉచిత వై-ఫై సేవలు
1) ఎ-2, బి-1, సి-4, డి-3 2) ఎ-1, బి-3, సి-4, డి-2
3) ఎ-4, బి-3, సి-2, డి-1 4) ఎ-2, బి-3, సి-4, డి-1

16. 'మిషన్ కర్మయోగి' అనే జాతీయ కార్యక్రమం దేనికి సంబంధించింది?
ఎ) సివిల్ సర్వీస్ ఉద్యోగుల నిరంతర శిక్షణ కోసం.
బి) సివిల్ సర్వీస్ ఉద్యోగులు ఆన్‌లైన్ కోర్సులు అభ్యసించేందుకు.
సి) ఉద్యోగులు తమ సర్వీసు రికార్డులు భద్రపరిచేందుకు
డి) ప్రజలను ఆధ్యాత్మికం వైపు మళ్లించేందుకు ఉపయోగపడే కార్యక్రమం.
1) ఎ, డి 2) సి, డి 3) ఎ, బి 4) బి, సి

17. భారతదేశ పౌరులందరికీ ఉన్న ఆధార్ కార్డు గురించి కింది వాక్యాల్లో సరైనవి?
ఎ) ప్రతి వ్యక్తికి వేర్వేరుగా 12 అంకెలు ఉంటాయి.
బి) బయోమెట్రిక్ గుర్తింపుగా ఉపయోగపడుతుంది.
సి) ప్రభుత్వ పథకాలు, రాయితీలు పారదర్శకంగా అందేందుకు ఉపయోగపడుతుంది.
1) ఎ, బి, సి 2) బి, సి
3) ఎ, సి 4) ఏదీకాదు

18. డిజిటల్ ఇండియాలో భాగంగా ఏర్పరిచిన డిజిలాకర్‌కు సంబంధించిన కింది వాక్యాలను పరిశీలించి, సరైన సమాధానాన్ని ఎంచుకోండి.
ఎ) ఇది క్లౌడ్ ఆధారిత వ్యవస్థ.
బి) దీనిలో ప్రజలంతా తమ ప్రభుత్వ పత్రాలను డిజిటల్‌గా నిల్వ చేసుకోవచ్చు.
సి) దీనివల్ల కాగితరహిత సేవలు అందుతాయి.
డి) దీనిలో భద్రపరచిన పత్రాలు న్యాయపరంగా చెల్లుబాటు అవుతాయి.
1) ఎ, బి 2) బి, సి
3) ఎ, బి, సి, డి 4) సి, డి

19. ఈ-గవర్నెన్స్ వల్ల ప్రభుత్వ సేవలకు సంబంధించిన కింది ఏవి సాధ్యమవుతాయి?
ఎ) పారదర్శకత బి) బాధ్యత
సి) ఖర్చు తగ్గుతుంది డి) వేగం పెరుగుతుంది
ఇ) సమాచారం అందుబాటులో ఉంటుంది
1) బి, సి 2) సి, డి
3) ఎ, డి 4) ఎ, బి, సి, డి, ఇ

20. 2025లో ప్రారంభించిన ఈ-గవర్నెన్స్ జాతీయ అవార్డులు కింది వేటికి సంబంధించినవి?
ఎ) గ్రామ పంచాయతీ స్థాయిలో డిజిటల్ సేవల కోసం
బి) యూపీఐ ఆధారిత సంపద పన్ను చెల్లించడాన్ని ప్రోత్సహించేందుకు
సి) ప్రభుత్వ ఉద్యోగుల ఎలక్ట్రానిక్ పాలనను ప్రోత్సహించేందుకు
డి) ఈ-గవర్నెన్స్‌ను సాధారణ ప్రజలు వినియోగించుకునేందుకు
1) ఎ, బి 2) సి, డి 3) ఎ, డి 4) బి, సి

సమాధానాలు

1-1; 2-4; 3-4; 4-4; 5-1; 6-2; 7-3; 8-1; 9-2; 10-1; 11-3; 12-1; 13-4; 14-2; 15-1; 16-3; 17-1; 18-3; 19-4; 20-1.

ఈనాడు ప్రతిభ

■ e-mail: support@epratibha.net

18

మంగళవారం నవంబరు 4, 2025

అలలపై తేలే వస్తువు చలనం..

రేఖీయ సరళ హరాత్మకం!

ఒక వస్తువు స్థానంలో కాలంతోపాటు మార్పు సంభవించినట్లయితే దాన్ని చలనంగా భావించవచ్చు. ఒక ప్రదేశం నుంచి మరొక ప్రదేశానికి వస్తువులు కదులుతున్నప్పుడు రకరకాల చలనాలను గమనించవచ్చు. వీటిని ప్రధానంగా స్థానాంతర చలనం, భ్రమణ చలనం, డోలన చలనం అని మూడు రకాలుగా వర్గీకరించవచ్చు. ఒక సరళరేఖ వెంట కాలం గడిచేకొద్దీ తన స్థానాన్ని మార్చుకుంటూ, ఒక వస్తువులో జరిగే చలనాన్ని 'స్థానాంతర చలనం' అంటారు ఒక వస్తువులోని కణాలన్నీ ఒక స్థిరమైన బిందువు/అక్షం ఆధారంగా వక్రమార్గంలో ప్రయాణిస్తున్నప్పుడు అది పొందే చలనాన్ని భ్రమణ చలనం అంటారు.


ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

ఫిజిక్స్

ఆవర్తన కాలం

ఆవర్తన చలనాన్ని పునరావృతం చేయడానికి పట్టే కనిష్ఠ సమయాన్ని ఆవర్తన కాలం (T) అంటారు. దీనికి SI ప్రమాణం సెకన్.

ఉదా: ఒక పరమాణువులో ఎలక్ట్రాన్లు చేసే చలనం – ఆవర్తన చలనం



❖ ఒక అయస్కాంతాన్ని దారంతో వేలాడదీసి ఉత్తర దక్షిణ దిక్కుల నుంచి పక్కకు కదిలించినప్పుడు చేసే చలనం - ఆవర్తన చలనం.

❖ ఒక విల్లు నుంచి బయటకు వదిలిన బాణం - ఆవర్తన చలనం కాదు

❖ ఒక నది ఇవతలి గట్టు నుంచి అవతలి వైపునకు ఈదుకుంటూ వెళ్లి, తిరిగి ఇవతలి గట్టుకు చేరిన వ్యక్తి చేసే చలనం - ఇది కూడా ఆవర్తన చలనం కాదు. ఎందుకంటే ఇది ఆవర్తన కాలాన్ని పాటించదు.

డోలన చలనం

ఒక నిర్దిష్ట కాలవ్యవధిలో పునరావృతమయ్యే చలనాన్ని ఆవర్తన చలనం అంటారు. రెండు బిందువుల మధ్య ఒకే మార్గంలో ఒక వస్తువు ముందుకి, వెనక్కి కదులుతూ చేసే ఆవర్తన చలనాన్ని డోలన చలనం అంటారు.



ఉదా: స్పీకర్‌లోని పలుచటి పొర చేసే చలనం, ఇంజిన్‌లోని ముషలకం (పిస్టన్) కదలడం, లఘు లోలకం చేసే డోలనాలు, ఊగే ఊయల చేసే చలనం.

✦ డోలన చలనాలు అన్నీ ఆవర్తన చలనాలే. కానీ ఆవర్తన చలనాలన్నీ డోలన చలనాలు కాదు.

✦ వీణను మీటినప్పుడు తీగల చలనం, లోలక గడియారంలో డోలనాలు చేసే లోలకం, కుట్టు మిషన్‌లో సూది చేసే చలనం, చేతి గడియారంలో బ్యాలెన్స్ చక్రం చేసే చలనం, ఒక పదార్థంలోని పరమాణువులు చేసే చలనం అనేవి డోలన చలనం అవుతూ, ఆవర్తన చలనాలుగా కూడా ఉంటాయి.

✦ సౌర కుటుంబంలో గ్రహాల చలనం, సమ వృత్తాకార చలనం చేసే ఇతర వస్తువులు ఆవర్తన చలనం అయి, డోలన చలనాలు కాని వాటికి ఉదాహరణలు.

డోలన చలనాలు - రకాలు

యాంత్రిక డోలన చలనం: యంత్రాల్లో రేఖీయ స్థానభ్రంశం లేదా కోణీయ స్థానభ్రంశాన్ని చేస్తూ జరిగే చలనాలు.

యాంత్రికేతర డోలన చలనం: విద్యుత్ అయస్కాంత తరంగాల్లో విద్యుత్ క్షేత్రం, అయస్కాంత క్షేత్రం చేసే చలనాలు, విద్యుత్ వలయాల్లో ఓల్టేజ్ చేసే డోలనాలు

▮ ఆవర్తన చలనం చేస్తున్న ఒక వస్తువు మార్గంలో ఒకానొక బిందువు వద్ద సమతా స్థితిని కలిగి ఉంటుంది. అయితే ఆ బిందువు వద్ద ఎలాంటి ఫలిత బలం ఉండదు. సమతా స్థితి ఉన్న బిందువు వద్ద వస్తువును వదిలేస్తే అది ఎప్పటికీ నిశ్చల స్థితిలోనే ఉంటుంది.

▮ సమతా స్థితిలో ఉన్న వస్తువుకు ఆ బిందువు దగ్గర నుంచి కొంత స్థానభ్రంశాన్ని కలిగిస్తే దాన్ని మరల సమతా స్థితికి తీసుకురావడానికి ఒక పునరుద్ధరణ బలం పని చేస్తుంది. ఆ ప్రయత్నంలో డోలనాలు ఏర్పడతాయి.

▮ పౌనఃపున్యం తక్కువగా ఉంటే డోలనాలు అని, ఎక్కువగా ఉంటే కంపనాలు అని వ్యవహరిస్తారు.

సరళ హరాత్మక చలనం

ఒక వస్తువు స్థానభ్రంశానికి అనులోమానుపాతంలో ఉండి, సమతాస్థితి స్థానం వైపు పనిచేసే పునరుద్ధరణ బలం వల్ల కలిగే ఆవర్తన చలనాన్ని సరళ హరాత్మక చలనం అంటారు.

◆ సరళ హరాత్మక చలనంలో ఉన్న వస్తువు సరళరేఖలో కదులుతూ దాని విరామ స్థానానికి అటుఇటుగా చలిస్తూ ఉంటుంది.

◆ ఈ చలనంలో వస్తువు స్థానభ్రంశాన్ని ఎప్పుడూ విరామ స్థానం నుంచే కొలవాలి.

◆ వస్తువు స్థానభ్రంశం ఎప్పుడు విరామ స్థానానికి వ్యతిరేక దిశలోనే ఉంటుంది.

◆ ఒక వస్తువు x స్థానభ్రంశంతో, a అనే త్వరణంతో సరళ హరాత్మక చలనం చేస్తూ ఉంటే

$a \propto -x$ లేదా $a = -kx$

ఇక్కడ k = అనుపాత స్థిరాంకం, – స్థానభ్రంశం, త్వరణాలు వ్యతిరేక దిశలో ఉంటాయని సూచిస్తుంది.

స.హ.చ – నియమాలు

☛ వస్తువు చలనం ఆవర్తన చలనమై ఉండాలి.

☛ నియమిత విరామ స్థానానికి అటు ఇటుగా వస్తువు కదలాలి.

☛ విరామ స్థానం నుంచి వస్తువు పొందే స్థానభ్రంశానికి త్వరణం అనులోమానుపాతంలో ఉండాలి.

☛ వస్తువు త్వరణం, స్థానభ్రంశం ఎల్లప్పుడూ వ్యతిరేక దిశలో ఉండాలి.

రేఖీయ సరళ హరాత్మక చలనం: కొద్దిపాటి వ్యాప్తితో ఊయల చేసే చలనం.

■ కొద్దిపాటి వ్యాప్తితో లఘు లోలకం చేసే చలనం.

■ బరువు వేలాడదీసిన స్ప్రింగ్ చేసే చలనం.

■ శృతి దండం (ట్యూనింగ్ ఫోర్క్)లోని prongs చేసే చలనం.

■ నీటి అలలపై తేలియాడే వస్తువు చేసే చలనం.

■ ఒక యానకంలో యాంత్రిక తరంగం ప్రయాణించినప్పుడు ఆ యానక కణాలు చేసే చలనం.

కోణీయ సరళ హరాత్మక చలనం: సమ అయస్కాంత క్షేత్రంలో స్వేచ్ఛగా వేలాడదీసిన అయస్కాంతం చేసే డోలనాలు

■ చేతి గడియారంలోని బ్యాలెన్స్ చక్రం చేసే డోలనాలు.

▮ డోలన చలనంలో ఉన్న ఒక వస్తువుకు సమతా స్థితిని కలిగించే ఒక విరామ స్థానం ఉంటుంది. ఈ బిందువు వద్ద ఫలిత బలం శూన్యం. వస్తువు చేసే డోలనాలు నశించిన తర్వాత ఈ బిందువు వద్ద వస్తువు నిలకడగా ఉంటుంది.


▮ డోలనాలు చేసే సమయంలో వస్తువు రెండు గరిష్ఠ దూర బిందువుల మధ్య చలిస్తూ ఉంటుంది. ఈ రెండు బిందువుల వద్ద వస్తువును వెనక్కి లాగే బలం అత్యధికంగా ఉంటుంది. కాబట్టి వస్తువు లిప్త కాలం పాటు ఆ బిందువుల వద్ద ఆగినట్లు అనిపిస్తుంది.

▮ విరామ స్థానం నుంచి వస్తువును పక్కకు లాగి వదిలినప్పుడు దాన్ని విరామ స్థానానికి తీసుకురావడానికి ఒక బలభ్రామకం పనిచేస్తుంది. వస్తువు విరామ స్థానాన్ని చేరేటప్పటికి దాని వేగం గరిష్ఠంగా ఉంటుంది. గమన జడత్వం కారణంగా వస్తువు రెండో గరిష్ఠ బిందువు వరకు కొనసాగుతుంది. మరలా బలభ్రామకం కారణంగా వెనక్కి మళ్లుతుంది. ఇదేవిధంగా కొనసాగుతూ వస్తువు డోలన చలనాన్ని చేస్తుంది.



రచయిత
వట్టిపల్లి కృష్ణ కిశోర్
విషయ నిపుణులు

సరళ హరాత్మక చలనం, సమ వృత్తాకార చలనానికి మధ్య సంబంధం



P అనే ఒక కణం, ω కోణీయ వేగంతో, A వ్యాసార్ధం ఉన్న ఒక వృత్తంలో అపసవ్య దిశలో సమ వృత్తాకార చలనంలో పరిభ్రమిస్తూ పటంలో చూపిన విధంగా ఉందని అనుకుంటే, O వృత్త కేంద్రంగా, XOX', YOY'లు పరస్పరం లంబంగా ఉన్న వ్యాసాలు అనుకుందాం. పటంలో చూపిన విధంగా కణం స్థాన సదిశ θ కోణం చేస్తుంటే, కణం ఒక పరిభ్రమణం చేసేటప్పటికి దాని నుంచి అక్షాలపైకి గీసిన లంబాలు ముందుకి, వెనక్కి కదులుతూ సరళ హరాత్మక చలనంలోకి వస్తాయి.

● దీని నుంచి సమవృత్తాకార చలనంలో ఉన్న కణం నుంచి గీసిన లంబాలు సరళ హరాత్మక చలనంలో ఉన్నట్లు గ్రహించవచ్చు.

820 Word of the Day

Facade

Telugu meaning: ముఖభాగం, పైమెరుగు

English meaning: The word facade (ఫెసాడ్) is a noun that refers to the front of a building or a deceptive outward appearance that hides the true nature of something.

Synonyms: Appearance, Pretence

Antonyms: Reality, Truth

Usage: 1. The old mansion's elegant facade concealed the crumbling walls inside.

2. Behind his friendly facade, he was struggling with deep insecurities.

Current Affairs



The Indian women's cricket team won their first-ever ICC Women's ODI World Cup on 2 November 2025. India defeated South Africa by 52 runs in the final at Mumbai's DY Patil Stadium. India scored 298 for 7 in 50 overs and South Africa all out for 246 in 45.3 overs.

✦ Shafali Verma was declared the Player of the Match, while Deepti Sharma won the Player of the Tournament award.



India's space agency ISRO successfully launched the LVM3-M5 rocket from the Satish Dhawan Space Centre in Sriharikota on 2 November 2025. The rocket carried CMS-03, weighing about 4,410 kilograms, the country's heaviest communication satellite ever sent to space. It marked the fifth operational flight of the LVM3 launcher. The satellite will provide multi-band communication services across India and nearby ocean regions. It will boost secure data, voice, and video links for both civilian and strategic use.

India's goods and services tax (GST) collections in October 2025 rose 4.6% to Rs.1,95,936 crore, compared with Rs.1,87,346 crore in September. This is the fifth highest monthly collection since the tax regime's 2017 launch.

Eminent Scientist Ankathi Raju was appointed as Director of Defence Research and Development Laboratory (DRDL), Hyderabad and assumed charge as Director of the Indian missile development laboratory on 1 November 2025.

For more Current Affairs: Scan QR code

శకుంతలా దేవి

శాస్త్రవేత్తలు విశేషాలు

ఈమె ప్రముఖ గణిత, ఖగోళ, జ్యోతిష శాస్త్రవేత్త. క్లిష్టమైన గణిత గణనలకు అతివేగంగా సమాధానాలు చెప్పడంలో శకుంతల దిట్ట. ఈమె ప్రపంచవ్యాప్తంగా అనేక గణిత అవధానాలు నిర్వహించారు. కంప్యూటర్ కంటే ముందుగా అంకెలు గుణించి గిన్నిస్ బుక్‌లో చోటు సంపాదించారు. ఆమెకు చదువు లేకున్నా.. తనకున్న అంకగణిత నైపుణ్యాలతో విద్యార్థులకు సంఖ్యా గణనలను సరళీకృతం చేయడానికి కృషిచేశారు. హ్యూమన్ కంప్యూటర్‌గా పేరొందిన శకుంతల నవంబరు 4న జన్మించారు. ఈ సందర్భంగా ఈమె జీవితంలోని ముఖ్య సంఘటనల గురించి తెలుసుకుందాం..!

బాల్యం – ప్రదర్శనలు

శకుంతలా దేవి 1929, నవంబరు 4న బెంగళూరులో జన్మించారు. తండ్రి సి.వి.సుందరరాజ రావు సర్కస్‌లో పనిచేసేవారు. శకుంతలకు మూడేళ్లున్నప్పుడు పేక ముక్కల్లో ట్రిక్స్ నేర్పిస్తూ, ఆమె అసాధారణ రీతిలో సంఖ్యలను గుర్తుంచుకోవడాన్ని తండ్రి గమనించారు. అప్పటి నుంచి ఆయన సర్కస్ మానేసి ఆమెతో గణిత ప్రదర్శనలు ఇప్పించడం ప్రారంభించారు.



✦ అయిదేళ్ల వయసులో ఆమె క్యూబ్ మూలాలు లెక్కించడం లాంటి గణిత సమస్యలను పరిష్కరించారు.

✦ ఆరు సంవత్సరాలున్నప్పుడు శకుంతల యూనివర్సిటీ ఆఫ్ మైసూర్‌లో గణిత ప్రదర్శన ఇచ్చారు. కాలిక్యులేటర్లు, పెన్ను - పేపర్‌పై ఆధారపడకుండా సంక్లిష్టమైన గణిత సమస్యలను ఆమె పరిష్కరించారు. దీంతో ఆమె పేరు దేశవ్యాప్తంగా మారుమోగింది. సంప్రదాయ విద్యను అభ్యసించకుండానే చిన్నతనం నుంచే తన అంకగణిత ప్రతిభను దేశవిదేశాల్లో చాటారు.

రచనలు

1976లో ఆమె రచించిన 'మోర్ పజిల్స్ టు పజిల్ యు' అనే పుస్తకం విడుదలైంది. అదే ఏడాది 'పర్ఫెక్ట్ మర్డర్' అనే నవల రచించారు.

▮ 1984లో 'ఆస్ట్రాలజీ ఫర్ యు' రాశారు. జ్యోతిషశాస్త్రంపై రాసిన పుస్తకం ఇది.

▮ 2006లో 'ఇన్ ది వండర్‌లాండ్ ఆఫ్ నంబర్స్' విడుదలైంది.

▮ 2011లో 'సూపర్ మెమొరీ: ఇట్‌కెన్ బీ యువర్స్' అనే పుస్తకం రాశారు.

చివరిగా


గణితాన్ని మన దైనందిన జీవితంలోకి అనుసంధానించడం, గణితంపై ఆలోచనలను పెంపొందించడం లాంటి విషయాలపై ఆమె ప్రముఖంగా మాట్లాడారు. మ్యాథ్స్ అంటే చాలామందికి ఉండే భయాన్ని పోగొట్టేలా అనేక రచనలు చేశారు. ఈమె జ్యోతిష శాస్త్రంలోనూ ప్రావీణ్యం పొందారు. మనిషి పుట్టిన తేదీ ప్రకారం నక్షత్రాలు, గ్రహాల అధ్యయనం ద్వారా వ్యక్తిగత జీవితం గురించి అంచనా వేసేవారు. శకుంతల 2013 ఏప్రిల్ 21న బెంగళూరులో మరణించారు.

మానసిక గణనకు ఉపయోగించే పద్ధతులపై శకుంతలాదేవి రచించిన పుస్తకం, గతంలో అడిగిన ప్రశ్నలు - జవాబుల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - ఇండియన్ ఎకానమీ

బ్యాంకింగ్ వ్యవస్థ - సహకార బ్యాంకులు

భారతదేశంలో సహకార పరపతి సంఘాలు 1904లో ప్రారంభమయ్యాయి. కొంతమంది సభ్యులు సంఘంగా ఏర్పడి, రాష్ట్ర చట్టాల మేరకు వీటిని ఏర్పాటు చేస్తారు. వీటినే సహకార బ్యాంకులు అంటారు. ఇందులో సభ్యత్వం ఉన్నవారికి మాత్రమే డిపాజిట్, లోన్ సౌకర్యం ఉంటుంది.



మన దేశంలో సహకార పరపతి వ్యవస్థను మూడంచెల స్థాయిలో ఏర్పాటు చేశారు. అవి:

1. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు (PACCS)
2. జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు (DCCBs)
3. రాష్ట్ర సహకార బ్యాంకులు (SCBs)

ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు

ఇవి గ్రామస్థాయిలో ఉంటాయి. ఒకే గ్రామానికి చెందిన 10 మంది లేదా అంతకంటే ఎక్కువ మంది రైతులు కలిసి ఒక సంఘంగా మారి, ఏర్పాటు చేసుకుంటారు.

లీడ్ బ్యాంక్ పథకం, భూమి అభివృద్ధి బ్యాంకులు, సేవా ప్రాంత దృక్పథం, రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి సంస్థలు, భారత జీవిత బీమా సంస్థ మొదలైన అంశాలతో సహా పూర్తి సమాచారం ఈనాడు ఈప్రతిభ వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో ఈ-బుక్ రూపంలో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

Common Management Admission Test (CMAT)-2026

The Common Management Admission Test (CMAT) is a national-level entrance Examination for admission to management programmes in the country. This Test facilitates AICTE-affiliated/ Participating Institutions to select suitable graduate candidates for admission to the Management Courses in affiliated Institutions for the Academic Session 2026-2027. The application fee is Rs.2500. Eligible candidates can apply online before 17 November 2025.

Senior Resident Posts

Employees' State Insurance Corporation (ESIC) Chandigarh is conducting interviews for the Senior Resident (Broad Speciality Department) posts in various departments on a contractual basis. The total no. of posts is 94. The application fee is Rs. 500. Eligible candidates can appear for the interview on 2025 November 7.

Did You Apply..?

Today (November 4) is the last date for the following Jobs/ Apprentice posts

☛ 20 Senior Resident Jobs in ESIC Noida. ***Eligibility:*** DNB, MBBS.

☛ 48 Professor Jobs in ESIC Faridabad. ***Eligibility:*** MBBS, MD, MS.

☛ 30 Project Associate posts in CSIR-CMERI. ***Eligibility:*** Diploma/ BE/ B.Tech/ M.Sc.

☛ 105 Apprentice posts in DRDO-LRDE. ***Qualifications:*** ITI, Diploma, Graduate.

For more information and other notifications - scan QR code

Bank Exams

Quantitative Aptitude

Cylinder

1. Height of a cylinder is 28 cm and its base of radius is 6 cm. Find out the total surface area of the cylinder.

A) $1282\frac{1}{7}$ cm² B) $1282\frac{2}{7}$ cm²

C) $1282\frac{5}{7}$ cm² D) $1282\frac{6}{7}$ cm²

E) None of the above

2. The radius and height of a cylinder are increased by $8\frac{1}{3}$% and $12\frac{1}{2}$% respectively. Find out the percentage increase in its surface area.

A) $21\frac{1}{8}$% B) $21\frac{5}{8}$%

C) $21\frac{3}{8}$% D) $21\frac{7}{8}$%

E) None of the above

3. If radius of a cylinder is 15 cm and its height is 20 cm, then find the volume of the cylinder.

A) $14142\frac{6}{7}$ cm³

B) $14142\frac{1}{7}$ cm³ C) $14142\frac{5}{7}$ cm³

D) $14142\frac{3}{7}$ cm³

E) None of the above

4. How many bullets can be made out of a loaded cylinder of height 36 cm and 7 cm diameter, each bullet being 3 cm in diameter?

A) 89 B) 95 C) 98 D) 92 E) 81

5. Find out the approximate weight of a hollow cylindrical lead pipe 42 cm long and $\frac{1}{2}$ cm thick. Its diameter is 7 cm (weight of 1 cm³ of lead is 11.4 g)

A) 4.891 kg B) 4.819 kg C) 4.918 kg

D) 4.981 kg E) 4.991 kg

6. A cylinder has a diameter of $\frac{35}{3}$ cm and the area of its curved surface is 264 sqcm. The volume of the cylinder is:

A) $\frac{770}{3}$ cm³ B) 700 cm³

C) 770 cm³ D) $\frac{1035}{2}$ cm³

E) None of the above

7. A cylindrical tank $\frac{21}{2}$ m in diameter contains water to a depth of 5 m. What is the total area of wetted surface?

A) $251\frac{1}{8}$ cm² B) $251\frac{5}{8}$ cm²

C) $251\frac{3}{8}$ cm² D) $251\frac{7}{8}$ cm²

E) None of the above

8. A sphere and a cylinder have equal volume and equal radius. The ratio of the curved surface area of the sphere to that of the cylinder is:

A) 2 : 3 B) 3 : 4 C) 4 : 3

D) 3 : 2 E) 1 : 7

9. The diameters of two cylinders, whose volumes are equal are in the ratio 4 : 3, their heights will be in the ratio:

A) 9 : 16 B) 9 : 14 C) 15 : 9

D) 16 : 9 E) 5 : 7

10. A large solid metallic cylinder whose radius and heights are equal to each other is to be melted and 162 identical solid balls are to be recast from the liquid metal so formed. What is the ratio of radius of the cylinder to that of the radius of the ball?

A) 7 : 1 B) 6 : 5 C) 6 : 1

D) 1 : 6 E) 1 : 7

11. A cylindrical pillar is 70 cm in diameter and 9 m in height. Find the cost of painting the curved surface of the pillar at the rate of Rs.20 per m².

A) Rs.369 B) Rs.396 C) Rs.424

D) Rs.496 E) Rs.512

12. The radii of two cylinders are in the ratio 3 : 5 and their curved surface of areas are in the ratio 13 : 7. What is the ratio of their volumes?

A) 25 : 61 B) 35 : 39 C) 61 : 25

D) 39 : 35 E) None of the above

13. The height of two cylinders whose volume are equal in the ratio 2 : 5. Their radii will be in the ratio:

A) $5 : \sqrt{10}$ B) $\sqrt{2} : 5$ C) $\sqrt{5} : 2$

D) 5 : 2 E) 8 : 19

14. The respective ratio between numerical values of the radius and heights of the cylinder is 4 : 9 and the respective ratio between the curved surface area and the volume of the cylinder is 3 : 4. What is the total surface area of the cylinder?

A) $\frac{416}{7\pi}$ cm² B) $\frac{416\pi}{7}$ cm²

C) $\frac{416\pi}{9}$ cm² D) $\frac{416}{9\pi}$ cm²

E) None of the above

Scan the QR code for Key

These model questions were prepared by
Dr.Vangala Srinivas
Subject Expert

త్వరలో ఎస్‌బీఐ, ఐబీపీఎస్ పీఓ ఇంటర్వ్యూలు జరగబోతున్నాయి. వీటికి సరిగ్గా సన్నద్ధమైతే చివరి దశను విజయవంతంగా పూర్తిచేసుకుని ప్రభుత్వరంగ బ్యాంకులో ప్రొబేషనరీ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తించవచ్చు. కీలకమైన తుది ఘట్టానికి ఎలా సిద్ధమవ్వాలో తెలుసుకుందాం.

ముఖాముఖిలో.. మెరుగుద్దామిలా!



ఇంటర్వ్యూ అంటే అభ్యర్థి జ్ఞానాన్ని పరీక్షించడం కాదు. అదేవిధంగా ప్రశ్న-జవాబుల సెషన్ కూడా కాదు. అడిగిన ప్రశ్నల్లో ఎక్కువ వాటికి సరైన సమాధానాలు చెబితే ఇంటర్వ్యూ బాగా చేసినట్లూ కాదు. ఇది అభ్యర్థి వ్యక్తిత్వ పరీక్ష. మీరు ఎలాంటి వారో తెలుసుకునే ప్రయత్నం. జవాబులు చెప్పే తీరును బట్టి ఇది ప్రస్ఫుటమవుతుంది. అందువల్ల సరైన జవాబుతోపాటు జవాబులు చెప్పే పద్ధతి కూడా చాలా ముఖ్యమైంది. నిజాయతీగా ఉండటం మరీ ముఖ్యం.

మూడు రకాల ప్రశ్నలు

ఇంటర్వ్యూలో సాధారణంగా మూడు రకాల ప్రశ్నలు అడుగుతారు. వీటికి సరైన విధంగా సన్నద్ధమైతే సరిపోతుంది.

1 **వ్యక్తిగత ప్రశ్నలు:** అభ్యర్థి చదువు, పనిచేసిన అనుభవం, వివరాలు, బలాలు, బలహీనతలు, ఇష్టాలు, కుటుంబ వివరాలు, ప్రాంత(స్థానిక) వివరాలు (అంటే దేనికి ప్రసిద్ధి చెందింది, అక్కడి పంటలు, పరిశ్రమలు, నదులు మొదలైనవి). ప్రాంతం అంటే.. గ్రామం/ జిల్లా/ రాష్ట్రం.. మొదలైనవి. వీటన్నింటిపై పూర్తి అవగాహన ఉండాలి.

2 **అకడమిక్/ ఉద్యోగానుభవం:** అభ్యర్థులు చదివిన (డిగ్రీ/పీజీ) సబ్జెక్టుల పట్ల పూర్తి అవగాహన ఉండాలి. వాటికి సంబంధించి ఏ ప్రశ్నకైనా జవాబు చెప్పగలిగేలా సిద్ధమవ్వాలి. అదేవిధంగా వాటిపై ప్రస్తుత పరిణామాలు, అభివృద్ధిపై కూడా అవగాహన ఉండాలి. అభ్యర్థి చదువు పూర్తయ్యాక ఉద్యోగం చేస్తున్నట్లయితే దానికి సంబంధించిన ప్రశ్నలూ అడుగుతారు.

3 **నాలెడ్జ్ సంబంధితం:** ఇందులో తాజా పరిణామాలపై ప్రశ్నలు ఉంటాయి. అలాగే బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగాలపై అభ్యర్థి అవగాహనను పరిశీలిస్తారు. రాత పరీక్షలో ఇంతకుముందే సన్నద్ధమైన వాటి గురించి అభ్యర్థులు బాగా అవగాహనతో ఉండాలి. అభిప్రాయాలు స్పష్టంగా, పరిణతితో చెప్పాలి.

చేయాల్సినవి

- బోర్డు సభ్యుల అనుమతి తీసుకుని లోపలికి ప్రవేశించడం.
- సభ్యులందరినీ సమయానుకూలంగా విష్ చేయడం (గుడ్‌మార్నింగ్/ గుడ్ ఈవినింగ్ మొదలైనవి)
- సభ్యులు అనుమతించాకే కూర్చోవడం, కృతజ్ఞతలు తెలపడం.
- జవాబు చెబుతున్నప్పుడు నేరుగా సభ్యుల కళ్లలోకి చూస్తూ మాట్లాడటం (ఐ కాంటాక్ట్).
- నిజాయతీగా ఉండటం
- ఆత్మవిశ్వాసంతో జవాబులు చెప్పడం.
- తెలియని వాటికి జవాబు తెలియదని ఒప్పుకోవడం. ✦ మర్యాద పూర్వకంగా వ్యవహరించడం.
- ఇంటర్వ్యూ అయ్యాక వెళ్లేటప్పుడు సభ్యులకు కృతజ్ఞతలు తెలపడం.

చేయకూడనివి

- అనుమతి లేకుండా ప్రవేశించడం, కూర్చోవడం
- ప్రతిదానికీ సాకులు/కారణాలు చెప్పడం.
- సభ్యుల పట్ల తేలిక భావం ప్రదర్శించడం.
- తప్పు సమాధానాలను సమర్థించుకోవడం
- సభ్యులతో వాదన పెట్టుకోవడం
- వేళ్ళు విరచడం, పెన్నుతో ఆడటం, దిక్కులు చూడటం.. లాంటివి.
- విపరీత హావభావాలు ప్రదర్శించడం

తరచుగా అడిగే ప్రశ్నలు

- మీ గురించి వివరించండి
- బ్యాంక్ ఉద్యోగమే ఎందుకు?
- వచ్చే పదేళ్లలో మిమ్మల్ని మీరు ఏ విధంగా చూడాలనుకుంటున్నారు?
- మీకు దీర్ఘకాలిక/ స్వల్పకాలిక లక్ష్యాలు ఉన్నాయా? ఉంటే వాటిని ఎలా చేరుకోవాలనుకుంటున్నారు?
- మీ బలాలు/ బలహీనతలేంటి? బలహీనతలు ఎలా అధిగమించాలనుకుంటున్నారు?
- మిమ్మల్ని ఎందుకు నియమించుకోవాలి?
- మీ చదువుకు పూర్తి భిన్నంగా ఉన్న ఈ ఉద్యోగాన్ని ఎందుకు ఎంచుకున్నారు?
- మీరు ఈ బ్యాంకుకు ఏ విధంగా ఉపయోగపడగలరని అనుకుంటున్నారు?
- మీరు సాధించిన అచీవ్‌మెంట్స్ గురించి చెప్పండి. ● మీరు ఏ ప్రాంతంలోనైనా పనిచేయడానికి సిద్ధంగా ఉన్నారా?
- మీ అభిరుచుల (హాబీలు) గురించి చెప్పండి.



- డా. జి.ఎస్.గిరిధర్, రేస్ ఇన్‌స్టిట్యూట్

ఇంటర్న్‌షిప్స్

వర్క్ ఫ్రమ్ హోమ్

సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్ (ఎస్ఈఓ)

సంస్థ: 91 నిన్‌జాస్ ప్రై.లి.
నైపుణ్యాలు: కంటెంట్ రైటింగ్, గూగుల్ డాక్స్, గూగుల్ షీట్స్, సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్, వర్డ్ ప్రెస్
స్టైపెండ్: రూ.5,000
దరఖాస్తు గడువు: నవంబరు 21
https://shorturl.at/HIbrK

గ్రాఫిక్ డిజైన్

సంస్థ: టెక్‌ప్రణి (సూపర్‌హబ్)
నైపుణ్యాలు: అడోబ్ ఇలస్ట్రేటర్, ఇన్‌డిజైన్, ఫొటోషాప్, ప్రీమియర్ ప్రో, కోరల్‌డ్రా, యూఐ అండ్ యూఎక్స్ డిజైన్, వీడియో ఎడిటింగ్
స్టైపెండ్: రూ.10,000-15,000
దరఖాస్తు గడువు: నవంబరు 21
https://shorturl.at/rZHAe

ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్

సంస్థ: బేర్‌హగ్స్
నైపుణ్యాలు: అకౌంటింగ్, అడ్వాన్స్‌డ్ ఎక్సెల్, క్యాష్ ఫ్లో మేనేజ్‌మెంట్, ఎంఎస్-ఎక్సెల్, ఎంఎస్-ఆఫీస్, ట్యాలీ
స్టైపెండ్: రూ.10,000-12,000
దరఖాస్తు గడువు: నవంబరు 28
https://shorturl.at/SzK1y

మొబైల్ యాప్ డెవలప్‌మెంట్

సంస్థ: కామ్‌కేర్ ఎంటర్‌ప్రైజెస్
నైపుణ్యాలు: ఆండ్రాయిడ్, ఫైర్‌బేస్, ఐఓఎస్, మొబైల్ అప్లికేషన్ డెవలప్‌మెంట్, రియాక్ట్, రియాక్ట్ నేటివ్, రెస్ట్ ఏపీఐ
స్టైపెండ్: రూ.3,000-5,000
దరఖాస్తు గడువు: నవంబరు 13
https://shorturl.at/epPig

క్రియేటివ్ రైటింగ్

సంస్థ: శాస్ గ్రూప్ **నైపుణ్యాలు:** క్రియేటివ్ డైరెక్షన్, క్రియేటివ్ థింకింగ్, క్రియేటివ్ రైటింగ్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఇంగ్లిష్ రాయడం, స్క్రిప్ట్ రైటింగ్, స్టోరీబోర్డింగ్, స్టోరీటెల్లింగ్, రిటెన్ కమ్యూనికేషన్
స్టైపెండ్: రూ.14,000-18,000
దరఖాస్తు గడువు: నవంబరు 21
https://shorturl.at/VOpkR

బ్లాగింగ్

సంస్థ: ఎస్‌ప్రెసో మీడియా
నైపుణ్యాలు: బ్లాగింగ్, క్రియేటివ్ రైటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, జనరేటివ్ ఏఐ టూల్స్, సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్
స్టైపెండ్: రూ.2,000-5,000
దరఖాస్తు గడువు: నవంబరు 28
https://shorturl.at/P6ojn

ఆటోమేషన్ ఎక్స్‌పర్ట్

సంస్థ: ఆంత్రప్రెన్యూర్ గ్రోత్ ల్యాబ్ (ఓపీసీ) ప్రై.లి. **నైపుణ్యాలు:** ఏపీఐఎస్, ఆటోమేషన్, ఫైర్‌బేస్, గూగుల్ వర్క్‌స్పేస్, జావాస్క్రిప్ట్, నోడ్-కోడ్ డెవలప్‌మెంట్, ప్రాబ్లమ్ సాల్వింగ్, రిపోర్ట్ రైటింగ్, రెస్ట్ ఏపీఐ
స్టైపెండ్: రూ.12,000-18,000
దరఖాస్తు గడువు: నవంబరు 13
https://shorturl.at/OHAZm

బిజినెస్ డెవలప్‌మెంట్ (సేల్స్)

సంస్థ: లేజీ ట్రంక్
నైపుణ్యాలు: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, ఇంటర్‌పర్సనల్ స్కిల్స్, సేల్స్
స్టైపెండ్: రూ.3,000-5,000
దరఖాస్తు గడువు: నవంబరు 27
https://shorturl.at/d3bxa

డాగ్ ట్రెయినర్ కావాలంటే..



బీఎస్సీ చదివాను. జంతువులంటే చాలా ఇష్టం. నగరంలో డాగ్ ట్రెయినర్‌గా పని చేయాలనుంది. దీని కోసం కోర్సులు ఎక్కడ ఉంటాయి? - రిషి



■ డాగ్ ట్రెయినర్‌గా పనిచేయాలనుంటే.. కుక్కలపై విపరీతమైన ప్రేమ, ఓపిక, సహానుభూతి ఉండాలి. వాటి విభిన్న అవసరాల గురించి తెలుసుకోవాలి. వాటి మనస్తత్వంపై పూర్తి అవగాహన పెంచుకోవాలి. డాగ్ ట్రెయినింగ్ గురించి వివిధ ఆన్‌లైన్ కోర్సులు.. కోర్స్ ఎరా, యుడెమి లాంటి ప్లాట్‌ఫామ్స్‌లో అందుబాటులో ఉన్నాయి. డాగ్ ట్రెయినింగ్‌లో స్వల్పకాలిక సర్టిఫికెట్ కోర్సులు కూడా కొన్ని సంస్థలు అందిస్తున్నాయి. సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ ఆధ్వర్యంలో డాగ్ బ్రీడింగ్ అండ్ ట్రెయినింగ్ స్కూల్ బెంగళూరులో ఉంది. హైదరాబాద్‌లో పలు ప్రైవేటు సంస్థలు డాగ్ ట్రెయినింగ్‌లో శిక్షణ అందిస్తున్నాయి. కాకపోతే, ఇక్కడ ఫీజులు కొంచెం ఎక్కువగా ఉండొచ్చు.

ఫీజు, కోర్సు వ్యవధి ప్రాక్టికల్స్ గురించి పూర్తి వివరాలు సేకరించండి.

ట్రెయినింగ్ కోర్సులో చేరేముందు ఆ సంస్థ లైసెన్స్, అక్రెడిటేషన్, పూర్వ విద్యార్థుల ఫీడ్‌బ్యాక్ ఇవన్నీ తెలుసుకోండి. ట్రెయినింగ్‌లో బోధించే సిలబస్ వివరాలు ముందే ఆరా తీయండి.

శిక్షణ పూర్తయిన తర్వాత ప్రొఫెషనల్ ట్రెయినర్‌గా పనిచేయడానికి అవకాశాలు ఎంతవరకు ఉన్నాయి? అనే విషయాన్ని ఆ సంస్థ నుంచీ, గతంలో శిక్షణ పొందినవారి నుంచీ తెలుసుకునే ప్రయత్నం చేయండి.

–ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

నేషనల్ హాస్పిటాలిటీ టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్

నేషనల్ కౌన్సిల్ ఫర్ హోటల్ మేనేజ్‌మెంట్ అండ్ క్యాటరింగ్ టెక్నాలజీ (ఎన్‌సీహెచ్‌ఎంసీటీ).. నేషనల్ హాస్పిటాలిటీ టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్ (ఎన్‌హెచ్‌టెట్) కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఈ పరీక్ష ద్వారా ఆతిథ్య రంగంలో.. అసిస్టెంట్ లెక్చరర్, టీచింగ్ అసోసియేట్ ఉద్యోగాలకు పోటీ పడగలరు. ఇందులో అర్హత పొందినవారు.. ఎన్‌సీహెచ్‌ఎంసీటీ, అనుబంధ ఐహెచ్‌ఎంలలో, ఇతర హోటల్ మేనేజ్‌మెంట్ సంస్థల్లో లెక్చరర్ లేదా టీచింగ్ అసోసియేట్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు.

● నేషనల్ హాస్పిటాలిటీ టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్ (ఎన్‌టెట్)
విభాగాలు: ● హాస్పిటాలిటీ అడ్మినిస్ట్రేషన్ / హోటల్ మేనేజ్‌మెంట్ ● కలినరీ ఆర్ట్స్ / ఫుడ్ అండ్ బెవరేజ్ స్పెషలైజేషన్
అర్హత: కనీసం 55 శాతం మార్కులతో హాస్పిటాలిటీ అడ్మినిస్ట్రేషన్/ హోటల్ మేనేజ్‌మెంట్/ కలినరీ ఆర్ట్స్‌లో బ్యాచిలర్ డిగ్రీ లేదా మాస్టర్స్ డిగ్రీ. చివరి ఏడాది కోర్సుల విద్యార్థులూ దరఖాస్తు చేసుకోవచ్చు. **వయసు:** అసిస్టెంట్ లెక్చరర్‌కు 35 ఏళ్లు; టీచింగ్ అసోసియేట్‌కు 30 ఏళ్లు మించకూడదు.
ఎంపిక: ఎన్‌హెచ్‌టెట్‌లో ఉత్తీర్ణత, ప్రాక్టికల్ స్కిల్ టెస్ట్, టీచింగ్ స్కిల్ టెస్ట్‌లతో **పరీక్ష:** 400 మార్కులకు ఉంటుంది. తప్పు జవాబులకు మార్కులు తగ్గిస్తారు.
పరీక్ష ఫీజు: జనరల్/ ఓబీసీ/ ఈడబ్ల్యూఎస్‌లకు రూ.1000. మహిళలు/ ఎస్సీ/ ఎస్టీ/ పీడబ్ల్యూబీడీ/ ట్రాన్స్‌జెండర్లకు రూ.500.
ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: 30.11.2025. ఆన్‌లైన్ దరఖాస్తు ప్రింట్ అవుట్.. డైరెక్టర్, ఎన్‌సీహెచ్‌ఎంసీటీ, ఏ-34, సెక్టార్-62, నోయిడా చిరునామాకు పంపించాలి.
పరీక్ష తేదీ: 14.12.2025.
వెబ్‌సైట్: https://nchm.gov.in/

టీహెచ్‌డీసీఎల్‌లో అసిస్టెంట్ మేనేజర్లు


ప్రభుత్వ రంగ సంస్థకు చెందిన తెహ్రీ హైడ్రో డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఇండియా లిమిటెడ్ (టీహెచ్‌డీసీఎల్).. ఒప్పంద ప్రాతిపదికన 40 అసిస్టెంట్ మేనేజర్, సీనియర్ మెడికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- అసిస్టెంట్ మేనేజర్ (సివిల్): 15
- అసిస్టెంట్ మేనేజర్ (ఎలక్ట్రికల్): 10
- అసిస్టెంట్ మేనేజర్ (మెకానికల్): 10
- సీనియర్ మెడికల్ ఆఫీసర్: 05

అర్హత: అసిస్టెంట్ మేనేజర్ పోస్టులకు సంబంధిత విభాగాల్లో బీఈ/ బీటెక్. మెడికల్ ఆఫీసర్ ఉద్యోగాలకు ఎంబీబీఎస్. **వయసు:** 01.07.2025 నాటికి అసిస్టెంట్ మేనేజర్‌కు 35 ఏళ్లు; సీనియర్ మెడికల్ ఆఫీసర్‌కు 37 ఏళ్లు మించకూడదు.
ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ఫీజు: జనరల్/ ఓబీసీ/ ఈడబ్ల్యూఎస్‌లకు రూ.600, ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులు/ఎక్స్ సర్వీస్‌మెన్‌కు ఫీజు లేదు.
ఎంపిక: అకడమిక్ మెరిట్‌తో దరఖాస్తుల షార్ట్‌లిస్ట్, ఇంటర్వ్యూతో **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభం:** 07-11-2025. **దరఖాస్తు చివరి తేదీ:** 06-12-2025.
వెబ్‌సైట్: https://thdc.co.in/en

రక్షణ రంగంలో సేవలందించాలనే లక్ష్యం ఉన్న విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ఉత్తమ వేదికగా నిలుస్తున్నాయి.. సైనిక్ స్కూళ్లు. వీటిలో ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుకోవచ్చు. విద్యతోపాటు రక్షణ రంగంలో మేటి ఉద్యోగాలకు ప్రత్యేక శిక్షణ అందిస్తారు. దేహదార్ఢ్యం, వ్యక్తిగత క్రమశిక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తారు. వచ్చే విద్యాసంవత్సరంలో ఆరు, తొమ్మిదో తరగతుల్లో ప్రవేశానికి నిర్వహించనున్న ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (ఏఐఎస్ఎస్ఈఈ)-2026 ప్రకటన వెలువడింది.

ఈ స్కూళ్లు భావి సైనికుల కోసం..



సైనిక స్కూళ్ల ప్రవేశ పరీక్షను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) నిర్వహిస్తుంది. దేశవ్యాప్తంగా 33 సైనిక్ స్కూళ్లు ఉన్నాయి. అలాగే ఆరో తరగతిలో ప్రవేశానికి 69, తొమ్మిదిలోకి 19 కొత్త పాఠశాలల్లోకి అవకాశం కల్పిస్తున్నారు. పరీక్షలో ప్రతిభతో వీటిలో చేర్చుకుంటారు. సైనిక్ స్కూల్ విద్యార్థులు యూపీఎస్సీ నిర్వహించే ఎన్‌డీఏ, సీడీఎస్ఈ, సీఏపీఎఫ్, ఇతర డిఫెన్స్ పరీక్షల్లో రాణించగలరు. ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్‌లు నిర్వహించే పరీక్షల్లోనూ వీరికి విజయావకాశాలు ఎక్కువే.

లాభాలివీ...

దేశంలో ప్రభుత్వ పరంగా జరుగుతోన్న నియామకాల్లో ఎక్కువ కొలువులు రక్షణ రంగంలోనివే. ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్సులతోపాటు సీఏపీఎఫ్‌కు చెందిన బీఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్, సీఐఎస్ఎఫ్, ఎస్ఎస్‌బీ, ఐటీబీపీ.. తదితర విభాగాల్లో క్రమం తప్పకుండా ప్రకటనలు వెలువడుతున్నాయి. వీటిలో ఎక్కువ నియామకాలు ఇంటర్మీడియట్ విద్యార్హతతో ఉంటాయి. యూపీఎస్సీ నిర్వహించే ఎన్‌డీఏ అండ్ ఎన్ఏ దేశంలో నిర్వహిస్తోన్న అత్యంత ముఖ్యమైన పరీక్షల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. అలాగే ఆర్మీలో గ్రూప్ ఎక్స్, వై. నేవీలో సెయిలర్-ఎంఆర్, ఎస్ఎస్ఆర్, ఏఏ. ఎయిర్ ఫోర్స్‌లో ఎయిర్ మెన్ టెక్నికల్, నాన్ టెక్నికల్ ఉద్యోగాల్లో ఎక్కువ పోస్టులు ఇంటర్ విద్యార్హతతో భర్తీ చేస్తున్నారు. ఈ ప్రకటనలు దాదాపు ప్రతి ఆరు నెలలకు ఒకసారి వెలువడుతున్నాయి. వీటిని లక్ష్యంగా చేసుకున్నవారికి హైస్కూల్ నుంచే సరైన శిక్షణ ఉంటే విజయం సాధించడం సులువవుతుంది. అందువల్ల ఈ పరీక్షల్లో సైనిక పాఠశాల నేపథ్యం ఉన్న విద్యార్థులు మేటి ప్రతిభ ప్రదర్శించగలరు. రక్షణ రంగంలో ఉన్నత స్థాయిలో పనిచేసినవారి ఆధ్వర్యంలో ఈ స్కూళ్ల పర్యవేక్షణ కొనసాగుతుంది. చదువుతోపాటు క్రీడలు, క్రమశిక్షణ, శారీరక ధ్రుఢత్వానికి ప్రాధాన్యముంది. ఈ పాఠశాలల్లో సీబీఎస్ఈ బోధన అందిస్తారు. బాలికలూ దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎంపిక: ఆఫ్‌లైన్ పరీక్షలో ప్రతిభ, మెడికల్ టెస్టులతో

పరీక్ష:

ఆరో తరగతిలో ప్రవేశానికి: 300 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. ఇందులో 125 ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష వ్యవధి రెండున్నర గంటలు. మ్యాథ్స్ నుంచి 50 ప్రశ్నలు వస్తాయి. ఒక్కో ప్రశ్నకు 3 మార్కులు. జీకే (సైన్స్, సోషల్) 25, లాంగ్వేజ్ (ఇంగ్లిష్/ తెలుగు/ హిందీ..నచ్చిన భాష ఎంచుకోవచ్చు) 25, ఇంటెలిజెన్స్ 25 ప్రశ్నలు ఉంటాయి. ఒక్కో ప్రశ్నకు 2 మార్కులు. సీబీఎస్ఈ ఐదో తరగతి సిలబస్ నుంచే ప్రశ్నలన్నీ అడుగుతారు. తెలుగు మాధ్యమంలోనూ పరీక్ష రాసుకోవచ్చు.

తొమ్మిదో తరగతిలో ప్రవేశానికి: ఈ పరీక్ష 400 మార్కులకు ఉంటుంది. ఇందులో 150 ప్రశ్నలు వస్తాయి. పరీక్ష వ్యవధి 3 గంటలు. మ్యాథ్స్‌లో 50 ప్రశ్నలు వస్తాయి. ప్రతి ప్రశ్నకు 4 మార్కులు. ఇంగ్లిష్, ఇంటెలిజెన్స్, జనరల్ సైన్స్, సోషల్ సైన్స్ ఒక్కో విభాగం నుంచీ 25 చొప్పున ప్రశ్నలు ఉంటాయి. ప్రతి ప్రశ్నకూ 2 మార్కులు. సీబీఎస్ఈ ఎనిమిదో తరగతి సిలబస్ నుంచే ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నపత్రం ఆంగ్ల మాధ్యమంలోనే ఉంటుంది.

6,9 రెండు పరీక్షలకూ రుణాత్మక మార్కులు లేవు. కాబట్టి తెలియని ప్రశ్నలకూ బాగా ఆలోచించి సమాధానం గుర్తించవచ్చు.

సన్నద్ధత

రెండు (6, 9) తరగతుల ప్రవేశాలకూ సిలబస్ వివరాలు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. సబ్జెక్టులవారీ ఆ పాఠ్యాంశాలను బాగా చదువుకుంటే సరిపోతుంది. ఏదో ఒక పబ్లికేషన్ పుస్తకాన్ని తీసుకుని, మాదిరి ప్రశ్నలు సాధన చేయాలి. అలాగే పాత ప్రశ్నపత్రాలను అధ్యయనం చేయాలి. ప్రశ్నలు ఆబ్జెక్టివ్ తరహాలో ఉంటాయి. వాటికి సమాధానాలను ఓఎంఆర్ పత్రంపై గుర్తించాలి. పరీక్షలో అర్హత సాధించడానికి సబ్జెక్టులవారీ కనీసం 25 శాతం మార్కులు తప్పనిసరి. అలాగే మొత్తం మీద 40 శాతం మార్కులు అవసరం. ఇలా అర్హత మార్కులు పొందినవారి జాబితా నుంచి మెరిట్, రిజర్వేషన్ల ప్రకారం ఒక్కో సీటుకు ముగ్గురుని చొప్పున వైద్య పరీక్షలకు ఎంపిక చేస్తారు. అందులో విజయవంతమైనవారిని ఆరు, తొమ్మిదో తరగతుల్లో చేర్చుకుంటారు. ఎస్సీ, ఎస్టీలకు కనీస మార్కుల నిబంధన లేదు.

వివరాలు:

అర్హత: ఆరో తరగతిలో ప్రవేశానికి ప్రస్తుతం ఏదైనా పాఠశాలలో ఐదో తరగతి చదువుతుండాలి. అలాగే మార్చి 31, 2026 నాటికి వయసు 10 నుంచి 12 ఏళ్లలోపు ఉండాలి. అంటే ఏప్రిల్ 1, 2014 - మార్చి 31, 2016 మధ్య జన్మించినవారు అర్హులు. తొమ్మిదిలో చేరాలనుకున్నవారు ప్రస్తుతం ఎనిమిదో తరగతి చదువుతుండాలి. వయసు మార్చి 31, 2026 నాటికి 13 నుంచి 15 ఏళ్లలోపు ఉండాలి. అంటే ఏప్రిల్ 1, 2011 - మార్చి 31, 2013 మధ్య జన్మించినవారు అర్హులు.

దరఖాస్తులు: నవంబరు 9 వరకు స్వీకరిస్తారు.

పరీక్ష ఫీజు: ఎస్సీ, ఎస్టీలకు రూ.700. మిగిలిన అందరికీ రూ.850. **పరీక్ష తేదీ:** జనవరి 18


వెబ్‌సైట్: https://exams.nta.nic.in/

ఫీజు.. సీట్లు..

మొత్తం సీట్లలో 67 శాతం ఆ సైనిక్ స్కూల్ ఉన్న రాష్ట్రం, కేంద్రపాలిత ప్రాంతానికి చెందిన విద్యార్థులకు కేటాయిస్తారు. మిగిలిన సీట్లు ఇతర రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలవారికి దక్కుతాయి. కోరుకొండ సైనిక్ స్కూల్‌లో ఆరో తరగతిలో 90 సీట్లు ఉన్నాయి. వీటిలో 10 బాలికలకు కేటాయించారు. అలాగే తొమ్మిదిలో 23 సీట్లు ఉన్నాయి. కలికిరి సైనిక్ స్కూల్‌లో ఆరో తరగతిలో 105 సీట్లు ఉన్నాయి. వీటిలో 10 బాలికలకు కేటాయించారు. తొమ్మిదిలో 10 సీట్లు ఉన్నాయి. సైనిక స్కూళ్లలో చేరిన విద్యార్థులు ఫీజులు చెల్లించాలి. బోధన, వసతి, భోజనం అన్నీ కలిపి ఏడాదికి సుమారు రూ.1.20 లక్షలు అవసరమవుతాయి. అయితే మెరిట్ విద్యార్థులు, అల్పాదాయ వర్గాలకు ఆయా రాష్ట్రాలు స్కాలర్‌షిప్పు అందించడం లేదా ఫీజు నుంచి మినహాయించడం చేస్తున్నాయి.

ఏపీలో అదానీ వరల్డ్ స్కూల్, నెల్లూరులో ఆరో తరగతిలోకి 80, తొమ్మిదిలో 30 సీట్లు ఉన్నాయి. ఇక్కడ డే స్కాలర్‌గా చదువుకోవచ్చు. కొత్తగా ప్రారంభమైన.. నేతాజీ సైనిక్ స్కూల్ విజయవాడ (కేతనకొండ)లో 120, వెరిటాస్ సైనిక్ స్కూల్ తిరుపతి(సి.రామపురం)లో 150 సీట్లు ఆరో తరగతిలో ఉన్నాయి. ఈ రెండూ రెసిడెన్షియల్ స్కూళ్లు.

భారత హోమ్ వ్యవహారాల మంత్రిత్వశాఖకు చెందిన ఇంటెలిజెన్స్ బ్యూరో.. 258 అసిస్టెంట్ సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్ గ్రేడ్-2/టెక్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. బీటెక్/ఎమ్మెస్సీ విద్యార్హతలతో ఈ ఉద్యోగాలకు పోటీ పడొచ్చు. గేట్ స్కోరు, స్కిల్ టెస్టు, ఇంటర్వ్యూలతో నియామకాలుంటాయి. ఎంపికైనవారు ఆకర్షణీయ వేతనం అందుకోవచ్చు.



ఇంటెలిజెన్స్ బ్యూరో.. ఆహ్వానిస్తోంది!

మొత్తం ఉద్యోగాల్లో అన్‌రిజర్వుడ్‌కు 114, ఈడబ్ల్యూఎస్‌కు 21, ఓబీసీకి 68, ఎస్సీకి 37, ఎస్టీకి 18 కేటాయించారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ 90, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ 168 ఖాళీలు ఉన్నాయి.

ఎంపిక: గేట్ స్కోరుతో అభ్యర్థులను 1:10 నిష్పత్తిలో షార్ట్‌లిస్ట్ చేసి, స్కిల్ టెస్టు నిర్వహిస్తారు. ఇందులో ఎంపికైన వారికి ఇంటర్వ్యూలు ఉంటాయి. అభ్యర్థుల సబ్జెక్టు పరిజ్ఞానాన్నీ, కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పరీక్షిస్తారు.

- మొత్తం 1175 మార్కులకుగానూ.. గేట్ స్కోరుకు 750, స్కిల్ టెస్టుకు 250, ఇంటర్వ్యూకు 175 కేటాయించారు.
- స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ తేదీ వివరాలను అభ్యర్థుల ఈమెయిల్‌కు తెలియజేస్తారు.
- గేట్, స్కిల్ టెస్టు, ఇంటర్వ్యూల్లో సాధించిన మార్కులతో మెరిట్ లిస్టును రూపొందించి.. వైద్య పరీక్షల అనంతరం తుది ఎంపిక చేస్తారు. వెయిటింగ్ లిస్టు కూడా ఉంటుంది. ఎంపికైనవారితో పోస్టులు భర్తీకానప్పుడు ఈ లిస్టులోనివారికి అవకాశం కల్పిస్తారు.

గమనించాల్సినవి:
దివ్యాంగులు, ప్రస్తుతం చివరి ఏడాది కోర్సుల్లో ఉన్నవారు దరఖాస్తుకు అనర్హులు.

- దేశవ్యాప్తంగా ఎక్కడైనా పనిచేయడానికి సిద్ధంగా ఉన్నవారే దరఖాస్తు చేయాలి.
- ఒకటికంటే ఎక్కువ దరఖాస్తులు పంపితే అన్నింటినీ తిరస్కరిస్తారు.
- అడ్మిట్‌కార్డు, కాల్ లెటర్లను అభ్యర్థుల ఈమెయిల్ ఐడీకి పంపిస్తారు.
- స్కిల్ టెస్టు, ఇంటర్వ్యూలకు హాజరయ్యే ఎస్సీ/ఎస్టీలకు ప్రయాణ ఛార్జీలను చెల్లిస్తారు.

ముఖ్యాంశాలు

అర్హతలు: ఎలక్ట్రానిక్స్/ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్/ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్/ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ కంప్యూటర్ సైన్స్/ కంప్యూటర్ ఇంజినీరింగ్/ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ బ్రాంచ్‌తో బీఈ/బీటెక్. లేదా ఎమ్మెస్సీ - ఎలక్ట్రానిక్స్/ కంప్యూటర్ సైన్స్/ ఫిజిక్స్/ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ లేదా ఎంసీఏ. గేట్-2023/ 2024/2025 స్కోరు ఉండాలి.

వయసు: 16.11.2025 నాటికి 27 సంవత్సరాలు మించకూడదు. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్ల సడలింపు ఉంటుంది.

దరఖాస్తు ఫీజు: అన్‌రిజర్వుడ్, ఈడబ్ల్యూఎస్, ఓబీసీలకు రూ.200. ఎస్సీ/ఎస్టీ, మహిళలు, మాజీ సైనికోద్యోగులకు రూ.100.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 16.11.2025 **వెబ్‌సైట్:** http://www.mha.gov.in./

తొలగని అమెరికా ప్రభుత్వ ప్రతిష్టంభన



వాషింగ్టన్: అమెరికా కాంగ్రెస్ నిధులు విడుదల చేయకపోవడం వల్ల ఫెడరల్ ప్రభుత్వ సేవలు మూతబడి 33 రోజులైంది. దీన్ని ప్రభుత్వ మూత అంటున్నారు. పాలక రిపబ్లికన్లు, ప్రతిపక్ష డెమోక్రాట్ల మధ్య నిధుల విడుదలపై ఏకాభిప్రాయం కుదరక ఫెడరల్ ఉద్యోగులకు జీతభత్యాలు ఆగిపోయాయి. అంతేకాదు, 4.2 కోట్లమంది పేద అమెరికన్లకు ఫెడరల్ ప్రభుత్వం నుంచి ఆహార సహాయం బంద్ అయిపోయే సంకేతాలు కనిపిస్తున్నాయి. పూర్వ డెమోక్రాట్ అధ్యక్షుడు బరాక్ ఒబామా తెచ్చిన 'అందుబాటు ధరల్లో ఆరోగ్య సంరక్షణ చట్టం' (ఒబామా కేర్) అమలుకు సబ్సిడీలు ఈ సంవత్సరాంతానికి ముగిసిపోతాయి. వాటిని పునరుద్ధరించాలనే డిమాండ్‌తో డెమోక్రాట్లు ఫెడరల్ సర్వీసులకు నిధుల విడుదలను స్తంభింపజేశారు. ఈ ప్రతిష్టంభనను తొలగించడానికి డెమోక్రాట్లతో బేరమాడే ప్రసక్తిలేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదివారం ఓ టీవీ ఇంటర్వ్యూలో స్పష్టం చేశారు. చివరకు డెమోక్రాట్లే తమతో రాజీపడతారని వ్యాఖ్యానించారు. 100 సీట్ల సెనెట్‌లో నిధుల విడుదల చట్టం 60 ఓట్లతో ఆమోదం పొందాల్సి ఉంది. అక్కడ రిపబ్లికన్లకు 53 మంది సభ్యులు, డెమోక్రాట్లకు 45 మంది ఉన్నారు. ఇద్దరు ఇండిపెండెంట్లు నిధుల చట్టానికి అనుకూలంగా ఓటు వేసినా కనీసం ఐదుగురు డెమోక్రాటిక్ పార్టీ సభ్యులు కూడా ఇదే బాటన పయనిస్తేనే చట్టం అమలులోకి వచ్చి నిధులు విడుదల అవుతాయి. ఈ నిబంధనను తుంగలో తొక్కాలని ట్రంప్ సెనెట్‌లో రిపబ్లికన్ పార్టీ నాయకుడిని కోరారు. ఒబామా కేర్‌కు సబ్సిడీలు కొనసాగిస్తేనే నిధుల చట్టానికి సమ్మతిస్తామని డెమోక్రాట్లు అంటుంటే ట్రంప్ ససేమిరా అంటున్నారు.

సంక్లిష్ట పరిశోధనల కేంద్రంగా భారత్

- ప్రైవేటు పెట్టుబడులకు భారీ ప్రోత్సాహం
- రూ.లక్ష కోట్ల నిధి ప్రారంభం కార్యక్రమంలో మోదీ వెల్లడి



దిల్లీ: అత్యంత క్లిష్టమైన, అధిక ప్రభావం చూపే పరిశోధనలకు భారత ప్రభుత్వం మద్దతిస్తోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో మరింత అభివృద్ధి సాధించడానికి, దేశాన్ని సాంకేతిక శక్తి కేంద్రంగా తీర్చిదిద్దటానికి ప్రైవేట్ పెట్టుబడులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. దిల్లీలోని భారత్ మండపంలో సోమవారం రూ.లక్ష కోట్ల పరిశోధనాభివృద్ధి నిధిని ప్రారంభించిన అనంతరం మోదీ ప్రసంగించారు. దేశంలో ఆధునిక ఆవిష్కరణలను మరింత పెంచడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. గతంలో పోలిస్తే దేశంలో పరిశోధన, అభివృద్ధి (ఆర్ అండ్ డి) వ్యయాన్ని రెట్టింపు చేశామని వివరించారు. ఈ చర్యలు భవిష్యత్ ఆవిష్కరణలపై తమ నిబద్ధతను తెలియజేస్తున్నాయన్నారు. అంతర్జాతీయ స్థాయిలో భారత్ పురోగతి సాధిస్తోందని చెబుతూ ఈ రంగంలో విశేష సేవలు అందిస్తున్న శాస్త్రవేత్తలను కొనియాడారు. దేశంలో ఆవిష్కరణలు సమగ్రంగా మారినప్పుడు, సాంకేతికత పరివర్తన చెందినప్పుడు గొప్ప విజయాలకు పునాది పడుతుందని మోదీ అభిప్రాయపడ్డారు. ప్రైవేటు రంగాన్ని పరిశోధనల వైపు ప్రోత్సహించేందుకు ప్రస్తుతం రూ.లక్ష కోట్ల నిధిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



సియాటిల్‌లోని భారత కాన్సులేట్‌లో 'వాల్ ఆఫ్ యూనిటీ'

సర్దార్ పటేల్ గౌరవార్థం ఏర్పాటు

న్యూయార్క్; సియాటిల్: ఏక్తా దివస్ నేపథ్యంలో అమెరికాలోని సియాటిల్‌లో గల భారత దౌత్య కార్యాలయ నూతన ప్రాంగణంలో సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ గౌరవార్థం 'ఐక్యతా గోడ'(వాల్ ఆఫ్ యూనిటీ)ను ఏర్పాటు చేశారు. దానిపై 30 అడుగుల ఎత్తు, 14 అడుగుల వెడల్పుతో గుజరాత్‌లోని నర్మదా నది తీరంలో 'ఐక్యతా మూర్తి' పేరిట ఏర్పాటు చేసిన 182 మీటర్ల ఎత్తైన పటేల్ విగ్రహ చిత్రాన్ని పొందుపరిచారు. భారత్‌లో అక్టోబరు 31న పటేల్ జయంతిని జాతీయ ఐక్యతా దినం (ఏక్తా దివస్)గా నిర్వహిస్తారు.

శబరిమల యాత్రికులకు రూ.6.12 కోట్లతో ఆసుపత్రి

కేరళలోని నీలక్కల్‌లో నేడు శంకుస్థాపన

పథనంథిట్ట: భారీ సంఖ్యలో వచ్చే శబరిమల యాత్రికుల కోసం నీలక్కల్ వద్ద రూ.6.12 కోట్ల వ్యయంతో అత్యాధునిక స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మించనున్నట్లు కేరళ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి వీణా జార్జి సోమవారం వెల్లడించారు. స్థానికులకు ఉపయోగపడేలా కూడా ఆసుపత్రి ఉంటుందని తెలిపారు. ట్రావెన్కోర్ దేవస్థానం బోర్డు(టీడీబీ) భూమి కేటాయించిందని, మంగళవారం శంకుస్థాపన చేస్తామని పేర్కొన్నారు. 10,700 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న భవనంలో భక్తుల కోసం అత్యవసర విభాగం, ఈసీజీ, ఐసీయూ వంటి పలు సౌకర్యాలు కల్పించనున్నారు.

రైలు నుంచి యువతిని తోసేసిన వ్యక్తి

తీవ్రంగా గాయపడ్డ బాధితురాలు

తిరువనంతపురం: కదులుతున్న రైలు నుంచి ఓ యువతిని మద్యం మత్తులో ఉన్న వ్యక్తి బయటకు తోసేశాడు. ఈ ఘటన కేరళ రాజధాని తిరువనంతపురంలో ఉన్న వర్కాల సమీపంలో జరిగింది. నిందితుణ్ని పనచామూడుకు చెందిన సురేశ్ కుమార్(50)గా పోలీసులు గుర్తించారు. స్థానిక పలోదేకు చెందిన శ్రీకుట్టి (20), ఆమె స్నేహితురాలు అర్చన(19) అలువా నుంచి తిరువనంతపురానికి కేరళ ఎక్స్‌ప్రెస్‌లో అన్‌రిజర్వ్‌డ్ కోచ్‌లో ప్రయాణిస్తున్నారు. కుట్టీ, అర్చన శౌచాలయం నుంచి బయటకు వచ్చి రైలు ద్వారం వద్ద నిల్చున్నారు. తోటి ప్రయాణికుడు సురేశ్... కుట్టీని పక్కకు జరగమనగా నిరాకరించడంతో ఆగ్రహానికి గురైన అతడు ఆమెను నెట్టేశాడు. పక్కనే ఉన్న అర్చన గట్టిగా అరవడంతో ఆమెనూ బయటకు తోసివేయడానికి ప్రయత్నించాడు. ఇది గమనించిన ఇతర ప్రయాణికులు రైలు చైన్ లాగి స్థానిక అధికారులకు సమాచారం ఇచ్చారు. తీవ్రంగా గాయపడ్డ కుట్టీని ఆస్పత్రికి తరలించారు. నిందితుణ్ని పోలీసులు అరెస్టు చేశారు. సురేశ్ మద్యం సేవించినట్లు వెల్లడైంది.

దిల్లీని కమ్మేసిన పొగమంచు

దిల్లీ: దేశరాజధాని దిల్లీలో సోమవారం ఉదయం నుంచి పొగమంచు కమ్ముకుంది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) విడుదల చేసిన వివరాల ప్రకారం.. దిల్లీలోని 28 మానిటరింగ్ కేంద్రాల్లో వాయు నాణ్యత సూచీ (ఏక్యూఐ) 300కు పైగా నమోదైంది. భారత వాతావరణ శాఖ తెలిపిన వివరాల ప్రకారం.. దిల్లీలో కనిష్ఠ ఉష్ణోగ్రత 17.9 డిగ్రీల సెల్సియస్‌గా నమోదై.. సాధారణం కంటే 1.9 డిగ్రీలు ఎక్కువగా ఉంది. ఉదయం 8.30 గంటలకు తేమ శాతం 64గా.. గరిష్ఠ ఉష్ణోగ్రత 30 డిగ్రీల సెల్సియస్‌గా ఉందని ఐఎండీ పేర్కొంది.

పుణెలో చిరుతను చంపేందుకు ఆదేశాలు

ఐదుగురు షార్ప్‌షూటర్లతో ప్రత్యేక బృందం మోహరింపు

పుణె: మహారాష్ట్రలోని పుణె జిల్లాలో చిరుతల దాడులు కలకలం సృష్టిస్తున్నాయి. గతవారం చిరుత దాడిలో 13 ఏళ్ల బాలుడు మృతిచెందిన ఘటనపై ఆగ్రహించిన స్థానికులు అటవీశాఖకు చెందిన పెట్రోలింగ్ వాహనాన్ని తగలబెట్టారు. ఈ నేపథ్యంలో ఆ చిరుతను గుర్తించి దానిని హతమార్చాలంటూ సోమవారం అధికారులు ఆదేశించారు. దాని కోసం ఐదుగురు షార్ప్ షూటర్లు ఆ ప్రాంతంలో మోహరించినట్లుగా పేర్కొన్నారు. ఇటీవల జున్నర్, అంబేగావ్, శిరూర్ ప్రాంతాల్లో చిరుతల దాడులపై ప్రజలు ఆగ్రహించారు. ఇలాంటి ఘటనలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ.. పుణె-నాసిక్ హైవేలోని అవ్సారి సమీపంలో రాస్తారోకో నిర్వహించారు.

మణిపుర్‌లో 8 మంది ఉగ్రవాదుల అరెస్టు

ఇంఫాల్: మణిపుర్‌లో వివిధ నిషేధిత సంస్థలకు చెందిన ఎనిమిది మంది ఉగ్రవాదులను భద్రతా దళాలు అరెస్టు చేసినట్లు సోమవారం పోలీసులు తెలిపారు. ఈ అరెస్టులన్నీ ఆదివారం జరిగినట్లు వెల్లడించారు. నిషేధిత కాంగ్లీపాక్ కమ్యూనిస్టు పార్టీ(తైబాంగాంబ)కు చెందిన ముగ్గురు ఉగ్రవాదులను థౌబల్ జిల్లాలోని ఖోంగ్‌జోమ్ బజార్‌లో అరెస్టు చేశారు. ఇంఫాల్ ఈస్ట్‌లో ఒకరిని, యునైటెడ్ నేషనల్ లిబరేషన్ ఫ్రంట్(యూఎన్‌ఎల్‌ఎఫ్-పి)కు చెందిన మరో ఇద్దరిని థౌబల్ జిల్లా చోంగ్‌థమ్ కోనా ప్రాంతంలో అదుపులోకి తీసుకున్నారు. కేసీపీ(పీడబ్ల్యూజీ)కి చెందిన ఇద్దరు ఉగ్రవాదులను ఇంఫాల్ వెస్ట్‌లోని వహెంగ్‌బామ్ లేయికాయీ ప్రాంతంలో అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి తుపాకులు, గ్రెనేడ్లు, కాట్రిడ్జ్‌లు, పిస్టల్స్ స్వాధీనం చేసుకున్నారు.

జర్మన్ సంగీతకారిణిపై వేధింపులు

నిందితులపై కేసు నమోదు

తిరువనంతపురం: కేరళలోని ప్రసిద్ధ పర్యాటక కేంద్రం వర్కాలలో జర్మనీకి చెందిన మహిళా సంగీతకళాకారిణిపై గుర్తు తెలియని వ్యక్తులు వేధింపులకు పాల్పడిన ఘటన తాజాగా వెలుగు చూసింది. ఈ నెల 1న సాయంత్రం 6.45 గంటల సమయంలో జర్మన్ సంగీత కళాకారిణి లీనా మేయర్‌ను కొంతమంది వ్యక్తులు వెంబడించి వేధించారు. వెంటనే ఆమె తిరువనంతపురంలోని జర్మన్ కాన్సులేట్ అధికారులకు ఈ విషయాన్ని తెలిపారు. కాన్సుల్ అధికారుల ఫిర్యాదు మేరకు ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.



సుప్రీంకోర్టు వద్ద సిబ్బంది, న్యాయవాదుల కోసం సోమవారం ఆరోగ్య పరీక్షల శిబిరాన్ని ప్రారంభించి బీపీ చెక్ చేయించుకుంటున్న భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్

ఏకాగ్రతను తిరిగి తెచ్చే మెదడు తరంగాలు

- గుర్తించిన అమెరికా శాస్త్రవేత్తలు

దిల్లీ: మెదడులోని ప్రీఫ్రాంటల్ కార్టెక్స్ భాగంలో సుడుల్లా తిరిగే ఒక మెదడు ప్రక్రియ ఏకాగ్రతకు సాయపడుతుందని తాజా అధ్యయనం తెలిపింది. చేస్తున్న పని నుంచి ఒక్కోసారి ధ్యాస పక్కకు మళ్లుతుంటుంది. అలాంటి సందర్భాల్లో తిరిగి నిమగ్నత సాధించేందుకు ఇది సాయపడుతుంటుంది. అమెరికాలోని మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటీ) శాస్త్రవేత్తలు ఈ పరిశోధన చేశారు. వీరు ప్రీఫ్రాంటల్ కార్టెక్స్‌లో విద్యుత్ చర్యలను పరిశీలించారు. ఏకాగ్రత సహా అత్యున్నత స్థాయి విధుల్లో ఈ భాగానికి ప్రమేయం ఉంది. శాస్త్రవేత్తలు.. కోతులపై పరిశీలన జరిపారు. కార్టెక్స్‌లోని న్యూరాన్ల సమన్వయంతో సాగే భ్రమణ తరంగాలు.. ఆలోచన ప్రక్రియను తిరిగి గాడిలో పెడతాయని చెప్పారు. "ఒక విధంగా ఇది పశువుల కాపరిలా వ్యవహరిస్తూ కార్టెక్స్‌ను సరైన మార్గంలో పెడుతుంది" అని పరిశోధనకు నాయకత్వం వహించిన ఎర్ల్ కె మిల్లర్ తెలిపారు. ఏకాగ్రతను కోల్పోయిన కోతుల్లో ఈ తరంగాలు తిరిగి గాడిలో పెట్టినట్లు పరిశోధనలో గుర్తించామన్నారు. ఏకాగ్రతకు భంగం కలగడం వల్ల ఈ జంతువుల పనితీరుపై ప్రభావం పడినట్లు పేర్కొన్నారు. అవి తప్పులు చేయడం, ప్రతిస్పందన సమయం తగ్గిపోవడం వంటివి జరిగినట్లు తెలిపారు. ఇతర అంశాలపైకి మనసు మళ్లడం మొదలైనప్పటి నుంచి పని మీదకు మళ్లీ దృష్టి పెట్టాలన్న భావన వచ్చినప్పటికి మధ్య సమయం ఎక్కువగా ఉంటే.. ఆ వానరాలు మెరుగ్గా ఏకాగ్రతను ప్రోది చేసుకుంటున్నాయని చెప్పారు. ఆ సుడి పూర్తి వృత్తం తిరగడానికి అంత సమయం అవసరమని శాస్త్రవేత్తలు తెలిపారు.

ట్రైబునళ్ల సంస్కరణ చట్టంపై విచారణ..

ధర్మాసనాన్ని మార్చాలన్న కేంద్రం

- సుప్రీంకోర్టు అసహనం

దిల్లీ: ట్రైబునళ్ల సంస్కరణలు (హేతుబద్ధీకరణ, సర్వీసు నిబంధనలు) చట్టం-2021ని సవాల్ చేస్తూ దాఖలైన వ్యాజ్యంపై విచారణ ముగింపునకు వస్తున్న సమయంలో ఈ కేసును రాజ్యాంగ ధర్మాసనానికి సిఫార్సు చేయాలన్న కేంద్ర ప్రభుత్వ అభ్యర్థనపై సుప్రీంకోర్టు అసహనం వ్యక్తం చేసింది. విచారణ తుది దశలో కేంద్ర ప్రభుత్వ నుంచి ఇటువంటి అభ్యర్థన వస్తుందని తాము ఊహించలేదంటూ సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ కె.వి.వినోద్ చంద్రన్ ధర్మాసనం అభ్యంతరం తెలిపింది. ట్రైబునళ్ల సంస్కరణల చట్టం ప్రకారం...ఫిల్మ్ సర్టిఫికేట్ అప్పిలేట్ ట్రైబ్యునల్‌తో పాటు మరికొన్నింటిని రద్దు చేయాల్సి ఉంటుంది. ట్రైబునళ్ల సభ్యుల నియామక నిబంధనలూ మారాయి. దీనిని సవాల్ చేస్తూ మద్రాస్ బార్ అసోసియేషన్ సహా పలువురు పిటిషన్లు దాఖలు చేశారు. 'పిటిషనర్ల వాదనలు ముగిసే వరకూ మీరు (అటార్నీ జనరల్) ఎలాంటి అభ్యంతరం తెలపలేదు. వ్యక్తిగత కారణాలతో వాయిదా కోరారు. ప్రస్తుత ధర్మాసనం ముందు విచారణ జరగడం కేంద్ర ప్రభుత్వానికి ఇష్టం లేనట్లుగా ఉంది' అని జస్టిస్ గవాయ్ అసహనం వ్యక్త చేశారు. జస్టిస్ గవాయ్ ఈ నెల 23న సీజేఐగా పదవీ విరమణ చేయనున్నారు. కేసును రాజ్యాంగ ధర్మాసనానికి బదిలీ చేయాలన్న కేంద్రం అభ్యర్థనను అన్యదా భావించవద్దని అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి కోరారు. చట్టాన్ని సమర్థిస్తూ వాదనలు వినిపించారు. ప్రభుత్వానికి కొంత సమయం ఇవ్వాలన్నారు. శుక్రవారం తిరిగి విచారణ కొనసాగనుంది.



మూలగంధ కుటీ విహార్

బుద్ధుడి చితా భస్మం సందర్శనకు భారీగా భక్త జనం

కార్తీక పౌర్ణమి సందర్భంగా సారనాథ్‌లోని మూలగంధ కుటీ విహార్‌లో ఉన్న గౌతమ బుద్ధుడి చితా భస్మాన్ని దర్శించుకునేందుకు భక్తులకు అవకాశం కల్పించారు. సోమవారం నుంచి బుధవారం వరకూ మాత్రమే ఈ అవకాశం ఉంటుంది. దీంతో దేశ, విదేశాల నుంచి వేల మంది బౌద్ధ భిక్షువులు సారనాథ్‌కు వస్తున్నారు. ప్రతి రోజూ ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకే ఈ దర్శనం అందుబాటులో ఉంటుంది. శ్రీలంక, మయన్మార్, థాయ్‌లాండ్, జపాన్, నేపాల్‌ల నుంచి భక్తులు వస్తున్నారు.



సర్టిఫికెట్లతో విద్యార్థులు

ప్రభుత్వ విద్యార్థులకు ఐఐఎం ప్రత్యేక శిక్షణ

ఒడిశాలోని సంబల్‌పుర్ ప్రాంతంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఐఐఎం విద్యాసంస్థ ప్రత్యేక శిక్షణ ఇస్తోంది. ఐఐఎం, సంబల్‌పుర్ గ్రంథాలయం ఆధ్వర్యంలో ఈ శిక్షణ కొనసాగుతోంది. పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయులు, వైద్యులు, ఇంజినీర్లతో ప్రతి ఆదివారం గ్రంథాలయ ఆవరణలో ఈ శిక్షణ ఇస్తున్నారు. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లను ప్రదానం చేస్తున్నారు. విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్, యోగా, పర్యావరణ శాస్త్రం, నైతిక విలువలు, ఆరోగ్యం, మేనేజ్‌మెంట్, లీడర్‌షిప్, ఏఐ, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌పై శిక్షణ ఇస్తున్నారు.

నైజీరియాపై సైనిక చర్యకు ప్రణాళిక

- పెంటగాన్‌కు ట్రంప్ ఆదేశాలు

అబుజా: పశ్చిమ ఆఫ్రికా దేశంలో క్రైస్తవులపై జరుగుతున్న హింసను అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందని పేర్కొంటూ నైజీరియాలో సైనిక చర్యలకు ప్రణాళికను రూపొందించాలని పెంటగాన్‌ను ఆదేశించినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. ఆ దేశానికి అన్ని రకాల సహాయాన్ని నిలిపివేస్తామని హెచ్చరించారు. "నైజీరియా ప్రభుత్వం క్రైస్తవులను చంపడానికి అనుమతిస్తూనే ఉంటే.. అమెరికా వెంటనే ఆ దేశానికి అన్ని రకాల సహాయాన్ని నిలిపివేస్తుంది. ఈ భయంకరమైన దురాగతాలకు పాల్పడుతున్న ఇస్లామిక్ ఉగ్రవాదులను పూర్తిగా తుడిచిపెడుతుంది" అని ట్రంప్ సోషల్ మీడియాలో పేర్కొన్నారు. నైజీరియా జనాభా 220 మిలియన్లు. ఇందులో ముస్లింలు, క్రిస్టియన్లు దాదాపు సమానంగా ఉన్నారు. అయితే బోకో హరామ్ అనే తీవ్రవాద సమూహం నుంచి దేశం చాలా కాలంగా అభద్రతను ఎదుర్కొంటోంది. నైజీరియాలో దాడులకు వివిధ కారణాలున్నాయి. క్రైస్తవులు, ముస్లింలు ఇద్దరినీ లక్ష్యంగా చేసుకొని మతపరంగా ప్రేరేపించిన దాడులు, క్షీణిస్తున్న వనరులపై రైతులు, పశువుల కాపరుల మధ్య ఘర్షణలు, మతపరమైన పోటీలు, జాతి ఘర్షణలు ఈ దాడుల్లో భాగం. 2020లో అమెరికా తొలిసారిగా నైజీరియాను ప్రత్యేక ఆందోళనకరమైన దేశాల జాబితాలో చేర్చింది.

పంటల బీమా కింద రూ.1 పరిహారంగా చెల్లిస్తారా

- రైతులను అపహాస్యం చేస్తారా
- బీమా సంస్థలపై కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ ఆగ్రహం

దిల్లీ: పంటల బీమా కింద రూ.1, రూ.2, రూ.5 ఇలా.. తక్కువ మొత్తాలను రైతులకు బీమా సంస్థలు పరిహారంగా చెల్లించడంపై కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇంత తక్కువ మొత్తాలను చెల్లించడమంటే.. రైతులను అపహాస్యం చేయడమేనంటూ మండిపడ్డారు. ఈ అంశంపై దర్యాప్తునకు ఆదేశించారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై)పై, బీమాకు సంబంధించిన ఫిర్యాదులపై సోమవారం ఆయన సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా రైతుల బకాయిలను ఒకే విడతలో చెల్లించాలని బీమా సంస్థలను ఆదేశించారు. "రూ.1, రూ.3, రూ.5 లేదా రూ.21 ఇలా... రైతులకు బీమా సంస్థలు పరిహారంగా ఇవ్వడమంటే వారిని అపహాస్యం చేయడమే. ఇలా జరగడాన్ని ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించదు" అని చౌహాన్ పేర్కొన్నారు.

జమ్మూలో మళ్లీ రాజధాని

జమ్మూ: ప్రభుత్వం ఆరు నెలలు శ్రీనగర్‌లో, మిగతా ఆరు నెలలు జమ్మూలో పనిచేయడమనే ఏళ్లనాటి సంప్రదాయాన్ని జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా సోమవారం పునరుద్ధరించారు. పూర్వం డోగ్రా రాజవంశీకులు పాటించిన ఈ సంప్రదాయాన్ని నాలుగేళ్ల క్రితం పొదుపు పేరుతో అప్పటి లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా నిలిపేశారు. ఎలక్ట్రానిక్ పాలన వల్ల ఏటా రూ.200 కోట్లు ఆదా అవుతూ రాజధాని తరలింపు అవసరం లేకుండా పోయిందని ఆయన వివరించారు. అయితే ఈ నిర్ణయాన్ని జమ్మూప్రాంత వ్యాపారులు వ్యతిరేకించారు. జమ్మూలో మళ్లీ ఆరు నెలలపాటు ప్రభుత్వాన్ని నడపాలనే నిర్ణయం వెనుక భావోద్వేగాలు, ప్రాంతీయ సమైక్యత ఇమిడి ఉన్నాయని ఒమర్ అబ్దుల్లా వివరించారు. సోమవారం సచివాలయానికి వచ్చిన ఆయన మధ్యలో కారు దిగి కిలోమీటరు దూరం కాలినడకన ప్రయాణించారు. ఆయనకు జమ్మూ ప్రజలు, వ్యాపారులు పూల వర్షంతో బ్రహ్మరథం పట్టారు. మిఠాయిలు పంచారు. ఒమర్‌తోపాటు ఉప ముఖ్యమంత్రి సురీందర్ చౌధరి, మంత్రి జావేద్ రాణా కూడా నడిచారు. సమయాభావం వల్ల మళ్లీ కారెక్కి సచివాలయానికి చేరుకున్నారు. జమ్మూకు మళ్లీ ఆరు నెలలపాటు రాజధానిని తరలిస్తానని ఎన్నికల సమయంలో చేసిన వాగ్దానాన్ని ఒమర్ నిలబెట్టుకున్నారు.

ఉత్తర్‌ప్రదేశ్‌లో బస్సు, కారు ఢీ

ముగ్గురి మృతి, ఐదుగురికి గాయాలు

చిత్రకూట్: ఉత్తర్‌ప్రదేశ్‌లోని చిత్రకూట్ జిల్లాలో ఆదివారం రాత్రి ఘోర రోడ్డుప్రమాదం చోటుచేసుకుంది. ఝాన్సీ-మిర్జాపుర్ జాతీయ రహదారిపై యూపీ రోడ్‌వేస్ బస్సును ఓ కారు (ఎస్‌యూవీ) ఢీ కొట్టింది. ఈ ఘటనలో అందులోని ముగ్గురు వ్యక్తులు మృతి చెందగా.. మరో ఐదుగురు గాయపడ్డారు. ఐంచ్వాడ గ్రామంలో రాజా భయ్యా అనే వ్యక్తి అత్తారింట్లో పుట్టినరోజు వేడుకలను ముగించుకుని తిరిగి వస్తుండగా.. ఖోఖో గ్రామ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. ఎస్‌యూవీలో ప్రయాణిస్తున్న పురవా గ్రామానికి చెందిన ఇద్దరు మైనర్ సోదరులు మోహిత్(14), శుభాశ్ (6), వారి బంధువు రోహిత్ (24)లు మృతిచెందారు. క్షతగాత్రులను స్థానిక ఆసుపత్రికి తరలించారు. రెండు వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లుగా పోలీసులు తెలిపారు.

జుబీన్ గర్గ్‌ది హత్యే: హిమంత

తేజ్‌పుర్, గువాహటి: ప్రముఖ అస్సామీ గాయకుడు జుబీన్ గర్గ్‌ది హత్యేనని, దీనిపై వచ్చే నెల 8వ తేదీన ఛార్జిషీట్ దాఖలు చేస్తామని అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ తెలిపారు. 'సింగపూర్‌లో ఆయన ప్రమాదవశాత్తూ మరణించలేదు. ఛార్జిషీట్ దాఖలు చేయడానికి గడువు విధించా. దానికి సిద్ధంగా ఉన్నాం' అని సోమవారం ఆయన మీడియాతో పేర్కొన్నారు. సెప్టెంబరు 19వ తేదీన సింగపూర్‌లోని సముద్ర జలాల్లో విహరిస్తున్న సమయంలో అనుమానాస్పద స్థితిలో జుబీన్ గర్గ్ మరణించారు. ఈ ఘటనపై సిట్‌తోపాటు సీఐడీ విచారణ జరుపుతున్నాయి. ఇందులో భాగంగా మొత్తం 60 ఎఫ్‌ఐఆర్‌లను దర్యాప్తు సంస్థలు నమోదు చేశాయి.

'విదేశాల్లో జరిగిన ఘటనలపై ఛార్జిషీట్ దాఖలు చేయాలంటే కేంద్ర హోంశాఖ అనుమతి తీసుకోవాలి. ఆదివారం నేను అమిత్ షాను కలిసి అనుమతి కోరా. అది త్వరలో వస్తుంది. 3, 4 రోజుల్లో దీనిపై కేంద్ర హోంశాఖకు సిట్ లేఖ రాయనుంది. ఆ తరువాత ఛార్జిషీట్ దాఖలు చేస్తాం. తొలి రోజు నుంచీ గర్గ్‌ది హత్య అనే కోణంలోనే విచారణ జరుపుతున్నాం' అని హిమంత వివరించారు.

ఎయిరిండియా విమానం మంగోలియాకు మళ్లింపు

దిల్లీ: శాన్‌ఫ్రాన్సిస్కో నుంచి దిల్లీ వస్తున్న విమానాన్ని సాంకేతిక సమస్యల కారణంగా మంగోలియాకు మళ్లించాల్సి వచ్చింది. ఈ బోయింగ్ 777 విమానం సోమవారం మంగోలియా రాజధాని ఉలాన్‌బాతర్‌లో దిగింది. ముందు జాగ్రత్త చర్యగా విమానాన్ని దించామని ఎయిరిండియా వెల్లడించింది. ప్రయాణికులను సాధ్యమైనంత త్వరగా దిల్లీకి చేరుస్తామని తెలిపింది. 'నవంబరు 2వ తేదీన శాన్‌ఫ్రాన్సిస్కో నుంచి బయలుదేరిన ఏఐ174 విమానం కోల్‌కతా మీదుగా దిల్లీకి రావాల్సి ఉంది.


అన్యాయంగా ఇరికించారు

సుప్రీంకోర్టుకు తెలిపిన దిల్లీ అల్లర్ల కేసు నిందితుడు

దిల్లీ: అక్రమ కార్యకలాపాల నిషేధ చట్టం (యుఏపీఏ) కింద తనపై ఎలాంటి నేరారోపణ దాఖలు చేయకపోయినా పనిగట్టుకుని మరీ కేసులో ఇరికించారని 2020నాటి దిల్లీ అల్లర్ల కేసులో అరెస్టయిన షిఫా ఉర్ రహమాన్ సోమవారం సుప్రీంకోర్టుకు తెలిపారు. తనకు వెంటనే బెయిలు మంజూరు చేయాలని కోరారు. పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ), జాతీయ పౌరుల రిజిస్టర్ (ఎన్‌ఆర్‌సీ)లను నిరసిస్తూ 2020 ఫిబ్రవరిలో జరిగిన దిల్లీ అల్లర్లలో 53 మంది మరణించగా 700 మందికిపైగా గాయపడ్డారు. రహమాన్ ఆ అల్లర్లలో పాల్గొన్నట్లు ఏ ఒక్క సాక్షీ చెప్పలేదని ఆయన న్యాయవాది సల్మాన్ ఖుర్షీద్ కోర్టు దృష్టికి తెచ్చారు. శాంతియుత మార్గంలో నిరసన తెలిపే హక్కు రాజ్యాంగం అందరికీ ఇచ్చిందన్నారు. ఈ కేసులో రహమాన్‌కు సహనిందితులైన నటాషా నర్వాల్, దేవాంగనా కలితా, ఆసిఫ్ ఇక్బాల్ తన్హాలకు 2021 జూన్‌లో దిల్లీ హైకోర్టు బెయిలు ఇచ్చిందనీ, ఆ లెక్కన రహమాన్‌కు కూడా బెయిలు ఇవ్వాలని ఖుర్షీద్ కోరారు. మరో నిందితుడు ఉమర్ ఖాలిద్ తరఫు న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపిస్తూ.. దిల్లీ అల్లర్ల కేసులో 116 మందిపై కేసులు పెట్టగా 97 మంది నిర్దోషులుగా విడుదలయ్యారనీ, 17 కేసుల్లో తప్పుడు సాక్ష్యాలను చూపినట్లు కోర్టులే ఎత్తిచూపాయని తెలిపారు.

'ఆన్‌లైన్ బెట్టింగ్' పిటిషన్లపై నేడు విచారణ

దిల్లీ: ఈ-స్పోర్ట్స్, సోషల్ గేమ్స్ ముసుగులో నడుస్తున్న ఆన్‌లైన్ జూదం, బెట్టింగ్ ప్లాట్‌ఫాంలను నిషేధించాలంటూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు సోమవారం నోటీసులు జారీ చేసింది. సెంటర్ ఫర్ ఎకౌంటబిలిటీ అండ్ సిస్టమిక్ ఛేంజ్ సంస్థ, శౌర్యా తివారీలు దాఖలు చేసిన ఈ పిటిషన్‌తోపాటు ఇదే సమస్యపై పెండింగులో ఉన్న ఇతర పిటిషన్లపై కూడా మంగళవారం విచారణ జరుపుతామని ద్విసభ్య సుప్రీం ధర్మాసనం తెలిపింది. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే 1,528 గేమింగ్ యాప్‌లను బ్లాక్ చేసినట్లు పార్లమెంటుకు తెలిపింది. ఇప్పుడు తాజాగా సుప్రీంకోర్టుకు రెండు వేల జూదం, బెట్టింగ్ యాప్‌ల జాబితాను పిటిషనర్ తరఫు న్యాయవాది విరాగ్ గుప్తా సమర్పించారు. ఆన్‌లైన్ జూదం, బెట్టింగ్ గేమ్స్ సంస్థలు భారత్‌లో ఏటా రూ.1.80 లక్షల కోట్ల వ్యాపారం చేస్తున్నాయని పిటిషన్ తెలిపింది.



బిహార్‌లోని కైమూర్‌లో సోమవారం ఇంటి నుంచే అసెంబ్లీ ఎన్నికల ఓటు వేస్తున్న ఓ వృద్ధురాలు

రాహుల్, తేజస్వి, అఖిలేశ్.. ఇండియా కూటమి కోతులు: యోగి



దర్భంగా, ముజఫ్ఫర్‌పుర్, పట్నా: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్‌లను "ఇండియా కూటమిలో మూడు కోతులు"గా ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అభివర్ణించారు. దర్భంగా, ముజఫ్ఫర్‌పుర్, సారణ్, పట్నాలలో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. "చెడు వినకు, కనకు, మాట్లాడకు అని మూడు కోతులు చెబుతాయి. ఇండియా కూటమిలోనూ ఇలాంటి మూడు కోతులున్నాయి. ఒకటి పప్పు.. ఎన్డీయే పనుల్లో ఏ మంచినీ ఆయన చూడలేరు. రెండోది తప్పూ.. ఏ మంచినీ వినలేరు. మూడోది అప్పూ.. సభల్లో మాట్లాడేటప్పుడు వీటిని అంగీకరించరు. నేరగాళ్లను చేరదీసి, రాష్ట్ర భద్రతను పణంగా పెట్టేలా చొరబాటుదారుల్ని వారు అనుమతిస్తున్నారు. బిహార్‌లో ఎన్డీయే ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వస్తే రాష్ట్రం నుంచి చొరబాటుదారులను తరిమికొట్టి, వారి సంపదను పేదలకు పంచుతుంది" అని చెప్పారు.



పట్నా జిల్లా మానేర్‌లో సోమవారం ఎన్నికల ప్రచార ర్యాలీలో ప్రసంగిస్తున్న ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్

ఏ ప్రధానీ ఇలాంటి పదాలు వాడలేదు: తేజస్వి

పట్నా: బిహార్ ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ సోమవారం తీవ్ర విమర్శలు చేశారు. ఏ ప్రధానమంత్రి కూడా ఇలాంటి పదాలు ఉపయోగించినట్లు తాను ఎప్పుడూ వినలేదని అన్నారు. యాదవ్‌ను ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించటం కాంగ్రెస్‌కు ఇష్టంలేదని, ఆర్జేడీ నేతలు ఆ పార్టీ తలపై తుపాకీ గురిపెట్టి తేజస్వీ పేరు ప్రకటించేలా చేశారని మోదీ ఆదివారం పేర్కొన్నారు. ఆయన గుజరాత్ వెళ్లినప్పుడు ఐటీ కంపెనీలు, సెమీకండక్టర్ యూనిట్లు, డేటా సెంటర్ల గురించి మాట్లాడతారని.. బిహార్ వస్తే తుపాకుల గురించి చెబుతారని తేజస్వీ విమర్శించారు.

ప్రపంచ కప్ గెలిచి దేశానికి గర్వకారణంగా నిలిచారు

గవర్నర్ అబ్దుల్ నజీర్

ఈనాడు, అమరావతి: క్రికెట్ ప్రపంచ కప్ ఫైనల్లో దక్షిణాఫ్రికాపై చరిత్రాత్మక విజయాన్ని సాధించిన హర్మన్‌ప్రీత్ కౌర్ నేతృత్వంలోని భారత మహిళా క్రికెట్ జట్టుకు గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ అభినందనలు తెలిపారు. అత్యుత్తమ ప్రదర్శనతో భారత మహిళా జట్టు దేశ ప్రజలను గర్వపడేలా చేసిందన్నారు. భవిష్యత్తులో వారు మరిన్ని విజయాలు సాధించాలని గవర్నర్ ఆకాంక్షించారు.

మహిళల క్రికెట్ జట్టు చరిత్ర సృష్టించింది

ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు, అమరావతి: మన దేశ మహిళా క్రికెట్ జట్టు ప్రపంచ కప్‌ను గెలిచి చరిత్ర సృష్టించిందని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. మన ఆడబిడ్డలు అసాధారణ ప్రతిభ, అలుపెరుగని పట్టుదల, అజేయ మనోబలంతో దేశమంతా గర్వపడేలా, ప్రపంచం ఆశ్చర్యపోయేలా విజయం అందించారని 'ఎక్స్'లో కొనియాడారు. వారి అద్భుత ప్రదర్శన ప్రతి భారతీయుడికీ స్ఫూర్తిగా నిలిచిందని పేర్కొన్నారు.

ఈ విజయం.. ఈతరం ఆడపిల్లలకు స్ఫూర్తి: మంత్రి లోకేశ్

'భారత్ ప్రపంచ ఛాంపియన్. మన మహిళా క్రికెట్ జట్టు.. చరిత్రను లిఖించింది. బలమైన దక్షిణాఫ్రికా జట్టును ఓడించి కప్ కొట్టింది. ఈ విజయం ఈ తరం ఆడపిల్లలకు స్ఫూర్తి' అని మంత్రి లోకేశ్ ఎక్స్‌లో పేర్కొన్నారు. 'ఆంధ్రప్రదేశ్ నుంచి వెళ్లిన శ్రీచరణి పేరు అందరూ గుర్తుంచుకోండి. రాబోయే రోజుల్లో ఉన్నత శిఖరాలకు ఆమె ఎదుగుతారు' అని లోకేశ్ తెలిపారు.

ఇది ఓ సువర్ణ అధ్యాయం: మాధవ్

దక్షిణాఫ్రికాపై మన దేశ మహిళా క్రికెట్ జట్టు అద్భుత విజయం సాధించి, తొలిసారిగా ప్రపంచ విజేతగా నిలిచిందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ హర్షం వ్యక్తం చేశారు. క్రికెట్ చరిత్రలో భారతదేశానికి ఓ సువర్ణ అధ్యాయాన్ని మహిళలు లిఖించారని 'ఎక్స్'లో పేర్కొన్నారు.

భారత క్రికెట్ చరిత్రలో సువర్ణ అధ్యాయం: జగన్

"ప్రపంచ కప్ సాధించిన భారత మహిళా క్రికెట్ జట్టు చరిత్ర సృష్టించింది. వారి టీం వర్క్, ఆత్మవిశ్వాసం దేశాన్ని గర్వించేలా చేశాయి. ఈ అద్భుత విజయం భారత క్రికెట్ చరిత్రలో ఓ సువర్ణ అధ్యాయంగా గుర్తుండిపోతుంది. ఈ గెలుపుతో ప్రతి భారతీయ యువత పెద్ద కలలు కనేందుకు ప్రేరణగా నిలుస్తుంది" అని మాజీ సీఎం జగన్ సోమవారం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ కింద 6 జిల్లాలకు రూ.7.88 కోట్లు

2016-19 నాటి పనులకు బిల్లులు చెల్లిస్తున్న ప్రభుత్వం

ఈనాడు-అమరావతి: ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ కింద ఆరు జిల్లాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.7.88 కోట్లు మంజూరు చేసింది. శ్రీకాకుళం జిల్లాకు రూ.1.91 కోట్లు, విజయనగరం-రూ.42 లక్షలు, విశాఖపట్నం- రూ.83 లక్షలు, చిత్తూరు-రూ.1.83 కోట్లు, అనంతపురం- రూ.2.35 కోట్లు, కర్నూలు జిల్లాకు రూ.53 లక్షల చొప్పున కేటాయించింది. 2016 నుంచి 2019 మధ్య కాలంలో బోర్లు, తాగునీటి సౌకర్యాలు, రహదారులు, అంగన్‌వాడీలు, ఇతర ప్రభుత్వ భవనాల్లో పనులకు సంబంధించి ఈ మొత్తాన్ని మంజూరు చేసింది. వైకాపా హయాంలో వీటికి బిల్లులు ఇవ్వకుండా పక్కన పెట్టారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పరిశీలించి నిధులు విడుదల చేసింది.

ఎర్రమట్టిదిబ్బల సరిహద్దుల ఖరారు కమిటీలో జీఎస్ఐ ప్రతినిధి

ఈనాడు, అమరావతి: విశాఖపట్నం జిల్లాలోని నేరెళ్లవలస వద్ద ఉన్న ఎర్రమట్టి దిబ్బల సరిహద్దుల నిర్ధరణ, వాటి నిర్వహణ కమిటీలో జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) తరఫున కోల్‌కతాలోని జియో హెరిటేజ్ అండ్ జియోటూరిజం డివిజన్ సీనియర్ జియాలజిస్ట్ కౌశిక్ రాజ్‌బన్షిని నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. హైకోర్టులో దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) నేపథ్యంలో న్యాయస్థానం ఆదేశాల మేరకు ప్రభుత్వం ఇప్పటికే ఐదుగురు అధికారులతో కమిటీని ఏర్పాటు చేసింది. తాజాగా జీఎస్ఐ తరఫు ప్రతినిధిని నియమించింది.

విశాఖ భాగస్వామ్య సదస్సులో టెక్స్‌టైల్స్ ఎంవోయూలు

ఈనాడు, అమరావతి: విశాఖలో ఈ నెల 14, 15 తేదీల్లో జరగనున్న భాగస్వామ్య సదస్సులో టెక్స్‌టైల్ రంగంలో ఎంవోయూలు చేసుకునేందుకు చేనేత, జౌళి శాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఇందుకు ఏపీ టెక్స్‌టైల్స్ పాలసీతో పాటు రెండు స్టాళ్లను ఏర్పాటుచేస్తామని మంత్రి సవిత పేర్కొన్నారు. సచివాలయంలో సోమవారం ఆమె.. చేనేత, జౌళి శాఖ ముఖ్యకార్యదర్శి అమ్రపాలి సిసోదియా, కమిషనర్ రేఖారాణి, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్‌తో సమావేశమయ్యారు.

భువనేశ్వరికి లండన్‌లో.. పురస్కారం గర్వకారణం

తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య

ఈనాడు, అమరావతి: ఎన్టీఆర్ కుమార్తె, సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరికి ప్రతిష్ఠాత్మక డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్ అవార్డు ప్రకటించడం పట్ల తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య కొనియాడారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. భారత మాజీ రాష్ట్రపతి దివంగత అబ్దుల్‌కలాం, హిందూజా గ్రూప్ కో ఛైర్మన్ గోపీచంద్, గోయెంకా గ్రూప్ సంస్థల ఛైర్మన్ సంజీవ్ గోయెంకా లాంటి దిగ్గజాలకు ఇప్పటి వరకు ఈ అవార్డు వచ్చిందన్నారు.

తెలంగాణలో రోడ్డు ప్రమాదంపై మాధవ్ దిగ్భ్రాంతి

ఈనాడు, అమరావతి: తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా చేవెళ్ల సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో పలువురు మృతిచెందడం తీవ్రంగా కలచివేసిందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తెలిపారు. గాయపడ్డ వారికి తక్షణమే మెరుగైన వైద్యసేవలు అందించడం సహా మృతుల కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

'ఉపాధి'లో మెరిసిన రాష్ట్రం

- జాతీయ స్థాయిలో మూడో స్థానంలో ఏపీ
- శ్రామికులకు 7 నెలల్లో 15.66 కోట్ల పనిదినాల కల్పన



ఈనాడు, అమరావతి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్ మెరిసింది. 2025-26లో ఇప్పటివరకు పనిదినాల వినియోగంలో దేశంలో మూడో స్థానంలో నిలిచింది. ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి 15 కోట్ల పనిదినాలు కేటాయించింది. అక్టోబరు 30 నాటికి అంతకంటే మించి 15.66 కోట్ల పనిదినాలను (104.48%) శ్రామికులకు కల్పించారు. జాతీయ స్థాయిలో మొదటి స్థానంలో కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరి (163.20%), రెండో స్థానంలో రాజస్థాన్ (104.48%) నిలిచాయి. దేశంలో సగానికిపైగా రాష్ట్రాలు శ్రామికులకు కేంద్రం తొలి విడతలో కేటాయించిన పనిదినాల్లో 40 నుంచి 50 శాతానికి మించి వినియోగించలేదు.

✦ ఆర్థిక సంవత్సరం ప్రారంభమై ఆరు నెలలు పూర్తయిన సందర్భంగా దేశవ్యాప్తంగా ఉపాధి హామీ పథకం అమలుపై కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ ఇటీవల సమీక్షించింది. ఈ సందర్భంగా విడుదల చేసిన నివేదికలో పనిదినాల వినియోగంలో జాతీయ స్థాయిలో రాష్ట్రం మూడో స్థానంలో నిలిచినట్లుగా వెల్లడైంది.

✦ దేశంలో రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు కలిపి కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది మొదటి ఆరు నెలలకు 198.85 కోట్ల పనిదినాలు కేటాయించింది. వీటిలో అక్టోబరు 30 నాటికి 148.84 కోట్లు (65.39%) వినియోగించారు. తెలంగాణకు 6.50 కోట్లు కేటాయిస్తే వీటిలో 5.47 కోట్లు (84.16%) ఖర్చు చేశారు. తమిళనాడులో 12 కోట్లకు 9.68 కోట్లు (80.72%), కర్ణాటకలోనూ 9 కోట్లకు 5.98 కోట్లు (66.51%), ఒడిశాలో 12 కోట్లకు 7.15 కోట్లు (59.64%) వినియోగించారు.

✦ రాష్ట్రంలో ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు నెలకు కనిష్ఠంగా 2.80 కోట్లు, గరిష్ఠంగా 5.91 కోట్ల పనిదినాలు శ్రామికులకు కల్పించారు. ఏప్రిల్, మే నెలల్లో అత్యధికంగా వినియోగించారు. పనులకు హాజరైన వారిలో అత్యధిక సంఖ్యలో మహిళలే ఉన్నారు.

✦ వైకాపా ప్రభుత్వంలో దొంగ మస్టర్లు వేసి పనిదినాలు భారీగా వినియోగించారన్న విమర్శల నుంచి రాష్ట్రం బయటపడేలా కూటమి ప్రభుత్వం పలు సంస్కరణలు చేపట్టింది. విజిలెన్స్ వ్యవస్థను బలోపేతం చేసింది. ఆకస్మిక తనిఖీలు పెద్దఎత్తున నిర్వహిస్తున్నారు.

అదనంగా మరో 3 కోట్ల పనిదినాలు

✦ రాష్ట్రానికి ఈ ఏడాది రెండో విడతగా కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ మరో 3 కోట్ల పనిదినాలు అదనంగా కేటాయించింది. వీటితో సెప్టెంబరు నుంచి మార్చి నెలాఖరు వరకు శ్రామికులతో పని కల్పించాల్సి ఉంది. అదనంగా 9 కోట్ల పనిదినాలు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. గత ఏడాది (2024-25) కూడా మొత్తం 24.22 కోట్ల పనిదినాలను ఖర్చు చేసిన విషయాన్ని ప్రస్తావించింది. 'కేంద్రం ప్రస్తుతానికి 3 కోట్ల పనిదినాలు కేటాయించింది. అవసరాల మేరకు మళ్లీ అదనపు పనిదినాలు ఇవ్వనుంది. ఈ విషయంలో ఎలాంటి ఇబ్బందీ లేదు' అని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఉన్నతాధికారి ఒకరు అన్నారు.

5 వేల హెక్టార్లలో బీచ్‌శాండ్ లీజులకు ప్రయత్నాలు

- కేంద్ర గనుల శాఖకు ఏపీఎండీసీ లేఖ

ఈనాడు, అమరావతి: అణుధార్మికతతో కూడిన అరుదైన ఖనిజాలు ఉండే బీచ్‌శాండ్ తవ్వకాల కోసం మరో 5 వేల హెక్టార్లలో లీజులు పొందేందుకు ఏపీ ఖనిజాభివృద్ధి సంస్థ (ఏపీఎండీసీ) ప్రయత్నాలు చేస్తోంది. శ్రీకాకుళం జిల్లా పరిధిలో మూడు లీజుల కింద 5 వేల హెక్టార్లు కేటాయించాలంటూ కేంద్ర గనుల శాఖకు తాజాగా లేఖరాసింది. గతంలో శ్రీకాకుళం జిల్లా గార మండలంలోని రెండు లీజులు, విశాఖపట్నం జిల్లా భీమిలి పరిధిలోని ఒక లీజు కలిపి మొత్తం మూడు లీజుల్లో వెయ్యి హెక్టార్ల బీచ్‌శాండ్ నిల్వలను ఏపీఎండీసీకి కేంద్రం రిజర్వ్ చేసింది. అయితే రాష్ట్రమంతా కలిపి 16,604 హెక్టార్లలో బీచ్‌శాండ్ డిపాజిట్లు ఉన్నాయి. వీటిని 16 లీజులుగా దశల వారీగా ఇస్తామని గతంలో కేంద్రం తెలిపింది. తొలుత తీసుకున్న లీజుల్లో కార్యకలాపాలు ఆరంభిస్తే, మిగిలినవి కేటాయిస్తామని పేర్కొంది. దీంతో ఇప్పటికే తీసుకున్న వెయ్యి హెక్టార్ల మేర మూడు లీజుల్లో ప్రాజెక్టు చేపట్టే ప్రక్రియ మొదలైంది. దీంతో మరో 5 వేల హెక్టార్లు కేటాయించాలని కేంద్రాన్ని ఏపీఎండీసీ కోరింది.

బాక్సైట్‌కు సేకరించిన భూములు బీచ్‌శాండ్‌కు వినియోగం

బీచ్‌శాండ్ లీజుల్లో కొన్నిచోట్ల అటవీ ప్రాంతం ఉంది. ఆ భూములు సేకరించాలంటే.. ప్రత్యామ్నాయంగా అటవీ శాఖకు భూములు ఇవ్వాల్సి ఉంటుంది. అయితే గతంలో ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో బాక్సైట్ తవ్వకాల కోసం ఆ లీజులను ఏపీఎండీసీకి కేటాయించారు. ఆ సమయంలో అక్కడి అటవీ భూములకు ప్రత్యామ్నాయ భూములు ఇచ్చేందుకు.. ఉమ్మడి కడప జిల్లాలోని జమ్మలమడుగు, మైదుకూరు ప్రాంతాల్లోని 1,212 హెక్టార్లు ఏపీఎండీసీ సేకరించింది. బాక్సైట్ ప్రాజెక్ట్ లేనందున.. వాటి కోసం సేకరించిన 1,212 హెక్టార్ల భూములను బీచ్‌శాండ్ లీజుల్లోని అటవీ భూములకు ప్రత్యామ్నాయంగా ఇవ్వాలని భావిస్తున్నారు. ఇందుకు అనుమతి ఇవ్వాలంటూ కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వశాఖకు ఏపీఎండీసీ లేఖరాసింది.

✦ ఏపీలోని బీచ్‌శాండ్‌లో ఇల్మెనైట్ నిల్వలు ఉన్నాయి. వీటితోపాటు రూటైల్, గార్నెట్, సిల్లిమినైట్, జిర్కాన్, మోనజైట్ ఖనిజాలు ఉన్నాయి. ఈ లీజుల్లో తవ్వే ఖనిజాలను సెరేషన్ ప్లాంట్ ద్వారా వేరుచేస్తారు. తర్వాత వాల్యూ ఎడిషన్ ప్లాంట్ ద్వారా.. వాటిని మరింత విలువైన ఖనిజాలుగా మారుస్తారు. ఇప్పటికే వెయ్యి హెక్టార్లలో బీచ్‌శాండ్ లీజుల్లో ప్రాజెక్ట్ అభివృద్ధి, నిర్వహణ కాంట్రాక్టును అదానీకి చెందిన అల్లూవియల్ హెవీ మినరల్స్ దక్కించుకుంది. 2029-30 నాటికి ఈ ప్రాజెక్టు అందుబాటులోకి వస్తుందని అంచనా వేస్తున్నారు. అప్పటి నుంచి ఏపీఎండీసీకి ఏటా రూ.120 కోట్ల రాబడి రానుందని భావిస్తున్నారు.

రూ.50 కోట్లు దాటిన బ్రాహ్మణ కోఆపరేటివ్ సొసైటీ డిపాజిట్లు

ఈనాడు, అమరావతి: ఏపీ బ్రాహ్మణ సంక్షేమ సంస్థకు అనుబంధంగా ఉన్న బ్రాహ్మణ కోఆపరేటివ్ సొసైటీ తొలిసారిగా డిపాజిట్ల సేకరణలో రూ.50 కోట్ల మైలురాయిని దాటింది. గత నెలాఖరుతో సొసైటీ డిపాజిట్లు రూ.50.99 కోట్లకు చేరాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత నుంచి ఇప్పటివరకు బ్రాహ్మణులకు వివిధ అవసరాల కోసం రూ.81.95 కోట్లను రుణాలుగా మంజూరు చేసింది. 2016లో సీఎం చంద్రబాబు చేతుల మీదగా ప్రారంభమైన ఈ సొసైటీలో ప్రస్తుతం 79,625 సభ్యులు ఉండగా, 17 శాఖలతో నడుస్తోంది. ప్రాథమిక సహకార సంఘాల్లో అత్యధిక సభ్యత్వం గల సంఘంగా గుర్తింపు తెచ్చుకుంది. వచ్చే ఏడాది మార్చి నెలాఖరు నాటికి లక్ష మందికి సభ్యత్వం, రూ.100 కోట్ల రుణాల పంపిణీని లక్ష్యంగా పెట్టుకున్నట్లు బ్రాహ్మణ సంక్షేమ సంస్థ ఛైర్మన్ కె.బుచ్చిరాంప్రసాద్ తెలిపారు. రాష్ట్రంలోని బ్రాహ్మణులంతా ఈ సొసైటీలో సభ్యత్వం తీసుకోవాలని, వారి ఆర్థిక అవసరాలు తీర్చేందుకు ప్రభుత్వం అండగా ఉంటుందని పేర్కొన్నారు.

పోలవరం పనులే చేస్తున్నప్పుడు విద్యుత్తు సబ్‌స్టేషన్ల పనులు పూర్తి చేయలేరా?

- ట్రాన్స్‌కో అధికారులను నిలదీసిన అసెంబ్లీ ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ

ఈనాడు, అమరావతి: విద్యుత్తు లైన్లు.. 132, 140, 400కేవీ వంటి సబ్‌స్టేషన్ల పనులనూ సకాలంలో పూర్తి చేయలేరా? అని ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ(పీయూసీ) ట్రాన్స్‌కో అధికారులను నిలదీసింది. వర్షాకాలం, వాతావరణ పరిస్థితుల వల్ల పనులకు అంతరాయం కలుగుతోందని అధికారులు చెప్పబోగా.. 'పోలవరం, అమరావతి పనులే ఎక్కడా ఆపకుండా చేయగలుగుతున్నప్పుడు.. ఇంత అనుభవం ఉన్న మీరు పనులు చేయించలేరా? రాష్ట్రంలో భవిష్యత్తు అవసరాల రీత్యా అన్ని జిల్లాల్లోనూ 400 కేవీ సబ్ స్టేషన్లను త్వరితగతిన ఏర్పాటు చేయాలి" అని స్పష్టంచేసింది. సోమవారం విద్యుత్తు సౌధలో ఈ కమిటీ సమావేశమైంది. కమిటీ ఛైర్మన్ కూన రవికుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో కమిటీ సభ్యులు భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, తెనాలి శ్రావణ్‌కుమార్, గిడ్డి సత్యనారాయణ, వర్ల కుమార్‌రాజా, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఆస్తులకు మార్కెట్ ధర ప్రకారం విలువ కట్టాలి

'ట్రాన్స్‌కో ఆస్తులను పూచీకత్తుగా పెట్టి అప్పులు తెచ్చి డిస్కంలకు ఇవ్వాల్సిన అవసరం ఏమిటి?' అని కమిటీ ప్రశ్నించింది. "అప్పులు తెచ్చేందుకు పూచీకత్తుగా పెడుతున్న ఆస్తుల విలువను లెక్కకట్టడంలోనూ సరైన విధానాన్ని పాటించలేదు. మార్కెట్ ధర ప్రకారం ఆస్తులకు విలువ కట్టాలి, దానివల్ల ఆ విలువ మేరకు ఎక్కువ మొత్తంలో రుణాలు వచ్చే అవకాశం ఉంటుంది. ఆ డబ్బును కూడా డిస్కంలకు రుణాలిచ్చేందుకు కాకుండా.. ప్రజలకు అవసరమైన నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్తును అందించేందుకు చేపట్టిన పనులను సకాలంలో పూర్తి చేసేందుకు వినియోగించాలి" అని కమిటీ సూచించింది.

కాగ్‌కు సమాధానాలివ్వరా..?

ట్రాన్స్‌కోకు సంబంధించి ఆడిట్ నివేదికలు సరిగా లేవని కమిటీ అభిప్రాయపడింది. కాగ్ అభ్యంతరాలకు కూడా సరైన సమాధానాలు ఇవ్వడం లేదని పేర్కొంది. ట్రాన్స్‌కోకు కేటాయించిన పోస్టుల్లో 63 శాతం ఖాళీలు ఉన్నాయని కమిటీ అడగ్గా.. ఈ పోస్టుల భర్తీకి ప్రభుత్వం ఆమోదం తెలిపిందని, ఈ నెలాఖర్లో నోటిఫికేషన్ ఇవ్వడానికి ఏర్పాట్లు చేస్తున్నామని అధికారులు తెలిపారు.

'రుణాల పంపిణీ.. డిజిటలైజేషన్‌లో భారీ అక్రమాలున్నాయ్'

ఈనాడు, అమరావతి: వైకాపా హయాం(2019-24)లో సహకార వ్యవస్థను అస్తవ్యస్తం చేశారని ప్రత్యేక సభా సంఘం అభిప్రాయపడింది. 2019-24 మధ్య ఆప్కాబ్, జిల్లా సహకార కేంద్ర బ్యాంకులు, పీఏసీఎస్‌లలో జరిగిన అక్రమాలను నిగ్గు తేల్చేందుకు ఏర్పాటైన సభాసంఘం.. అసెంబ్లీ కమిటీ హాలులో సోమవారం సమావేశమైంది. ఛైర్మన్ ఎన్.అమరనాథరెడ్డి అధ్యక్షతన జరిగిన భేటీలో సభ్యులు బూర్ల రామాంజనేయులు, యార్లగడ్డ వెంకట్రావు, తెనాలి శ్రావణ్‌కుమార్, ధూళిపాళ్ల నరేంద్రకుమార్, బొలిశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు. సంబంధిత అధికారులు హాజరయ్యారు.

ఆస్తులను జప్తు చేశామంటే సరిపోతుందా..?

'పెద్దమొత్తంలో అప్పులిచ్చారు. శీతల గిడ్డంగులకూ రుణాలిచ్చారు. వాటిని తిరిగి రాబట్టరా?' అని సభ్యులు ప్రశ్నించగా.. తిరిగి చెల్లించని వారి ఆస్తులను జప్తు చేస్తున్నామని అధికారులు చెప్పారు. 'జప్తు చేస్తే సరిపోతుందా? నిబంధనల ప్రకారం పబ్లిక్ నోటీసులిచ్చి వాటిని వేలం వేసి, మొత్తాన్ని రాబట్టాలి కదా' అని సభాసంఘం నిలదీసింది. సహకార సంఘంలో సభ్యత్వం లేని వారిని అప్పటికప్పుడు సభ్యులుగా చేర్చుకుని వారికి పెద్ద మొత్తాల్లో రుణాలిచ్చారు? ఎవరు చెబితే ఇలా చేశారు? ఉమ్మడి కృష్ణా, గుంటూరు, తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఇలాంటి వ్యవహారాలు ఎక్కువగా ఉన్నాయి' అని సభ్యులు ఆగ్రహం వ్యక్తంచేశారు. 'తాడేపల్లిగూడెం నియోజకవర్గంలోనే దాదాపు రూ.3 కోట్లపైనే అక్రమాలున్నా ఎందుకు చర్యలు తీసుకోలేక పోయారు?' అని బొలిశెట్టి శ్రీనివాస్ ప్రశ్నించారు.

గోదాములన్నీ ఒకరికేనా?

'రైతుల కోసం ఉద్దేశించిన గోదాముల్లో అత్యధికం జగనన్న కాలనీల్లోనే కట్టారు. గోదాములను రాష్ట్రవ్యాప్తంగా కట్టేందుకు ఒకరికే కాంట్రాక్టు ఇవ్వడం వెనుక ఉద్దేశాలేంటి? వాటికి అనుసంధాన రహదారులు లేవు. ఉపయోగించుకునే స్థితిలో లేవు. ఎవరి ప్రయోజనాల కోసం వాటిని కట్టారు?' అని సభ్యులు అసహనం వ్యక్తంచేశారు. గోదాముల పూర్తి వివరాలను తమ ముందుంచాలని ఆదేశించారు.

51 సెక్షన్ విచారణ ఏమైంది?

'సహకార చట్టం 51 సెక్షన్ కింద విచారణను ఫిర్యాదులు వచ్చిన చోటే.. అందులోనూ రాష్ట్రవ్యాప్తంగా 7 జిల్లా కేంద్ర సహకార బ్యాంకుల పరిధిలోనే చేస్తున్నారు. దీనినీ పూర్తిస్థాయిలో చేపట్టక పోవడానికి కారణాలేంటి? విచారణను దారి తప్పించారు. ప్రాథమిక సహకార సంఘం నుంచి రుణాలు ఇచ్చినప్పుడు కార్యదర్శి ఒక్కరితోనే అయిపోదు కదా? అక్కడ ఉండే త్రిసభ్య కమిటీ ఆమోదమూ కావాలి కదా? రుణాల పంపిణీలో అవకతవకలకు కార్యదర్శులను బాధ్యులను చేసి, త్రిసభ్య కమిటీలోని వారిని ఎలా తప్పిస్తారు? బినామీ పాస్ పుస్తకాలకు సూత్రధారులెవరు? తర్వాత వాటిని ఎలా డిలీట్ చేశారు? బాధ్యులెవరో తేలాలి కదా' అని అధికారులను రామాంజనేయులు, శ్రావణ్‌కుమార్ తదితరులు నిలదీశారు. 'రికార్డులను డిజిటలైజ్ చేయడం అవసరమే. కానీ, అందుకోసం 5జీ కాలంలో 2జీ పరికరాలను ఎందుకు కొన్నట్లు? డిజిటలైజేషన్ ప్రక్రియలోనే అక్రమాలున్నట్లున్నాయి. వీటి సంగతి తేల్చాల్సి ఉంది' అని సభ్యులు అభిప్రాయపడ్డారు.

15 రోజుల్లోగా సమర్పించండి

'టర్నోవర్ ఆధారంగా సహకార సంఘాలను తనిఖీ చేసినప్పుడు నాబార్డు/డీసీసీబీలు/ఆడిటింగ్ సంస్థలు గుర్తించిన అవకతవకలపై ఏయే సమాధానాలిచ్చారు? ఆ నివేదికలను 15 రోజుల్లోగా సభా సంఘం ముందుంచండి' అని ఛైర్మన్ అమరనాథరెడ్డి అధికారులను ఆదేశించారు. అవసరమైతే అన్ని జిల్లాల్లోనూ క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలిస్తామని స్పష్టంచేశారు.

వైకాపా నాయకులు భూమి ఆక్రమించారు

- తెదేపా కేంద్ర కార్యాలయంలో బాధితుల ఫిర్యాదు

ఈనాడు, అమరావతి: వైకాపా మద్దతుదారులు తన స్థలాన్ని తప్పుడు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని గుంటూరు జిల్లా గోరంట్లకు చెందిన యశోద వాపోయారు. ఈ మేరకు మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ, ఏపీ కమ్మ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ బ్రహ్మం చౌదరి సోమవారం వినతులు స్వీకరించారు.

✦ తాము లేని సమయంలో వైకాపా నాయకుడు తమ 16 ఎకరాల పొలాన్ని ఆక్రమించుకున్నారని ప్రకాశం జిల్లా రాజుపాలెం గ్రామానికి చెందిన భారతి, వసంత లక్ష్మి, కస్తూరి ధర్మజ, యర్రంశెట్టి హారిక అర్జీ ఇచ్చారు. ఎస్సై కూడా వైకాపా నేతలకు అనుకూలంగా మాట్లాడుతున్నారని పేర్కొన్నారు.

✦ తన కుమార్తెకు పసుపు కుంకుమ కింద 55 సెంట్ల భూమి ఇస్తే.. వీఆర్వో తమతో సంతకాలు చేయించుకుని రికార్డులు మార్చేసి మోసం చేశారని కృష్ణా జిల్లా మల్లయ్యపాలెం గ్రామానికి చెందిన రామలింగేశ్వరరావు ఫిర్యాదు చేశారు.

✦ తప్పుడు మ్యుటేషన్లు రద్దుచేసి తన భూమికి యాజమాన్య హక్కు కల్పించాలని తిరుపతి జిల్లా వెంకటగిరి మండలం పెట్లూరు గ్రామానికి చెందిన వెంకటయ్య విజ్ఞప్తి చేశారు.

✦ గుంటూరు జిల్లా మంగళగిరి ప్రాంతంలో తమ పేరుతో ఉన్న భూమిలో ఇతరులు భవనాలు నిర్మిస్తున్నారని విజయవాడకు చెందిన శ్రీమన్నారాయణ ఫిర్యాదు చేశారు.

మణిపాల్ ఆసుపత్రిలో గవర్నర్‌కు వైద్య పరీక్షలు

తాడేపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు తాడేపల్లి మణిపాల్ ఆసుపత్రిలో సోమవారం సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించారు. విజయవాడ నుంచి మధ్యాహ్నం ఆసుపత్రికి చేరుకున్న ఆయన.. పరీక్షల అనంతరం సాయంత్రం 5 గంటలకు తిరిగి రాజ్‌భవన్‌కు వెళ్లారు.

8 మంది పుర కమిషనర్లకు స్పెషల్ గ్రేడ్ హోదా

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ఎనిమిది మంది గ్రేడ్-1 మున్సిపల్ కమిషనర్లకు స్పెషల్ గ్రేడ్ హోదా కల్పించేందుకు వీలుగా అడ్‌హాక్ ప్రమోషన్ ప్యానల్ కమిటీలో చేర్చేందుకు అనుమతిస్తూ రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కమిషనర్లలో కె.మేరీ గోల్డ్ డైమండ్, పి.నరసింహప్రసాద్, జి.సృజన, బి.శ్రీకాంత్, డి.రవీంద్ర, ఎ.దాదాబాషా, బి.విజయసారథి, ఎం.ఏసుబాబు ఉన్నారు.

రూ.11 కోట్లతో మూడు పర్యాటక ప్రాజెక్టులు

ఆర్జీఎస్ఏలో నిర్వహణకు పరిపాలన అనుమతులు

ఈనాడు, అమరావతి: పర్యాటక రంగం అభివృద్ధి, పంచాయతీలకు ఆదాయం అనే విధానంలో రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్(ఆర్జీఎస్ఏ) కింద రాష్ట్రంలో రూ.11 కోట్లతో మూడు ప్రాజెక్టుల నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఇందులో కేంద్రం 60%, రాష్ట్ర ప్రభుత్వం 40% నిధులు వెచ్చించనున్నాయి. ఇందుకు సంబంధించి పరిపాలన అనుమతులిస్తూ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రాజెక్టుల నిర్వహణకు రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ(ఏపీటీడీసీ) టెక్నికల్ ఏజెన్సీగా వ్యవహరించనుంది. రాష్ట్రం నుంచి కేంద్రానికి ఎనిమిది ప్రాజెక్టులపై ప్రతిపాదనలు వెళ్లగా.. మూడు ఖరారు చేశారు. పర్యాటకులను ఆకర్షించేలా ప్రాజెక్టుల ఏర్పాటుతోపాటు వాటి పరిధిలోని పంచాయతీలకు ఆదాయం వచ్చేలా వీటిని రూపొందించారు.

ప్రాజెక్టులు ఇవి..

- ✦ అరకులో రూ.5 కోట్లతో క్యాంపింగ్, కారవాన్ విలేజ్ ప్రాజెక్టు అభివృద్ధి.
- ✦ రూ.3 కోట్లతో హెరిటేజ్ విలేజ్‌గా కూచిపూడి.
- ✦ ఏటికొప్పాకలో రూ.3 కోట్లతో టాయ్ విలేజ్ అభివృద్ధి.

హైకోర్టు ఉద్యోగిని తెలంగాణకు తిరిగి కేటాయించడానికి సుప్రీంకోర్టు నిరాకరణ

ఈనాడు, దిల్లీ: రాష్ట్ర విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన పీవీ సతీష్‌కుమార్ అనే హైకోర్టు ఉద్యోగిని తిరిగి తెలంగాణకు కేటాయించడానికి నిరాకరిస్తూ ఏపీ హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వులను కొట్టేయడానికి సుప్రీంకోర్టు విముఖత వ్యక్తంచేసింది. ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పులో జోక్యానికి నిరాకరిస్తూ సోమవారం జస్టిస్ పంకజ్‌మిత్తల్, జస్టిస్ బాలచంద్ర వరాలేలతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీచేసింది. ఈ సందర్భంగా ఏపీ హైకోర్టు తరఫున హాజరైన న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. సదరు ఉద్యోగి తొలుత తెలంగాణ హైకోర్టును ఎంచుకున్నారని, తర్వాత పునఃకేటాయింపును కోరారన్నారు. దాంతో తెలంగాణ హైకోర్టు సదరు ఉద్యోగిని ఏపీ హైకోర్టుకు తిరిగి కేటాయిస్తూ, అతన్ని విలీనం చేసుకోవాలని కోరిందన్నారు. తెలంగాణ హైకోర్టు విజ్ఞప్తిని అనుసరించి ఆ ఉద్యోగిని ఏపీ హైకోర్టు విలీనం చేసుకొందని చెప్పారు. విలీనం చేసుకొనే సమయంలో అతనికి సీనియారిటీ వర్తించదని కూడా స్పష్టంచేసినట్లు పేర్కొన్నారు. దాన్ని సవాల్‌చేస్తూ ఆయన రిట్ పిటిషన్ దాఖలుచేసి.. తర్వాత ఉపసంహరించుకున్నట్లు చెప్పారు. అనంతరం తనను మళ్లీ తెలంగాణకు కేటాయించాలని హైకోర్టుకు విజ్ఞప్తి చేసుకున్నారని తెలిపారు. ఒకసారి విలీనం చేసుకున్న తర్వాత సదరు ఉద్యోగిని మళ్లీ మరో హైకోర్టుకు కేటాయించే అధికారం తమకు లేదని ఏపీ హైకోర్టు చెప్పిందని వివరించారు. దాన్ని సవాల్‌చేస్తూ సదరు ఉద్యోగి మరోసారి రిట్ పిటిషన్ దాఖలుచేస్తే హైకోర్టు కొట్టేసిందని విన్నవించారు. దీనిని పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకోవడానికి నిరాకరించింది. అయితే ఈ విషయంలో తెలంగాణ హైకోర్టు ఏదైనా తీర్పు ఇచ్చి ఉంటే దాన్ని ప్రత్యేకంగా సుప్రీంకోర్టులో సవాల్ చేసుకోవడానికి వీలు కల్పించింది.

ఎనికేపాడులో ఏపీ మత్స్యవిశ్వవిద్యాలయ క్యాంపు కార్యాలయం

ఈనాడు, అమరావతి: రాష్ట్ర మత్స్య విశ్వవిద్యాలయ క్యాంపు కార్యాలయాన్ని విజయవాడ నగరంలోని తాడిగడప నుంచి ఎనికేపాడులోని ఏపీబీటీ టవర్స్‌లోకి మార్చేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ మేరకు వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు.

ఏపీపీఎఫ్‌సీఎల్ రూ.5 వేల కోట్ల రుణానికి ప్రభుత్వ హామీ

ఈనాడు, అమరావతి: ఏపీ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీపీఎఫ్‌సీఎల్).. హడ్కో నుంచి రూ.5 వేల కోట్ల రుణం పొందేందుకు ప్రభుత్వ గ్యారెంటీ ఇచ్చేందుకు అనుమతిస్తూ సోమవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. రాష్ట్ర వినియోగ అవసరాలు, నిర్వహణకు.. బొగ్గు, విద్యుత్ కొనుగోలు తదితరాల కోసం ఏపీపీఎఫ్‌సీఎల్ ఈ రుణం తీసుకుంటోందని విద్యుత్‌శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఉత్తర్వులో పేర్కొన్నారు.

దివ్యాంగులకు ఉచితంగా త్రీవీలర్ మోటారు సైకిళ్లు

ఈ నెల 25 వరకు దరఖాస్తుల ఆహ్వానం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని అర్హులైన దివ్యాంగులకు ఉచితంగా 1,750 రెట్రోఫిట్ త్రీ వీలర్ మోటారు సైకిళ్లను అందజేస్తామని మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి తెలిపారు. ఈ నెల 25లోపు www.apdascac.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 'డ్రైవింగ్ లైసెన్స్ ఉండి, రెగ్యులర్ డిగ్రీ, ఆపై ఉన్నతవిద్య చదువుతున్న విద్యార్థులు, పదో తరగతి ఉత్తీర్ణులై స్వయం ఉపాధితో జీవించేవారు, 18 నుంచి 45 ఏళ్ల లోపు ఉండి 70 శాతం అంగవైకల్యం ఉన్న వారు దరఖాస్తు చేసుకొనేందుకు అర్హులు" అని మంత్రి స్వామి వెల్లడించారు.

అమల్లోకి వచ్చిన ఏపీ షాప్స్, ఎస్టాబ్లిష్‌మెంట్ సవరణ చట్టం

ఈనాడు, అమరావతి: ఏపీ షాప్స్, ఎస్టాబ్లిష్‌మెంట్ సవరణ చట్టం అమలుకు కార్మిక శాఖ కార్యదర్శి శేషగిరిబాబు నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ చట్టం సోమవారం నుంచి అమల్లోకి వస్తుందని పేర్కొన్నారు. వారానికి 48 గంటల పని విధానాన్ని కొనసాగిస్తూనే కార్మికుల రోజువారీ పని గంటలను 8 నుంచి 10కి పెంచారు. ప్రస్తుతం వారానికి 14గంటలు ఓవర్ టైం ఉండగా.. దీన్ని మూడు నెలలకు 144 గంటలుగా నిర్ణయించారు. రాత్రి సమయాల్లో పని చేసేందుకు మహిళలకు అనుమతించారు. మహిళా సిబ్బంది సమ్మతితో రాత్రి 8గంటల నుంచి ఉదయం 6గంటల వరకు పనికి అనుమతించేలా చట్ట సవరణ చేశారు. రాత్రి విధుల్లో వారికి అన్నిరకాల సదుపాయాలు కల్పించాలి. 20 మంది లోపు సిబ్బంది ఉన్న సంస్థలకు కొన్ని రిజిస్టర్ల నిర్వహణ నుంచి మినహాయింపునిచ్చారు. సిబ్బంది రిజిస్ట్రేషన్, రెన్యువల్, సెలవులు, తొలగింపు లాంటి రిజిస్టర్లను మాత్రం తప్పనిసరిగా నిర్వహించాల్సి ఉంటుంది.

'గడప-గడపకు మన ప్రభుత్వం' పెండింగ్ బిల్లుల మంజూరు

ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వ హయాంలో నిర్వహించిన 'గడప-గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమానికి సంబంధించిన రూ.1.89 కోట్ల పెండింగ్ బిల్లుల్ని ప్రణాళిక శాఖ సోమవారం విడుదల చేసింది. విశాఖపట్నం, కడప నగరపాలక సంస్థలకు వరుసగా రూ.1.72 కోట్లు, రూ.17.48 లక్షలు చొప్పున విడుదల చేస్తూ ఉత్తర్వులిచ్చింది.

'ప్రతి నెలా స్త్రీశక్తి పథకం డబ్బులు రీయింబర్స్ చేయాలి'

ఈనాడు, అమరావతి: స్త్రీశక్తి పథకానికి సంబంధించి ప్రతినెలా ఆర్టీసీకి చెల్లించాల్సిన రూ.250 కోట్లను అదే నెలలో ప్రభుత్వం రీయింబర్స్ చేయాలని, లేదంటే బస్సుల నిర్వహణ కష్టమవుతుందని ఎంప్లాయిస్ యూనియన్ (ఈయూ) అధ్యక్షులు పలిశెట్టి దామోదరరావు పేర్కొన్నారు. సోమవారం విజయవాడలోని ఈయూ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన ఎన్టీఆర్ జిల్లా నిర్మాణ సభలో దామోదరరావు మాట్లాడారు. ఆర్టీసీ ఉద్యోగుల పదోన్నతుల ప్రక్రియ మొదలైందని, ఆరు వేల మందికి పదోన్నతులు దక్కనున్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా ఈయూ అధ్యక్షునిగా ఏకే సాగర్, కార్యదర్శిగా జి.ఎం.రావు సహా 18 మందితో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పక్కా ఆధారాలతోనే జోగి రమేశ్ అరెస్టు

సాంఘిక సంక్షేమ మండలి ఛైర్మన్ బాలకోటయ్య

ఈనాడు, అమరావతి: వైకాపా హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలపై పోలీసులు, విచారణ సంస్థలు తీసుకుంటున్న చట్టబద్ధమైన చర్యలను వైకాపా నేతలు వారి సామాజిక మాధ్యమాల ద్వారా 'డైవర్షన్ పాలిటిక్స్' అంటూ ప్రజల్ని తప్పుదారి పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారని సాంఘిక సంక్షేమ మండలి ఛైర్మన్ బాలకోటయ్య మండిపడ్డారు. పక్కా ఆధారాలతోనే కల్తీ మద్యం కేసులో మాజీ మంత్రి జోగి రమేష్ అరెస్ట్ అయ్యారని స్పష్టంచేశారు. సమాజం నుంచి తప్పించుకునేందుకే కాశీబుగ్గ మరణాలను తెరమీదకు తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు. జోగి రమేష్ రెచ్చిపోయినప్పుడు చిద్విలాసం చిందించిన జగన్, ఇప్పుడు ఆయన్ను పరామర్శించేందుకు ఎప్పుడు వెళ్తారో చెప్పాలని డిమాండ్ చేశారు.